భారతి

మాస పత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

నవంబరు 1977

సంపుటము : 54 సంచిక : 11

విడిప్రతిక వెల రూపాయిన్నర

తమసోమా జ్యోతిర్గమయ ....

సత్వర ఆర్థికాభివృద్ధికి, సాంకేతిక పురోగతికి విద్యయే మూల కందం.

గత సంవత్సరం [1976 - 77] లో మొదటి తరగతి నుండి ఆరవ తరగతి వరకు 0. 90 లక్షల బాల బాలికలు రాష్ట్రంలోని పాఠశాలల్లో కొత్తగా చేరారు. దీని ఫలితంగా 6-11 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లల పాఠశాల ప్రవేశాల శాతం బాలుర విషయంలో 84. 4 కు, బాలికల విషయంలో 60-9కి చేరుకున్నది. ఇది గణనీయమైన పురోగతి అని చెప్పక తప్పదు.

మన రాష్ట్రంలో ప్రస్తుతం 3, 500 వున్నత పాఠశాలలు వున్నాయి. పాఠశాల విద్యా బోధనకు 1977 - 78 బడ్జెట్ లో రు. 43. 67 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించారు. రాష్ట్రంలోని మూడు నివాసిత పాఠశాలలు గత సంవత్సరం తమ విద్యార్థులందరూ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులు కావడంతో మనకు గర్వకారణమైనాయి.

రాష్ట్రంలోని నిరక్షరాస్యుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర పథకాన్ని ప్రారంభించింది. దీని క్రింద కృష్ణా, ఖమ్మం, కడప, ఆదిలాబాదు జిల్లాలలో సాంప్రదాయేతర విద్యా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఈ సంవత్సరం యీ కార్యక్రమాన్ని యింకొక రెండు జిల్లాలకు విస్తరింపజేస్తారు.

మన యువతరం చీకటి నుండి వెలుగులోకి, అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు పయనిస్తున్నది.

డైరెక్టర్, సమాచార పౌరసంబంధశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.

18/77–78

విషయానుక్రమణిక

నవంబరు 1977

ఇక్కడ ఏ పక్షీ పాడదు

డా॥ సి. నారాయణరెడ్డి

ఇక్కడ ఏ పక్షీ పాడదు
  ఎండిన కొమ్మల యెముకలు తప్ప.
ఇక్కడ ఏ రెక్కా పలకదు
ఇంకిన కన్నీటి చినుకులు తప్ప.

ఎన్ని వర్ణాలో జీర్ణపర్ణాలో
ఈ దవాగ్ని నాల్కలమధ్య.
ఎన్ని చిట్లిన పవన నాడులో
ఎగిరిపడుతున్న ఉల్కలమధ్య.

ఎడారి ముస్తాబయింది
పడుచుబుగ్గల పెళ్లి పిల్లలా.
పురివిప్పి ఆడుతున్నది ఇసుక
కురిసే అక్షింతల జల్లులా.

శూన్యం ఎంత సొగసుగావుంది
చుక్క తెగిపోతున్నట్టుగా.
ఊర్పు ఎంత వెచ్చగావుంది
ఉషస్సు తిరగబడుతున్నటు గా.

పంచమస్వరం ఎగురుతుంది
పక్షిపాడని ఈ కోనలో.
చైత్రరాత్రి రగులుతుంది
సంకీర్ణ పత్రాల వానలో.

శ్రీ మాదిరాజు రంగారావు

మస్తిష్కంలో లేబొరేటొరీ

ఈ సుదీర్ఘమైన కవిత మొదట ''భారతి''లో ప్రకటితమైంది. ఇది శక్తివంతమైన సృజన రూపానికి ఆదర్శంగా, కవి సామాజిక సాహితీ వ్యక్తిత్వానికి ప్రతిబింబంగా నిలచేది. ఈ దృక్పథంతో సమాలోచన జరపడానికి యత్నిస్తాను.

> ''మొహెంజొదారో శిథిలాల లోతులోకి
> పురాతన నాగరకతా గర్భంలోకి
> సూర్యుడస్తమించిన జాడల్లోకి ఒకదారి
> మరోదారి మస్తిష్కంలోని మా ఇంటికి [1]
> మరి మా ఇంటి ముందున్న లేబొరేటొరీ'' [2]

కవి ఎదుటనున్న దారులు రెండు. ఒకటి పురాసంస్కృతీ గర్భంలోకి వెళ్ళేది. ఇంటి వెనుకనుండి, అదే సూర్యుడస్తమించే జాడల్లో కలిసేది. మరొకటి మస్తిష్కంలోని ఇంటికి ఈ ఇంటికి ముందుగానే లేబొరేటొరీ. ఇంటి వెనుకా ముందూ ఎన్నెన్నో చిత్రాలు. సంఘటనాత్మకమైనవీ, స్థితినాశ్రయించినవీ, వ్యాఖ్యానగతాలైనవీ. ఒకదానివెంట మరొకటి ఆకర్షణీయంగా, జీవితంలోని నగ్న సత్యాలను స్మరింపజేస్తాయి.

ఇంటి వెనుకనున్నవి గత కాలపు మచ్చుతునకలు. పురా సంస్కృతీ శిథిలాలు. మానవగాథా శకలాలు. ఇంటిముందు భవిష్యత్తును దర్శింపజేసే ఆశారూపాలు. ఈ రెండు సందర్భాల్లో ప్రసరించే ఆలోచనారూపం వేరు, గమనవైఖరి వేరు. మొదటిది ప్రస్తుత కాలానికి అంతగా పనికిరాని వ్యవస్థను స్మరింపజేసేది. అందులో మన కెదురయ్యే కృత్రిమమూ, కఠినమూ చేతనా విరహితమూ ఐన అంశాలపై దృష్టిని ప్రసరింపజేసేది. ఇది సూర్యుడస్తమించిన జాడల్లో అవనతమై ఉంది. రెండోది ప్రస్తుతం అవసరమైన స్వేచ్ఛ, వాస్తవికత, పురోగమనశీలం కలిగిన మానవుని అన్వేషణపై ఆస్థ కలిగింది. ఇది సూర్యుడుదయించే దారులవైపు ఉన్ముఖీకృతమై ఉంది. మధ్య మధ్య కవివ్యాఖ్యానం, చరిత్రగురించీ, కాలాన్ని గురించీ, మానవుణ్ణి గురించీ, అతనిజీవిత సమస్యల్ని గురించీ, ప్రకృతస్థితి కన్వయిస్తూ తాత్త్వికమైన ఆలోచనా ధోరణిలో సాగింది. ఇవి కవి మనస్సులో ఉన్న మౌలికమైన నిర్మాణరేఖ లనుకుంటాను.

ఈలేబొరేటొరీలో కూర్చొని 'శాంతి పండే' రీతి ''క్రొత్త రకం విత్తనాల్ని'' కనిపెట్టే 'బలమైన కవిత్వాన్ని సృజించే' అవకాశం ఉంది. సమాజ సుస్థితికి శాంతి; మానసికమైన శాంతస్థితికి బలమైన కవిత్వం అవసరమైనవి. ఇక్కడ జరిగే కృషిలో అందరూ భాగస్వాములు. కాబట్టి ఇది ఎప్పుడూ తెరిచే ఉంటుంది. అందరకు ప్రవేశముంది ఇందులో. ఇక్కడ జరిగే వినూత్నమైన పరిశోధనల వల్ల శిథిలమైన ఆశలు చివురిస్తాయి. జీవితం రసవంతంగా, ఆనందప్రదంగా పరిణమిస్తుంది. ఆదర్శరూపం సిద్ధించడానికి చేయవలసిన ప్రయత్నమూ ఇక్కడ ప్రసక్తమైంది.

మస్తిష్కం అన్నమాటకు మేధ అనీ అర్థం. జీవితంలో మన అనుభవానికి వచ్చేవన్నీ, దీనియందు కూడి ఉంటాయి. ఇది శిరోదేశాన్నిపొంది ఉండడంవల్ల 'మస్తిష్కం' అని పేరు వచ్చింది. ఈనాటి వైజ్ఞానికమైన అవసరాన్ని కవి ప్రముఖంగా గుర్తిస్తూనే, వివేకాన్ని కోల్పోయే ప్రమాదంలో పడకూడదని విశ్వసిస్తాడు. అందుకని మేధాగతమైన ఆలోచనకూ, అనుభవానికీ జీవితంలో సమమైన ప్రాధాన్యం ఉండాలన్నది కవి నిశ్చయమైన ఆశయం. దీన్ని సామరస్యానికి భంగం కలిగితే ప్రమాదమే. ఇది అనేక సందర్భాల్లో స్ఫుటంగా వివృతమైంది.

> ''నిశ్శబ్దంగా నిదురపోయే
> నిరపరాధి పరమాణువు
> డొక్క చించి డోలుకట్టి
> ప్రమాదాలు తేబోకు!'' [3]

విజ్ఞానం, వివేకంతో సమన్వితమైనప్పుడే ఆనందాన్ని, సుఖాన్ని ప్రసాదిస్తుందన్న స్ఫూర్తినిస్తున్నాయి ఈ పంక్తులు.

ఇంటిముందు లేబొరేటొరీలో కూర్చొని ప్రయోగసరణికి స్థూలంగా గతం — వర్తమానం — భవిష్యత్తు అన్న మూడు దశల్లోని జీవితరేఖలు అభ్యుదయ భావనతో, మానవతా దృక్పథంతో తీర్చబడినాయి.

II

స్థూలంగా కవిలోని సామాజిక స్పృహ; అభ్యుదయ భావన; మానవతాదృక్పథంతో విలసితమైంది. చాలా సందర్భాల్లో రెండూ ఒకదానికొకటి ఉపస్కారకంగా చిత్రితమైనాయి. రెండిటి ఆశ్రయభూమి ఒక్కటే. అవి ఉన్ముఖీకృతమైతీరులో ఉంది భేదం. ఈ రచనలో, గతాన్ని ఉన్నచోటునే భద్రంగా ఉంచి, వర్తమానం వీపుతట్టి మేల్కొల్పి, భవిష్యత్తుకు స్వాగతం పలికే ప్రవృత్తిలో, అవసరమైన క్రియాశీలంతో అభ్యుదయభావన ఆశాంచలాలు స్పృశిస్తూంది. చరిత్రలోని కొన్ని ఘటనలు ఈ దృక్పథంలో కవికి ఉపయుక్తమైనాయి కవి సామాజిక స్పృహ

వితా తత్త్వం రెండూ ఒకదానినొకటి స్పృశిస్తూ కదలిపోవడం కూడవచ్చు.

"గతంలోంచి కొంత నేర్చుకోబోయి
గతానికి తాకట్టుపడుతున్నారు కవులు"

తాన్ని, మానవుడు అనంత ప్రయాణంలో అతిక్రమించిన స్థానంగా ాక, గమ్యస్థానం అనుకోవడంలో పురోగతికి క్షతి కలుగుతూంది. పూర్వానుభవ విశేషంతో ప్రయాణం సాగించడం వేరు. గతానికి తాకట్టుపడుతున్నారనడంలో మానసికంగా విముక్తి ఎరుగని దశలో స్సహాయస్థితి సూచితం. గతాన్ని కవి ఎందుకూ పనికిరాదని రసించడంలేదు. దానిపని మనకు శిక్షణ నివ్వడంవరకే పరిమితం. మైన జీవితంలో పరిస్థితులనుబట్టి వర్తమాన వ్యూహం, లక్ష్య ాధనసుబట్టి భవిష్యరూపం ఉంటాయి.

ఇంటివెనుక సూర్యాస్తమయ సన్నివేశం విన్యసించడంలో తకాల్పు నిశాలక్షణం లక్షించవచ్చు

"మా ఇంటి వెనుకగా
తాజ్‌మహల్ అందాల్లా మెరసిన షాజహాన్ కీర్తి"

ఇక్కడ తాజ్‌మహల్ అందాల్లో ప్రభువు కీర్తి మెరవడంలో అతని కళాసౌందర్య లక్షణం స్ఫూర్తి కడుతూంది. అస్తమయానంతరం, అంటే—గతంలో ఏదీ సరిగా కన్పించని స్థితిలో, కన్పించే కళా రూపాల్లో ఇదొకటి. ఇలాంటివి ఇంకా కొన్ని లేకపోలేదు. ఇవి జాతి కీర్తిని మెరపించే రమణీయాకృతులు! శిల్పంతోపాటు సాహిత్యం లోనూ, ఇతర క్షేత్రాల్లోనూ పేర్కొదగినవి ఉన్నాయి. వీటితో ఈ కాలాన చెల్లనివే ఎక్కువ!

"ఆనాటి పాతగంటం కంటిలో
రాక్షసీ వికటాట్టహాసం, రంభోర్వశీనాకవాసం"

"పాతగంటం కన్ను" అన్న భావచిత్రం (Image) నవ్యమైందీ, ఎంతో అర్థస్ఫూర్తి నిచ్చేదీ. గంటం వ్రాస్తుంది కాని చూడ లేదు బాహ్య జగత్తును చూచేది కన్ను. ఊహామయమైన ఆంతర జగత్తును చూచేది మనస్సు. మనస్సులో మెదలిన ఊహాసమూహానికి గంటం అక్షరాకృతి నిస్తుంది. ఊహాసమూహం కవి మనస్సులో రూపొంది, సాగి, అక్షరాకృతి వహించే process పై దృష్టితో పై భావచిత్రం నిర్మితమైంది. రాక్షసుల దేవతల కథలతో అల్లుకొన్న పూర్వసాహిత్యంలో యథార్థమైన జీవితానికి దూరమైన కృత్రిమ వాతావరణాన్ని భావింపజేస్తుంది.

"లోకాన్ని అడక్కుండా ఎవడో దుష్టన్నపతి
రచించిన కఠిన శాసనాల రాసులు"

పాలకులు, పాలితులమధ్య పెద్ద అఖాతం! ఈ మాటలు దీని లోతును చూపేవి. వీరిలోకం వేరు, వారిలోకం వేరు. ఇవన్నీ చారిత్రకమైన అవగాహనతో ఆలోచిస్తే, ఏ మార్పూలేని కఠినమైన వాతావరణం అవగతమౌతుంది. అప్పటి నిరంకుశమైన రాజరిక వ్యవస్థయొక్క విపరీత పరిణామానికిది ఒక ఉదాహరణంమాత్రమే. దీని పరాకాష్ఠ రూపం, రైతుల జీవితాలు రాజుల భోగసమృద్ధికి ఉపయుక్తమైన చారిత్రక సత్యం.

"రాజుల పాదాలక్రిందుగా
రైతుల రతనాల బ్రతుకుల తివాచీలు"

తనకు సాంఘికన్యాయం చేకూరలేదన్న అభిజ్ఞ కూడ లేదు రైతుకు. పైవారి సేవా భావంలోనే ఒదిగిపోయి నలిగిపోతూంది అమూల్యమైన జీవితం. కారణం తరతరాలుగా క్రమ్ముకొన్న అజ్ఞానమూ, దారిద్ర్యమూ వాళ్ళను ఆధునిక జగత్తునుండి దూరం చేశాయి. ఎప్పుడో ఎక్కడికి చేరుకున్న వారక్కడే నిలచిపోయారు. రాజులకూ వీరిని గురించి పట్టలేదు, పట్టించుకుంటే తమ భోగసరణికి అంతరాయం కలుగవచ్చు నన్న భయం! అభ్యుదయ కవిత్వంలో బహుధా కన్పించే కార్మిక లోకంతోపాటు, ఇతని కవిత్వంలో రైతునుగురించీ, అంతటి అభిలాష మొదటినుంచీ కన్పిస్తుంది. దీనికితని రచనల్లో అనేకమైన ఉదాహరణలు చూపవచ్చు.

III

ఈ లేబొరేటొరీలో కూర్చొని శాంతిని పండించేందుకు ముఖ్యమైన మరోరకపు విత్తనం కనిపెట్టే అవకాశముంది. ఇది మానవత్వపు విలువల్ని ప్రసాదించేది.

"నిరాశతో ఏడ్చే దరిద్రాంగన
కన్నీటి చుక్కలకు
ఎంత దూరాన నవ్వు పువ్వులున్నాయో—"[4]

దరిద్రమన్నది చాలవరకు సామాజిక వ్యవస్థకు చెందింది. దీన్నిబట్టే ఎక్కువగా అవాంఛనీయమైన పోకడలూ తలెత్తడం జరుగుతూంది దీని నివారణకు సాంఘిక వ్యవస్థలో మార్పు రావలసి ఉంది. వైయక్తికమైన మనస్తత్వానికి సంబంధించినవి వదలేస్తే ఎన్నో సంఘ వ్యవస్థాపరంగా అనుభవించేవే. వ్యక్తి, సంఘం రెండూ పరస్పరం ప్రభావం నెరపుతాయి. కాబట్టి ఈ రెండు దశల్లో కృషి జరిగినపుడే వికాసవంతమైన జీవితానికి చేరువలో ఉండగలం. దీన్ని గురించి కవి జరిపే ఆలోచన, అతడు నెరపే సానుభూతియొక్క ఆవిష్కారమే ఈ పంక్తుల్లోని మానవతా చిత్రణం. హృదయంలో ఏ పొరలో దయ, ఏ తెరలో నిర్దయ, ఏ దిక్కున రాగం, ఏ దిక్కున త్యాగం "దాక్కొని పెలవిస్తాయో" అన్న అంశమూ ఇక్కడ మనస్తత్వ భూమికలో పరిశోధనార్హమైందే. ఆశాస్వభావంతోపాటు కరుణ, అనురాగం, శాంతి మొదలైన ఉదారగుణోపేతమైన మనోరూపాన్ని సంపూర్ణంగా సాధించడానికి మొదట "మానవుడు మానవుడు"గా మేల్కొవలసిన అవసరం ఎంతైనా ఉంది.

IV

"కటిక రాతి గోడలతో కట్టిన కారాగేహంలో
గత కాలపు శాసనాల కట్టుబడిన ఖైదీవలె

భయం భయంగా గాలి పీల్చుకుంటూవేం"

"ఊపిరి తిత్తుల్ని కొలిమి తిత్తులుగా

నొక్కి నొక్కి మండించవోయ్ మానవతా జ్వాలావళి"

అభ్యుదయ భావన; మానవతా దృక్పథం—రెండిటి సమన్వయం ఈ పంక్తుల్లో చూడవచ్చు. ఇందులో కన్పించే చిత్రాలు రెండు. ఒకటి భయం. నిర్బంధంతో కూడిన విషాద చిత్రం. రాతి గోడల కారాగృహంలో కఠిన శాసనాలకు కట్టుబడిన ఖైదీవలె ఉన్న సామాన్యుని స్థితి. ఇది పాలితులపై పాలకుల అధికారాతిశయాన్ని తెలిపేది. రెండోది ఉత్సాహం. ఔజ్వల్యంతో కూడిన ఆశాచిత్రం. పాలకులవలన భయంతో బ్రతకడానికే సందేహించే వారి మనస్సులో, రగిలిన మెలకువతో మానవతాజ్వాలా సంచారం, ఎంతఅవసరమో రూపించేది కఠోర ప్రవర్తనకూ, స్వేచ్ఛా వర్తనకూ మధ్య జరిగే సంఘర్షణలో ఈ కవి ఊహ ప్రజలవైపు మొగ్గడం సహజం మానవులు ధైర్యంతో కదలి మునుముందుకు పురోగమించే జ్వలదగ్ని శిఖలుగా కళ్ళముందు సాక్షాత్కరిస్తారు ఇది ఒకదేశానికీ, కాలానికీ స్థగితం కాకపోవడంతో నేరుగా విశ్వజనీనత్వాన్ని పొందుతూంది. "కారాగేహంలో ఖైదీవలె" అన్నది సమాజపరమైన వాస్తవిక **(Socio-realistic)** భావచిత్రం. ఐతే ఊపిరితిత్తుల్ని "కొలిమి తిత్తులుగా మండించి" అన్నది కల్పనా **(imaginary)** గతమైంది రెండిటి సమన్వయం కవి ప్రధానమైన ఉద్దేశానికి పరిపుష్టమైనరూపం చేకూర్చింది. ఒకటి బాధానుభవాన్ని పలికితే, మరొకటి తద్విముక్తికి అవసరమైన చైతన్యాన్ని ప్రబోధిస్తూంది.

"ఇంకా అక్కడక్కడా ఎత్తైన గడీ గోడ నీడలు

చిన్నిచిన్ని గుడిసెల్ని పెరగనీయడంలేదు"

ఇంకా భయం భయంతో తలవంచుకొనే బరువు బరువుగా నడుస్తున్నాడు బానిసీడు. ఎత్తయిన గడీ గోడలు ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీక. అణువును భేదించినా, ఆకాశాన్ని ఉత్తరించినా ఇక్కడ సామాన్యుని బ్రతుకులో గుణాత్మకమైన మార్పు శూన్యం. కాబట్టి గుడిసెల్లో పెరుగుదల లేదు. ఎన్ని శతాబ్దాలు గతించినా "ఇక్కడే ఉన్నాం ఈ ఊరు పొలిమేరలోనే." ఎంతకాలం గడచినా; మానవునిలోని మూలభూతమైన సంస్కార గుణం, అనేకమైన వికర్షణలవల్ల మానవతా కేంద్రాన్ని స్పృశిస్తూ, అందుకోలేక పోతోంది. ఇది కేవలం ఆదర్శంగానే నిలచింది. ఈ భాగం వాస్తవాన్ని దర్శించాలన్న నిబిడమైన ఉత్కంఠను ఉన్మీలితం చేస్తూంది. ఏవో కొన్ని వైయక్తికమైన ఉదారవర్తనలకతీతమైన, విస్తృతమైన సాంఘిక న్యాయాన్ని అభిలషించే వ్యవస్థా దృక్పథంతో దీన్ని పరిశీలించవలసి ఉంది.

ఇంకా ఈ లేబొరేటొరీలో పరిశోధించే అంశాలు చాలా ఉన్నాయి.

"ఏ డిగ్రీలో ఎంత వేడి నిలిస్తే

ఏ రకం ప్రాణికోటి పుడుతుందో"

"ఏ ఖిలా గోడనీడ [5]

ఏ మహారాజ వంశాన్ని ఎంతెంత కాలం కాపాడిందో ?"

ఒకటి శైజ్ఞానికమైన పరిశోధనకు చెందింది. రెండవది సామాజికమైన అవగాహనకు చెందింది. విజ్ఞానశాస్త్రమూ, సామాజిక తత్త్వమూ రెండూ ప్రజల శ్రేయస్సుకు ఉద్దేశించినంతవరకూ వేరుకావు. పరస్పర ప్రయోజనా భావం లేకపోతే మానవ వికాసానికి సమగ్రత చేకూరదు. ఈ లోపంవల్లనే—

"మస్కెట్లనుండి రైఫిళ్ళదాకా నడచిన దేశం

కొడవళ్ళనుండి కోతయంత్రందాకా సాగలేదు"

ఇక్కడే సమస్థితి చెదరింది. మారణాయుధా లెప్పటికపుడు ప్రగతి దశలో నున్నట్లు ప్రాణాధారమైన ఆహారాన్ని ఉత్పత్తిచేసే వ్యవసాయరంగం లేదు. ఇది జీవితంలో మనం సాధించదలచుకొన్న విలువల్నిబట్టి ప్రాముఖ్యం వహిస్తుంది. ఈ సమన్వయంయొక్క అవసరాన్ని పదేపదే నొక్కిచెబుతూ జీవితంలో మరో పార్శ్వమైన కళాజగత్తుపైకి ఇతనిచూపు ప్రసరిస్తుంది.

V

అజంతాలో శిలాసుందరికిలేని

క్షుద్బాధా సంచలనం

పల్లెపడుచుకున్నాదని గమనించుకో భాయీ !

చిత్రం, శిల్పం మొదలైన కళారూపాలు మానసికమైన అనుభూతినిచ్చేవి. వీటికి క్షుధ ఏం తెలుసు? జీవితం నిత్యమూ అనుభవాత్మక

మైంది. ఎంతకాలం క్రమించినా అజంతా సుందరిలో ఏ ప్రధానమైన మార్పూ ఉండదు. పల్లెపదుచు వాస్తవ జీవితంలో అనుభవ స్పందనకు నిదర్శనంగా కన్పిస్తుంది. ఇది నియతం కాదు. పరిమితం కాదు. అందుకే క్షణక్షణానికీ, రోజురోజుకూ, సంవత్సర సంవత్సరానికీ భౌతికంగా, మానసికంగా ఎన్నో మార్పులు పొందుతుంది. ఆకలి, ఆలోచన, అనుభవం అన్న మూడు వాస్తవికమైన ప్రధాన స్థానాల నుండి సాగిన కల్పనా రేఖలతో జీవిత రూపం ఏర్పడుతూంది. ఇది వ్యక్తినీ వ్యక్తినీ భేదిస్తుంది. జీవితానికి సంబంధించినంతవరకూ ఇవన్నీ పరిశీలనార్హాలే. మన దృష్టి మరల్చడానికి వీలులేదు. ఇవి మన దృష్టినుండీ తప్పుకోలేవు.

కల్పనలో కళారూపానికీ, వాస్తవంలో జీవిత రూపానికీ మధ్య అంతరం చాలా ఉంది. అయినప్పటికీ విచిత్రమేమంటే ఈ రెండిటినీ కలిపే పల్చని స్ఫటిక సదృశమైన రేఖ లేకపోలేదు. దీన్ని కళలో వాస్తవికత; వాస్తవికతలో కళాకృతిగా దర్శించవచ్చు. రెండిటి కాంతి ప్రసారం ఒకచోట కలిసే స్ఫటిక సదృశమైన అనుభూతి విశేషం, దాశరథి కవితలో స్పష్టంగా కన్పిస్తుంది.

ఈ మెట్లపైనుండి కవిత్వానికి వస్తే, కవి మనస్సులోపలి చిత్రశాలలో ''చిత్రించరాని శిల్పం కూర్చలేని'' వేదన ఉంది. ఈ వేదన ఇంతవరకూ ప్రసక్తమైన సామాజిక దుస్థితివల్ల స్పందితమైంది. ఈ స్పందనలో జన్మించిన ''ఊహింపులు'' నిర్భయంగా, నిర్నిరోధంగా ''దిసమొలలో తోకానబడి'' పరుగిడు తున్నాయి వీటి స్వేచ్ఛాప్రవృత్తిని అరికట్టాలా? లేక సమాదరించాలా ? అని విచికిత్స.

''దెయ్యాల ఆడబిడ్డలవంటి
పెద్ద పెద్ద మోదుగ వృక్షాలకు
నిప్పుబట్ట కట్టించిన రీతి'' పరుగెత్తును ఊహాలు.

మోదుగపూలు నిండుగా పూచినప్పుడు ఎర్రగా కళ్ళు మిరుమిట్లు గొల్పుతుంది. ఇవి ఎండలో ధగధగలాడుతూ నిప్పుబట్టగా భావితమైంది. ఇవి పూచే కాలంలో కొమ్మలే ఉంటాయి. ఆకులంతగా ఉండవు. గుత్తులు గుత్తులుగా పూచి, కొమ్మల్ని ఆవరించిన పూలు, చూపుని చప్పున ఆకర్షిస్తాయి. పూలు నిప్పుబట్టగా వర్ణించడంలో భావచిత్రం గాఢత్వాన్ని పొంది, ఔజ్వల్యాన్ని ఆవిష్కరిస్తూంది. దెయ్యాలు భయానికి ప్రతీక. ఈ స్థితి మోదుగ వృక్షాలపై న్యస్తమైంది. భయావహమైన పూర్వస్థితికి నిప్పంటుకోవడంతో, ఊహలో ధైర్యరూపం పూలరూపంలో రమణీయంగా వ్యంజితమైంది.

''దండించనా ? రండి రంజని పిలిచి
నా కవిత్వపు పండుటెరుపు చేలాలందించనా ?''

అని ప్రశ్నిస్తాడు. దండించడమంటే సహజమైన స్వేచ్ఛాతత్వాన్ని నిరోధించడమన్నమాటే. ఇతనివద్ద 'రెడీమేడ్ దుస్తులు' లేవు. అందుకని వేదనలో జన్మించిన స్వచ్ఛమైన ఏ దాపరికంలే స్వేచ్ఛామూర్తులకు కవిత్వపు చేలాలందించే ఔత్సుక్యం కలిగింది ఇవి. పండుటెరుపు వర్ణం కలవి. ఇది ఉజ్వలమైన అభ్యుదయ రూపానికి ప్రతీక. 'నిప్పుబట్ట కట్టిన' కల్పనారీతి స్థానంలో, క అందించిన ''పండుటెరుపు చేలాల'' వాస్తవాకృతి, రచనక వ్యంగ్యభాసురత్వాన్ని కలిగిస్తోంది. ఒకమారు అవలోకిస్తే నగ్నత్వంలో సహజత్వమూ, ఉరకడంలో స్వేచ్ఛ, నిప్పుబట్టల తేజస్స్వరూపమూ, వేదనలో సృజనాత్మక మనోలక్షణం రేఖలు రేఖలుగా తీర్చబడిన కవితా స్వరూపం ప్రత్యక్షమౌతుంది.

అనేక సందర్భాల్లో తాత్విక దృక్పథంతో సాగిన వ్యాఖ్యానమూ మరవడానికి వీల్లేదు.

''కదళ్లేని వృక్షంవలె
కాలం అక్కడక్కడా పెరగ్గలదా ?''[6]

కాలం కదలందికాదు. అక్కడక్కడా కాస్తకాస్త పెరిగేదీ కాదు. ఇది అప్రతిహతమైన గతి శీలం కలదీ; పరిణామమైన రూపం కలదీ. మానవుని ప్రయాణంలో సుళ్ళుసుళ్ళుగా తిరిగినా, బ్రతుకులో ముళ్ళుముళ్ళుగా పడినా చిక్కులు, ఆగేదికాదు. ఒక క్రమ గతిలో అఖండంగా, సాధారణమైన ప్రకృతికతీతంగా చైతన్య రూపాన్ని దర్శింపజేసేది. ఇది అనుభవైకమాత్రమైంది. ఈ సంస్కారం విశేషస్థితిలో విశ్వజనీన దశకు చేరువుగా, ఉత్తమ కవిత్వంలో అనివార్యంగా కన్పిస్తుంది.

మొదట పేర్కొన్నట్లు, ఇతని సామాజిక స్పందనం — రెండు ముఖాలు అభ్యుదయభావన; మానవతాదృక్పథం — ఒకదాని కాంతి మరొకదానిపై ప్రసరిస్తూ, కవిలక్ష్యానికి దీప్తిని చేకూరుస్తూంది. ఇక కవితాతత్వం—శిల్పానికి గల స్థానాన్ని మరవకుండా, వేదనా ప్రధానమైంది. జీవితంలో విజ్ఞానమూ, వివేకమూ; కళా రూపమూ వాస్తవస్థితితో 'మానవుడు మానవుడు' గా భౌతిక మానసిక భూమికల్లో సంపూర్ణమైన వికాసాన్ని పొందడానికి చేసే కవి ప్రయత్నం — నవీన భావనారూపమే ఈ 'లేబొరేటొరీ'.

అధోజ్ఞాపికలు

1. పునర్నవం. 68.
2. ,, 69.
3. పునర్నవం. పుట 73.
4. పునర్నవం. పుట 75
5. పునర్నవం. పుట 72.
6. పునర్నవం పుట 71.

సెలెస్టియల్ సాంగ్

శ్రీ వి. సంపత్కుమారాచార్య

ఈ విశ్వంలో... గ్రహాలకవతల
తారలమధ్య...గెలాక్సీలో
ఏ 'సెలెస్టియల్ బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్' లోంచో
వినిపిస్తోందొక శాంతి గీతం ! ...
ఎవరు వినాలని ?... ఎవరు వినాలని ? ? ...
ఎవరికే దివ్య సందేశాన్నిద్దామని
ఆ 'కాస్మిక్ కిరణాల వెలుగు భాష'లో
ప్రశాంత గీతం నాకు వినిపిస్తోంది ? ?
ఆ గీతా న్నెవరాలాపిస్తున్నారు ?
ఇలా నా మనస్సు నెవరే లోకానికి ఆకర్షిస్తున్నారు ? ?

ఈ నభోంతరాళంలో...ఒక మారుమూల
ఛిన్నమైన...చిన్నదైన మట్టిగడ్డ భూవలయం !...
ఇందులో కోటానుకోట్ల జీవరాసుల మధ్య
ఓ చిన్న ప్రపంచం !... మా నవ ప్రపంచం ! ! ...
ఈ కాస్తలో దేశాలూ...దేవుళ్ళూ...తేటలేని జీవాలూ!!...
ఆ జీవాలనే మట్టికణాలమధ్య తెలుపునలుపు భేదాలు ! !...
ఆ భేదాలు తలకెక్కి...పరిధిగీసి...హద్దు పెంచి
'ఎగోయిజమ్'లో మునిగిన నేనెవరు ? అసలున్నానా ??...
నా వేడెక్కిన గుండెల్లో మ్రోగే ఆ విశ్వగీత స్వరమాహాత్మ్యం
నా భుజంచరిచి ఉన్నావంటోంది ! !...

అలా చూస్తే అంతరిక్షంలో
తనలో తలయెత్తే ప్రాణశక్తికి ఆకారణగా
వీనస్ భూమిలా అందాలు సంతరించుకుంటోంది !...
అంగారకుడు ఆశలు పుట్టిస్తూ మనిషి నూరిస్తూంటే
ఆ ఆలోకనలో ఆనందించే సవిత
అలాగే వృద్ధుడై పోతున్నాడు ! !... అవును !
కొన్నాళ్ళకి కాగికాగి మసిలి మసిలి మసియై రాలిపోతాడు!! ...
ఆ బాధ చూడలేని గ్రహాలు అంతకుముందే మాయమౌతాయి
అప్పుడింకో సూర్యుడు!...మళ్ళీ గ్రహాలు!...ఉపగ్రహాలు!!...
కొన్నింటిలో మళ్ళీ జీవరాశి ! !...నాగరకత ! !
యుద్ధాలు !... క్రుద్ధాలు !... విద్వేషాలు ! !...
చివరకు మళ్ళీ విలయం !...పిదప మరోజననం !...ఇదే
ఈ కాలోదధిలో విశ్వజీవనమనే యానపాత్రచేసే
పునః పునః మహః ప్రస్థానం ! !...

తన ఎదుటివాడి ఊహలనే
చదువలేని మనిషి మెదడు
ఈ పరిధిలో ఎంతని పెరుగుతుంది ?
ఎంత ఆలోచిస్తే ఏమందుతుంది ?
అయినా...తెలిసినంత తెలుసుకుని
మనిషి మనీషియై... ...
మానసికంగా
గ్రామాల...పట్టణాల...దేశాల...గోళాల
ఎల్లల్ని దాటి... ...
అభ్యుదయమనే అంతరిక్షంవరకూ పెరిగి
విశ్వజనీన జీవనమనే...ఆ
ప్రశాంత...సౌహృద్యగీతాలాపనతో కంఠంకలిపి...
'నవయుగాది' ని చేతులెత్తి ఆహ్వానిస్తే !...
మనిషి గుండె చప్పుడులో మానవత ప్రతిధ్వనిస్తే ! ! .
ప్రమోద ప్రజ్వల ధామంతో
తమో నిహీన మొనరిస్తే ! ...
మధుర ప్రణాద ప్రక్వణాలతో
ద్యావాపృథువుల నింపేస్తే ! !... ...

సుకవి మనోరంజనము*

ఆంధ్ర విద్వత్కవులలో కూచిమంచివారి కుటుంబం మిక్కిలి ప్రసిద్ధమైనది. గొప్ప లాక్షణికుడు, బహుప్రబంధకర్త అయిన తిమ్మకవి కవిసార్వభౌముడుగా పేరు పొందాడు. అతని తమ్ముడు జగ్గకవి తిట్టు కవిత్వంలో దిట్ట. సాహిత్యాభిమానులలో అతని చంద్రరేఖా విలాపాన్ని ఎరగనివారు ఉండరనుకుంటాను. జగ్గకవి మనుమనికి మనుమడైన వెంకటరాయడే సుకవి మనోరంజనానికి కర్త.

తిమ్మకవి పెక్కు ప్రబంధాలనేకాక లక్షణసార సంగ్రహమనే లక్షణ గ్రంథాన్ని కూడా రచించాడు. అందులో మూడాశ్వాసాలలో వ్యాకరణాంశాలను, యతిప్రాసలను, రేఫఱకారములను సోదాహరణంగా, విపులంగా తెలియజేశాడు. వేంకటరాయడు కూడా ఆ పద్ధతినే అంతకంటె వివరంగా నాలుగాశ్వాసాలలో ఛందోవ్యాకరణాంశాలను, ఎన్నో ఉదాహరణాలను చూపిస్తూ ఈ విపులమైన గ్రంథాన్ని రచించాడు. ఇందులో అవతారికాభాగం తప్ప తక్కిన గ్రంథమంతా వచనంలోనే ఉన్నది ఉదాహరణలు మాత్రం పద్యాలుగా ఉన్నవి. ఆ వచనం కూడా—గ్రంథకర్తకాలంలో—అంటే రమారమి నూరేండ్ల క్రిందట వ్యవహారంలో ఉన్న భాషలోనే ఉన్నది.

వెంకటరాయ డీ గ్రంథాన్ని నాలు గాశ్వాసాలుగా విభజించి రచించినట్లు వ్రాతప్రతులనుబట్టి తెలుస్తున్నది. ఇది పిఠాపురంలోని కుక్కుటేశ్వరుని అంకితంగా రచింపబడినట్లు షష్ఠ్యంతాలనుబట్టి, ఆశ్వాసారంభ పద్యాలనుబట్టి తెలుస్తున్నది. ఆశ్వాసాల చివర పద్యములుగాని, ఆశ్వాసాంత గద్యలుగాని లేవు. ఏతత్పరిష్కర్తలకు సంపత్కుమారాచార్యగారు నాలుగవ ఆశ్వాసాన్ని రెండుగా విభజించి అయిదవ ఆశ్వాసాన్ని కూడా కల్పించారట! ఐదవ ఆశ్వాసాదిని నాలుగవ ఆశ్వాసంలోని తొలిపద్యమే చేర్చబడినది.

ప్రథమాశ్వాసంలో అవతారికకు తర్వాత సంస్కృతాంధ్ర వర్ణవిభాగం, ప్రాసవిషయం ఉన్నవి. ద్వితీయాశ్వాసంలో యతిభేదాల చర్చ, యతిభేదాలు తెలుపబడినవి. మూడవ ఆశ్వాసంలో యతి భేదాలు ఉదాహరణలతో కూడా విపులీకరింపబడినవి. నాల్గవ ఆశ్వాసంలో రేఫ కటరేఫల చర్చ, వాటికి సంబంధించిన పదముల పట్టిక ఉన్నవి. చివరి ఆశ్వాసంలో అప్పకవి ఆక్షేపణలు, వాటికి సమాధానాలు, కొన్ని వ్యాకరణాంశాలు కానవస్తున్నవి.

ఆంధ్ర లక్షణ గ్రంథాలలో సాధారణంగా ఛందోవ్యాకరణాలంకార లక్షణాలు మూడున్నూ కొద్దిగానో గొప్పగానో ఉంటూనే ఉన్నవి. వ్యాకరణ గ్రంథమైన ఆంధ్రశబ్ద చింతామణి 'విశ్వశ్రేయః కావ్యం' అని కావ్యలక్షణంతోనే ప్రారంభమైనది. అందులో 'వళిరాద్య మనంతరాక్షరం ప్రాసః' అని ఛందోలక్షణం కూడా స్పృశించబడినది. అప్పకవి తాను ఆంధ్రశబ్ద చింతామణి అను వ్యాకరణశాస్త్ర గ్రంథాన్ని వ్రాస్తున్నట్లు చెప్పినా, అతని గ్రంథంలో ఛందోవిషయాలే అధికంగా కానవస్తున్నవి. ఆ రీతినే ఈ సుకవి మనోరంజనంలోనూ ఛందోవ్యాకరణాలు రెండూ ఉన్నవి. వ్యాకరణాంశాలకంటె ఛందోవిషయాలే ఎక్కువగా ఉన్నట్లు ఆ యా ఆశ్వాసాలలోని విషయాలనుబట్టి తెలుసుకోవచ్చును.

వెంకటరాయడు తన గ్రంథానికి తిమ్మకవి లక్షణసార సంగ్రహాన్ని మేలుబంతిగా స్వీకరించాడు. కవిసార్వభౌమ బిరుదుతో కూడా తిమ్మకవి పేరును పలుతావుల్లో పేర్కొనడంవల్ల ఆయన యెడల ఇతనికి ఎట్టి భక్తి గౌరవాలున్నదీ తెలుస్తున్నది. ఇతడు తిమ్మకవినే అనుసరించినా, కొన్ని విశేషాలను తెలియజేశాడు. ఉదాహరణలను అధికంగా ఇచ్చాడు. ఇందులో ఆదినుండి అంతంవరకూ అప్పకవిని విమర్శించడమూ, అధిక్షేపణలు కానవస్తున్నందున, ప్రధానంగా అప్పకవీయాన్ని విమర్శించడంకోసమే యిది రచించబడినదా? అని సందేహించవలసి వస్తున్నది. ఏ ఆక్షేపణ అయినా యిందులో సయుక్తికంగానే కానవస్తుంది. ఇందులో నూరు ఆంధ్ర గ్రంథాలు, ఇరవై అయిదు సంస్కృత గ్రంథాలు ప్రామాణికాలుగా స్వీకరించబడినందున గ్రంథకర్త పరిశీలనశక్తి అపారమైనదని తెలుస్తున్నది.

(1) ఇందులో వర్ణసమామ్నాయమును గురించిన పెద్ద చర్చ ఉన్నది. "ఆద్యాయాః పంచాశద్వర్ణాః" అని చింతామణిలో సంస్కృతంలో ఉన్న వర్ణములు ఏభై అని చెప్పబడినది. వరరుచి కథనాన్ననుసరించి—

"ద్విధాక ఏచో౽నుస్వారో విసర్గః షోడశ స్వరాః
స్పర్శా అంతస్థ శోష్మాణః చతుస్త్రింశత్ హలః స్మృతాః"

'అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఏ ఐ ఓ ఔ ం ః'

అని అచ్చులు పదహారు, క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ, య ర ల వ ళ, శ ష స హ' అనే ముప్పయి నాలుగూ హల్లులు. ఇందులో చాలా చర్చ జరిపి తర్వాత వెంకటరాయడు అచ్చులలోని ౡకారాన్ని విడిచిపెట్టి ఌక, ఌప అనే జిహ్వామూలీయోపధ్మానీయాలను చేర్చి అచ్చులను 17 గా చెప్పాడు. హల్లులలో 'ళ' కారాన్ని విడిచిపెట్టి అవి 33 అని అన్నాడు. ఈ రీతిగా ఏభై సంఖ్యను కిట్టించి, యిదే తన మతమని స్పష్టపరచాడు. ఱ, ళ లను, కొన్ని వర్ణ

---

* సుకవి మనోరంజనము. కూచిమంచి వేంకటరాయ ప్రణీతము. పరిష్కరణ. శ్రీ కోవెల సంపత్కుమారాచార్య, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల, జగిత్యాల, కరీంనగరం జిల్లా. డెమ్మీ సైజు 60+504 పుటలు. వెల 15రూ. ప్రకాశకులు—ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవనం, సైఫాబాదు, హైదరాబాదు.

యుక్కులను చేర్చి తెలుగక్షరములు 43 అని అన్నాడు. ఇందీతని స్వాతంత్ర్యం స్పష్టంగా తెలుస్తున్నది.

(2) అప్పకవి 17 ప్రాసభేదములను చెప్పగా ఇతడు ఆరింటిని మాత్రమే చెప్పి, తక్కిన వాటిని నిరాకరించాడు. ఆ అప్పకవి ప్రాస సంఖ్యను విమర్శించినపుడు "వీటిలో ప్రాసమైత్రి, స్వవర్గజము, ఋప్రాసము" ఈ మూడున్ను భేదములు కనుపించుచున్నవి గాన గ్రాహ్యంబులు. ప్రాసవైరమని పేరు మాత్రమేగాని యెక్కడనైనను లేనందుననున్ను, తమరు లక్ష్యమొకట్నైనా వ్రాయనందుననున్ను పూర్వసుకవి ప్రబంధములయందు నున్నవని చెప్పుటవలననున్ను—ఇంత సందర్భముగా రచించుటకు గగనారవింద శశివిషాణ వంధ్యాపుత్రులవంటివిగా నెంచి సంతోషించినాము. విశ్రమ ప్రకరణమందును 'విశ్రమవైర' విశ్రమమని చెప్పవలసిన దౌను. "పరాకు నొందినారని తోచుచున్నది" (పుట 70.) అని అప్పకవి తీవ్రముగా అధిక్షేపింపబడెను.

పై రీతిగానే అప్పకవి చెప్పిన యితర ప్రాసభేదాలున్ను నిరాస్తం చెయ్యబడినవి.

అంతవరకూ ఇతర లాక్షణికులకన్న ఎక్కువ యతులను చెప్పినవాడు అప్పకవిమాత్రం కనిపిస్తున్నాడు. వెంకటరాయడు అతని యతి భేదాలను విమర్శిస్తూనే అతనికంటె అధికంగానే యతులు చెప్పాడు. అప్పకవి మతంలో స్వరయతులు 7. వ్యంజనాక్షరయతులు 21. ఉభయ యతులు 12. ప్రాసయతి ఒక్కటి. మొత్తముపయి నలభైయొక్క యతులు. వెంకటరాయని మతంలో స్వరయతులు 6. వ్యంజనాక్షరయతులు 15. ఉభయయతులు22. ప్రాసయతి ఒక్కటి. వీటిలో అభేదయతులు నాల్గువిధాలు. ప్లుత యతులు నాలుగు భేదాలు. కాకుస్వరయతులు ఇరవై అయిదు విధాలు. ఈ అంతర్భేదాలను కలుపుకుంటే యతులు డెబ్బయి నాలుగు విధాలవుతున్నవి. ఇలా సంఖ్యను పెంచడంలో ప్రయోజన మేమో !

వెంకటరాయని అభిప్రాయాల్లోని ఔచిత్యానౌచిత్యాలను పరిశీలిస్తూ పరిష్కర్తలు సంపత్కుమారాచార్యగారు చెప్పిన విషయాలు గమనించదగినవి. ఇతడు అప్పకవి చెప్పిన స్వరమైత్రి యతిని నిరాకరించి స్వరప్రధాన యతినే స్వీకరించగా, పరిష్కర్తలు స్వరమైత్రి యతినే గ్రహించి, స్వరప్రధాన యతిని త్రోసిపుచ్చడం సముచితంగా ఉంటుందని సయుక్తికంగా చెప్పడం దీనికొక ఉదాహరణం.

రేఫ శకటరేఫల విషయంలో లాక్షణికుల పొరపాట్లు వివరించబడినవి. తిమ్మకవిని అనుసరించి వాటి పట్టికకూడా ఈయబడినది.

ఇక వ్యాకరణ విషయాలలో పయ్యెద మున్నగు పదాల విషయమై అప్పకవి అభిప్రాయం సయుక్తికంగా నిరసించబడింది. ప్రథమోత్తమ పురుష సంధిని గురించి యితడు చాలా విపులంగా విమర్శించాడు. అప్పకవిని విమర్శించే దీని సందర్భంలో "ఇన్ని తప్పులప్పకవీయమందుండంటే నందఱు నెందుకు (దానిని) గొనియాడుదురందురా ? మొదట భూలోకములోనున్న గ్రంథముల పేరులన్నియును వ్రాసినందున (అప్పకవిగారు) అన్ని గ్రంథములు పరిశీలించినారనిన్నీ, అలంకారముల పేరులు, రీతులు, వృత్తులు మొదలైనవాటి పేరులు, రసముల పేరులు వ్రాసినందున నన్నియు విమర్శించినారనిన్నీ, పామరుల తాత్పర్యం" అని వ్రాయుటవల్ల ఆ కవి యెడల ఇతనికెంత నిరసనభావ మున్నదీ తెలుస్తున్నది.

వెంకటరాయడు చేసిన అమ, అయ (అమ్మ, అయ్య) మున్నగువాని చర్చ, దీర్ఘాంతాల హ్రస్వత్వచర్చ, కహ్లారాదుల విమర్శ, కొన్ని విభక్తిరూపాల వివరణ గమనించదగినవి. 242 వ పుటలో శృంగార నైషధంలోని "ఏమో క్రొత్త యపూర్వ వార్త వినుచేమో చెప్పచున్" అనే అపపాఠాన్నే అందరూ గ్రహించి యతి భంగాన్నయినా గ్రహించడంలేదనీ, అక్కడ "వినుచేమీ చెప్పచున్" అని ఉండాలనీ తెలపడం యితని నిశితదృష్టికి తార్కాణ. ఈ గ్రంథకర్త ఎంతో పరిశ్రమించి యీ గ్రంథం రచించాడు.

ఇందులో 'వ్రాసుట, వ్రాసుతున్నాడు' అన్నవి చెవికి కొంత వింతగా వినబడుతున్నవి. అహోబల పండితుని 'కవిశిరోభూషణం' యిందులో కొన్నిచోట్ల 'కవిశిరోమణి'గా చెప్పబడింది. ముద్దరాజు రామన్న, బుద్ధరాజు రామభద్రుడుగా పేర్కొనబడియున్నాడు. గ్రంథకర్త తరచుగా తాను చెప్పినదానికి ప్రమాణంగా కూచిమంచి తిమ్మకవి లక్షణసార సంగ్రహ భాగాలను, అహోబల పండితీయంలోని భాగాలను ఉదాహరిస్తూ వచ్చాడు.

కవి వంశీయులైన కామేశ్వరరావుగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి సమర్పించిన రెండు వ్రాతప్రతులు ఆధారంగా ఈ బృహద్ గ్రంథం పరిష్కరింపబడి, పెక్కు విషయాలను తెలిపే విపుల పీఠికతోను, అనుబంధాలతోను ప్రకటింపబడినది. ఆ పీఠిక (సమాలోకనము) లో కవి వంశ ప్రశంస, గ్రంథం మూల ప్రతి, పరిష్కరణ రీతి, గ్రంథస్వరూపం, వర్ణవిభాగం "అద్యః క్రియాసు..." సూత్రచర్చ, ప్రాసవిచారం, యతుల వర్గీకరణం, కొన్ని యతులపై చర్చ, గుండు రా, బండి రా ల చర్చ, విమర్శ తీవ్రత, సహృదయత వివరింపబడినవి. అనుబంధాలలో వెంకటరాయడు నిరూపించిన నిత్యసమాస పదములు, శకంధ్వాదులలోని పదములు, అతడు చూపిన పదముల స్వరూపవైవిధ్యం, ఉదాహృత గ్రంథాలు — పద్యాలు — ఈయబడినవి.

దీనిని పరిష్కరించిన కోవెల సంపత్కుమారాచార్యగారు సంస్కృతాంధ్రాలలో సమర్థులైన విద్వాంసులు. లక్షణ గ్రంథాల్లో విశేషకృషి చేసినవారు. కొన్నియేండ్ల క్రిందట తిమ్మకవి 'లక్షణ సార సంగ్రహ'ాన్ని చక్కగా పరిష్కరించి, విపులమైన పీఠికతోను, ఉపయుక్తములైన అనుబంధములతోను చక్కని శుద్ధప్రతిని తయారుచేసినవారు వీరే! దానిని ఆం. ప్ర. సాహిత్య అకాడమీవారే ప్రకటించారు. అది ఎన్నో యేండ్ల క్రిందట ఏలూరిలోని ప్రసిద్ధ విద్వాంసులు నందివాడ చలపతిరావుపంతులుగారు తమ 'మంజ

వాణీ' ముద్రాక్షరశాలలో ముద్రించి ప్రకటించారు. పంతులుగారు దానిని "సర్వలక్షణసార సంగ్రహ" మన్నారు. సంపత్కుమారాచార్య గారు ఆ పేరు సరికాదనీ, తిమ్మకవి యెక్కడా అలా చెప్పలేదనీ అందు వివరించారు. వారినే దీని పరిష్కరణకుకూడా నియమించి అకాడమీవారు తగినవారినే ఎన్నుకొన్నందుకు అభినందనీయులు. ఆచార్యగారు విసుగుపడకుండా శుద్ధప్రతిని, అనుబంధాలను తయారుచేసి, తగిన పదాలను కుండలీకరణంలో ఇచ్చి, పాఠకుల కెంతో సౌకర్యం కలిగించారు. అవసరమైనచోట్ల అధ వ్యాఖ్యాచికల నిచ్చి, తమ ఆశయాన్నికూడా వెల్లడించారు. వీరి సమాలోకనం చదివితేనే పుస్తకంలోని విషయం చాలావరకూ అవగతమవుతుంది.

కవి పిఠాపురంవాడు. కావున అతవి జీవితాదులను గురించి స్థానికులైన శ్రీ ఆవంత్స సోమసుందర్ మున్నగు విజ్ఞులవల్ల పెక్కు విషయాలను తెలుసుకుని పీఠికలో చేర్చారు. ఈ వంశీయులు పెద్దాపురం, బొబ్బిలి ప్రభువులచేతకూడా సమ్మానాలు పొందినట్లు చెప్పనపుడు విజయరామరాజుగారు బొబ్బిలి ప్రభువని చెప్పడం పొరపాటు. ఆయన విజయనగర ప్రభువు. బొబ్బిలివారికి విరోధి. ఆయనకీ విషయం ఎవరో తప్పుగా చెప్పిఉంటారు.

ఛందో విషయాలను గురించి విపులంగా చర్చించిన గ్రంథాలలో అప్పకవీయం మొదటిది. తర్వాతిది లక్షణసార సంగ్రహం మూడవది యీ గ్రంథం. వెంకటరాయుడు ఎన్నో గ్రంథాలను చూచి, తయారుచేసిన దీనిని ఓపికతో పరిశీలించి, పరిష్కరించి, ఆంధ్రవిద్వల్లోకానికి అందజేసిన సంపత్కుమారాచార్యగారు ఉత్తమ రీతిని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ఆంధ్ర సాహిత్యానికి చేసినమేలు విస్మరింపరానిది.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య.

1x0=0

"సాంధ్య శ్రీ"

గుప్పెడు గుండెలో కొండలంతేసి ఆశయాల్ని కాపురం చేయించి
   అణువంత స్వార్థానికి బానిస ...
కళ్లలో కలలరంగుల్ని దిక్కులమీదికి విదిలించి — లోకాన్ని
చిత్రవర్ణంలో ముంచెత్తి అణువంత కన్నీటిలో మునిగి ...
ఈ మనిషి కెవరు కల్పించారీ భ్రమ
ఏమిటి సాధించాడు ఇంతాపడిశ్రమ

అంటే
ఒక దశలో దేముడైనాసరే ఈ ప్రశ్నవేస్తే — తనకు తనే సమాధానం.
ఈ కలల వర్తకుడ్ని
ఈ సంకెలల వర్తకుడ్ని
ప్రపంచం ఎందుకు నమ్ముతుందో [ప్రపంచం నిర్జీవమా—లేక స్త్రీలింగమా]
చివరికి వాడ్ని—వాడే ఎందుకు నమ్ముకుంటాడో తెలీదుకదా ?
సమాధానానికి ఎదురొచ్చే ప్రశ్న—సమాధానాన్నే ఆశ్రయించు
కుంటుంది; ప్రశ్నకు ప్రత్యేకమైన ప్రతిపత్తి లేదు, సమాధానం
తప్ప. సమాధానానికెప్పుడూ ప్రశ్న ఉండనే వుంటుంది.

[శ్రీ గుంటూరు శేషేంద్రశర్మకు అంకితం]

శ్రీ ఎమ్. పార్థసారథి

ఒక ప్రేమ (సంభాషణ)

(ఆడగొంతూ, మగగొంతూ మాట్లాడుకుంటున్నాయి)

మగ : చాలా థాంక్స్. నా మాట మన్నించి యింత దూరం వచ్చారు.

ఆడ : ఓ యస్. మన్నించాను. కాని యిన్నిసార్లు రమ్మనటంలో మీ వుద్దేశం ఏమిటి? అలా అడగొచ్చా? మీచెల్లెళ్ళని ఎవరైనా అబ్బాయి యిలాగే పిల్చుకుపోతే మీకు బావుంటుందా?

మగ : సారీ సారీ. మేడం, అలా అనకండి. మిమ్మల్ని ఆషామాషీగానూ పిలవలేదు. అల్లరిచెయ్యటానికీ పిలవలేదు. మీ వ్యక్తిత్వంమీద గౌరవముంది. మీరంటే అభిమానముంది. ఈ విషయాలు ఆఫీసులో మాట్లాడుకోలేం. ఆనాడు హోటల్‌కు రమ్మంటేనేమో మొహంవాచేలా చీవాట్లు పెట్టేరు. రమ్మన్నందుకే నేను అలుసైపోయానా? మీకు నేనంటే ఏమాత్రం యిష్టంలేకపోయినా యిలా వచ్చారా?

ఆడ : స్టాపిట్. కమ్ టు ది పాయింట్.

మగ : నన్ను కాస్త గుక్కతిప్పుకోనివ్వండి.

ఆడ : ఉపన్యాసం ప్రారంభించి యింకా అలా అమాయికంగా మాట్లాడతా రెందుకూ!

మగ : సరే. మీరు చెప్పండి.

ఆడ : అందికేనా నన్ను పిలిచింది?

మగ : నన్ను మాట్లాడనివ్వండి. ప్రతిదానికీ మీరిలా ఫైర్‌చేస్తే ఎలాగ?

ఆడ : ఎంతచెడ్డా మీరు సీనియర్ క్లర్క్. నేను జూనియర్ క్లర్కుని. నేను మిమ్మల్నెలా ఫైర్‌చెయ్యగలను?

మగ : ఖర్మ. ఇక్కడా ఆఫీసు గొడవలు లాక్కొస్తున్నారు.

ఆడ : నేనేమీ లాక్కురాలేదు. మీరే నన్ను లాక్కొచ్చారు. కానీ, ఆ చెప్పేదేదో కాస్త త్వరగా శలవివ్వండి. నేనిలా కూర్చోవటం మీకు బావుంటుందేమో గాని మావాళ్లకు బావుండదు. ఎంతసేపిలా నాచేత వాగిస్తారు?

మగ : వాగీశ్వరీ, తమరలా అనద్దు.

ఆడ : నా పేరు వాగీశ్వరి కాదు. ప్రేమలత.

మగ : థాంక్స్. మీతో కొన్ని సీరియస్ విషయాలు చెప్పటానికే రమ్మన్నాను. కాని మాట్లాడాలంటే ఏమిటోగా వుంటుంది. మాటల అవసరం లేకుండానే నా మనసులోని విషయాలన్నీ మీకు తెలుపగలిగిన పద్ధతి ఏదన్నావుంటే బావుండును.

ఆడ : వెరీగుడ్. నేను గూడా ఆప్టిమిస్టునే. ప్రపంచంలో శాస్త్ర ప్రగతి చాలవేగంగా జరుగుతోంది. ఆ యంత్రమేదో త్వరలోనే మార్కెట్లోకి వచ్చెయ్యొచ్చు. మీ మాటల్ని అప్పటిదాకా వాయిదా వెయ్యండి.

మగ : ప్లీజ్. ప్లీజ్. లెట్ మి టెల్ యు...నేనంటే మీ కిష్టమా?

ఆడ : అంటే?

మగ : నేనెలాంటివాణ్నని మీ వుద్దేశం?

ఆడ : ఏమో, నాకెలా తెలుస్తుంది?

మగ : అలాకాదు...పోనీ, మీకు పెళ్లి చేసుకోవాలనే వుద్దేశం వుందా?

ఆడ : ఎవర్ని?

మగ : ఎవరో ఒకర్ని. అసలు చేసుకుంటారా లేదా?

ఆడ : ఆ విషయం మీకెందుకు?

మగ : మగవాళ్లను ఆట పట్టించటం మీకు బాగా చాతవును లాగుంది. మీకు చేసుకొనే వుద్దేశమేవుంటే నేను కూడా అప్లికేషన్ పెట్టుకుంటాను. కాస్త కన్సిడర్ చెయ్యండి.

ఆడ : నేనింకా వేకెన్సీ అడ్వర్టైజ్ చెయ్యందే?!

మగ : ఏమిటీ ఆ సమాధానం! చెప్పండి. మీరంటే నాకు చాలా యిష్టం, గౌరవం, అభిమానం. పెళ్లికి ముందరి ప్రేమాయణం నాకూ నచ్చదు.

ఆడ : నాకూ అంటున్నారు. నాకు నచ్చుతుందో లేదో నేను మీకు చెప్పలేదే?

మగ : నాకునచ్చదు. **But all the same I love you.** ఓ. కే. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను.

ఆడ : థాంక్స్. అంటే మీరు నన్ను పెళ్ళిచేసుకోకపోయినా నామీద యిష్టమూ, గౌరవమూ, అభిమానమూ వుంటాయా?

మగ : దయచేసి మీరూ క్రాస్–ఎక్జామిన్ చెయ్యకండి. మీరంటే మంచి అభిప్రాయం వుండటంవల్లే మీ మీద అభిమానం కలిగింది.

ఆడ : మీరిష్టపడ్డ ప్రతి ఆడదాన్నీ మీరు పెళ్ళాడగలరా ఏమిటి?

మగ : ప్లీజ్. ప్రేమా అలామాట్లాడొద్దు. నన్ను ఆటపట్టించకు.

ఆడ : లేదండీ, నేనెవర్నీ ఆట పట్టించను. ఆట కట్టించను. నా పనేదో నేను చూసుకుని వెళ్ళిపోతాను.

మగ : ప్రేమా

ఆడ : ఓహ్ ! I hate that name. ఆ పేరు పెట్టినందుకు మావాళ్లమీద నాకు చాలా కోపం. నాకు ప్రేమ తెలియదు. నేను ప్రేమించను. అవసరాలు తీర్చుకోవటాని కనుకూల మైన పేరు ప్రేమ. మీరు ప్రేమ జబ్బుల స్పెషలిస్టు దగ్గిరకు వెళ్లటం మంచిది.

మగ : ఏమిటి, మనం పెళ్ళిచేసుకుంటే బావుంటుందనుకోవటం అసమంజసమైన కోరికా ? ఒక మనిషిని యిష్టపడటం అసహజమైన పనా ?

ఆడ : అబ్బబ్బ. ఆపండి. ఏముందండీ నాలో యిష్టపడటానికి? నేనేమీ వేదాంతిని కాదు. కాని శరీరం చూసి చేసుకునే వాళ్ళంటే నా కసహ్యం. ఈ ఆకర్షణ చెరిగిపోతే దానితో పాటు యిష్టమూ పోతుంది. ఇంత తుచ్ఛమైనదీ, నీచ మైనదీ ఎదటివాళ్ళను ఆకర్షించిందంటే...

మగ : మైడియర్ప్రేమా, ప్లీజ్ స్టాపిట్. రమణమహర్షి ఇలాగే అనుకున్నాట్ట. నేనంటే ఎవర్నూ అని. ఈ శరీరం నాది కాదు. ఈ మనసు నాదికాదు. మరి నేనెవరు...అంటూ... మరి నాపేరు రమణ మహర్షి కాదు. రమణారావు. నా కళ్లకు నువ్వు అందాల రాణివి. నా కళ్లు నీ శరీరాన్ని ప్రేమిస్తాయి. నా చెవులు నీ మాటల్ని ప్రేమిస్తాయి. నా చేతులు నిన్ను స్పృశించాలంటాయి.

ఆడ : ఇంకా ?

మగ : ప్రస్తుతానికంతే. ఇప్పుడే యింతకన్నా ఎక్కువమాట్లాడితే సెన్సారు కత్తెర అడ్డమొస్తుంది.

ఆడ : రమణారావుగారూ

మగ : ఊఁ.

ఆడ : నేను గూడా మీ గురించి యివన్నీ చెప్పాలా ?

మగ : అక్కర్లేదు. మీ అభిప్రాయం చెప్పండి. చాలు.

ఆడ : కాని నాకు మీ గురించి ఏం తెలుసని చెప్పను? మనదంతా ఆఫీసు పరిచయమే గద.

మగ : నాకు మాత్రం మీ గురించి ఏం తెలుసునని ఇవన్నీ అను కున్నాను ! కావాలంటే అన్నీ విడమర్చి మాట్లాడుకుందాం. ఒకరి బలహీనతలొకరం అర్థం చేసుకుందాం. మన్నించు కుందాం. ఎలాసర్దుకోవచ్చో తెలుసుకుందాం. ఒకరి సంతో షాని కొకరం ఆలంబనగా వుందాం.

ఆడ : అంటే మనం పెళ్లికి నిశ్చయించుకున్నట్టే అన్నమాట.

మగ : ఏమో, మీ అంగీకారం తెలపందే ?

ఆడ : మరి తెలపందే అవన్నీ ఎలా చెప్పారు ?

మగ : ఒకర్నొకరు తెలుసుకుని చేసుకోవాలి. చేసుకుని తెలుసు కోవాలి. ఏది ముందు ?

ఆడ : మీరు జోక్చేస్తున్నారా? నన్ను లాఫింగ్స్టాక్చేసి మాట్లాడు తున్నారా ?

మగ : రెండూ లేదు. మీరు ఉద్రేకంగా వున్నారు. నేను ఆలో చిస్తున్నాను. అప్పుడప్పుడు అనుమానంగా అడుగుతున్నాను.

ఆడ : కావచ్చు. నేను సమయోచితంగా మాట్లాడలేకపోవచ్చు.

మగ : మీరు నమ్మకపోయినా ప్రేమ గుడ్డిదేనేమో !

ఆడ : ఏమో ! కడుపొస్తేగాని కళ్లు తెరవరు ప్రేమికులు. గుడ్డి ప్రేమికులు.

మగ : అబ్బబ్బ. ఎంతలేసి మాట్లాడుతున్నారండీ !

ఆడ : కాదు. ఎంతలేసిమాటలు వింటున్నానండీ అనాల్సింది నేను.

మగ : అనండి. ఇంకా అనండి.

ఆడ : వింటాను. చెప్పండి.

మగ : చెప్పదలచుకున్నదేదో చెప్పేశాను. మీరు అపహాస్యం చేసినా, గేలిచేసినా, చెప్పేశాను. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. మీరంటే నాకు చాలా యిష్టం. ఇక చెప్పాల్సింది మీరే.

ఆడ : ఏం చెప్పమంటారు?

మగ : మీ యిష్టం. అయిష్టం.

ఆడ : నన్నింతవరకూ ఎవరూ యిలా అడగలేదు.

మగ : అది నా అదృష్టం. లేకపోతే యిప్పటికి మీరు యింకెవరి అర్ధాంగిగా వుండేవారో!

ఆడ : మొదట అడిగినవాణ్ణే చేసుకుంటానని నేను వాగ్దానం చెయ్యలేదే.

మగ : చీకటి పడింది. వెళ్లాలని తొందర చేస్తారు. చెప్పండి.

ఆడ : బోర్ కొడుతోందా?

మగ : మీరనాలనుకుని నాచేత అనిపించదలచుకున్నారా? మీ సంగతి తెలియదు గాని నాకు ఎప్పుడు ఏ క్షణం గూడా మిమ్మల్ని చూస్తే బోర్ కొట్టదని నమ్మకంగా వుంది.

ఆడ : అప్పుడే ఎలా బోర్ కొడుతుందిలెండి. పెళ్ళై పిల్లలు పుడితే అప్పటి సంగతివేరు.

మగ : మీరెందుకింత సినికల్‌గా వున్నారో నాకు తెలియదు. మీకు పెళ్లంటే యిష్టంలేదా లేక నేనంటే యిష్టం లేదా? ఇంత చిన్న వయసులో అప్పుడే జీవితంమీద యింత అపనమ్మకం—ప్రేమలేదనీ, ఆకర్షణలేదనీ, అంతా క్షణికమనీ—ఇంత నిర్లిప్తత ఎందుకు? నేనంటే యిష్టం లేకపోతే పోనివ్వండి. కాని జీవితంమీదా, ప్రపంచంమీదా యింత విరక్తి ఎందుకో మాత్రం చెప్పండి.

ఆడ : నాకు విరక్తి కలిగిందని నే చెప్పానా? పెళ్లి చేసుకోనని చెప్పానా? పురుషద్వేషం వుందని చెప్పానా? నేనని మాటలు మీరెందు కూహిస్తున్నారు? చివరికి మీరంటే యిష్టం లేదని కూడా నేను చెప్పలేదు. మీ మాటలకు ఊకొట్టనంతమాత్రాన ఇన్ని లక్షణాలు నాకాపాదిస్తున్నారా?

మగ : అన్నీ చెబుతారు. కాని అసలు విషయం మాత్రం దాచేస్తారు. పోనీ, ఆలోచించి మరో రోజు చెప్పండి

ఆడ : మరో రోజు మరో విషయం మాట్లాడుకుందాం. ఈ రోజు కిది కానివ్వండి.

మగ : చీకటి పడింది.

ఆడ : లైట్లు వెలిగాయి. లోపల సద్దు మణిగింది

(నవ్వు—హేళనగా)

మగ : కాని మీ అభిప్రాయంమాత్రం వెలికిరాదు.

ఆడ . ఏమిటండీ ఊరికే అభిప్రాయం—అభిప్రాయం. ఈలోకంలో అభిప్రాయాలకూ, అభిమానాలకూ, యిష్టాలకూ, అయిష్టాలకూ దేనికీ విలువలేదు. ప్రతిదీ అవసరాన్నిబట్టి నిర్ణయించుకుంటారు. వీలునుబట్టి చేస్తారు.

మగ : అగెయిన్ సినికల్—సినికల్.

ఆడ : ఆల్రైట్. మీరే రైట్. నేను సినికల్‌గా వుండను. నాకు చాలా కోరికలున్నాయి. బోలెడు ప్రేమించాలని వుంది. మీరు నాకు కావలసినవన్నీ సమకూర్చగలరా?

మగ : ష్యూర్. టు ది బెస్ట్ ఆఫ్ మై ఎబిలిటీ. మేం వున్నవాళ్ల మేం కాదుగాని, మా యింట్లో ఒకరంటే ఒకరికి ఎంత అభిమానముందో మీకు తెలియదు. మా నాన్న, మా అమ్మ, మా చెల్లెలు, తమ్ముళ్లు అంతా ఏ పొరపొచ్చాలు లేకుండా బ్రతుకుతున్నాం. పెళ్లి తర్వాత కూడా ఏ రకమైన కలతలూ రావని హోప్ యిస్తున్నాను. నా కిష్టం వచ్చిన వాళ్లను ఎవర్ని చేసుకున్నా వాళ్లకిష్టమే. కులం కట్టింపులు లేవు.

ఆడ : మీ నాన్నగారేం చేస్తారు ?

మగ : రిటైర్డ్ స్టేషన్ మాస్టరు.

ఆడ : అమ్మగారు?

మగ : షి ఈజ్ ఆల్సో రిటైర్డ్. (నవ్వు) చెల్లెలు హైస్కూల్. తమ్ముళ్లు—ఒకడు ఇంటర్మీడియేట్, మరొకడు ఫస్ట్‌ఫాం. డబ్బున్న వాళ్లం కాదుగాని డబ్బు యిబ్బందులులేవు. వి ఆర్ హేపీ. వీ విల్ మేక్ యూ హేపీ.

ఆడ : జనాభా ఐతే మీ యింట్లో లాగానే మా యింట్లోనూ వుంది. కాని మావాళ్లు హేపీగా లేరు నేను పెళ్లి చేసుకొని మీ యింటికొస్తే అసలు హేపీగా వుండరు.

మగ : మీవాళ్ల గురించి కామెంట్ చెయ్యను గాని—ఆడపిల్ల డబ్బు తినటం పాపం.

ఆడ : ఎందుకూ మొహమాటం—'నీచం' అనండి.

మగ : అనవసరంగా మనం టాపిక్ మార్చేశాం.

ఆడ : లేదు. మార్చలేదు. ఇప్పుడే ట్రాక్‌లో పడ్డాం.

మగ : చెప్పండి.

ఆడ : నాకు బోర్ కొడుతోంది

మగ : పోనీ ఈ రోజుకింక చాలిద్దాం.

ఆడ : లేదు. జీవితం బోర్ కొడుతోంది వుద్యోగం బోర్ కొడుతోంది.

మగ : మూడేళ్ళకే?

ఆడ : ఆఁ. మూడేళ్ళకే... నేను ఈ కాలపు మనిషిని కానేమో నని పిస్తుంది నాకు యింటిపట్టున వుండటమే యిష్టం. ఏదో—యింటిపని చేసుకోవటం, పిల్లల్ని చూసుకోవటం, వంట చెయ్యటం, మధ్యాన్నం కాసేపు రెస్టుతీసుకోవటం—నాకు చాలా యిష్టం.

(కొంచెం నిశ్శబ్దం)

మగ : చెప్పండి.

ఆడ : నిజంగా, మీరు చెప్పిందంతా నిజమైతే, మీయింట్లో వాళ్లు అంతమంచివాళ్లే ఐతే, నాకంతకన్నా కావలసిందేమీ లేదు. మీకు కట్నమిచ్చైనా సరే, మిమ్మల్నే చేసుకుంటాను. అప్పుడు నేను సినికల్‌గా వుండను హాయిగా, రొమాంటిక్‌గా వుంటాను. భాగ్యనగర జీవిత సమస్యలు మరచిపోతాను. ప్రేమనగర వీధుల్లో విహరిస్తాను వద్దు. వద్దు. నాకీ వుద్యోగం — ఈ రొటీన్, ఈ డబ్బుపంచటం — ఏవీ వద్దు. నాకెందుకు పెళ్లికాలేదనుకున్నారు ? నేను సంపాదిస్తున్నాను గనకే నాకు పెళ్లికాలేదు. లేకపోతే, ఎప్పుడో మావాళ్లు నాపీడ విరగడ చేసుకునేవాళ్లు. ఐ హేట్ మై జాబ్. ఐ హేట్ మై ఫామిలీ.

మగ : లేదు. అలా మాట్లాడొద్దు. జీవితమంటేనే కాంప్రొమైజ్ కావటం, సర్దుకుపోవటం, తృప్తిపడటం.

ఆడ : ఇక మీరేం చెప్పకండి. నేను మిమ్మల్ని చేసుకోవటానికి రెడీ. ఇప్పుడే. ఈ క్షణం. ఐ డోంట్ కేర్ ఫర్ ఎనీ బడీ. నా జీవిత భారాన్ని మీకప్పగిస్తాను. నిశ్చింతగా, మీ నీడలో బ్రతుకుతాను. ఇంక నా సమస్యలన్నీ మీవే. నేను ఏదీ ప్రయత్నించి పరిష్కరించుకోనక్కర్లేదు. ఎవరికీ జవాబు చెప్పనక్కర్లేదు. ఎవరి ఏడుపు మొహాలూ చూడక్కర్లేదు. ఇక మీరే నా ప్రపంచం. నా తోడు, నా ఆరాధన, మిమ్మల్ని ప్రేమించటం, మీ సేవచెయ్యటం తప్ప యింక జీవితంలో నాకేమీ అక్కర్లేదు. ఈరోజుతో ఇంక అన్నీ మర్చిపోతాను.

మగ : కానీ రోజులు మారేయి. సమస్యలూ వాటి స్వభావాలూ కూడా మారేయి.

ఆడ : ఔను. ఇదివరకైతే వంటింటి చాకిరీ మాత్రమే చేసేది స్త్రీ. ఇప్పుడు చాకిరీ ప్లస్ డబ్బు సంపాదనకూడా నెత్తిన పడింది.

మగ : కాని దానివల్ల జీవన ప్రమాణం పెరుగుతుంది. ఖర్చులు ఇంటి సామాన్లు, ఫోంబెడ్స్, ఫ్రిజ్, సీలింగ్ ఫాన్లు, స్కూటర్లు, నైలెక్సు చీరలు, సొంతయిల్లు, ఆభరణాలు, సినిమాలు, షికార్లు — ఇవన్నీ ఒకరి సంపాదనతో రావు.

ఆడ : నేను సంపాదిస్తున్నది, వుద్యోగం చేస్తున్నది మా వాళ్లను పోషించటానికా, మీవాళ్లను పోషించటానికా అన్నది తెల్చుకోవటానికే పెళ్లి చేసుకోవాలిలాగుంది. మీరు చెప్పినప్రకారం ఎవరూ ఎవర్నీ పోషించక్కర్లేదు. వెరీగుడ్. నాడబ్బులు నేను ఖర్చుపెట్టుకుంటాను. మీడబ్బులు మీరు ఖర్చుపెట్టుకుంటారు పిల్లలు పుడితే ఫిఫ్టీ—ఫిఫ్టీగా ఖర్చు పెడదాం. స్నేహితుల్లా కలిసివుందాం. హోటళ్లలో ఎవరి బిల్లు వాళ్లు చెల్లించుకుందాం (నవ్వు)

మగ : హేళనగా వుందా ?

ఆడ : లేదు. పిచ్చెత్తి నవ్వుతున్నాను.

మగ : ఇంత బిజినెస్ లైక్‌గా ఆలోచిస్తారా దంపతులు. పరస్పరం జీవితాన్ని పంచుకొని — మనసులేకమై, జీవితాలు పెనవేసు కున్నచోట యిలాంటి ఆలోచనలు వస్తాయా ? ఇవన్నీ పెళ్లిగురించిన భయాలు మాత్రమే. ఈనాడు వుద్యోగాలు చేస్తున్న దంపతుల జీవితాలిలా లేవు. ఇవి కేవలం ఊహ.

ఆడ : మీ అవసరాలకు అనుకూలంగా వుండే పని ఏది చేసినా మీరందులో లాజిక్ చూస్తారు. అలాగే నేనూ. కానీ నా అవసరం వేరు. ఉద్యోగంచేసే ఆడది మీకక్కావాలి. సంపాదన తెచ్చి చేతిలో పొయ్యాలి.

మగ : నో.

ఆడ : నన్ను మీరు డబ్బుకోసం పీడించి, నేను మిమ్మల్ని రోజా సాధించి — నేను అత్తింటి మర్యాదలు పాటించి, మంచి కోడలిగా వాళ్లకు సేవలు చేసి, భర్తే దైవమనుకుని మాంగల్యాన్ని కళ్లకద్దుకొని ...

మగ : ఇది అభిప్రాయం కాదు. భయం. ఊహ. కల్పన.

ఆడ : ఔను అందువల్లే అవి నిజం కావటం నా కిష్టంలేదు. అందువల్లే నా సంపాదనకాశించే మొగుణ్ణి నేను చేసుకోను సోఫామీద, సీలింగ్‌ఫాన్‌కింద పడుకొని, జీడిపప్పు తింటూ సీరియల్ నవలలు చదువుకునే లేజీ లైఫ్ నాక్కావాలి అదివ్వగలిగినవాణ్ణే చేసుకుంటాను. నాచేత చాకిరీ చేయించ కుంటూ, నా సంపాదనమీద ఆధారపడుతూకూడా న బాస్‌గా వుండే మొగాణ్ణి నేను చేసుకోను.

మగ : ప్రేమా, అది పొరపాటు.

ఆడ : డోన్ట్ యు సే దట్ ఎగెయిన్. ఇక పనం లేవ్వచ్చు.

స్పందనం

శ్రీ రంగివేని సుబ్రహ్మణ్యం

కడలి పిలుపువిని ఒడలు విరుచుకొని
పరువాలను పండించుకొనుటకు
ఉవ్వెత్తున ఉరకలతో
తన్ను తాను తానన్నది మిగులకుండా
ఆత్మార్పణం చేసుకొని
కలయికలో బ్రహ్మానందాన్ని
స్వంతం చేసుకొంటుంది వాగు.

మురళి రవళులలోని
నాదలయ మాధురులు
స్తబ్దమైన తన ఎదలోతులకు తాకి
పరవశత్వపు పరిమళాలను గుభాళించ
పురికొల్పగా — తానెవరో తెలియక
తనలో కలిగిన మైక మెందుకో తెలియ
తననెవరూ బలవంతపెట్టకుండానే
చేతనంలో అచేతనమై
ఆనందపు కేతనమై
మనసును కుదిలించ మైమఱచి
నాదామోదంలో లీనమై
బ్రహ్మానందాను భూతిని పొందుతుంది వాగు.

చేతనా చేతన ప్రకృతి
ప్రణయ స్వరూపమై ప్రకాశించుటకు
ఆధారం రాగం !
ఆ రాగం జీవన రాగంగా [illegible]
ఎద ఎద ఒకటై
"నీ—నా" భేదాలు తొలగి
విశ్వైక ప్రేమ కుసుమిస్తుంది.
ప్రపంచం నందనవనమై
చీకట్లు చీకాకులు లేక
నిరంతరానందమయ స్వర్గంగా ప్రకాశిస్తుం

చేతనా చేతన ప్రకృతి తిలకించిన
మనసున స్పందన భాసిస్తుంది.



శ్రీ నిడుదవోలు సుందరేశ్వరరావు

గోళగి మఠములు - ఆంధ్రదేశము

(గతసంచిక తరువాయి)

తూర్పు గోదావరి

పద్మశివుడు: – (బిక్కవోలు, రామచంద్రపురం తా.) సర్వ లోకాశ్రయ మూడవ విష్ణువర్ధన మహారాజు తన 25వ రాజ్య పాలన కాలమున (724–758) బిక్కవోలులోని బెజయిూశ్వర మహాదేవునికి కొంతభూమిని దానము చేసెను. ఆ దానమును పద్మ శివుడు బిక్షావృత్తిగా గొనెను. (12/1929–30) పశ్చిమ గోదావరి వసంతవాడలోని తేరంబి మఠగురువులు వామశివ, పురుష శివులు ఈ కాలము వారగుటచే పద్మశివుడును తేరంబి మఠమునకు చెందినవాడై యుండును.

పశ్చిమ గోదావరి

వామశివ, పురుషశివ. క్రీ.శ. 724–758 (వసంతవాడ. ఏలూరు తా.) వసంతవాడలోని శివాలయమునకు స్థానాపతులు తేరంబి[1] నివాసియైన బ్రహ్మశివాచార్యుని శిష్యులు. ఈ దానము శాసనములో నిట్లు చెప్పబడినది :

తేఱంబి నివాసి బ్రహ్మ శివాచార్యాన్తే వాసి వామ
శివ పురుష శివాభ్యా॥
మారాధనీయానాం త్రయాణాం దేవస్థానానాం
నిత్య పూజాబలి ప్రదానార్ధం॥
దత్తం ఘన సుషిరా వనద్ధ వాద్య వాదక
గాయక నటకాచార్య విలాసినీ॥
జనభృతయే యేతద్దేవాయ తన ఖండస్ఫుటిత
నవ కర్మాది కార్యకరణార్థంచ॥
(సోమశేఖరశర్మ – 305)

తడికలపూడి (ఏలూరు తా.) క్రీ. శ. 1216లో సుబ్రహ్మణ్య శివాచారి (రాచగురుదేవర శిష్యుడు) (SII V. 197) క్రీ.శ 1243 లో సిద్ధాంత శివాచారి శిష్యుడు అనుగ్రహ శివాచారి (SII V. 206), 1275 లో గోళగ స్థానపతులు ఉత్తమశివులు (SII V. 199) పేర్కొనబడినారు. భట్టిప్రోలు (రేపల్లె తా. గుంటూరు జిల్లా) లోని ఉత్తమశివుడు నీతడు ఒకేవ్యక్తియా ? పై గురువులలో అనుగ్రహ శివాచారి "యమనియమ ధ్యాన ధారణ మౌనానుష్ఠాన జపహోమ సమాధి స్వాధ్యాయ నైష్ఠిక తపో భూయిష్ఠ సిద్ధాంత శివాచార్య" పుత్రుడు.

తడికలపూడి గోళగి మఠము

సుబ్రహ్మణ్య శివాచారి
|
సిద్ధాంత శివాచారి
|
అనుగ్రహ శివాచారి
...
ఉత్తమ శివు(ని)

కృష్ణా జిల్లా :

సోమశివాచార్యుడు (పెదకళ్లేపల్లి, దివి. తా.) క్రీ.శ. 1292 "పుష్పగిరి మఠ సాంతానికులైన శ్రీమతు సోమశివాచార్యులు జనమేజయ సర్పయాగస్థానమునందు బాగుడి" (126, 126A/ 1897. SII VI 81, 82).

నెల్లూరు

శాంతశివగురు (గంగాపురం. దర్శి) క్రీ. శ. 1254. త్రిపురాంతకదేవుని స్థానాపతి. రాజగురుదేవుని శిష్యుడు (V R // Darsi 85, 86)

కడప

ఉత్తమ శివ (ముడూరు. సిద్ధవటం తా) క్రీ.శ. 1077 లోని బిజ్జాపుర గ్రామమును తెనుగు చోడబిజ్జన[2] తన గురువైన ఉత్తమ శివునకు దానము (62/1939–40)

ఈశాన గురుదేవ–: పుష్పగిరి : కడప తా. క్రీ.శ. 1257లో కాకతి గణపతిదేవుని రాజ్యకాలమున గంగయ యను నాతడు పుష్పేశ్వరస్వామికి ఈశాన గురుదేవునిద్వార గంగవరమను గ్రామము. (23/1937–38) పెదకళ్లేపల్లి (కృష్ణాజిల్లా) లోని సోమశివాచార్యులు ఈ మఠమునకు చెందినవాడే. ఇచ్చట గోళగి మఠమున్నట్లు నిదర్శనముగా ఇంద్రనాథస్వామి దేవాలయ ప్రాకార కుడ్యము నందొకచోట తమిళభాషలో గోళగి మఠము ప్రసక్తమైనది. (78/1965 APGRE)

వ్యాపకశివ : (క్రీ. శ. 1237) (అదేపూరు, తా.) యజ్ఞజియ్యర్ శిష్యుడు (6/1953–5, 19/1953–54)

క ర్నూ లు

శాంతశివ (క్రీ. శ 1260) (శ్రీశైలం, నందికొట్కూర్ తా.) శ్రీపర్వతములోని అభినవ గోళగి మఠాధ్యక్షుడు. శివలింగ మఠానికి, విద్యామంటపానికి చెందిన బ్రాహ్మణులకు, దేశాంతరులకు కాయస్థజన్నిగ దేవుడు కల్పించినది. (50-/1941-42)

ఈశ్వర శివాచార్యులు : (క్రీ. శ. 1313. శ్రీశైలం. నందికొట్కూర్ తా.) అరసు మఠము.

అనంతపురం

వరుణశివ భటారకుడు : గౌని మోర్చుగల్లు (మడకశిర. తా.) క్రీ. శ. 936 నోలంబ పల్లవుని అన్నయదేవుని కాలమున నోలంబేశ్వరదస్థానాపతి. ''జపనియమ తపోవాస సత్యశౌచాచారాన్వితత్తపోవనానురాగ...శివ సత్రానురంజిత భగవద్వాద్వైకాభరణ'' (SII. 9-24)

ఈశాన శివుడు : హేమావతి (మడకశిర.తా.) క్రీ.శ. 12 శ. శ్రీనగరిలోని మంగీశ్వరదేవుని స్థానాపతి (EIXXXI. P. 269-276).

అనంతశివుడు (అదేఊరు) క్రీ. శ. 10 వ శతాబ్ది. నకరేశ్వర దేవాలయ స్థానాపతి. (12/1917)

రుద్రశివ(సంగమేశ్వరం. రాయదుర్గం తా.) క్రీ.శ.1073. కూడలి సంగమేశ్వర దేవాలయ స్థానాపతి. (SII IX. 138)

మహబూబ్ నగర్

శంకర శివాచారి (క్రీ. శ. ప్రతాపరుద్రుని కాలము సోమశిల, కొల్లాపురం తా.) ఇతనికి రాచగురుదేవుడని బిరుదము. (No. 255/APGRE 1966)

న ల్గొం డ

ముగ్ధశివాచారి (1019-20). (ఏలేశ్వరము, దేవరకొండ తా.) ఇతడు సద్యశ్శివాచారి శిష్యుడు. ఈ గురువు సదా శాకాహారి. వేములవాడ ప్రథమ అరికేసరి విద్యాదాన నిమిత్తము కొల్లిపర్రు (.గుం. జి.) లో కొంతభూమిని ముగ్ధశివాచారికి దానము చేసియున్నాడు. (భారతి. సం. 7. సం. 2.1297-9)

శాంతశివదేశికులు (క్రీ. శ. 1267).(అదే తా.) యాదవ విశ్వనాధుని కీతడు రాజగురువు.

క రీం న గ ర్

ధర్మశివాచార్యుడు : ఆర్కియాలజీ డిపార్టుమెంటు వారు 'Visweswara Sivacharya and his son Dharma Sivacharya'' అని పొరబాటుగా వ్రాసియున్నారు. ధర్మశివుని శిష్యుడు విశ్వేశ్వర శివాచారి కదా ! (గణపతి దేవుని కాలము. కాళేశ్వరము మంతెన. తా). తన గురువు విమల శివుని పేర నొక దేవాలయము (...చ్ఛైలాయతనం) నిర్మించినాడు. తమ గురువులు తనువు చాలించిన పిమ్మట శిష్యులు వారి పేర నొక లింగమును ప్రతిష్ఠించుట కలదు. విమల శివాచార్యుడు తన గురువు కీర్తి శంభునిపేర కీర్తీశ్వరదేవాలయమును నిర్మించినాడు. (జబల్పూర్. నెం. 64 CII.) ఇచ్చటి శాసనములో ''సశ్రీ ధర్మశివో [న్] గణపతే ర్దేవస్యరా [జ్ఞో] [ ]రుః'' అని ధర్మశివుడు గణపతి దేవునికి గురువని స్పష్టముగానున్నది. ఈ శాసనకాలము తెలియదు [కరీంనగర్. 32.].

విశ్వేశ్వర శివాచార్యులు . (గణపతి దేవుని రాజ్యపాలన కాలము. కమ్మంపల్లి. మంతెన. తా). శ్రీ ... కాకతీయ గణపతి దేవ మహారాజులు...రాజ్యంబు సేయుచుండంగా శ్రీమతు రాజగురు దేవరైన శ్రీ విశ్వేశ్వర శివాచార్యులు చంద్రవెల్లి, కమ్మమువల్లి... విశ్వేశ్వర దేవాయతనను అంగిరంగభోగాలకు దానము చేసినట్లున్నది [కరీంనగర్. నెం.34]. కాలముతెలియదు. అయినను మాల్కాపుర శాసనములో (1261)

''మంత్ర కూటాభిధానే...

నామ్నా స్వేనస చంద్రవల్లి నగరే లింగ ప్రతిష్ఠాప్య''

అని యుండుటచే నిచ్చట గోళగి మఠముండెడిదని వేరే చెప్పనవసరము లేదు.

ఇవిగాక మా. శా. కాళేశ్వరములో నొక మఠము నందపదము (మునికూటపురము మునిగోడు), ఏలేశ్వరములో నొక మఠము, నందికొట్కూరు తా. ఇల్లాల, దుద్యాల (ప్రస్తుతం ఆత్మకూరు, కర్నూల్ జి)లో మఠములను స్థాపించినట్లు మాల్కాపురశాసనము చెప్పుచున్నది.

వ రం గ ల్లు

ధర్మ శివాచార్యుడు : (క్రీ. శ. 1245. శంభుని గుడి) విమల శివాచార్యుని శిష్యుడు. (వరంగల్లు. నెం. 65)

విశ్వేశ్వర శివాచార్యులు: (ప్రతాపరుద్రుని కాలము. ఉరుసు వరంగల్లు తాలూకా. నెం. 99)

వరంగిల్లునకు రెండు మైళ్ల దూరములో ఒక గుట్టమీద చెక్కిన కావ్య శాసనములో—

''ఇతి రాజగురు విశ్వేశ్వర పండిత మానోర్న

రసింహార్షే కృతౌయోగ...తే ప్రథమ సర్గః''

బహుశః ఇది 'కాకతీయ చరితే' యని యుండదగు. ఈ నరసింహ కవి వరంగల్లు 96 శాసనములో కాకతీయ చరితము వ్రాసినట్లు

చెప్పికొని యున్నాడు. ఇతడు దశరూపకములను, మలయవతియను గద్య కావ్యము రచించెనట. (వరంగల్లు 97) ఉరుసుగుట్ట పైన సిద్ధోద్వాహం అను కావ్యము చెక్కబడినది. 155 పంక్తులు గల ఆ కావ్యము చివర "విశ్వేశ్వర సూనోర్నర సింహార్వే కృతిం:" అని యున్నది.[3] సూనుడనగా శిష్యుడనియే అర్థము.

అఘోర శివాచార్యులు : (క్రీ.శ. 1313. వరంగల్లుకోట నెం. 89). సహస్ర లింగ గణపతీశ్వర దేవ స్థానాపతి. రావగురు దేవర మఠము పేర్కొనబడినది.

సోమనాథుడు పేర్కొనిన "శ్రీ కంఠశివులు" మొదలయిన వారు మధ్యప్రదేశ్‌నుండియు, పశ్చిమ బెంగాలు నుండియు వచ్చిన గోళగి మఠగురువులని స్పష్టపడుతున్నది. ఇంకొక ముఖ్యవిషయ మిచ్చట గమనించవలసియున్నది.

బిజ్జలుడు - శైవమత పరిస్థితులు

బసవ పురాణమునగాని తదితరాంధ్ర గ్రంథములందుగాని గోళగి మఠప్రసక్తి కానరాదు. కర్ణాటకమున కాలముఖ మఠముల కున్న ప్రఖ్యాతి తెలుగుదేశమున లేదు. ఇక తమిళనాడులో రాజరాజ చోళుని కాలమునుండియు గోళగి మతగురువులు (లక్ష్మాధ్యాయి, బిక్షాధ్యాయి) రాజగురువులై వర్ధిల్లిరి. వారిలో చాలమంది పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ రాఢామండలమునుండి వచ్చినవారే. తమిళనాడు గోళగిమఠము ఆంధ్రదేశములో 'గోళగి' వెలువడుటకు ముందుగా (అనగా 200 సంవత్సరములకు) వెలసినది. తెలుగు దేశమున గోళగి మఠ ప్రదేశము చోళచాళుక్య సమ్మేళన ఫలితముగా నేర్పడి యుండవచ్చును. తూర్పు చాళుక్యులు తమిళ చోళులు సఖ్య సంబంధము కలవారని చరిత్ర చాటుచునే యున్నది. కర్ణాటకమున బిజ్జలుని కాలమున (1156-67) కాలాముఖుల వైభవ ప్రాభవ ములు శాసనములలో మిక్కిలిగా కొనియాడబడినవి. బిజ్జలుని కల్యాణ మున గోళగి మఠగురువులున్నట్లు తెలియవచ్చుటలేదు. అయినచో శ్రీకంఠశివులు మొదలయినవారు కల్యాణమునందున్నట్లును, వారి బసవేశు భక్తులతో తాము లింగవంతులమనుచు ప్రసాదమును గుడుచుచున్నారని బోయలు బిజ్జలునితో మొరబెట్టుకొనిరనియు సోమనాథుడెట్లు చెప్పగలిగెనో దురూహ్యముగా నున్నది. అటులే బిజ్జలుని కాలమున కర్ణాటకములో బసవేశ్వరుడను వీరశైవ మత మహా విప్లవ కర్ణధారు డుద్భవించి, కలచురి బిజ్జలుని మంత్రియై, దండనాథుడై రాజబొక్కసమునునుండి ధనరాశులను భక్తివర్ధ నము కొరకు జంగమములకు పంచిపెట్టించి, తుదకు కల్యాణమున గజిబిజి యొనర్చిన మహావీరుని పేరు బిజ్జలుని శాసనములందుగాని, ఆతని తనయుడు సోయిదేవుని శాసనము లందుగాని లేకపోవుట అద్భుతాశ్చర్యాసుమాన సంజనితముగా నున్నది. పలువురు చారిత్ర కులును నిట్లే తలచిరి. (చూ. అబ్లూర్ శాసనము. E. I. V: 244-5 J. F. Fleet దొరవారి అభిప్రాయము.) మరియు Lorenzen అభిప్రాయమును గూడ తిలకింపుడు.

"Not only is there no epigraphic evidence of the existence of Veerasaivas before Basava but the epigraphic allusions to Virasaiva activity in the two or three Centurees after Bijjala one few and far between (Lorenzen-167).

దీని యథార్థ కథన మిట్లూహింపవచ్చును :

11వ శతాబ్ది నుండి 1167వరకు(బిజ్జలుని కాలావసానము) కాలముఖ మతములు కర్ణాటకమున లకులీశ పాశుపతమును బ్రహ్మాం డముగా ప్రచారమొనర్చినది. ఆ మతమున బ్రాహ్మణాధిక్యము మెండు వారు ఔత్తరాహులు. వారికి సంస్కృతమే ప్రచారసాధనమై యుండనోపు. వారు కర్ణాటకులుకారు. వారి మాతృ భాష కన్నడమును కాదు. ఇది ఒక కారణము.

వేరొక కారణము జైనమత ప్రభావము. కాలాముఖ, వీర శైవ మతములకు ముందుగనే జైనమతము కర్ణాటకమున వ్రేళ్ళు దన్నుకొని యున్నది. జైనము వేదవిరుద్ధమే గాక శైవమునకు ప్రత్యక్ష విరుద్ధము. దక్షిణాది శైవ సమయాచార్యుల జీవిత మంతయు, మత ప్రచారముకంటె, జైనబసది నిర్మూలనమునందె గడచినది. కాలాముఖ మఠములలో సర్వ దర్శనములు విద్యా ప్రణా ళిక యందున్నవి. వారు వీరశైవులవలె జైనులను తొడలు నరచి కయ్యమునకు పిలిచినవారు కారు. శైవములో జైనసమయ నిర్మూ లనమే వీరప్రధానమైనది. కనుకనే అట్టివారు వీరశైవులైరి. చారిత్రకముగా తెలిసినంతవరకు ఏకాంతరామయ్య ప్రథమ వీర శైవుడు. (1200) (E.I.V. 237) ఏకాంతరామయ్య అబ్బ లూరిలో జైనవాదములో జయపత్రమును బిజ్జలునివద్దనుండి పొంది నప్పటినుండియు నా దేవాలయము బసవేశ్వరాలయముగా, వీరశైవు లకు ప్రధానక్షేత్రముగా మారినది ఒకటేమిటి కాలముఖ ప్రధాన మఠమైన కేదారమఠముగూడ నేడు వీరశైవులకు పవిత్ర క్షేత్ర మైనది ఇట్టి పరివర్తన కాలమును శైవమత చరిత్రకారులు గుర్తింపకపోవుట వింతగానున్నది. కాని నందిమఠ్‌గారు మాత్రము నిష్పాక్షికమైన తమ యభిప్రాయమును నిట్లు వెల్లడించినారు:

"Slowly and imperfectly they (Kalamukhas) were absorved into Virasaivisam" (Nandimath page 99) తిరిగి మన సోమనాథుని కథనమునకువత్తము.

"బసవయ్య తోయంపు భక్తులంజూచి
వసుధదారును లింగవంతుల మనుచు"

శివప్రసాదమును గుడుచుచున్నారట. అనగా ఆ కాలమునాటి కాలా ముఖ పాశుపత శాసనధరులు గూడ వీరశైవులతో కలిసిపోయి రన్న మాట. సారాంశమేమనగా క్రీ. శ. 1200 నుండి కర్ణాటకమున వీరశైవమొక నూతనమతముగా నేర్పడినది.

తెలుగు దేశము - వీర శైవము

తెలుగుదేశమున పాశుపతమే వీరశైవ మతమునకు లేదా వీర మాహేశ్వర సిద్ధాంతమునకు ముందుగా వర్ధిల్లినది. 9వ శతా

బ్దమునకు ముందు బౌద్ధ జైన మతములు శైవమతము తాకిడికి నోర్వలేకపోయినవి. విష్ణుకుండినులు (408–617) శ్రీ పర్వతస్వామి పాదానుధ్యాతులు. తూర్పు చాళుక్యులలో కొందరు జైనమతమునెడ కొంత కొంత అభిమానమును చూపుచున్నను వారు ప్రధానముగా శైవులే. నరేంద్ర మృగరాజాపర నామధేయుడు, ద్వితీయ విజయాదిత్యుడు అయిన తూర్పు చాళుక్యరాజు (808–847) 108 శివాలయములను శాత్రవ శిరః కంఠములచే రక్తదఘ్నమైన ప్రదేశములను నెలకొల్పెనట. ఈ దేవాలయములే సమస్త భువనాశ్రయ శ్రీ నగేంద్రస్వామి యను పేరితో వెలయుచుండెను. నరేంద్ర మృగరాజు కాలములో ప్రథమ పాసుపత్యాచార్యుడుండెను. ద్వితీయ అమ్మరాజు (945–970) తాడికొండ శాసనమున సమస్త భువనాశ్రయములో పాశుపతులు సన్మానింపబడిరి. కవి విష్ణువర్ధనుని (852–53) కాలమున అమృత సోమాచార్యుని శిష్యుడైన పశుపతి భగవాదునకు కొంత భూదానము జరిగినది. అమృతసోమ శివాచార్యుడు బాలసోమ భగవంతుని శిష్యుడు. (E I. XXXVII-41-44) వేములవాడ చాళుక్యులు శైవులు. నన్నయ మహాభారత కృతిపతి రాజరాజు (1019–68) ఈశ్వరాగమములయందు భక్తినిలిపినాడు. తన మామగారైన ప్రథమ రాజేంద్రచోళుడు, తాతగారైన రాజరాజ చోళుడు గోళగి మఠాచార్యులయిన ఈశానశివ, సర్వశివుల శిష్యులు. కావుననే రాజరాజునకు పార్వతీపతి పదాబ్జధ్యానము కరం బిష్టమైయుండు. రాజరాజు తరువాత చాళుక్యచోళులనుగూర్చి వేరె చెప్పనవసరములేదు.

మల్లికార్జున పండితుడు

మల్లికార్జున పండితారాధ్యుని గురువునకు గురువు అవాంతరయ్య యమనియమాది వ్రతాచార పారశ మదమోత్కృష్ట నిష్ఠా గరిష్ఠుడు; చతుర్వేదార్థ వేత్త. గురువుకోటిఫలి ఆరాధ్యుడు న్యాయ వైశేషికోదాత్త శాస్త్రానపాయ దర్శనుడు. అనగా పాశుపతమునకు చెందినవాడు. (చూ. హరిభద్రసూరి షడ్దర్శన సముచ్చయము). ఇక మల్లికార్జున పండితారాధ్యుడు పశుపాశ పతిజ్ఞానదృష్టి పడసినవాడు.

"స్థిరపశు పాశపతి జ్ఞానముఖ్య
సరణియె భవవార్ధిఁ దరియించు తెప్ప"

(వాద. ప్ర. పు 555)

యని వెలనాటిచోడని యాస్థానమున పరవాదులను గీటడంచి, పాశువత ధర్మమును ప్రతిష్ఠించినాడు. లభించినంతవరకు శివతత్త్వసారమున[4] వీరశైవమను మాటయే లేదు. ఈతడు బసవేశ్వరుని గాని, శ్రీశైల మల్లికార్జునుని గాని దర్శించినవాడు గాదు. చారిత్రకముగా బసవనికి సమకాలికుడు.

"జననిపైని ప్రేమ జనయిత్రిపై భక్తి
వదలలేని బాల పగిది నేను
భక్తిమీది వలపు బ్రహ్మంబుతో పొత్తు
బాయజాల నేను బసవలింగ"

యని బసవేశ్వరునికి కబురంపినాడని కిం వదంతి. కాని పై పద్య మకుటము సోమనాధుని బసవలింగ శతకము (చతుర్వేదసారము) లోనిది. (చతుర్వేదసార ముద్రితప్రతి యందనేక పద్యములు చేర వలసియున్నవి.) ఇది సోమనాధుని కల్పనము. కాని అన్యముకాదు.

శ్రీపతి పండితుడు:

శ్రీపతి పండితుడు శ్రీకర భాష్యరచయిత కాడని చెప్పుటకే ఎక్కువ ఆధారములున్నవి. శ్రీకర భాష్యములో "వీరశైవ"మను పదమున్నది.[5] అది శ్రీకర భాష్యము ప్రాచీన మనువారి వాదమునకు కుద్దాలప్రాయమైనది.

నన్నెచోడుడు:

నన్నెచోడుని కుమారసంభవ కృతిపతి జంగమ మల్లికార్జునుడు కాళాముఖ శైవుడు కాని వీరశైవుడుకాడు. ఏతత్ కృతి యందు వీరశైవ పదమే కన్పట్టదు. కృతిపతి మల్లికార్జునుడు కాలాముఖ మతస్థాపకుఁడెయని నా యభిప్రాయము అని మానవల్లి రామకృష్ణకవిగారును (కు. సం. ద్వి. భా. పీఠిక 33), నన్నిచోడని గురువయిన మల్లికార్జునుఁడు కాలాముఖ మతమువాఁడు అని వేటూరి ప్రభాకరశాస్త్రులుగారును (బస. పీ. 74), కోరాడ రామకృష్ణయ్యగారీ యభిప్రాయమును సమర్థించిరి. (కు. సం. మ. వి. XII, XIII). ఈ యభిప్రాయములే చారిత్రకముగా సమంజసమగును. జంగమ పదమును కర్ణాటక కాలాముఖ శైవులలో కొందరు వాడియున్నారు. (EIVI. 96-97, JBBRAS X 167-298 నెం. VII)

కుమార సంభవ కృతిపతి గురువు శ్రీశైల మఠమునకు చెందిన కాలాముఖ శివయోగి. ఆతడా ప్రాంతీయుడు. అతడే పెద చెఱుకూరి శాసనముతో ముడిపెట్టుకొన్న కొప్పరము శాసనములోని కాలముఖ మల్లికార్జునుడై సంచారార్థము నక్కడికి వచ్చియుండ వచ్చును. అనంతపురం జిల్లా గుత్తిలో త్రిభువన మల్లదేవుని కాలమున దండనాయకుడు ఓమియరసు 'యమనియమ స్వాధ్యాయ ధారణ మౌనాను ష్ఠాన జప సమాధి సంపన్న రప్ప శ్రీమతు కాలాముఖ మల్లికార్జున పండితర్గే' యని తన శాసనములో పేర్కొనినాడు. దీనికాలము క్రీ.శ. 1085. (SI I. VIII. 367) తిరిగి అనంతపురం తా, రాచపల్లిలో క్రీ. శ. 1121లో, భువనైక మల్లుని కాలములో ఒరయూరి పురవరాధీశ్వరాది బిరుదాంకితుడైన చోడరాజు రెడ్డియపల్లి మల్లికార్జున దేవాలయ స్థానాపతి మల్లినకార్జున పండితుని ధాన ధర్మము లొసరించినాడు. (69/1941–42). కల్యాణి చాళుక్యుల క్రింద కొందరు తెనుగు చోడులీ ప్రాంతమును పాలించిరి. వారికి ఒరయూరు పురవరాధీశ్వర మొదలయిన బిరుదములు గలవు మొత్తముమీద చోళుల కీతడు

గురువువలె కాన్పించుచున్నాడు. ఈ మల్లికార్జున మహాముని కాలాముఖ వ్రతస్థుడగుట చేతను, కర్ణాటక, అనంతపుర ప్రాంతము వాడగుట చేతను, బాలిగ్రామ మండలి (నేటి బెల్గాం) శాసన కవితతో మిక్కిలి పరిచయము కలవాడయ్యెను. కావుననే కుమార సంభవ నాల్గవ యాశ్వాసాంత పద్యమైన "హరహాసా కాశ గంగా త్యమల జల" యను పద్యము బాలిగ్రామమండలి జైన శాసన కావ్యములోని దానికి ఛాయగా కుమార సంభవమున వెలసినది. బహుశః సంస్కృతాంధ్ర కర్ణాటక భాషా పండిత్యముగల మల్లికార్జున పండితుడే దీనిని వ్రాసి యుండవచ్చును.

నన్నె చోడుడు కుమార సంభవమున నొకచోట ఇట్లు వ్రాసి యున్నాడు: తన కూతురు పార్వతిని శివుని పరిచర్యకు నియోగించి సెలవు తీసుకొను నవసరమున హిమవంతుడు (3-101) శివుని "యియ్యండ బాసి పోవగా నోపుదునే" అని ప్రార్థించినాడు. హిమవంతునికి శివుడచ్చట స్థిరముగా నుండుటయే ఇష్టము. అప్పుడు శివుడను గ్రహించి హిమవంతునితో "సకల లోకాభీష్ట ఫలవృద్ధి కేదారాత్మకుండ నగుటం గేదారేశ్వరుం డన నీ పురంబున వసియించెద నోడకుండుమని' అభయం బిచ్చినాడు. అప్పటి నుండియే కేదారేశ్వరుడు ప్రసిద్ధికెక్కినాడు. అది హిమవత్పర్వత ప్రాంతను. దాని నిప్పుడు కేదారనాథ్ అని అందురు. ఇది నన్నె చోడుని స్వీయ కల్పన. కాళిదాసు కుమార సంభవమున నిదిలేదు. ఇట్లు కల్పించుట కొక కారణము. కాలాముఖులకు దక్షిణ భారతమున కేదార మఠము గలదు. అది బాలగామి (బలిగ్రాం, బెల్గాం కర్ణాటక)యను ప్రదేశమున గలదు. దానికి దక్షిణ కేదారమని పేరు. వింధ్యకు దక్షిణమున గల కాలముఖ మఠముల లోనిది పెద్దది, ప్రశస్తికెక్కినది. అదియే కాలాముఖ శక్తి పరిషత్తునకు ప్రధాన పీఠము 11, 12 శతాబ్దములలో దక్షిణ భారత శైవమత చరిత్రలో నీ మఠము మరువరానిది. దీనినిబట్టి చూచినను నన్నెచోడుని గురువు కేదార మఠమునకు చెందినవాడనియు, కుమారసంభవము కర్ణాటక సమీప భూమియగు అనంతపురం మండలమునందు పుట్టినదనియు నూహించుట కవకాశము కలదు. పెద్దలు దీనిని పరిశీలింపగోరెద.

యథావాక్కుల అన్నమయ్య :

క్రీ. శ. 1242 లో యథావాక్కుల అన్నమయ్య రచించిన సర్వేశ్వర శతకములో వీరశైవ పదములేదు. తిక్కన, మారన, మంచన, పావులూరి మల్లన కృతులలో నీ పదముండుటకే అవకాశము లేదు.

పాల్కురికి సోమన :

వేయేల సోమన తొలికృతి యని మన మీనాడు విశ్వసించుచున్న అనుభవసారమునందు కూడ వీరశైవ పదము లేకుండుట గమనించవలసిన విషయము. బసవేశుని మహిమలకు పరవశుడైన పిమ్మటనే బసవపురాణ రచనకు గడంగి వీరశైవ మను పదమునకు ప్రచారము కల్పించినాడు. ఉపలభ్యములగు సాధన సామాగ్రినిబట్టి చూడగా నీ వీరశైవ పదమును తెనుగువారికి తెచ్చిపెట్టినది సోమనాథుడే యని ప్రస్తుతము చెప్పవలసి వచ్చినది. తన తొలి నెలవగు త్రిపురాంతకము గోళగి మఠస్థులకు ప్రధానమేకాక ప్రథమ పీఠము గూడ. అక్కడనే గోడగి త్రిపురారి అనుభవసారమును సోమనచే చెప్పించుకొన్నాడు.

వర్ణరాహిత్యమైన శుద్ధ శైవ భక్తి మార్గమును తెరచిన వాడు బసవేశ్వరుడు. వర్ణాశ్రమ ధర్మ లక్షణములను వదలలేని సవైదిక వీరమాహేశ్వరుడు మల్లికార్జున పండితారాధ్యుడు. వీరిరువురు సమకాలికులైనను ఒకరి నొకరు చూచుకొనలేదు. ఒకరి దేశమును నింకొకరు సందర్శించి యుండలేదు. ఇక వీరిరువురి చరిత్రలు వ్రాసిన సోమన్నకు మల్లికార్జున పండితునిగూర్చి తెలిసినంత స్పష్టముగా బసవన్నను గూర్చి తెలియదు. వీరిరువురి మతవిషయముల లోని స్థూల సూక్ష్మభేదము లెట్లుండినను సోమన గ్రంథములు ప్రమాణికము లగుటయేగాక ఆంధ్రదేశపు పరిశోధకులకు మతావగాహనలో తికమక పెట్టిన రచనలని మాత్రము చెప్పవచ్చును.

కాలాముఖులు - ఆరాధ్యులు

తెలుగుదేశమున పూర్వచాళుక్యుల కాలమునుండియు (అనగా 108 శివాలయములు కట్టించిన ద్వితీయ విజయాదిత్యుని (799-847) నాటినుండి) కాలాముఖ పాశుపతులు స్థానా

పతులై, రాజగురువులై విలసిల్లిరి. రెండవ అమ్మరాజు (946–970) తాడికొండ శాసనములో (EI XXIII 161-170) సింహ పరిషత్తునకు చెందిన కాలాముఖులు పేర్కొనబడిరి. లకులీశ్వరుని స్తుతి తరువాత పై శాసనములో—

''తదన్వయే కాలాముఖా శ్రుతి ముఖ్యా స్వయంభువో
... ...
తేషామమరవ పేశ్వరాద్యనేక పురాణరేవాయతన
నివాసినాం కాలాముఖానాం సన్తతా''

అనియున్నది. నరేంద్ర మృగరాజు దేశమునం దెల్లెడలను కట్టించిన శివాలయములకు కాలాముఖులే స్థానాపతులై యుందురనుటలో విప్రతిపత్తిలేదు.

కర్ణాటకమున శ్రౌతులయిన కాలాముఖులు బిజ్జలుని అనంతరము వీరశైవులయినట్లు, తీరాంధ్రమున, తెలంగాణమునందును, రాయలసీమయందును కాలాముఖులు కాలక్రమమున ఆరాధ్యులై యుందురు. బసవేశ్వరోపజ్ఞమైన వీరశైవము వర్ణరాహిత్య శివభక్తి మార్గమును స్థిరముగా ప్రతిష్ఠించినది. దాని కతడును, ఆతని అనుయాయులును సాహసోపేతమైన యుద్యమమును నడపిరి. తెనుగునాట అంత ప్రళయము జరుగలేదు గాని కాలాముఖ పాశుపత బ్రాహ్మణులు యుక్తిప్రయుక్తులతో వాదోపవాదములు జరిపి, అద్వైతాది మతములను ఖండించి, శివాధిక్యమును వేదోక్త, పురాణోక్తముగ ఆరాధ్య సంతతిని స్థాపించిరి. ఉద్భటారాధ్య, కోటిపల్యారాధ్య, వేమారాధ్యులను ఆరాధ్య త్రయమును, మంచన, శ్రీపతి, మల్లికార్జున పండితులను పండితత్రయమును, తెలుగు దేశమున వీరమాహేశ్వర సమయమును సవైదిక మొనర్చి, అనేక నిబంధన గ్రంథములను సంస్కృతాంధ్ర భాషలలో రచించి, వీరశైవ, వీరమాహేశ్వర సంప్రదాయములను సుస్థిర మొనర్చిరి. పాశుపాత కాలాముఖులును లింగధారులే.

''హృన్నాభిషు లింగధారిణః పాశుపతాః'' అని ఆనందగిరి శంకరవిజయము తెల్పుచున్నది. బళ్ళిగామ కాలముఖ శాసనములలో నీ విషయము స్పష్టముగా నున్నది. (నంజుండారాధ్య. 54–55) కాని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు (బసవ. పీ. 73) కాలాముఖ పాశుపతాదులు లింగధారులుగారనిరి. అందు వారు ప్రమాణముగా గొన్న గ్రంథములు అర్వాచీనములు. పాశుపతులు హృదయమున లింగమును ధరించగా, వీరశైవులు కంఠములందు ధరించెడివారని క్రీ. శ. 1242 లో యధావాక్కుల అన్నమయ్య 'భక్తగాత్రములం దెప్పుడు నుండుఁగాన' (సర్వే. 24) యని సాక్ష్యము నిచ్చుచున్నాడు. కాలాముఖము వీరశైవముగా మారినకాలమున శ్రీనాధుడు వెలసినాడు. అయినను కాలాముఖ పాశుపతము మీదనున్న అభిమానము చేతనో మరి యే కారణముననో హరవిలాసమున తనకు వీలుగుపట్టుల కాలాముఖ ప్రశంసచేసియున్నాడు. 'కాలాముఖ వీరపాశుపత లాంఛనధారులు' (5–14) అని చెప్పటయేగాక కాలాముఖుడైన శివుని నిట్లభివర్ణించియున్నాడు :

''కలికి కాటుక గీర్బొట్టు పలుగుపేరు
జాతిగాఁ దాల్చి నెఱమిండ జంగమగుచు
బిక్షాటనంబునకుఁ జొచ్చె'' (హర 5–41. 42)

కాలాముఖులనగా నల్లని గీర్బొట్టును నొసట పెట్టుకొనెడివారు. కాటుక గీర్బొట్టు అట్టిదే. ఈ విధముగా కాలాముఖ పాశుపతులు వీరశైవులై ఆరాధ్య బ్రాహ్మణులయి యుందురు. ఈ పరివర్తనము నింకను పరిశోధింపవలసియున్నది.

వ్యాససారాంశము

1. ఆంధ్రదేశపు శైవమత స్వరూపము నెరుంగుటకు గోళగి మఠాధిపతుల చరిత్ర ముఖ్యముగా చదువవలసినది యగును. గోళగి మఠస్థులు, పాశుపతులు, కాలాముఖులు పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, గుజరాత్ ప్రాంతములనుండివచ్చిన శైవబ్రాహ్మణులు.

2. తీరాంధ్ర రాయలసీమ ప్రాంతములందు గోళగి (బిక్షాధ్యాయి) కాలముఖ పాశుపతులును, పశ్చిమాంధ్రమున శక్తి పరిహత్తు కాలాముఖ గురువులును ప్రవేశించి ప్రసిద్ధ శైవ క్షేత్రములైన శ్రీశైల, త్రిపురాంతక, ద్రాక్షారామ, అలంపుర, కొలనుపాక స్థలములందు మఠములను, విద్యా మంటపములను నెలకొల్పి, వేదాది విద్యలు విస్తరిల్లజేసిన సాత్విక పురుషులు. జనసామాన్యమునకు విద్యాపీఠములనే గాక వైద్యాలయ, అన్నసత్రాదులను నిర్మించిన పరమ మహోపకారులు.

3. కర్ణాటకమున కాలాముఖము బసవని వీరశైవములో కలిసి పోయినది. ఆంధ్రమున కాలాముఖ, గోళగి పాశుపతము వీర మాహేశ్వర సవైదిక వీరశైవములో కలిసిపోయినది. కాలాముఖ బ్రాహ్మణులే ఆరాధ్యులైరి.

4. మల్లికార్జున పండితుడు శ్రీశైలపతిని చూడలేదు. సోమన బసవని చూడలేదు. అయినను సోమనాథుడు ఇరువురి మహనీయుల చరిత్రలను సంపూర్ణమైన కవితా కళను జోడించి అటు కన్నడులకును, ఇటు తెలుగు వారికిని పరమ ప్రామాణికుడైనాడు.

5. వీరశైవమను పదము తెలుగుదేశమునకు కొత్తది. అది సోమనాధుని మూలముననే తెనుగున ప్రచారమొంది యుండును. బసవన వర్ణాశ్రమరహిత వీరశైవము కర్ణాటక సరిహద్దులను దాటి తెనుగునేల జొరకుండచేసి శాంతి భద్రతలను, వర్ణాశ్రమ ధర్మములను నిలబెట్టినవారు గోళగి మఠమువారు.

6. నన్నెచోడుని జంగమ మల్లయ్య కాలాముఖాచారి. ఆతడు వీరశైవుడుకాడు. కర్ణాటక శక్తిపరిషత్తు కేదారమఠము

నతి చండికాపాటు అనంతపురి, శ్రీశైల ప్రాంతములవాడై యుండును. కేదారమఠ కుడ్య భాగముల శిలోట్టంకితమైన గంభీర కన్నడ కవితాశైలివలె తెనుగున కుమార సంభవము వెలసినది. కనుకనే కవిత్రయ కవితా స్రవంతికది కొత్త నీరు. నన్నెచోడుడు తిక్కనకు తరువాత ననువాదము అతి నీరసము, చారిత్రక గతికి భిన్నము.

7. పుష్పగిరి, శ్రీశైలము మొదలగు స్థలములలో భిక్షావృత్తి మఠములు గోళగి మఠములే. సిద్ధభిక్షావృత్తి, వారణాసి భిక్షావృత్తి, వీరశైవ భిక్షావృత్తి, అజాతి వీరశైవ భిక్షావృత్తి అయ్యవారలు ఒకానొకప్పుడు గోళగి మఠాచార్యులే పుష్పగిరిలోని అఘోర శివాచార్యులును, (మాదయగారి మల్లన, నంది జంటకవులు, తిమ్మన, గురువు) శ్రీశైల శాంత భిక్షావృత్తి (గౌరన, శ్రీనాథుల కృతి పోషకుడు) గోళగి శివాచార్యుల పరంపరలోని వారే అట్లే శైవాచార సంగ్రహమునందు కీర్తింపబడిన వారణాసి సిద్ధాభిక్షావృత్తియు.

8. కాకతీయుల తరువాతి శైవమును గూర్చి ఇందు చర్చించ లేదు. ఏకామ్రనాథ, కాసెసర్వప్ప, కూచిమంచి జగ్గకవుల గ్రంథములు అర్వాచీనములు.

9 తెలుగుదేశ చరిత్రలో 11, 12, 13, 14 శతాబ్దములు మిక్కిలి ప్రాముఖ్యము గలవి. తెలుగు వాఙ్మయమునకు, మతమునకు అవినాభావ సంబంధము గలవి. అవి రెండును చక్కగా సమన్వితము కాలేదు. అయిననాడు ప్రాచీనాంధ్ర కవులు దేశమునకు, భాషకు, మతమునకు నొనర్చిన సేవ విస్పష్టము కాగలదు

అధోజ్ఞాపికలు

1 తేఱంబి. **Terahi, Jabbalpur (M.P).**

2 తిక్కనని. ఉ. రా. అవతారికలో "బిరుదు వెలుంగ బిజ్జఁ డరిభీకర" (1–28) అని యున్నది. "బిరుదు తెలుంగు బిజ్జఁడరి" యని యుండవలెను. కీర్తి మెఱసి అని యుండునుగాని బిరుదు వెలుఁగుట యుండదు.

3. **Hanumakonda Niroshtya Karya Inscription. (EI. XXXVI 209-218)**

దీనిని రాష్ట్ర ఆర్కియాలజీ శాఖవారు ప్రత్యేక గ్రంథముగా ప్రచురించియున్నారు.

4 ఇది పశుపాశపతి జ్ఞానమును దెల్పు కృతి. ఇట్టి కృతిని కొలని గణపతిదేవుడు నదే శీర్షికతో రచించినాడు. కాని అది అలభ్యము. (చూ. శివయోగసార పీఠిక)

5 ("వీరశైవైక సిద్ధాంతే సర్వశ్రుతి సమన్వయః—నంజుండారాధ్య 66) శ్రీపతి పండితుడు శ్రీకరభాష్యకర్త కాడని యిటీవల చక్కగా నిరూపితమైనది. (భారతి. మార్చి 1975. పుటలు 36–42. కుమారి లలితాంబ)

అనుబంధము - I
ఆంధ్ర ప్రదేశ్

జిల్లా	స్థలము	నామము	మఠము	కాలము
తూర్పు గోదావరి	బిక్కవోలు	పద్మశివ	భిక్షావృత్తి	724–758
పశ్చిమ గోదావరి	వసంతవాడ	వామశివ, పురుష శివ	,,	
,,	తడికలపూడి	సుబ్రహ్మణ్య శివ	గోళగి	1216
,,	,,	సిద్ధాంతశివ, అనుగ్రహశివ	,,	1243
,,	,,	ఉత్తమ శివ	,,	1275
కృష్ణా	పెద కళ్ళేపల్లి	సోమశివ	,,	1292
గుంటూరు	సత్తెనపల్లి	ఈశాన శివ	—	1127
,,	భట్టిప్రోలు	పరిపూర్ణ శివ	గోళగి	1243
,,	మందడం	విశ్వేశ్వర శివ	,,	1253
,,	కంభంపాడు	సదాశివ	—	1258

జిల్లా	స్థలము	నామము	మఠము	కాలము
,,	భట్టిప్రోలు	ఉత్తమశివ	గోళకి	1271
,,	మందడం	కాశీశ్వర శివ	,,	1282
నెల్లూరు	గంగాపురం	శాంత శివ	,,	1254
కడప	తుడూరు	ఉత్తమ శివ	—	1077
,,	పుష్పగిరి	వరుణ శివ	—	1237
,,	,,	ఈశాన శివ	గోళకి	1257
,,	,,	ఈశ్వర శివ	,,	1313
కర్నూలు	త్రిపురాంతకం	ధర్మశివ	,,	1234–52
,,	శ్రీశైలం	శాంతశివ	,,	1260
,,	త్రిపురాంతకం	శాంతశివ	,,	1263
,,	,,	త్రయంబక శివ	,,	1271
,,	,,	శ్రీకంఠశివ	,,	1271
,,	,,	నందశివ	,,	1290
,,	,,	చంద్రభూషణ శివ	,,	1313
అనంతపురం	గౌనిమోర్చుగల్లు	వరుణశివ	—	936
,,	హేమావతి	అనంతశివ	—	10వ. శ.
,,	సంగమేశ్వరం	రుద్రశివ	—	1073
,,	హేమావతి	ఈశానశివ	—	12వ. శ
నల్గొండ	ఏలేశ్వరం	ముగ్ధశివ — సద్యశ్శివ	—	1019
,,	,,	శాంతశివ	గోళకి	1267
వరంగల్లు	వరంగల్లు	ధర్మశివ	,,	1234–52
,,	,,	అఘోర శివ	,,	1313
కరీంనగర్	కాళేశ్వరం	ధర్మశివ	,,	1234–52
,,	కమ్మంపల్లి	విశ్వేశ్వర శివ	,,	1253
మహబూబ్‌నగర్	సోమశిల	శంకర శివ	,,	1293


అనుబంధము - II
ఆంధ్రప్రదేశ్


ళగి, తేరంబి, భిక్షాధ్యాయి, మఠములు - గురువులు [క్రీ.శ. 724-1313]

నెం	కాలము క్రీ. శ.	పేరు	మఠము	స్థలము	జిల్లా
1	724–758	పద్మశివుడు	భిక్షాధ్యాయి	బిక్కవోలు	తూర్పు గోదావరి (1)
2	,,	వామశివ, పురుషశివ	,,	వసంతవాడ	పశ్చిమ గోదావరి (2)
3	936	వరుణశివ	—	గౌని మోర్చుగల్లు	అనంతపురం (25)

నెం.	కాలము క్రీ. శ.	పేరు	మఠము	స్థలము	జిల్లా	
4	945	సద్భావశివ	గోళగి	త్రిపురి	మధ్యప్రదేశ్	
5	10 వ. శ.	అనంతశివ	—	హేమావతి	అనంతపురం	26
6	1019	ముగ్ధశివ — సద్యశ్శివ	—	ఏలేశ్వరం	నల్గొండ	29
7	1041	వామశివ (శంభు)	గోళగి	త్రిపురి	మధ్యప్రదేశ్	
8	1073	రుద్రశివ	—	సంగమేశ్వరం	అనంతపురం	27
9	1077	ఉత్తమ శివ	—	తుడూరు	కడప	14
10	1095	సోమశంభు (శివ)	గోళగి	వారణాసి	ఉత్తరప్రదేశ్	
11	1127	ఈశానశివ	—	సత్తెనపల్లి	గుంటూరు	7
12	12 వ. శ.	ఈశానశివ	—	హేమావతి	అనంతపురం	28
13	1123–63	శక్తి శంభు, కీర్తి శంభు	గోళగి	త్రిపురి	మధ్యప్రదేశ్	
14	1212	విమలశివ	,,	త్రిపురి	మధ్యప్రదేశ్	
15	1216	సుబ్రహ్మణ్య శివ	,,	తడికలపూడి	పశ్చిమ గోదావరి	(3)
16	1234–52	ధర్మశివ	,,	కాళేశ్వరం వరంగల్లు త్రిపురాంతకం	కరీంనగర్ వరంగల్లు కర్నూలు	33 31 18
17	1237	వరుణశివ	—	పుష్పగిరి	కడప	15
18	1243	పరిపూర్ణశివ	గోళగి	భట్టిప్రోలు	గుంటూరు	8
19	1243	సిద్ధాంతశివ, అనుగ్రహశివ	,,	తడికలపూడి	పశ్చిమ గోదావరి	(4)
20	1253	విశ్వేశ్వరశివ	,,	కమ్మంపల్లి మందడం	కరీంనగరం గుంటూరు	34 9
21	1254	శాంతశివ	,,	గంగాపురం	నెల్లూరు	–13
22	1258	సదాశివ	—	కంభంపాడు	గుంటూరు	–10
23	1260	శాంతశివ	గోళగి	శ్రీశైలం	కర్నూలు	–19
24	1263	శాంతశివ	,,	త్రిపురాంతకం	కర్నూలు	–20
25	1267	శాంతశివ	,,	ఏలేశ్వరం	నల్గొండ	–30
26	1271	త్ర్యయంబక శివ	,,	త్రిపురాంతకం	కర్నూలు	–21
27	1257	ఈశానశివ	,,	పుష్పగిరి	కడప	16
28	1271	శ్రీకంఠశివ	,,	త్రిపురాంతకం	కర్నూలు	–22
29	1271	ఉత్తమశివ	,,	భట్టిప్రోలు	గుంటూరు	–11
30	1275	ఉత్తమశివ	,,	తడికలపూడి	పశ్చిమ గోదావరి	(5)
31	1282	కాశీశ్వరశివ	,,	మందడం	గుంటూరు	–12
32	1290	నందశివ	,,	త్రిపురాంతకం	కర్నూలు	–23

నెం.	కాలము క్రీ. శ.	పేరు	మతము	స్థలము	జిల్లా	
33	1292	సోమశివ	,,	పెదకళ్ళేపల్లి	కృష్ణా	(6)
34	1293	శంకరశివ	,,	సోమశిల	మహబూబ్‌నగర్	35
35	1313	చంద్రభూషణశివ	,,	త్రిపురాంతకం	కర్నూలు	-24
36	1313	అఘోరశివ	,,	వరంగల్లు	వరంగల్లు	-32
37	1313	ఈశ్వరశివ	,,	పుష్పగిరి	కడప	17





గ్రంథ సూచి

అన్నమయ్య యథావాక్కుల—సర్వేశ్వర శతకము. ఆం. సా. ప. కాకినాడ. 1919

కాకతీయ సంచిక—రాజమండ్రి. 1935.

కృష్ణారావు, భావరాజు వేంకట — రాజరాజనరేంద్రుడు మద్రాసు—1950.

చెన్నారెడ్డి జె—శైవసిద్ధాంతము—ఒక పరిచయము. **S. V. Univ. Journal (off print)**

తిక్కన—ఆంధ్రమహాభారతము — ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రచురణ.

తెలంగాణా శాసనములు—సం. I, II. 1935, 60.

నంజుండారాధ్య. ఎం. జి. సం. తత్త్వప్రకాశ. కన్నడ-లిపి.

నందిమల్లయ—ఘంటసింగయ—ప్రబోధ చంద్రోదయము. హైదరాబాదు. 1976

నన్నెచోడుడు—కుమారసంభవము—మద్రాసు విశ్వవిద్యాలయ ప్రచురణ 1948

నరసింహారెడ్డి వే. పాల్కురికి సోమన— సిద్ధాంత గ్రంథము. (అముద్రితము)

మంచన. కేయూర బాహుచరిత్ర. మద్రాసు. 1970.

మల్లికార్జున పండితుడు—శివతత్త్వసారము.

వీరభద్రరావు, చిలుకూరి—ఆంధ్రుల చరిత్ర—ద్వి. భా. చెన్నపురి. 1912

వేంకటరమణయ్య డా. నేలటూరి—విష్ణుకుండినులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము. హైదరాబాదు. 1973.

పాల్కురికి సోమనాథుఁ డెప్పటివాఁడు?
వావిళ్ల, మదరాసు 1955.

వెంకటావధాని–దివాకర్ల – భారతదేశము – శైవమతము (31–41) 8. వ సం. ఆం. మ. భార. ఉ. వి. వి. ప్రచురణ–
హైదరాబాదు 1973.

శివనారయ్య. వల్లపాటి–'తెలుగు' పత్రిక
తెలుగు అకాడమి. హైదరాబాదు. జన–మార్చి–1975, అక్టో–
డిశ–1976.

(ఇది ప్రామాణికమైన వ్యాసము కాదు)

శేషయ్య, చాగంటి–ఆంధ్రకవితరంగిణి 3 సం.

శైవాచార సంగ్రహము–కుంటుముక్కల తిరుమలనాథకవి.
మద్రాసు. 1951

శ్రీనాథుడు-హరవిలాసము–వావిళ్ల 1973.

సీతారామయ్య, కురుగంటి–శైవము. ఆంధ్రదేశము
'ఆంధ్రపత్రిక' ఉగాది సం. 1955–56.

సోమన–పాల్కురికి–అనుభవసారము–వావిళ్ల – 1955.

,, బసవ పురాణము. ఆంధ్రగ్రంథమాల
మద్రాసు. 1926

,, పండితారాధ్య చరిత్ర–ఆం. గ్రం. మాల
మద్రాసు. 1939.

Audilakshmi : History of Saivism in telugu Literature (Thesces) Madras.

A. P. Govt. Report on Epigraphy for 1965.

" " 1966.

E. I. Epigraphia Indica.

Hanumantha Rao. B. S. L. Religion in Andhra Guntur. 1973.

Haribhadrasuri-Saddarsana Samucchaya.
With commentary of Gunaratna's
Tarka Rahasya : Calcutta 1905-14

Inscriptions of A. P. Warangal Dt. 1974.
Karemnagar Dt. 1974

Lorenzen David.The Kapalikas and Kalamuhhas. New Delhi. 1972

Majumdar-History of Ancient Bengal
Calcutta 1974.

Mirashi. V. V. corpus Inscriptionium Indicarum.
Ooty-1955.

Nandi Ramendranath-Religious.
Institutions and cults in the Deccan
New Delhi-1973

Rama Rao. M. Inscriptions of Andhra Pradesh
Vol II—Part II
Tirupati 1968.

Rangachari V. A. Topographical list of the Inscriptions of Madras Presidency Vol II. 1919.

Sicar D.C. Studies in Religious life of Ancient& Medieval India—New Delhi 1971.

Sayana Madhava - Sarvadarsana Sangraha. Chowkamba–Varanasi 1964.

Somasekhara Sarma M. History of the Reddi kingdomes. Waltair. 1948.

Sudhakar chathopadhyaya-Evolution of Hindu sects. New Delhi 1970.

Yazdani - The Early History of the Deccan Part VII-X1-OXFORD. 1960.

అనుబంధము - 4. మాల్యాపుర శాసనము (మొదటిప్రక్క)

1 స్వస్తి శ్రీః వితరతు భగవా నపో శ్రియం వః కరివ–
2 దనో హరినీలభాసి యస్య । ద్యుతివరసరసి స్ఫురత్త–
3 రంగ శ్రియ మధికా మళిపంక్తయో వహంతి ॥జయ
4 తీందోః కలా ఖేలతు గంగాంభః కణదంతురైః । కరైః కరోతి యా శ–
5 ంభో ర్మూర్ధ్ని ముక్తావళి శ్రియం ॥ హరిరవతు కిరితను ర్వో
6 [భు]వ ముద్వోఢుం గతస్య వరుణపురిం । య స్యాఖిల జలధిజ–
7 లం పాద్యా యాభూ దనర్ఘ్యాయ ॥ జయతి భగవాను న్వయ–
8 ంభూ గ్గణపతి నృపతే హృది స్థిత స్సతతం । యత్కారుణ్యకటా–
9 క్షై ర్వృద్ధిం ప్రాప్తాంధ్రదేశ శ్రీః ॥ అస్తి స్వస్తిమతీ తను భ్భగవతో

10 దేవస్య తస్యా స్ఫుర న్నాభీపంకజసంభవస్య భుజతో భూవల్లభా జ—
11 జ్ఞిరే । తేషాం తిగ్మమరీచిసంతతిభువో యే దుజ్జ్ఞయాః క్షత్రియా స్తేషా
12 మస్తి కులం కలంకరహితం శ్రీకాకతీభూభుజాం ॥ వీర స్తత్సామ్మ ద—
13 జని రజనీనాథవ ద్దుగ్ధసింధోః కీర్తి జ్యోత్స్నా భరితభువనః ప్రోలభూపాల
14 నామా । రాజ న్యస్మి న్కమపి నృపతిం రాజశబ్దాభిధేయ న్నైవా ప్రా—
15 ష్మ త్రిజగతి వినా యామినీకామినీశం । కీర్తి ర్యస్య హిమేందుకుందవిశ—
16 దా మూర్తి ర్జనందినీ దానం విశ్వజనార్తిహారిచరితం గంగాపయః
17 పావనం । చిత్తం శంభుపదారవిందయుగళధ్యానామృతక్షాలితం శౌ—
18 ర్యం విష్వగరాతిదుర్మదహరం ధామాపి ధామశ్రియః ॥ రుద్ర—
19 దేవ స్తతో జాతో యత్కీర్త్యా భూ రలంకృతా । ప్రతిపక్షమహీపా—
20 లయశోనిర్మాల్య ముజ్ఝతి ॥ రాజానః కతివా న సంతి సుభటా స్స—
21 ంక్రాంతవిక్రాంతయ స్తే తిష్ఠంతు త మేకమేవ శృణుమ శ్శూరేషు రుద్ర—
22 ం నృపం । య స్యాసీ దసిదారితారినృపతిశ్రేణీశిరః కందుకక్రీడాంగ్రబేడి—
23 తవిక్రమా యుధి జయశ్రీః ప్రేయసీ స్థేయసీ ॥ఏక ఏవ ధనుర్వీరో రుద్రదేవో మ—
24 హీభుజాం । సురేశ్వరాణాం సర్వేషాం పినాకీవ ధనుష్మతాం ॥ అ థానుజ
25 స్తస్య మహీ శశాస ధీరో మహాదేవనృపో మహౌజాః । ప్రతాపదీపాః
26 ప్రతిపక్షభాజాం శామ్యంతి య త్ఖ్యాయ్యకథానిలేన । కుందేందుచందన—
27 సఖః కుముదస్య మిత్రం స్వస్సింధుసింధురతురంగరుచాం సనాభిః ।
28 కర్పూరహారహరహాసపయఃపయోధిబంధు ర్విభాతి య దుదార—
29 యశోవిలాసః ॥ తస్యాయం తన[య] స్తదంబామయతనో ర్దేవా ద్భవానీపతే ల
30 [బ్ధః] క్ష్మాం సముపాలయతు గణపతిః క్ష్మాపాలచూడామణిః । యస్మి
31 న్విస్మయకారి విక్రమకథాధారాముచి శ్రీఘనే పృథ్వీ దుష్టదురీశదావదహ—
32 నప్రాప్తం రుజం ముంచతి ॥ దర్పే ధన్విని మత్సరో రణజయే ధాష్ట్యం ద్విపారో—
33 హణే । క్రౌర్యం శౌర్యవిధౌ తురంగదమనే చాపల్య మాశా యుధి । క్రోధో దుష్ట—
34 జనేభయం ద్విజధనా లోభశ్చ ధర్మార్జనే పూజా కర్మణి శాంకరే గణపతిక్షోణీ—
35 పతే ర్గ్రహః ॥ కోదండోచ్చండవేగవ్యథితకరిహయవ్రాతపృథ్వీశసైన్యం కిం బ్రూమ
36 శ్చండిమానం గణపతినృపతే ర్బాహుదండద్వయస్య । అద్యా ప్యుద్దామదర్పా దుపర—
37 తప్రుతనా కోటికంకాలకూట ప్రక్రీడతు ప్రేతయాధవ్యతికరవిషమభూ—
38 మయో భీషయంతే ॥ కతికతి న సంతి భూపాః కతికతి గుణగణాభ—
39 రణాః । గణపతినృపతి స్త్వేకో నరపతిశతపోషకః క్షోణ్యాం ॥ నిస్త్రాణరవ
40 సంత్రస్తాః క్షణా ద్గణపతే నృపాః । అపి త్యజంతి దుర్గాణిన దారానేవ కేవ—
41 లం ॥ రుద్రదేవీ సముదభూ త్పురణ్యా త్సర్వభూభృతాం । గంభీరా న్మహత
42 స్తస్మా ల్లక్ష్మీ రత్నాకరాదివ ॥ సర్వోర్వీశకిరీటకుట్టిమతటే విన్యస్తపాదాంబుజా శా
43 స్త్యేషా చతురంబురాశిరశనాం శ్రీరుద్రదేవీ భువం । యస్యా జన్మమహోత్సవో
44 గణపతేః క్ష్మాపాలచూడామణే ర్విష్ణూర్జిత్కలికాలకల్మషక[థా]ధ్వాంతౌఘ
45 తేజోనిధేః ॥ సాంబ్రాజ్యే ఖల వర్జిత్ తం విరచితే శ్రీరుద్రదేవ్యాస్వయం చాతుర్వ
46 ర్ణ్య నిజస్థితి ర్విజయతే విద్రాతికాలః కలిః ధర్మా సౌ భగవా న్విభాతి దురితం
47 దూరే ద్విజానాం ద్విష స్తన్నామగ్రహభీషితా నిజపురా న్నిర్యంతి పర్యాకు—
48 లాః ॥ ఆక్రామంతి తరత్తరంగవిగళద్దుగ్ధాబ్ధిఫేనావలీ రాచామంతి శరత్స—
49 శాంకవిలసజ్యోత్స్నాప్రవాహామృతం । ఆకర్షంతి సురేంద్రదంతివశన
50 ప్రాగ్భారలగ్నాం శ్రియ(ం) ముక్తాహారలతాయితాః ప్రతిదిశం రుద్రాంబికా—
51 కీర్తయః శ్రీవిశ్వేశ్వరదేశికేంద్రశివహస్తోసిదోర్విక్రమ స్త్రిక్షోణీశ
52 జగద్గుళః ప్రతిబళప్రధ్వంసిజన్మోత్సవః । యస్యాః కాకతివంశమౌక్తిక—
53 మణేశ్రీరుద్రదేవస్సుత స్తస్యాః కిం కథయామ వైభవ మత శ్రీరుద్రదేవ్యా—

54 ః పరం ॥ అస్తి విశ్వంభరాసారః కమలాకులమందిరం । భాగీరథీనర్మ్మద—
55 యో ర్మ్మధ్యం దహలమండలం ॥ ఉగ్రస్తత్ర తపశ్చర న్నియమయ
56 న్బాహ్యేంద్రియక్రీడనం । సాంద్రానందమయే సమాధిసమయే
57 చిత్తేన లీన శ్శివే । నీత్వాకాల మనంత మంతకజయా సద్భావశంభు
58 ర్గ్గురు ర్దుర్వ్వాసోన్వయసంభవ స్సుచరితః ప్రాబుద్ధపుణ్యా న్నృణాం శైవ
59 ం ప్రథమాయ శంకరపదధ్యానామృతాంభోనిధిక్రీడాంబ్రేడనకర్మ్మనిర్మ్మ—
60 లతరస్వాంతాయ శాంతాత్మనే । తస్మై నిస్పృహచేతసే గళచురిక్ష్మాపాలచూ—
61 డామణి ర్గ్రామాణాం యువరాజదేవనృపతి ర్భిక్షాం త్రిలక్షీం దదౌ ॥ కృత్వా
62 స శైవముని రద్భుతశీలమూర్త్తి ర్శ్రీగోలకిమఠ ముదారం ముదాత్తచిత్తః
63 [త]స్యాకర స్స నృపదేశికమౌక్తికానాం వృత్తిం చకార సకలా మపి తాం త్రిలక్షీ
64 । ప్రాచీనపుణ్యపరిపాకవశా త్ప్రజానా మావిర్బభూవ భగవా నిహ సో—
65 మశంభుః । నామ్నా నిజేన సకలాగమసింధుసేతుం యః పద్ధతిం కరుణ—
66 యా ప్రతిమాం బబంధ ॥ అథ నృపశేఖరమాలాలాలితపాదో త్ర వామశ—
67 ంభు రభూత్ । అద్యాపి కళచురీశా యచ్చరణారాధకాః ప్రశస్యంతే । లబ్ధ
68 దేశికపదా మనోహరా భూరిదాన పరితోషితార్త్థినః । యత్ర మత్తకరి—
69 ణోపి కుర్వతే పాశభేద మిహ భద్రజాతయః ॥ తస్మి న్మఠే తస్య గురో ర్బభూ
70 శ్శిష్యాః ప్రశిష్యా శ్చ పరస్సహస్రాః । వినిగ్రహీతుం సమనుగ్రహీతుం క్షోణీ—
71 శ్వరా న్దక్షకటాక్షపాతైః ॥ ఇత్థం కాలే యాతి సత్సంప్రదాయే సంతానే స్మి న్న—
72 ర్త్థిసంతానకల్పే శైవాంభోధే శ్శక్తిశంభో రుదారా చ్ఛిష్య శ్రీమా న్కీర్త్తిశంభు ర్బభూవ ॥

రెండవ ప్రక్క

73 ప్రణామవ్యాలోలత్కలచురిమహీపాలపరిషత్కిరీటప్రక్రీడత్కిరణకలికాలా—
74 లితపదాః । యశఃపూరస్స్వైరస్తబకితదిశః కేరలభవాస్తతః పద్మావాసా విమ—
75 లశివపాదా స్సమభవన్ ॥ నిర్వైర ముర్వ్యాం కలికాలమధ్యే స్థాతుం పదాభ్యా[ం]
76 కుతుకీవ ధ[ర్*]మ్మః । శిష్యఃకృపాకందలితాంతరాత్మా తేషా మభూ ద్ధర్మ్మశివో మునీ—
77 ంద్రః ॥ యం కృపానిధి ముదారవైభవం ధర్మ్మశంభు మఖిలార్త్తిభంజనం । ఏకప—
78 క్త్రకమలం సదాశివం సంకథాసుకృతినః ప్రచక్షతే ॥ అధ్యేతా నిగమస్య ధర్మ్మతన—
79 య శ్రీగౌడరాఢోల్లసత్పూర్వ్వగ్రామశిఖామణి ర్గ్గణపతిక్ష్మాపాలదీక్షాగురుః
80 క్షీరాబ్ధే రివ చంద్రమాః శ్శశికలామౌళే ర్యథా షణ్ముఖః శ్రీ విశ్వేశ్వరశంభురు—
81 గ్రతపస శ్శ్రీధర్మ్మశంభో రభూత్ ॥ చిరం పృథ్వీపాలావలీమకుటఘృష్టాంఘ్రికమలద్వయో
82 విద్యావల్లీవలయకలనాకల్పతరుః । సదాదాంతస్స్వాంత స్థిరతరో లసద్ధూర్జటీ
83 మహాశాంతః కాంతో జయతి భువి విశ్వేశ్వరశివః ॥ శ్రీచోళేశ్వరమాళవ—
84 క్షితిపతీ రాజన్యచూడామణీ యచ్ఛిష్యౌ కిమతఃపరం గణపతిక్షోణీపతి ర్య్య
85 త్సుతః న స్యా త్కస్య ముదే సదేశికవర శ్శైవాగమాంభోనిధి శ్శ్రీ విశ్వేశ్వరదేశికః కల—
86 చురిక్ష్మాపాల దీక్షాగురుః ॥ గౌడాః పూర్ణ్ణమనోరథాః కతికతి ప్రాప్తశ్రియ
87 స్తాపసా । స్సంతుష్టాః కవిపుంగవాః కతికతి ప్రధ్వస్తపాశా నృపాః యే తస్మిన్
88 గణపత్యధీశగురుతాసింహాసనాధ్యాసిని శ్రీవిశ్వేశ్వరదేశికే శివపురీ విశ్రా—
89 ణనశ్లాఘిని ॥ త్వంగత్పింగజటాకిరీట ముదయస్మేరారవిందాననం ముక్తాకుండల.
90 తాడితాం సశిఖరం హారైర్మ్మనోహారిణం । విద్యామండపవర్త్తినం గణప—
91 తిక్ష్మాపాలదీక్షాగురుం । శ్రీవిశ్వేశ్వరశంభు వీక్షితవతాం తే చక్షుషీ చక్షుషీ
92 లోహః కోయం శకస్యాబ్దే దుర్మ్మతా వత్సరే శుభే । చైత్రే సితేతరాష్టమ్యాం వా—
93 రే శుక్రాభిధానకే । విషయే వెలినాడాఖ్యే కంద్రవాట్యాం విశేషతః । యదుత్త—
94 రేణ వహతి కృష్ణవేణీ మహానదీ ॥ శ్రీ విశ్వేశ్వరశంభవే గణపతిక్షోణీశ్వరో దా—
95 దరా ద్గ్రామ(ం) మ్మందరనామధేయ మఖిలై ర్వ్వార్గ్గదత్తై మాయ్యై స్సమం । తత్పు—

96 త్రీతదనుజ్ఞయా పశుపతేః శ్రీ రుద్రదేవీ పురః ప్రాదా ద్గ్రామ వెలంగ పూండిప–
97 హితం సీమాష్టకే నావృతం ॥ అష్టస్వామ్యేన సహితం ధారా పూర్వ్వం సకషర్కం కృ–
98 ష్ణవేణీ నదీమధ్యగతయా లంకయా సహ ॥ తస్యగ్రామస్య సీమానః కథ్యం–
99 తే పూర్వ్వతః క్రమాత్ । పరిజ్ఞానాయ సర్వ్వేషాం భాష యాంధ్ర్యా స్ఫుటార్త్థ–
100 యా । పూర్వ్యస్యాం । పెనుంబాకదిక్కు మెడవిలుపుం గాల్వ పొలమెర । ఆ–
101 గ్నేయ్యాం । తాండినుండి వచ్చిన మద్దిమడ్డుకాల్వ పొలమెర । దక్షిణస్యా–
102 ం । కట్టుంగొమ్ము కాల్వ పొలమెర । నైరుత్యాం । ఉప్పలపాటిచెఱ్వు పడుమ–
103 టికొమ్మురావిపూండి వెలంగపూండి పొల్లమునందు పొలమెర । పశ్చి–
104 మాయాం । మందరానకూను వెలంగపూండికివి పడుమటి రావి–
105 పూండి పొలములోని నల్లందుమ్మ ఉత్తరము పెనుంబడియ పొలము–
106 సందు పొలమెర । వాయవ్యాం । పెరకమ్మనుండి వెడ్లినఇమ్మంగారి కాల్వ
107 తలపొలమెర ।అదిమొదలు ఈశానపర్య్యంతము కృష్ణవేణియే పొలమెర ।
108 అయిశాన్యాం । కృష్ణవేణినుండి వెనుంబాకరెడ్డి త్రవ్వించిన కాల్వతలపొలమెర ॥
109 రావిపూండికి ఐశాన్యము । మందరానుకూను వెలంగపూండికిన్ని వాయవ్య–
110 ము పెరకమ్మనుండి వచ్చినపాయేటితల పడుమటి సీమగాను మందర–
111 పులంక ॥ శ్రీ విశ్వేశ్వరదేవ మిందుకళికాచూడం మఠం శాశ్వతం సత్రం వి–
112 శ్వజనాగ్రహారసహితం సుస్థాప్య నిత్యోజ్జ్వితం । శ్రీవిశ్వేశ్వరగోళకీత్యభిధ–
113 యా తం గ్రామమత్యాదరాత్ శ్రీవిశ్వేశ్వర స్వమయుజ త్రిగౌడచూ–
114 డామణిః ॥ నానాగోత్రసముద్భూతా ద్రావిడా యే ద్విజోత్తమాః । పరస్ప–
115 రం ప్రకుర్వాణాః క్రయవిక్రయ మాదికం ॥ షష్టి సంఖ్యా విశిష్టేభ్యః ప్రత్యేకం
116 పుట్టికాద్వయం । పెనుంబాక ప్రసిద్ధేన మానదండేన సమ్మితం స్థిత్యుపాధిమ–
117 దా త్తేభ్య శ్రీవిశ్వేశ్వరదేశికః ॥ ఏతతు క్షేత్రంతు పుట్టినాం వింశత్యా భ్యధికం శ–
118 తం । వెలంగపూండి సహితం దత్తం మందరనామని ॥ త్రిధా విభజ్య తత్పి–
119 ష్టవేకం భాగం పినాకినే । విద్యార్త్థిభ్యో పరం భాగం శుద్ధశైవమఠాయ
120 చ । ప్రసూత్యారోగ్యశాలాభ్యాం విప్రసత్రాయ చేతరం । ప్రాదా ద్విశ్వేశ్వరశి–
121 వ శ్శైవసిద్ధాంతపారగః ॥ ఋగ్యజుస్సామవేదానాం సమ్యగధ్యాపకాస్త్ర–
122 యః పదవాక్య ప్రమాణానాం సాహిత్య స్యాగమస్య చ ॥ పంచవ్యాఖ్యాకృ–
123 తో వైద్యకాయ స్థా ద్వౌ విచక్షణౌ ॥ దశానా మపి చైతేషాం ప్రత్యేకం పుట్టికా–
124 ద్వయం ॥ శ్రీవిశ్వేశ్వరదేవస్య నర్త్తక్యో దశసంఖ్యయా । ముఖరీద్వయ సంయుక్తా
125 అష్టౌ మద్దలవాదకాః ॥ అష్టాదశానా మేతేషాం ప్రత్యేకం సార్ద్ధ పుట్టికా । ఏ–
126 కః కాశ్మీరదేశీయో గాయిన్య శ్చతుర్ద్దశ ॥ కరడావాదనాద్యేషు కృత్యేషు రస–
127 సంఖ్యయా ॥ పాచకౌ ద్వౌ ద్విజన్మానౌ చత్వారః పరిచారకాః । తథైవ షట్సమా
128 ఖ్యాతా బ్రాహ్మణా మఠసత్రయోః । చాతుర్వర్ణ్యసముద్భూతా జటిలా శ్చోడదే–
129 శజాః ॥ బీజచ్ఛేద శిరచ్ఛేద కుక్షిచ్ఛేదాది కర్మ్మభిః । వీరభద్రసమా ఖ్యాతా దశగ్రా–
130 మస్య రక్షకాః ॥ భటాన్య రపరే భక్తా వింశతి ర్వీరముష్టయః । సువర్ణ్ణతామ్ర–
131 పాషాణవంశాయస్కుంభకారకాః ॥ ఏతే స్థపతిసంయుక్తాః కారునాసిత
132 శిల్పినః । దశ స్వకృత్యం కుర్వాణా భటాన్య వీరముష్టిభిః ॥ త్రిసప్తతి మర్మనుష్యా–
133 ణాం కల్పితా త్వేకపుట్టికా । ప్రత్యేకం పూర్వ్వముక్తానా మారామార్త్థం చ సర్వ్వ–
134 తః ॥ ప్రాదాత్ షోడశకం భాగ న్నివర్త్తన మిత క్షితేః । గౌడదక్షిణరాఢీయపూ–
135 ర్వ్వగ్రామసముద్భవాః ॥ శ్రీవత్సగోత్రిణో యే స్యు బ్రాహ్మణా స్సామవేదినః
136 ఏ తేభ్య స్త్రింశతం పుట్టి రదా ద్రాజగురు స్తథా ॥ ఏతా ఏతే ప్రభుంజానా
137 గ్రామ స్యాయవ్యయాదికం । అనుసందధతాంసర్వ్వం సమ్య గ్లేఖనపూ–
138 ర్వ్వకం ॥ ఇత్యాహృత్య శతం సార్ద్ధం పుట్టికానాం ప్రకల్పితం । తిష్ఠతా మేవ స–
139 ర్వ్వేషాం స్వే స్వే కర్మ్మణి వృత్తయః ॥ భవం త్వాచంద్రతారార్క మన్యథా న భ వంతి వా

140 పుత్రాభావే స్త్రియో హ్యేషాం కులాచార సమన్వితాః । కారయం త్వస్యకర్మ్మా వ క్షే–
141 త్రారామాది భుంజతాం ॥ క్షేత్రాణి శిష్ట్వా న్యఖిలాని దేవదేవాంగభోగాలయ
142 ముఖ్యకృత్యే । ఉపేయుషాం శైవవ్రతసాధనానాం కాశానవానాం శివశాసనానా–
143 ం ॥ విద్యార్త్థినాం పాశుపతవ్రతానా మ ప్యన్నవస్త్రాదిసమర్ప్పణాయ ॥ ఆ–
144 రభ్య విప్రా ననివారితానాం చండాలపర్య్యంత ముపాగతానాం ॥ అన్న–
145 ప్రదానాయ చ సర్వ్వకాల మకల్పయ ద్రాజగురు మ్మహాత్మా । దేవస్య సత్ర–
146 స్య మఠస్య తస్య గ్రామస్య సర్వ్వస్య చ సో ధికారీ ॥ యోగోళకీవంశ్యకృతాఖిలే–
147 క శ్శాంత శ్శుచి శ్శైవరహస్యవేదీ । శైవాగమానా మపి పారగామీ సంతాన–
148 పాల స్సమలోష్ట హేమః ॥ సర్వాణి భూతా న్యనుకంపమాన స్సమస్తవిద్యా–
149 సుకృతావగాహః । మహీసుర శ్శీలవతాం పురోగో భవేత్తరాం నైష్ఠికదేశి–
150 కేంద్రః ॥ విశ్వేశ్వరశివాచార్య్యో ధీమా న్రాజగురు స్స్వయం । ఏసమాజ్ఞాప–
151 యద్ధీర శ్శైవాచార్య్యశతై ర్వృతః ॥ అంధ్రేషు స్థానపతయ(ః) ష్షట్కర్మ్మణ స్తపోధనాః
మూ డ వ ప్ర క్క
152 సాంతానికా శ్చ సర్వేత్ర సాక్షిభూతా భవంతు తే ॥ శ్రీ విశ్వేశ్వరగోళక్యా
153 మాచార్య్యత్వే ప్రతిష్ఠితః । ఏత త్సర్వ్వం సదాచారః పరిపా ల్యార్జితం
154 సదా ॥ నిష్కాణాం శతమాచార్య్య భోగం భుంజీత దేశికః – ఉపే–
155 క్షకేస్మి దుర్వృ త్తైప్రజ్ఞా . . భక్త . కు . . . స్తంపరిత్యజ్యసా–
156 ంతానిక మ థాపరం । ధర్మ్మ స్యైతస్య కర్త్తారస్స . తా . . హాయారక్ష
157 స్తథా ॥ సర్వ్వతీర్త్థఫలం సర్వ్వజపహోమఫలం తథా । సర్వ్వ దేవార్చ్చ–
158 నఫలం ప్రాప్నువం త్యత్ర మానవాః ॥ విరుద్ధా విఘ్నకర్త్తారః క్షేత్రద్ర–
159 వ్యాపహారిణః ॥ త్రిసప్తకులజై స్సార్ధ మన్నపానాద్యభావతః॥ దరి–
160 ద్రాః ప్రేత్య రౌద్రీశ్చ ప్రాప్యాష్టదశదుర్గ్గతీః । దుఃఖాన్యనుభవిష్యంతి
161 మహాంతీతి మహాతపాః ॥ విశ్వేశ్వరశివాచార్య్య స్సదాచారై స్తపోధ–
162 నైః । బ్రాహ్మణై ర వ్యసంఖ్యేయై ర్గ్రస్తే స్వర్భానునారవౌ । కృష్ణవేణ్యా మ్మ–
163 హానద్యాం స్నాత్వా చమ్య విధానతః । ఏవం పాపకృతాం శాపం ప్రాదా త్పుణ్యకృతా–
164 ం వరం ॥ కృత్వా కాళీశ్వరాఖ్యే పురే ఉపలమఠం పొన్నగామాగ్రహారం క్రీత్వా
165 విశ్వేశ్వరశివ ఉరుధీ ర్ద్ద త్తవా సర్వ్వసాక్షి । నిర్మ్మా య స్వాఖ్యలింగ మ్మఠమపి
166 నగరే మంద్రకూటాభిధానే మానేప ల్ల్యాట్లుపల్లిద్వయమదదత సద్వేవస–
167 త్రద్వయాయ ॥ నామ్నా స్వేన స చంద్రవల్లినగరే లింగం ప్రతిష్ఠాప్య సన్ కంచం–
168 పల్లితటాకసేతుమధికం కృత్వార్త్థ మస్మై అదాత్ । కృత్వానందపదే స్వనామనగ–
169 రం ప్రతిష్ఠాప్య చాప్యానందం మునిఖూటమవ్యథపురం దేవస్య భుక్త్యై
170 అదాత్ ॥ కొమ్మూర్మ్మగ్రామే స్వాఖ్యలింగప్రతిష్ఠాం కృత్వా త్రింశత్తారిమానాం మ–
171 హీం సః । నిమ్నక్షేత్రం పంచఖారీ మితం చ ప్రాదా ద్దేవా యోంగరంగోపభు–
172 క్త్యై శ్రీశైలేశాన్యే లీశ్వరపురి పమఠం చ షోడశావరకం । అకరో త్తచ్చిషోఽ్యదా ద్రా–
173 మం గణపతి రవాదిస్త్రత్రాయ ॥ విషయే పళ్ళినాడాఖ్యే కంద్రకోటాభిధాన–
174 కం । ఆచార్య్యదక్షిణారూపం తస్మై భక్త్యై సమార్ప్పయత్ ॥ లింగన్నినృత్తాని
175 మ్నాయ తద్వేల్లాలాంతరస్థలిం । దుద్యాలగ్రామవహ్యాం శంపూనహార్యగ్రామ–
176 మ ప్యదాత్॥ ఉత్తరసోమశిలాయాం లింగం వైశ్వేశ్వరం ప్రతిష్ఠాప్య ఐత్రపోల్నా–
177 మానం గ్రామం ప్రాదా త్సదేశికశ్రేష్ఠః ॥ సామాన్యో యం ధర్మ్మసేతు ర్నృపాణా–
178 ం కాలే కాలే పాలనీయో భవద్భిః । సర్వా నేతా న్భావినః పార్త్థివేంద్రా న్భూ–
179 యో భూయో యాచతే రామచంద్రః॥ స్వదత్తాం పరదత్తాం వా యో హ–
180 రేత వసుంధరాం । షష్టిం వరుషసహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమి–
181 ః ॥ అస్య సర్వ్వస్య ధర్మస్య పాలకస్య పదద్వయం । విశ్వేశ్వరశివాచార్యో వహత్యన్యా–
182 ం సహత్యలం ॥ మంగళమహాశ్రీశ్రీ.

శా స నా ను బ ం ధ ము

1 చిల్పి ఆచార్యుర్లు శాంతోజు కొడుకు గుడ్డోజునకు ఖ ౨ అక్కసాల ప్పైయ్య
2 పోజు కొడుకు ప్రోలోజునకు ఖ ౧ శ్రీమతు రాచగురుదేవర ఆనతిక్రమమున శ్రీమ—
3 తు కాశీశ్వరశివాఅయ్యంగరు సానిమిత్తులు పెట్టిన వైయినము ‖ ప్రోలాండిసెట్టి కుంతులు కామ్నలఅక్క—
4 సానికి ఖ ౧ తు౧౦ । నల్లదేవిసెట్టికుంతులు నలమరాసనికి ఖ ౧ తు౧౦ । సమయమంత్రి కుంతు—
5 లు విశ్వేశ్వరమాణిఖ్యానకు ఖ ౧ తు ౧౦ । ఆండరి కుంతులు గోశగిరిమాణిఖ్యానకు ఖ ౧ తు౧౦ ।
6 వీరభద్రవైయిరగి ఆండరికి ఖ౧తు ౧౦। సంకువెన్నజియ కుమ రెకు తు ౧౭ । వేమన—53
7 బోయిని కుంతులు కొమసనికి ఖ ౧ తు ౧౦ । ప్రోలబోయ కుంతులు కొమసానికి ఖ ౧ తు ౧౦ । త్రుట్ట
8 పాము కొమ్మసానికి ఖ ౧ తు ౧౦ । త్రుట్టపాము గుట్టసానికి ఖ ౧ తు ౧౦ । వెనసాని కూంతు
9 . . . సానికి వ్రిత్తి ఖ ౧ న ౧౦ । . డుపలెమల్లెని మనుమలు పాత్రలుసాని—
10 కి ఖ ౧ తు ౧౦ । సూర్య్యదేవని కూంతులు తిరుముత్తసానికి ఖ ౧ న ౧౦ । వెలంకపూండి
11 సోమనత దేవరకు ఖ ౨ ఆస్థానపతి త్రిపుర . . య పిల్లప్రదిష్ఠించిన గణేశ్వరునికి న ౩
12 శ్రీవిశ్వనతదేవరగుడి పనిచేసి కా—
13 సె అ[నో]జునకు ఖ ౧ నన్నపోజు—
14 నకు ఖ ౧ పాన్నోజునకు ఖ ౧
15 . . ంటికూంతులు మొదలమకు గోకననూం
16 . . . గోకన న ౧౦ శ్రీవిశ్వనాధదేవర
17 , . . మాందిరి కేసరి ఖ ౧ విరిగా
18 . . . . సానికి కేసరి ఖ ౧ ఆకొ

(అసంపూర్తి) (SII. 395, 396)

పిపాసువు

శ్రీమతి విజయకుమారి

దిక్కుల మొదళ్లలో
చీకటి గుబురులు జీబురు మంటున్నపుడు—
దిగంతాల వెలుపలికి పరుగులుతీసిన
వెలుగు పిల్లల అడుగుజాడల్ని
నక్షత్రాలు వెదుక్కుంటూన్నప్పుడు —
నా కన్నుల్ని చిదిమి
ఎన్ని కవితల్ని వెలిగించానని ! ?

రేయి విడిచిన కుబుసంలో
పవలు ఒదిగి ఒదిగి నిదురిస్తూన్నపుడు—
ఆవలిస్తూ ఒళ్లు విరిచే
అరణ్యాల పయ్యెదల్ని పయ్యెరలు సవరిస్తూన్నపుడు—
నా రుధిరానికి రూపుదిద్ది
ఎన్ని భావాలకు జీవం పోశానని ! ?

పర్వతాల పెదవులపై
పరచుకొన్న నిశ్శబ్దం
భూదేవి గుండెల్ని జోకొడుతున్నపుడు—
నిశాదేవి నీలి నీలి కన్నుల్లో
ప్రకృతి తూలి తూలి మురుస్తున్నప్పుడు—
నా గుండెల్ని రంగరించి
ఎన్నికలలకు రంగలద్దానని ! ?

శ్రీ జ్వాలాముఖి

సాహిత్యంలో వాస్తవికత

సాంప్రదాయికార్థాన్ని పరిగణనలోకి తీసుకున్నా సాహిత్యానికి 'హితం' అనేది ప్రధానగుణంగా వుంది. సమాజ స్వరూపం మారుతున్నకొద్దీ 'హితం' యొక్క స్వభావంకూడా మారుతూ వస్తూంది. సమాజ పరిణామక్రమాన్ని గుర్తించనివారు సాహిత్యాన్ని సమాజానికి అతీతంగా భావించి 'కళ కళకోసమే' అనే నిర్ణయానికొచ్చారు. కాని సమాజావసరం అలాంటి అతీత సాహిత్యానికి విడాకులిచ్చింది. అందువల్ల సమాజానికి సాహిత్యానికి అవినాభావ సంబంధం వుందనేది నిర్వివాదాంశం. ఈ సంబంధం కాలవాచకంగా కూడా అభివృద్ధి చెందుతూ వుంది.

సాహిత్య సామాజిక బంధాన్ని గుర్తించినవారు సాహిత్యంలో ''వాస్తవికత'' వుండాలనే అంశాన్ని ఇటీవల ఒక వాదంగా ప్రతిపాదించారు. సాహిత్యం ఊహాలోకాల్లో ఉండడానికి వీల్లేని అంశంగా రూపొందేట్టు సమాజం వేగంగా మారుతూ వచ్చింది. ఈ మార్పులో యుగధర్మం ప్రధాన విషయంగా కనబడుతుంది. ఫ్రెంచి విప్లవకాలంలో రూసో, వోల్టైర్ తదితరులు ఈ సామాజిక స్వరూప స్వభావాల్ని దృష్టిలో పెట్టుకొని 'మార్పు' ఆవశ్యకతను గుర్తించి ఆనాటి తిరుగుబాటు ధోరణులకు ఒక నిర్దుష్టతను సమకూర్చిపెట్టారు. అలాగే రష్యా విప్లవానికి అక్కడి రచయితలు పూర్వరంగాన్ని సృష్టించారు.

సమాజంలో మౌలికమైన మార్పును తీసుకరావడానికి రచయితలు అనివార్యంగా ప్రజల చింతనా ధోరణిలో ఒక మలుపును సాపేక్షకంగా సృష్టించాల్సివస్తుంది. దీన్నే 'భావవిప్లవం'అనవచ్చు. అది మార్పుకు సంబంధించిన సామాజిక విప్లవానికి నాందిలా దోహదపడుతుంది. రాజకీయ విప్లవానికి ఇరుసులా పనిచేస్తుంది. అయితే ఆలోచనే సర్వస్వమూకాదు. ఆచరణే నిర్ణాయక శక్తి. ఆలోచన, ఆచరణ విప్లవానికి రెండు చక్రాల్లాంటివి. వాటి ఇరుసులు సాహిత్యం, కళలు. నడిపే శక్తి జనశక్తి.

ఈ నేపథ్యంనుండి పరిశీలిస్తే సాహిత్యంలో 'వాస్తవికత' అనేది ఒక అవసరమైన ధోరణిగా ధృవపడగలదు. అయితే 'వాస్తవికత' అంటే ఉన్నదున్నట్టుగా చిత్రించడమే కాగలదా ? లేక ఉన్న కల్లోలంలోంచి ఒక 'విముక్తిమార్గం' నిర్దేశించాలా ? ఈ విషయంలో మత భేదాలున్నాయి.

కొందరు సాహితీవేత్తలు ఊహాలోకాల్నుండి ఇంకా దిగి రాదలచారు. వారిని సమాజం పట్టించుకోదు. కొందరు 'వాహ్వా' అనవచ్చు. వారు పాలకవర్గంవారి నిలయవిద్వాంసులు. ఇలాంటివారు సాహిత్యాన్ని ఆనందంమట్టుకే కుదించివేసినా వారూహించే ఆనందమాత్రం 'కాగితప్పూల' సౌందర్యంలాంటిదేనని వేరే చెప్పనక్కరలేదు.

కొందరు మారుతూన్న పరిస్థితుల్ని గుర్తించి సమాజంలో కనిపించిన అంశాల్ని యథాతథంగా మాత్రమే సృష్టించి చేతులు దులుపుకుంటారు. ఈ 'చిత్రీకరణవాదం' ఒకమేరకు సరిగా తోచినా ఇది ప్రస్తుతాంశాన్ని కూలంకషంగా చర్చించకపోవడంవల్ల ఫలితంలో వచ్చే అన్నిరకాల అనర్థాలకు, కొనసాగే దుర్మార్గాలకు పరోక్షంగా సమ్మతిని తెలియజేసేదిగా వుండిపోగలదు. ఈ వాస్తవికత లోతుపాతుల్లోకి వెళ్లని 'దృశ్యీకరణ' మాత్రమే. ఈ దృశ్యీకరణలోకూడా రచయితకు చారిత్రక పరిజ్ఞానం లోపిస్తే అతని రచనలు పాక్షికసత్యాలుగానే పరిఢవిల్లుతాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గళమెత్తి పాడినవారు ఆనాటి యుగధర్మాన్ని రచనల్లో ప్రతిబింబించినా ఎలాంటి స్వాతంత్ర్యం రూపొందాలనే విషయంలో నిర్లిప్తులుగా వుండిపోవడంవల్ల వారు సమగ్రమైన జాతి రచయితలు కాలేకపోయారు. ఇటీవలి వేర్పాటు ఉద్యమాలకాలంలో ఈ బాపతు రచయితలు రాజకీయనాయకులకన్నా చాల పొరపాట్లుచేశారు.

'వాస్తవికత'కు సంబంధించిన అవగాహన సరిగా లేకపోవడంవల్ల, కనిపించిన అంశాన్నే చిత్రిస్తే చాలు అనుకోవడంవల్ల, పరిష్కారంచూపే బాధ్యత తమది కాదనుకోవడంవల్ల రచయిత పాత్ర భూత భవిష్యత్ వర్తమాన కాలాల్లో ఏదో ఒక కాలానికే నిలిచిపోవడం జరుగుతూవుంది. రచయిత త్రికాలవేది. క్రాంతదర్శి. జరిగిన అనర్థాల్ని శాస్త్రీయంగా వివేచించడం, నడుస్తూన్న చరిత్రను హేతుబద్ధంగా తిప్పడం, రాబోయే సమాజాన్ని జనపథంగా అక్షరీకరించడం రచయిత, కవి చేయాల్సిన వైతాళిక ధర్మం. ఈ నైతిక బాధ్యతను కావాలని తృణీకరించే అహంభావుకుల్ని, సౌందర్యోపాసకుల్ని సమాజమే కాలగర్భంలో కలిపివేయ గలదు. చిత్రకారుల్లో పికాసోకున్న స్థానం డాలీకి లేదు. అద్భుతాలు 'రూప' చమత్కారాలు శిరః కంపాలకే పర్యవస్తం. వస్తువుకు రూపానికి వైరుధ్యాన్ని సృష్టిస్తే ప్రయోజనమే నశించిపోగలదు.

ఆధునికుల్లో వాస్తవికతా ధోరణి మరోరకంగా అభివృద్ధి చెందుతూ వుంది. సమాజంలో కనిపించే దృశ్యాన్ని చిత్రిస్తున్నారు రచయితలు. ఆయా పాత్రల్ని వారి జీవన ధర్మాన్ని వారి భాషగా 'రూపం' (form) లో అద్భుతంగా చిత్రిస్తున్నారు. ఒక బిచ్చగాడు వాడి మాండలికంలో చింపుల్లో కనబడతాడు. మోసం చేస్తాడు. గుడ్డివాడవుతాడు, లేదా గుడ్డివాడుగా వుంటే తోటి

గుడ్డివాళ్ళ సాయంతో కళ్ళు నయంచేసుకొని తోటి గుడ్డివాళ్ళను తిరిగి మోసంచేయడానికి పూనుకుంటాడు. ఇది గొల్లపూడి మారుతీరావుగారి ''కళ్ళు'' నాటక సారాంశం. సహజంగా బిచ్చగాళ్ళ గుంపులో కనిపించే భాషను ఆధారం చేసుకొని 'యాచకో యాచకశత్రు' అనే ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక 'వాస్తవిక' దృశ్యంగా చిత్రించారు నాటక రచయిత. 'Face value' మీద స్థిరమైన నిర్ణయాలకు రావడం, ప్రేక్షకుల్ని ఒక నిర్ణయానికి నెట్టడం ఎంతవరకు 'వాస్తవికత' కాగలదు? అనేది నిలుచున్న ప్రశ్న.

సమాజ స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సమాజ స్వరూపంలోని ఒక దృశ్యాన్ని పనితనంగా చిత్రించి చదువరుల్ని, ప్రేక్షకుల్ని ఒక అభిప్రాయానికి వచ్చేట్టు చేయడం రచయిత యొక్క అసమగ్ర దృష్టికోణమే కాగలదు వెలితిపడ్డ వాస్తవికత యొక్క వికృత రూపంగానే ఆ సాహిత్య కళాఖండం ఉండిపోగలదు. సమాజంలో కనిపించే ఏ దృశ్యమూ సమాజ స్వభావానికి భిన్నంగా వుండజాలదు. సమాజంలో ఈనాడు రాజ్యంచేస్తున్న ప్రధానాంశం ''శ్రమ దోపిడి''. దాని ప్రాబల్యంలోనే సమాజం ఊపిరి పీలుస్తున్నది. దీని ప్రభావం సమాజంలోని అన్ని రంగాలమీదా తప్పనిసరిగా వుండగలదు. మౌలికమైన సమాజ స్వభావాన్ని పరిశీలించకుండా దానికి సంబంధించిన పాత్రను ప్రవేశపెట్టకుండా కనీసం సూచన చేయకుండా ''కళ్ళు'' నాటకంలోలాగే చిత్రిస్తే చివరకు ప్రేక్షకుల్లో, లేక చదువరుల్లో కలిగే అభిప్రాయం, బిచ్చగాళ్ళు చాల మోసగాళ్ళుని, తోటివాళ్ళనుకూడా మోసగించడానికి వెనుదీయని కిరాతకులని ధృవపడగలదు. ఇక్కడరచయిత ఒక వస్తువు ఉపరితలాన్నే స్వీకరించాడు కాని దాని వర్గపునాదిని స్వీకరించలేదు. బిచ్చగాళ్ళలోనే మోసంలేదు; వాళ్ళనలా దిగజార్చిన సమాజం దోపిడీగాళ్ళలోనే మోసం మూర్తీభవించివుంది. అదే బిచ్చగాళ్ళ దాకా పాకింది. ఈ సామాజిక వివేచనను రచయిత గుర్తించకుంటే, తాను జన్మించిన స్థానే సామాజిక వాస్తవాన్ని భూస్థాపితం చేసేవాడు కాగలడు.

అందువల్ల వాస్తవికత నాశ్రయించేవారు సామాజిక వాస్తవికతను కూడా పరిశోధించాల్సి వుంటుంది. సమాజిక ఉత్పత్తి శక్తుల్ని స్వాధీనం చేసుకున్నవారు సామాజిక చింతనాధోరణిని కూడ తమ కనుగుణంగా మార్చివేసుకుంటారు. ఈ కుట్రలో రచయిత, కవి, కళాకారుడు పడిపోకుండా జాగ్రత్తపడాలి. ఇక్కడ వ్యక్తిగత ఇష్టానిష్టాల ప్రమేయం ఉండరాదు.

కొందరు, 'జీవన వాస్తవికత'ను రచయితలు చిత్రిస్తేచాలు అని కూడా వాదిస్తూ వుంటారు. ఈనాడు జీవితం ఎలా వుందో, ఎన్ని రాగద్వేషాల కూడలిగా వుందో చూపెడితే చాలు మిగతా పరిష్కారం, లేదా మార్గాన్వేషణ అనవసరం అనే నిర్ణయానికి కూడా వస్తున్నారు. పాత్రానుగుణమైన అద్భుతమైన చిత్రీకరణ వుంటే చాలు అని కూడా నిర్ధారించుకుంటారు. సమాజంలో శ్రమదోపిడి కొనసాగినంతకాలం, ప్రతి దయనీయమైన పాత్ర కూడ దోపిడికి గురవుతూకూడా దోపిడీ అంతర్భాగంగానే కనిపించగలదు. ఈనాడు సంచలనాత్మకమైన చర్చకు దారి తీయించబడిన రాచకొండ విశ్వనాధ శాస్త్రిగారి ''రత్తాలు-రాంబాబు'' నవల్లో, సామాజిక, శ్రమ దోపిడీ, క్రూరానికి బలైన వేశ్యలు దోపిడీచేసే పాత్రలుగానే మాండలికం పలుకుతారు. ఇక్కడ ''రూపం'' (Form) రాజ్యంచేస్తుంది. ''వస్తువు'' (Coutcut) రూప హావ భావాల్లో తప్పిపోతుంది. అందుకే ఓమారు చైనా రచయిత లూసన్ ఇలా హెచ్చరించాడు: ''శబ్దమయ ప్రపంచంలో రచయిత తన్ను తాను పోగొట్టుకోరాదు'' — అని.

చైతన్యం వున్న రచయిత రాచకొండ కాబట్టి క్వాచిత్కంగా అక్కడక్కడా చైతన్యం లెక్చర్లు తీర్చించినా అవి 'వస్తువు'ను అభివృద్ధిచేసే అంశాలుగాకాక, రూపాన్ని తీర్చిదిద్దే స్పోటుడర్లుగా కనిపిస్తాయి. కాకపోతే లంపన్ పాత్రల్లాంటివారు కూడా [హెడ్డు కానిస్టేబుల్, కంపెనీల బ్రోకర్ సింహాచలం] వర్గచైతన్యం ప్రసంగాలు చేసేవారు కారు. సామాజిక వాస్తవికతను చిత్రించే రచయితలు సమాజంలో సహజంగా కనిపించే సంఘర్షణను, ప్రతిఘటనను ప్రధానాంశంగా పోషించ నిరాకరించడంవల్లనే వారెన్నుకున్న 'జీవిత వాస్తవికత' గల్లంతైపోవడం తటస్థిస్తూ వుంది.

సమాజ వాస్తవికత, జీవన వాస్తవికత, రెండూ బొమ్మ బొరుసు లాంటివే. సమాజ వాస్తవికత లేంది జీవన వాస్తవికత లేదు. జీవన వాస్తవికత (సరైన అర్థంలో) లేనిది సమాజ వాస్తవికత లేదు. అందువల్ల సాహిత్యంలో ప్రతిబింబించే వాస్తవికతలో, సమాజానికి, జీవితానికి సమానమైన స్థానం ఉండాలి.

అలాగే సమాజంలో ప్రతి జీవీ, మనుగడకోసం పరిసరాలతో సంఘర్షిస్తూనే వున్నాడు. సంఘర్షణ జీవన వాస్తవికత. దీన్ని 'రూపం' గురించో, 'వస్తువు' గురించో కప్పివేయాలని, వదిలివేయాలని, చూసే రచయిత లందరూ ఊహా ప్రపంచంలో వున్నట్లే లెక్క.

అన్యాయాన్ని, అక్రమాన్ని, దోపిడీని, ప్రతిఘటించడం అనాదిగా వస్తూవున్న చరిత్ర పాఠం. సాహిత్యానికిది సత్యదూర విషయంకాదు. కిరాతకుని వేటను వద్దన్న వాల్మీకి ''మానిషాద''లో అన్యాయ ప్రతిఘటన వుంది. మహాభారతమంతా న్యాయాన్యాయాల సంఘర్షణే. [ఏది ఏ మేరకు న్యాయమనేది సమాజ స్వరూపాన్ని బట్టి నిర్ణయించాల్సి వుంటుంది] సాహిత్యంయొక్క పరమాశయం కూడా హితమే. ఆ హితం కూడా అన్యాయాన్ని నిర్జించినపుడే సాధ్యం కాగలదు.

ఈనాటి ప్రపంచ స్వభావాన్ని పరిశీలించినా ప్రతిచోటా ఈ సంఘర్షణ, ప్రతిఘటనా, బహుముఖంగా కనబడుతూనే వుంది. ఇది విప్లవ దశ.

> ''దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నాయి
> జాతులు విముక్తిని కోరుతున్నాయి
> ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు'' — మావో

ఈ అభిప్రాయంతో ఏకీభవించడం ఏకీభవించకపోవడం వేరే విషయం. కాని ప్రపంచ పటంలో నిత్యం కనబడుతూన్న సత్యం మాత్రం ఇదే. వర్ధమాన దేశాలు అగ్రరాజ్యాల ప్రాబల్యం (దోపిడీకి మారు పేరు) నుండి బైటపడాలని పెనుగులాడుతున్నాయి. ఇలా పెనుగులాడే వర్ధమాన దేశాల ప్రభుత్వాలు సంపూర్ణ జీవితాన్ని కోరే ప్రజల్ని మాత్రం అణచివేస్తూనే వున్నాయి. అయినా ప్రజలు విప్లవోన్ముఖంగా పయనిస్తున్నారు. ఇది సహజమైన, సత్యమైన నిత్య దృశ్యం.

ఈ కనిపించే వాస్తవాన్ని నిరాకరిస్తే రచయిత ఎన్ని అద్భుతాలు రాసినా మిగిలేది తన కోసమే. జనం కోసంకాదు. రచయితకు, ముఖ్యంగా వర్ధమాన దేశాల రచయితకు, సరైన అవగాహన చాల అవసరం. అవగాహన పాలకవర్గం వార్తల అద్భుతం మేరకు గాక, శాస్త్రీయ వివేచనాజ్ఞానం మేరకు, జన జీవనసంఘర్షణా సత్యంగా వర్ధిల్లాలి.

సాహిత్యానికి ఈనాడు కావలసింది—సోషలిస్టు వాస్తవికత. సమాజంలో ఒక వర్గమే సుఖంగా వుండాలనే శ్రమ దోపిడీ దుర్మార్గంనుండి బయటపడి, సమాజంలో అన్నివర్గాలు బాగుపడాలి. వర్గాలు నశించాలి. దోపిడి కొనసాగినంతకాలం, మానవ సంబంధాలుకూడా విషాక్తం కాగలవు. వాటిని ఏ మతమూ, ఏ బాబా ఏ అమ్మ రక్షించజాలవు. ఈ రంగుల వలలాంటి సాలెగూడులో రచయిత భ్రాంతిలో పడకుండా రోజూ కనిపించే ప్రతిఘటననూ అభివృద్ధిచేసి, సమాజ ప్రతిఘటనోద్యమంలో విలీనంచేసి విముక్తి ఆదర్శాన్ని, విప్లవయుగ ధర్మాన్ని సాక్షాత్కరింపజేయాలి తన సాహిత్య సృష్టిలో.

ఇటీవల 'అర్నాద్' గారి 'చీకటోళ్ళు' నవల (స్వాతి బహుమతి) గుడిసెలవాళ్ళ జీవన వాస్తవికతను చిత్రించింది (రావిశాస్త్రీయంగా) ఒక నిత్యకూలి కూతురు పోలీసువాడి మిలట్రీ కొడుకును పెళ్ళాడి 'నిప్పు'లా బతకపోయి మామ దురంతాలకు తాళలేక, సమ్మె కాల్పుల్లో చనిపోయిన తండ్రి కుటుంబాన్ని ఆదుకోవడానికి చేరి, భర్త నిరాదరణకురోసి, అతణ్ణి వదిలి, కుటుంబాన్ని, ఆదుకుంటూన్న కార్మిక నాయకుణ్ణి (నూకరాజు) అనుకోకుండా ప్రేమించి, బతుకు గడువకపోవడంవల్ల, కార్మిక నాయకుడు భిలాయ్ వెళ్ళడంవల్ల, చెల్లెళ్ళని, తమ్ముళ్ళని పోషించడానికి లాడ్జింగ్‌లో బుక్కై, వేశ్యగా పట్టుబడుతుంది. జామీను ఇచ్చి కార్మిక నాయకుడు విడిపిస్తాడు. పెళ్ళి చేసుకుంటానంటాడు. తను చెడినందువల్ల పెళ్ళి చేసుకోనని చెప్పేసి, నిప్పుశీలం నవ్వులపాలైనందుకు, తల్లి, గూడెంవాళ్ళు నిందిస్తుంటే తన దైన్యానికి సమాజం కారణమని, సమాజం మారితేకాని ఇలాంటి దైన్యాలు, నైచ్యాలు పోజాలవని ఉపన్యాసం చెబుతుంది. బాగానే అనిపిస్తుంది.

కథానాయిక దుర్భర జీవన వాస్తవికతలో సమాజ వాస్తవికతలా వచ్చిన కార్మిక నాయకుడు తన సహజమైన శీలం సెంటిమెంట్లులేని సోషలిస్టు వాస్తవికతను నిర్వర్తించే ప్రధానమైన కర్తవ్యంనుంచి అతణ్ణి తప్పించి లక్ష్యాన్ని కుంచించి వేస్తాడు రచయిత. ఎక్కడా వర్గచైతన్యం కనిపించని కథానాయిక అకస్మాత్తుగా 'సమాజం మారాలని' ఉపన్యాసం చేస్తుంది. (మనుషులు మారాలి సినిమాలా) నిజమే. జీవిత గుణపాఠంగా ఆమె ఆ నిర్ణయానికి వచ్చిందనుకుందాం. ఆ నిర్ణయం 'మడి' కాదుకదా! మరీ ముఖ్యంగా కార్మిక నాయకుడు చొరవ తీసుకొని చెడిన స్త్రీగా భావింపబడుతూన్న కథానాయికను వివాహమాడితే సోషలిస్టు ప్రయాణక్రమంలో పతితల పరించిన చెడు అభిప్రాయం కూడా మారిపోగలదు. వారి సానుభూతీ లభించగలదు. ఉద్ధరణ అన్ని జీవితరంగాల్లో సమగ్రంగా కనిపించాలి. లేకుంటే మార్పుకర్థంలేదు.

అన్యాయాలు ప్రతిఘటించే పాత్రలు కూడా సమాజ వైరుధ్యాల వాస్తవ ప్రతిబింబాలుగా వుంటూ నిత్య సంఘర్షణా సత్యాలుగా అభివృద్ధి చెందాలి. రచయితకున్న సెంటిమెంట్లను పాత్రల కంటగట్టి రచనాలక్ష్యాన్ని తారుమారు చేయరాము.

సాహిత్యానికి వాస్తవికత వుండాలనేది తప్పనిసరి. అది జీవితానికి దగ్గరగా వుండాలి. ఆ జీవితం కూడా సమాజ జీవితానికి భాష్యకారునిలా, ద్వంద్వాలమధ్య రాజీలేని పోరాట వీరునిలా ప్రతిబింబించాలి. చాలకాలంనుండి వస్తూన్న శీలం, స్నేహం, ప్రేమ, ఔదార్యం, దానం, సహజీవనం, త్యాగం, సాహసం మున్నగు మానవతా గుణశీల క్రొత్త కోణంనుండి చూపే సోషలిస్టు వాస్తవికతలా అభివృద్ధి చేయాలి. సహజంగానే ఈ సృష్టిలో, వైపరీత్యాలకు తావుండకపోదు. దాశరథి రంగాచార్యులగారి 'జనపదం' నవలలో మితవాద వైపరీత్యంనుండి, ప్రయాణం అతివాద వైపరీత్యం వరకూ కొనసాగుతుంది. పోరాటం చేస్తున్న విప్లవకారుడు తప్పించుకోవడానికి అవకాశం వున్నా అర్థం పర్థం లేకుండా తెచ్చిపెట్టుకున్న వీరమరణానికే అసహజంగ ఆహ్వానం పలుకుతాడు. విప్లవమంటే 'అనాలోచిత చర్య' అనే భావన వస్తుంది చదువరుల్లో. ఇది స్వవచన విఘాతం.

అన్యాయాన్ని ప్రతిఘటించే క్రమంలో సాహిత్య పాత్రలు సమాజ వైరుధ్యాల్ని ఎలా విస్మరించరాదో అలాగే అన్యాయ ప్రతిఘటనకు కావాల్సిన అనంతమైన సమిష్టి నిర్మాణకృషిని కూడా నిర్లక్ష్యం చేయరాదు. ఈ జాగరూకత గోర్కీ ''అమ్మ''లో అడుగడుగునా ప్రతిఫలిస్తూ వుంటూంది. కారణం ''సమాజం మహాత్ముల మంచికోరికలవల్ల ఎలా మారదో, అలాగే కొందరి వీరుల సాహస కృత్యాలవల్ల కూడా మారదు.'' అది సమిష్టి పోరాటం. దానికి నిర్మాణం ప్రధానం. ఈ సత్యం నేటి మార్పుకోరే సాహిత్యంలో ప్రతిబింబించాలి. అతిమిత సెంటిమెంట్ల వాదాలకు తావీయకుండా సాహిత్య సృష్టి సోషలిస్టు వాస్తవికత లక్ష్యంగా అభివృద్ధి చెందాలి. సమాజం కూడా సోషలిజాన్నే కోరుతూంది కాబట్టి ఈ బాధ్యత రచయిత నైతిక బాధ్యత.

హేమంతరాత్రిలో దారితప్పిన వసంతం

శ్రీ సోమసుందర్

నిన్న రాలిన జాజిపూలతో
  నేటి పవనం పరిమళంబై
తొగరు గుండెల మీటివటు
ఏ గతపు పాటలో మేల్కొనున్ !

    ఓ వసంత మధూత్సవమ్మా
    ఎచట దారిని తప్పినావే ?
    చెంగలించే శీతగాలుల
    వాతలకు తలఒగ్గినావే !

మరచుటెట్లో ? నిన్న వేకువ
అంతటా వాసంతహాసమె !
అంతటా సంగీత రవమే
వనప్రియ ఆమెతలు పంచెను...

    ఏటి కద్దరి తోటలో ఒక
    పాట మెల్లన సోకినట్లుగ
    రేయి దవ్వుల నేవో గుసగుస
    బాసలై వినిపించునామది !

వానజల్లుల దీనరుతములు
తలుపులను తెగభాదినప్పుడు
దూర భూరేఖలను మెరిసే
దీనగాథలు మొరసినప్పుడు —

    నీలి నీలిమ నింగిపాత్రల
    వొంపి పుడమికి దప్పితీర్చగ
    నిన్నరాత్రి నిరాశ బెంగలు
    కలల కలచిన వెందుకో !

ఇంత విస్మృతజగతి—రేయిని
ఇంత కురచై తరిగి మదిలో
వాన చినుకుల చెడిన బ్రతుకుల
లెక్కపెట్టుము దిగులుతో !

    ఇంతలో ఎటు దాపురించెను
    శీత భీతావహపు రాతిరి ?
    కొరడుకట్టె మంచుజడిలో
    గుండెచప్పుళ్లటుకు పోయెను ?

తలుపులన్నీ బిగిసికొను
హేమంతరాత్రి శీతధాత్రిని
ముసరుకొను నీరవ భయానక
వేళ నామని కొసరగా !

    ఇప్పుడే హేమంత రాత్రిని
    ఇక్కడే వణికించు చలిలో
    తోలు ఒలిచిన భీతస్వప్నం
    వ్రేలు మది మొగసాల చూరుల !

దారి తప్పిన అడుగులేవో
నగ్న నృత్యము సలుపుచున్నవి
మంచు చిమకులు ఆకుకొసలను
జీవహరితం పీల్చు చున్నవి !

    కడలి వరకొక్కటే చలితము
    పుడమి చివరల మణగె చలనము
    గుండెమ్రోతల విడిసి హిమ రా
    క్షసము కలలను చెరల పట్టెను !

గరిక పచ్చని నేల కలలకు
నేటికీ శివజ్వరము పట్టెను !
గాలి ముసుగులలోని చిర్నగ
వాగురుచుట వినిపించు చుండెన

కరువువలె, దారిద్ర్యరాక్షసి
అనుపమడమల బరువువలె
వాకిటను గాలించ వచ్చిన
తెగ బలిసె నీ చలి!

వన్యమృగముల చర్మములతో
చలిని బాసిన పూర్వమానిసి
మెరయు కిరణోజ్జ్వల పతాక
గుండెలర్పణ చేసినప్పుడు ...

నరుల హృదయ గవాక్షరేఖల
మెరయురోచులు కర్మసాక్షిగ
ఆవహించిన ఆశగా, మధురాం
నయనాల నిలచెను !

అర్ధరాత్రి తిమిరగర్భము
చీలినట్లొక సూలరేగగ ...
కడలి కెరటా లడుగు పారలీ
వెలుగు పిండులు కదల బారగ ...

ఈ నిశాంత ధ్వాంత మూకలే
పరుగులో ఎటుపోవుచున్నది ?
చలిని సందిటపట్టి చీకటి
పరుగు పరుగున వెడలినట్లుగ

రాత్రి రాలిన హిమసమూహము
జీవ చైతన్యోత్సవముగా
కదలబారెను; కడల బర్వెను
ఒక నవీన వసంతహాసము !

అంతటా ఒక అట్టహాసము
అలజడించిన ఎదల తొందర,
సిగ్గుతెర తొలగింది పుడమికి
మెలకువల కొన మెరిసినట్లుగ !

గాలి ఒక నిట్టూర్పు విడిచెను
తూర్పు వెచ్చని శ్వాస పీల్చెను
శీతు బంధన తెగివ స్వేచ్ఛా
గాన మెగసెను ధాత్రిపై !

ప్రాంత హంతకి అంతరించెను
శిశిర శిర మది ప్రయ్యోలాయెను
రక్తకుసుమోత్కరముగా
నవ వసంతము పొదులమీటెను !

సర్వథా వాసంత హాసమె
సర్వదా మధుమాస గానమె
సర్వ పర్వముగా నవోత్సవ
నవకేతన లాస్యమే !

జీవ చైతన్యోత్సవములో
స్నాతమై ప్రేమైక హృదయము
మేర ఎరుగని వెన్నెలల బం
గారు బయళుల సోలెనో ?

మిధునముల ఎద మరగు మధురిమ
స్వప్న సాక్షాత్కార సీమల
నిలుపవలెరా ! తరుగరాని
సుధా తరంగముగా !!

ఈ వసంతోత్సవము నిట్లే
భద్రపరచుక సాగవలెరా !
కొండ కోనల దొంగ చీకటి
చటుల బలగము నడ్డవలెరా

ఈ చిరంతన జీవయాత్రను
చేరవలె సాహస్రయోజన
దూరగమ్యము; రసానందపు
హర్మ్య విజయముకై !

సాగిరండో భ్రాతలారా
తెలుగు కలువల కన్నులారా !
ఇదే ఆమని కాముపున్నమి
అందరికి అందన్ !

[ప్రపంచ తెలుగు మహా సభలకు రాసినది.]

చిక్కని చీకటిలో చక్కని చంద్రుడు

పడమట పొద్దువాలి పోవడం చూచి బస్సుదిగిన బాబూరావు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. తాను ఊరు చేరాలంటే ఇంకా రెండు మైళ్లు నడవాలి. సూర్యునితో పరుగుపోటీ పెట్టుకుని ఒగురుస్తూ కాలు చాచి నడక సాగించాడు. అయినా ఓటమి తప్పలేదు. మసక చీకటి ముసురుకుంటోంది.

కారు చీకటి, ఊరకుక్కలు తనకు స్వాగతం చెబుతాయేమో ననుకుంటూ ముందడుగు వేశాడు.

దూరాన చిక్కని చీకటిలో చక్కని చంద్రుడు తళుక్కున మెరిశాడు. అది ఆకాశపు మెరుపేమోననుకున్నాడు. కొంతసేపటికి వెలుగు వెల్లువ వెదజల్లుతూ దీపాలతోరణాలు స్వాగతం చెప్పడంతో బాబూరావు ఆశ్చర్యంతో తబ్బిబ్బైనాడు. ఆయన స్వగ్రామం విడిచి వెళ్ళి నాలుగేండ్లు కావచ్చిందిగదా.

ఆ ఊరేకాదు ఆంధ్రప్రదేశ్‌లో యీనాడు **27,221** గ్రామాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. కొత్తగూడెం విద్యుచ్ఛక్తి కేంద్రం **110** మెగావాట్లు మొదటి యూనిటు యిటీవల పని ప్రారంభించడంతో మన రాష్ట్రం విద్యుదుత్పాదనశక్తి యిప్పుడు **1228** మెగావాట్లకు పెరిగింది.

నాగార్జున, శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి పథకాల అమలుకు సౌదీ అరేబియా నుండి ఆర్థిక సహాయం లభిస్తోంది.

డైరెక్టర్, సమాచార పౌరసంబంధశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.

14/77-78

శ్రీ ఇస్మాయిల్

సదా బాలకుడు టాగోర్

టాగోర్‌ని మనిషిగా, కవిగా అర్థం చేసికోదలచిన వాళ్లకి సరైన 'క్లూ' అతని బాల్యంలోనే దొరుకుతుందని నా అభిప్రాయం. టాగోర్ చిన్నప్పుడు కాస్త ఒంటెత్తుగానే పెరిగాడు. పెద్దవాళ్ళు పిల్లల్ని ఆట్టే చేరదీసేవాళ్లు కాదు. పెద్దల మాటల్లోకి పిల్లల్ని చొరనిచ్చే వాళ్లు కాదు. ఇంటో సంగీతసభలు జరిగినా, 'జాత్ర'వాళ్ళు నాటకాలాడినా పిల్లలకు ప్రవేశముండేది కాదు. దూరాన వరండాలో నిలబడి చెవులు నిక్కించి వింటే వాళ్లరాగాలూ, కథానాయకి రోదనలూ వినిపిస్తుండేవి. టాగోర్ తండ్రి దేవేంద్రనాథ్ టాగోర్ 'మహర్షి'. పిల్లల శిక్షణ గురించి ఆయనకు చాలా పట్టుదలలున్నాయి. పిల్లలకి ఎక్కువగా ఆటవస్తువులిస్తే వారి భావనాశక్తి సరైన అభ్యాసం దొరక్క కుంటుపడుతుందనీ, సృజన క్రియవల్ల లభించే ఆనందాన్ని వాళ్లు కోల్పోతారనీ ఆయనఅభిప్రాయం. కనక, టాగోర్ తన ఆటపాటల్ని తనే సృష్టించుకోవలసివచ్చింది. అతని భావనాశక్తికి పసితనంలోనే మంచి దోహదం జరిగింది.

వాళ్లింటో నాయనమ్మగారి పాత మేనా ఒకటుండేది. పాత జమీందారీ రోజుల్లో భారీగా, హుందాగా తయారుచేయించింది. ఒక్కొక్క కొమ్ముకు ఎనిమిదేసిమంది కాస్తేకాని లేవదు అందులో తలుపులేసుకు కూచుని మహా మహా సాహసకథలు అల్లుకునేవాడు. మేనాలో తనతల్లి కూచునుంది. మహా కీకారణ్యంలోంచి అపరరాత్రి వేళ ప్రయాణం చేస్తున్నారు. తను గుర్రంమీద అనుసరిస్తున్నాడు. నల్లటిపొదల్లో ఎర్రటికళ్లు నిప్పుకణికల్లా మెరిసాయి. గాండ్రుమంది పులి. బోయీలు మేనా విడిచి 'బాబోయ్' అంటూ పారిపోయారు. తను చెక్కుచెదరకుండా తుపాకీ తీసి ఒక్కటే వేటు. 'ఢా'మ్మనగానే పులి నేలకొరిగింది. తను అమ్మకేసి చూసి 'అమ్మా! నీకేం భయంలేదు' అన్నాడు. అమ్మ తనకేసి గర్వంగా చూసింది. ఇదో కథ. మరోకథలో మేనా ఓడగా మారింది. చుక్కానివద్ద అబ్దుల్లా నిలబడి ఉన్నాడు. సూది గడ్డమూ, బోడి గుండూ వాడూ. అబ్దుల్లాని తనెరుగును. రెండో అన్నయ్యకి హిల్సా చేపలూ, పీతగుడ్లూ తెచ్చిపెట్టే బెస్తవాడు. 'కథచెప్పమని అబ్దుల్లాని ఓసారి అడిగాడు. చైత్రంలో ఓమాటు చేపలవేటకి వెళ్ళాట్ట అబ్దుల్లా. ఇంతలో అకస్మాత్తుగా ఒక బ్రహ్మాండమైన తుపాను లేచి, బోటు తలకిందులైంది. అమట్టని బోటు తాడు నోట కరుచుకుని పెద్ద పెద్ద బారలేసుకుంటో ఈదుకుని బోటుని ఒడ్డుకి చేర్చాను, అన్నాడు అబ్దుల్లా. 'అప్పుడేమైంది?' అన్నాడు టాగోర్. అంతే. ఏమీ కాలేదు! ఛా, ఇదేం కథ! కనీసం బోటు మునిగితేనే కాని కథకాదని అప్పటికే టాగోర్‌కి తెలుసు. అప్పుడు టాగోర్‌కి ఆరేళ్లు.

టాగోర్ ఎంత ఒంటెత్తుగా పెరిగాడో తనచుట్టూ ఉన్న ప్రపంచమంటే అంత ఆసక్తికూడా కనపర్చాడు. ఆసక్తి అంటే ఇంతా అంతా కాదు. తన దృష్టి పరిధిలోకి వచ్చిన వ్యక్తుల్నీ ఘటనల్నీ సూక్ష్మంగా పరిశీలించేవాడు. జోరాసంకో అనే కలకత్తా పేటలో టాగోర్ భవంతి ఉండేది. చుట్టూ కిక్కిరిసిపోయి బీద కొంపలూ, గేటుకవతల టోంగాలతో, జనసమ్మర్దంతో చిత్‌పూర్ రోడ్డు. పిల్లలు తమ గదులుదాటి అవతల అడుగు పెట్టటానికి వీల్లేదు. మేడ వరండాలో నిలబడి రోడ్డున పోయే జనాన్నీ, పెరటి చెరువులో స్నానానికి వచ్చేవాళ్లనీ గమనిస్తుండేవాడు. స్నానం చేసే వాళ్లకి ఒక్కొక్కళ్లకో పద్ధతి. ముసలినౌకరు బ్రజేశ్వర్ స్నానమయాక ఎక్కడ మైలపడిపోతాడోనని భయపడుతూ, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, నీళ్ళు జల్లుకుంటూ ఇంటోకి వచ్చేవాడు. వరండాలో టైలరు నియామత్ కుట్టుమిషను ఆడిస్తుండేవాడు ఎంత అదృష్టవంతుడు వీడు! తనను మిషను ముట్టనైనా ముట్టనివ్వరే? ముంగిట్లో దర్వాను చంద్రభాన్ కర్రనువ్వెనతో గడ్డాన్ని రెండుపాయలుగా దువ్వి, చెవులపై చుట్టేవాడు ఇహ, పై డాబామీదికి వెడితే చుట్టూరా ఇళ్ళూ, జనం కనిపించేవారు. పక్కింటావిడ స్నానంచేసి తలారబోసుకుంటోంది. ఆవిడ అమ్మాయిలిద్దరూ ఆడుకుంటున్నారు. ఎంత అదృష్టవంతు లీ ఆడపిల్లలు! ఎంచక్కా బడికి వెళ్లఖర్లేదు. (ఆ రోజుల్లో ఆడపిల్లల్ని బడికి పంపించేవాళ్ళు కాదు.) ఆడపిల్లనై పుట్టినా బాగుణ్ణు!

ఈ పరస్పర వ్యతిరేక వైఖరులు—ఒంటెత్తు తనమూ, బహిఃప్రపంచం యెడల ఆసక్తి — అంతర్ముఖతా, బహిర్ముఖతా — టాగోర్ జీవితంనిండా పెనవేసుకుని ఉన్నాయి. వీటి బీజారోపణ బాల్యంలోనే జరిగింది. ఇవే కాదు. మరికొన్ని అంకురాలు కూడా చిన్నప్పుడే మొలకెత్తాయి. అపారమైన సౌందర్య ప్రేమ. సౌందర్యాన్ని ఇంతలా ఆరాధించిన కవి మరొకడు కనిపించడు. పొద్దున లేవగానే తోటలోకి పరిగెత్తేవాడు, పరిమళాల్లోకీ, రంగుల్లోకీ. అంత చిన్నతనంలోనే వర్షమంటే అతనికి ప్రాణం. వర్షాకాలపు సౌందర్యాన్ని ఇంత హృద్యంగా వర్ణించినవాళ్ళు అరుదు. ఇతని వర్షాప్రియతకీ, కవిత్వప్రియతకీ ఒకేసారి అంకురార్పణ జరిగినట్టు తోస్తుంది. ఇతని బెంగాలీ బాలశిక్షలోని రెండు చిన్నిపాటలు వర్షమన్నా, లయఅన్నా ఇతనికున్న ఆకర్షణని స్ఫురింపచేసినట్టు కనిపిస్తుంది. వీటిని ఇతను జీవితాంతంవరకు మరిచిపోలేదు. **'The rain patters, the leaf Quivers'**అని ఒకటి. రెండోది, **'The rain fallsPit-a-pat, Pit-a-pat,the tide comes up the river.'** అప్పుడే విశ్వరహస్యాలకేసి ఇతనిదృష్టిమళ్లింది. పందిరి గుంజలు

పాతటానికి పెరట్లో గుంటలు తవ్వుతుంటే, అయ్యో, ఇంకాస్త లోతుగా తవ్వితే బాగుణ్ణు, విచిత్రాలెన్నో బైటపడేవికదా అనుకునే వాడు. అపర మధ్యాహ్నవేళలంటే ఒకటి, టాగోర్‌కి మహాఇష్టం. నౌకర్లని కన్నుమరిగించి పై అంతస్తు గదిలోకి తప్పించుకుపోయి ఆకాశపు నీలంకేసి చూస్తో, కృష్ణపక్షి పిలుపు వింటో ఒంటిగా కూచునేవాడు. వర్షాకాల సమయాలూ, బంగారపు కాంతులీనే మధ్యాహ్నవేళలూ తరువాత ఇతని కవిత్వం నిండా విరిసి మనల్నెంతో ఆహ్లాదపరుస్తాయి. ఈ రెండు వేళలకీ సంబంధించిన వివిధమైన **moods** ని ఇతడు వ్యంజించినట్టు ఇంకెవరూ చెయ్యలేకపోయా రంటే అతిశయోక్తికాదు. కవిత్వంలోనేకాదు, కథల్లోకూడా.

ఇక్కడ టాగోర్ వంశం గురించీ, కుటుంబనేపథ్యం గురించీ ప్రస్తావిస్తే సమంజసంగా ఉంటుంది. ఎందుకంటే, అటువంటి కుటుంబంలో టాగోర్‌వంటివాడు జన్మించాడంటే ఆశ్చర్యమేమి లేదు. ఆ కుటుంబ సర్వస్వమూ ప్రతిభావంతుల పుట్ట. ఇతని తాత ద్వారకానాథ్ టాగోర్ సంఘ సంస్కర్త, బ్రాహ్మ సమాజ స్థాపకుడు ఐన రాజారామమోహన్‌రాయ్‌కి అంతరంగికుడు. రామ మోహన్‌రాయ్ తరువాత బ్రాహ్మసమాజ నాయకుడు ఇతని తండ్రి దేబేంద్రనాథ్ టాగోర్‌ని 'మహర్షి' అనేవారు. ఆయన చాల ఉత్తముడూ, మహాభక్తుడూ. ఇతని పెద్దన్న ద్విజేంద్రనాథ్ తత్త్వవేత్త, కవీ. రెండో అన్న సత్యేంద్రనాథ్ ఐ. సి. ఎస్. కి ఎన్నుకోబడ్డ ప్రథమ భారతీయుడు. ఐదో అన్న జ్యోతిరింద్రనాథ్ గాయకుడూ, చిత్రకారుడూ. టాగోర్‌మీద ఇతని ప్రభావం చాల ఉంది. అక్క స్వర్ణకుమారి ప్రముఖ రచయిత్రి మేనల్లులు అబనీంద్రనాథ్, గగనీంద్రనాథ్‌లు బెంగాలీ, చిత్రకళా సంప్ర దాయానికి ఆద్యులు.

చిన్నప్పుడు ఇతన్ని స్పర్శించిన సాహిత్య ప్రభావాలేమిటి ? మూడో అన్న కూతురు ప్రతిభకి విష్ణు అనే ఆయన సంగీతం చెప్పేవాడు. ఆయన దగ్గిర జానపద గీతాలు నేర్చుకున్నాడు. టాగోర్. చండీదాస్, విద్యాపతుల వైష్ణవ గీతాలుకూడా అప్పుడే ఇతన్ని ఆకర్షించాయి. ఒకసారి తండ్రి హిమాలయాలకు వెడుతో ఇతన్ని కూడాతీసుకువెళ్ళాడు. డల్‌హౌసీలో ఉండగా ఇతనిచేత 'మేఘదూత' చదివించాడు. ఇతని కవిత్వంనిండా కాళిదాసు ప్రభావం ఉజ్జ్వలంగా గోచరిస్తుంది.

తరవాత, ఇంగ్లీష్ సాహిత్యంతో పరిచయం కలిగాక ఇతని మార్గనిర్దేశం చేసిన గొప్ప ప్రభావం రొమాంటిక్ ఉద్యమం. పాశ్చాత్యసంపర్కంమూలంగా భారతదేశంలో రొమాంటిక్‌ఉద్యమం వేళ్ళూని బ్రాహ్మసమాజపు సాంఘిక, మత సంస్కరణల్లో చివుళ్ళు తొడిగింది. టాగోర్ కవిత్వంలో మొగ్గతొడిగి రేక విప్పిందనవచ్చు. పద్దెనిమిదో శతాబ్దం చివర ఫ్రాన్సులో రూసో, వాల్తేర్‌ల భావాల్లో లేచిన ఈ గాలిదుమారం సాంఘిక, రాజకీయ వ్యవస్థల్లో స్థిత స్థితిని ఊపి ప్రశ్నించి, చివరికి ఫ్రెంచి విప్లవానికి దారితీసింది. తన భావాలకు అనుగుణంగా సమాజాన్ని మార్చుకునే హక్కు మనిషి కుందని ఉద్ఘాటించింది. సంఘంకోసం వ్యక్తికాదు, వ్యక్తికోసం సంఘమని వ్యక్తికి కట్టిన పట్టం ఫ్రెంచి విప్లవానికేకాక, ఇంగ్లండ్‌లో రొమాంటిక్ ఉద్యమానికి కూడా దారితీసింది. రొమాంటిసిజానికి వ్యక్తివాదమూ, వ్యక్తిస్వేచ్ఛా పునాదులు. ఇది సంప్రదాయవాదానికి ప్రతిచర్య. సంప్రదాయవాదం వస్త్వాశ్రయ మైతే, రొమాంటిసిజం ఆత్మాశ్రయం. వస్తువును ఉన్నదున్నట్లు వర్ణించాలంటారు సంప్రదాయవాదులు. అలాకాదు, తన భావనాశక్తిచేత కవి వస్తువుకు వెనకాతల ఉన్న కేవల యథార్థాన్ని ఆవిష్కరించాలంటారు రొమాంటిసిస్టులు. ఉదాహరణకి, కీట్స్ వ్రాసిన **'Ode on a Grecian Urn'** లో ఆ పాత్ర **'Beauty is truth, truth beauty'** అనే ఒక కేవల సత్యాన్ని ఆవిష్కరించ టానికి ఒక సాధనంగా మాత్రమే ఉపయోగపడింది. మానవ శక్తుల్లోకెల్లా ముఖ్యమైంది 'భావన'అని వీళ్ల అభిప్రాయం. ఈ భావనాబలంచేత మనకు పరిచయంలేని కొత్త లోకాలు తెరవచ్చు నంటారు.

ఆత్మాశ్రయమైన రొమాంటిక్ వైఖరి టాగోర్‌లో చివరికి మిస్టిసిజానికి ఎలా దారితీసిందో మనం సులువుగా గ్రహింపవచ్చు

సరే. టాగోర్‌ని పది, పదకొండేళ్ల వయస్సులో విడిచి పెట్టాంగదా. మళ్లీ అక్కడికొద్దాం. ఇప్పుడతని ఒంటరి జీవితం లోకి ఒక స్నేహితురాలు ప్రవేశించింది. ఇంచుమించు సమాన వయస్కురాలైన వదినగారు. ఐదో అన్న జ్యోతిరింద్రనాథ్ భార్య. ఇతన్ని బొమ్మల పెళ్లిళ్లకు పిలిచి మంచి మంచి ఫలహారాలు పెట్టేది. జ్యోతిరింద్రనాథ్, ఈవిడా ఈ పిల్లాడికి చాల ప్రోత్సాహ మిచ్చారు అన్నగారు కట్టణాలమీద కొత్తవరసలు కట్టి పియానో మీద అద్భుతంగా వాయించేవాడు. సాయంత్రాలు డాబాపై కూచుని, జ్యోతి వయొలిన్ వాయిస్తే, రవి గొంతెత్తి పాడేవాడు

పద్మానది అందాన్ని టాగోర్‌కి మొదట పరిచయం చేసిన వాడు జ్యోతియే. షిలాయిదాలో టాగోర్లకి ఎస్టేటు ఉండేది. ఎస్టేటు వ్యవహారంమీద వెడుతో రవిని తీసుకువెళ్ళాడు జ్యోతి. అంతే. టాగోర్ పూర్తిగా వివశుడైపోయాడు. పద్మా తరంగాల గలగల అతని కవిత్వాన్ని ఇక ఎన్నడూ వీడలేదు. కాళిదాసు పర్వత రాజు ఆస్థానకవి ఐతే, టాగోర్ పద్మానదికి కవి వల్లభుడు. పద్మా నది అనంతమైన **moods** గురించి ఎన్ని పద్యాలు వ్రాశాడో ! అతని అద్భుతమైన కథలెన్నో పద్మానదిపై ప్రయాణం చేస్తుండగా తట్టినవే.

జ్యోతి 'భారతి' అనే పత్రికని స్థాపించి, అన్న ద్విజేంద్ర నాథ్‌ని సంపాదకుడుగా ఉండటానికి ఒప్పించాడు. టాగోర్ బాల్య రచనలు ఈ పత్రికలో ప్రచురితమయాయి. 'కబిర్ కహాని' అనే దీర్ఘకావ్యమొకటి. ఇందులో షెల్లీ ప్రభావం బాగా కనిపిస్తుంది. ఒకసారి మాటల సందర్భంలో ఛాటర్‌టన్ గురించి ఎవరో చెప్పారు. ఛాటర్‌టన్ అనే పదహారేళ్ల ఇంగ్లీష్ బాలకవి ప్రాచీన కావ్య పద్ధతిలో పద్యాలువ్రాసి. ఏ విధంగా విమర్శకులను నమ్మించిందీ. ఈ గమ్మత్తు తనెందుకు చెయ్యకూడదూ, అను

కున్నాడు టాగోర్. మైథిలీ వైష్ణవ కవుల పద్ధతిలో పదాలు రచించి, 'భానుసింహేర్ పదాబలి' అనే పేరుతో 'భారతి'లో ప్రచురించాడు. తమ పాత పుస్తకాల కొట్టంలో లభించాయనీ, భానుసింహుడనే మధ్యయుగాల కవి వీటిని రచించినట్టు తెలుస్తుందనీ ఒక ఉపోద్ఘాతం తగిలించాడు. ఈ పద్యానుకరణలు ఎంత బాగున్నాయంటే, నిజంగా ఎవరికీ అనుమానం కలగలేదు. పైగా నిశికాంత ఛటర్జీ అనే ఆయన ఒక జర్మన్ యూనివర్సిటీకి భానుసింహుడి మీద థీసిస్ submit చేసి డాక్టరేటుకూడా సంపాదించాడు!

1877లో రవిని ఇంగ్లండ్ పంపించారు. మరుసటేడు తిరిగొచ్చాడు. అక్కడ పెద్దగా నేర్చుకున్నదేమీలేదు. రాగానే 'వాల్మీకి ప్రతిభ' అనే సంగీత నాటకం వ్రాశాడు. కాళికా భక్తుడైన దొంగల ముఠాకి వాల్మీకి నాయకుడు. ఒకనాడు బలికోసమై ఒక పిల్లని పట్టుకు తీసుకొస్తారు దొంగలు. వాల్మీకికి హఠాత్తుగా జాలి కలిగి ఆ పిల్లని విడిచిపెడతాడు. ఈ 'జాలి' అనేది అతనికి చాల కొత్త అనుభూతి. అర్థంకాని సంక్షోభంతో అడవెమ్మట తిరుగుతుంటాడు. ఇద్దరు అనుచరులు ఒకపిట్టని చంపటం చూసి అతనికి మరింత జాలి కలుగుతుంది. అకస్మాత్తుగా అతని నోటివెమ్మట ఒక సంస్కృతశ్లోకం వెలువడుతుంది. తన మాటలకి తనే ఆశ్చర్యపడుతుండగా, సరస్వతిదేవి అగుపించి, నీలో జాలి రేకెత్తించటానికి నేనే ఆ కన్యారూపంలో వచ్చాను, అని చెప్పి తన వీణని అతనికి ప్రసాదించి, కవివి కమ్మని దీవిస్తుంది. ఈ నాటకం చాలా ఉత్సాహంగా ఉరకలెత్తుతూ నడుస్తుంది. ఇందులో దొంగిలముఠా బృందగానా లున్నాయి, వేటగాళ్ల నట్యా లున్నాయి, వనకన్యల పాటలున్నాయి. మొట్టమొదటిసారిగా పాశ్చాత్య బాణీలు ఇందులో మనకు కనిపిస్తాయి. మూర్ 'ఐరిష్ మెలడీస్' భారతీయ వేషంలో సాక్షాత్కరిస్తాయి. అంతా చాలా ఉత్సాహంగా, సరదాగా ఉంటుంది.

1881లో ప్రచురించిన 'సంధ్యాసంగీత'తో అతనికి బాగా పేరొచ్చింది. తర్వాత 'ప్రభాత్ సంగీత్' వెలువడింది. రెండో దాంట్లో బాగా పరిణతి చెందాడని అంటారు.

1882లో ఇరవై ఒకటోఏట, ఇతని జీవితాన్నీ, కవితా దర్శనాన్నీ మార్చివేసిన మహత్తరమైన అనుభవమొకటి కలిగింది. అప్పుడు వాళ్ల సదర్‌స్ట్రీట్ ఇంటో ఉంటున్నాడు. ఒకనాడు పొద్దున దూరాన చెట్లవెనక సూర్యోదయమౌతుండగా చూస్తూ నిలబడ్డాడు టాగోర్. హఠాత్తుగా కళ్లముందునించి ఆచ్ఛాదన ఏదో తీసేసినట్టూ, ప్రపంచమంతా లోనుంచి ఉబికి వస్తున్న మహానందంతో జ్వలిస్తున్నట్టూ కనిపించిందన్నాడు. ఇప్పుడు జగత్తును ఉన్నదున్నట్లు చూస్తున్నాననిపించింది; ప్రతి చిన్నవస్తువు నించీ, ప్రాణినించీ అనంతమైన జీవమూ, ఆనందమూ తొంగి చూస్తున్నాయనిపించింది. మనం క్షుద్రమనుకునే ప్రతిదీ అర్థవంతమనిపించింది, అని అన్నాడు. ఈ ఆనందమూ, ఉజ్జ్వమూ ఆనాడే వ్రాసిన 'The Awakening of the Fountain' అనే పద్యంలో వ్యక్తపరిచాడు. సామాన్య విషయాల్లో, సంఘటనల్లో దాగి ఉన్న ఈ ఆనందాన్నీ, ఉజ్జ్వాన్నీ ఆవిష్కరించటమే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు టాగోర్.

మరుసటేడు కార్వార్‌లో ఉద్యోగం చేస్తున్న సత్యేంద్రనాథ్‌తో కొన్నాళ్లు గడిపాడు. అక్కడ 'సన్యాసి' అనే నాటకం వ్రాశాడు. ప్రేమా, సౌందర్యమూ సత్యసాధనకు ఆటంకాలు కావనీ, పైగా ప్రేమ, సౌందర్యాలద్వారానే సత్యం ఆవిష్కృతమౌతుందనీ, దీనికోసమై ప్రపంచాన్ని త్యజించనఖర్లేదనీ ఇందులో సూచించాడు. ఆదుకునే వాళ్లెవరూ లేని ఒక చిన్నపిల్ల దారిప్రక్క కూచున్న ఒక సన్యాసి పంచకు చేరుతుంది. సన్యాసి హృదయం మొదట్లో ద్రవించినా, ఛీ ప్రపంచ లంపటాల్లో తగుల్కోకూడదు, అని గట్టిపరచుకుని, ఆ పిల్లని తోసేసి వెళ్లిపోతాడు. తరవాత సౌందర్య దర్శనం జరిగి, మనసు మార్చుకుని ఆ పిల్లకోసం వెతుకుతాడు. 'అల్పవిషయాల్లోనే అనంతుడైన భగవంతుడున్నాడు, ప్రేమలోనే సత్యముంది' అంటాడు. కాని ఆ పిల్ల అప్పటికే చచ్చిపోతుంది.

1883లో ఇరవైరెండోయేట మృణాళినీదేవిని పెళ్లిచేసికొన్నాడు. తర్వాత కొన్ని నెలల్లోనే తన చిన్నప్పటి స్నేహితురాలైన వదినగారు ఆత్మహత్య చేసుకుంది. జీవితాంతం వరకు ఆవిణ్ణి మరవలేదు టాగోర్. ఆమెను ఉద్దేశించి చాలా పద్యాలు వ్రాశాడు.

షిలైదాలో ఉన్న కుటుంబ ఎస్టేట్లు అజమాయిషీచేస్తూ 1890 నించి పదేళ్లు టాగోర్ అక్కడ గడిపాడు. ఇది టాగోర్ జీవితంలోకల్లా చాల ఆనందమయమూ, సారవంతమూ ఐనకాలం. తనకు ప్రియమైన పద్మానది. పద్మానదిలాగే విశాలంగా, కాంతిమంతంగా పరుచుకున్న దినాలు. పల్లెజనాలతో, వారి జీవితాలతో సాన్నిహిత్యం. పద్మానదిపై పడవలో తేలుతుంటే, దినాలకు దినాలే ప్రశాంతంగా ప్రవహించిపోయాయి. షిలైదానుంచి తన మేనకోడలికి వ్రాసిన ఉత్తరాలు 'ఛిన్నపత్ర' అనేపేరుతో ప్రచురితమయాయి. వీటిలో కొన్ని 'Glimpses of Bengal'గా అనూదితమయాయి. తరవాత వ్రాసిన చాల కథలకు బీజాలు వీటిలో మనకు గోచరిస్తాయి. పట్టణ జీవితంకోసం బెంగపెట్టుకున్న విలేజ్ పోస్టుమాష్టరూ మొదలైనవాళ్లు మొదట ఈ ఉత్తరాల్లో తగుల్తారు మనకు. ఈ గ్రామీణ జీవిత సంపర్కంవల్ల వాళ్ల సమస్యలు అర్థం చేసికోటానికి టాగోర్‌కి అవకాశం లభించింది. ఉత్తరోత్తరా 'శ్రీనికేతన్'లో ప్రవేశపెట్టిన పద్ధతులకూ, పథకాలకూ బీజాంకురాలు ఇక్కడివే.

ఇతడు 1891లో కథలు వ్రాయటం ప్రారంభించాడు. 'My Lord the Baby' అనే కథ మొదటిది. టాగోర్ కథలకి సముచితమైన పీఠం ఇక్కడ వెయ్యతలచుకున్నాను. టాగోర్ కవిగా కన్నా కథకుడుగానే గొప్పవాడని నా అభిప్రాయం. తన అనుభూతికీ, అభివ్యంజనానికీ మధ్య గొప్ప సామరస్యాన్ని కథల్లో సాధించగలిగాడు టాగోర్. అతని కావ్యాల్లో ఎక్కడో తప్పించి ఆ పరిపూర్ణత కనిపించదు నాకు. కథలు మాత్రం అకళంకాలు. అతనిలో పెల్లుబికే మానవతా, సామాన్య జనంపట్ల సానుభూతీ, ఆసక్తీ, ప్రకృతీ

ప్రియతా, జీవించటంలో తనుపొందే ఆనందమూ, అనుభూతీ—టాగోర్ జీవిత దర్శనం అతని కథల్లో ప్రతిఫలించినట్టు కావ్యాల్లో ప్రతి ఫలించదు. పిల్లల మనస్తత్వాన్ని ఇంత బాగా అర్థంచేసికొన్న రచయిత మరొకడు కనిపించడు. ఇవి వ్రాసినప్పుడు టాగోర్ బాలకుడే. అతని మనస్సుకి గెడ్డాలూ, మీసాలూ ఇంకా మొలవలేదు.

ప్రతీకాత్మకాలు కాని (non-symbolical) శుద్ధ నాటకలు ఈ రోజుల్లోనే టాగోర్ రచించాడు. అందమైన సంగీతంతో, ఆనందంతో స్పందించే 'చిత్రాంగద' కేవలం భౌతిక సౌందర్యం కన్నా జీవితాన్ని ఎదుర్కోగలిగే ఆత్మస్థైర్యం గొప్పదని చెబుతుంది. 'రాజా ఓ రాణీ' (King and queen) స్వార్థమైన ప్రేమ దుఃఖ భాజనమని చూపుతుంది. 'మాలిని' అనే నాటకం మూఢ, ఛాందస ఆచారాలవల్లకాదు, ప్రేమవల్లనే భగవంతుని చేరుకుంటాం, అని చాటుతుంది. 'బిసర్జన్' (sacrifice) కూడా ఈ కాలం నాటిదే. వీటన్నిటికీ ఒక సామాన్య లక్షణముంది. సత్యావిష్కరణకి సాధనంగా తోడ్పడేది ఒక స్త్రీ: సాధారణంగా ఒక బాలిక. ఇదే లక్షణం పూర్వ రచితమైన 'సన్యాసి'లోనూ గమనించాం.

ఇంతవరకూ వచ్చిన టాగోర్ కావ్యాలకి తలమానికం 'చిత్ర' (Beauty). (ఇంగ్లీష్ 'Chitra' కాదు.) సౌందర్యారాధన ఇందులో పరాకాష్ట అందుకుంది. 'చిత్ర'లో పద్యాలు కొన్ని 'Gardener' మొదలైన వాటిలో తర్జుమా అయాయి. సౌందర్యారాధనకి చిరమ స్థాయి ఐన 'ఊర్వశి' కావ్యం ఇందులోదే. దీనిగురించి తరవాత ప్రస్తావిస్తాను.

ఇక టాగోర్ జీవితం ఒక మలుపు తిరగబోతుంది. ఈ కాలంలోనే 'సోనార్ తరీ' (The Golden boat) అనే కావ్యమొకటి వ్రాశాడు. టాగోర్ మిస్టిక్‌గా మారాడనే అపవాదనకిది దోహదమిచ్చింది. ఈ కావ్యంలో ఇతని 'జీబన్ దేబతా' సిద్ధాంతం రంగ ప్రవేశం చేసింది. 'జీవనదేవత' అంటే 'మన జీవితంపై అధ్యక్షత వహించే దేవత' అన్నమాట. కొంతమంది కవులకి తమని inspire చేసి తమచేత వ్రాయించేదేదో ఉందనే భావం ఉండటం చూస్తాం. ఇదే జీవన దేవత. ఈ జీవనదేవతని ఉద్దేశించి చాలా పద్యాలు వ్రాశాడు. 'మానసి', 'సోనార్ తరీ', 'చిత్ర', 'చైతాలి'ల్లో ఇవి మన కెదురౌతాయి. ఇంతటితో జీవనదేవత నిష్క్రమించి, టాగోర్ కవిత్వంలోకి భక్తి ప్రవేశించింది. ఇప్పుడు టాగోర్ నలభైయో పడిలో అడుగు పెట్టబోతున్నాడు.

1896 నించీ టాగోర్ రాజకీయాలతో ప్రమేయం హెచ్చించుకున్నాడు. మొదట్లోచెప్పానే. టాగోర్‌లో బహిర్ముఖతా, అంతర్ముఖతా సమానాంతరాలని, ఈ కాలంలోనే అతని దృష్టి అంతర్ముఖమై భగవంతుని వైపు మళ్ళింది. జీవితానుభవాన్నీ, సౌందర్యాన్నీ ఉగ్గడించిన టాగోర్ భక్తిలో ఎందుకు పడ్డాడనే ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. ఇలా పోయి పోయి చివరికి భక్తిలోకి దుమికిన సౌందర్యారాధకులు తరచూ తగులు తుంటారు మనకు. మన ఆంధ్రదేశంలో చలంగారు ఒక తార్కాణ. ఈ ప్రశ్నకెవ్వరూ సరైన సమాధానం చెప్పగా నేను వినలేదు. ఇంద్రియానుభూతితో అసంతృప్తి అన్నారు. ఇంద్రియానుభూతికి భక్తి ప్రత్యామ్నాయం ఎలా ఔతుందో నాకర్థంకాదు. ఏమైతేనేం, కవిత్వం ఇంద్రియానుభూతికి సంబంధించింది. ఇంద్రియాలు ఆలంబనంగా అతీతమైన అనుభవాన్ని ప్రసాదిస్తుంది. ఇంద్రియానుభావం కాలదన్నితే, ఇక కవిత్వానికి చోటెక్కడ? ప్రపంచాన్ని తిరస్కరించిన చాలమంది విషయంలోలాగే టాగోర్ విషయంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది. ఈ ఘట్టానికి మునుపటిదే టాగోర్ గొప్ప కవిత్వమంతానూ. 'గీతాంజలి' అవీ ఇంకా ముందున్నాయనుకొండి. కాని, 'గీతాంజలి'ని టాగోర్ పతాక కవిత్వంగా జమ కట్టను నేను.

1897–1900 మధ్య 'కల్పనా', 'కథా', 'కాహినీ', 'క్షణికా', 'కణికా' అనే ఐదు కావ్య సంపుటాలు ప్రచురించాడు. 'క్షణికా' లో మొదటిసారిగా వ్యావహారిక భాష వాడి, బెంగాలీ పండితుల కోపానికి గురయ్యాడు. అసలు బెంగాలీ పండితులకి టాగోరంటే సానుభూతి ఎప్పుడూ ఏకోశానా లేదనుకొండి. కలకత్తా మెట్రిక్యులేషన్ పరిక్ష పేపర్లో 'ఈ క్రింది వాక్యములను దిద్దుడు'అని టాగోర్ పుస్తకాల్లోని వ్యాక్యాలిచ్చేవారు. 1912లో కలకత్తా యూనివర్సిటీ వైస్‌-ఛాన్సలర్ సర్ అశుతోష్ ముఖర్జీ టాగోర్‌కి డాక్టరేట్ ఇవ్వాలని సెనేట్‌లో తీర్మానం పెడితే, 'టాగోర్ ఏం పండితుడా, డాక్టరేట్ ఇవ్వటానికి?' అని తోసి పుచ్చారు.

కొత్త శతాబ్దంతోపాటు టాగోర్ జీవితం ఒక మలుపు తిరిగింది. 1901లో 'శాంతినికేతన్'స్థాపించాడు. 'బంగ దర్శన్' అనే పత్రికకు సంపాదకత్వం వహించాడు. నవలలు వ్రాయటం ప్రారంభించాడు. రాజకీయాల్లోకి కంఠదఘ్నంగా దిగాడు. భక్తి గీతాలు రచించి 'నైవేద్య' అనే పేరుతో తండ్రికి అంకితంచేశాడు. ఇందులోవి కొన్ని ఇంగ్లీషు 'Gitanjali' లో చోటు చేసుకున్నాయి.

టాగోర్ నవలలు ఈ శతాబ్దారంభంలో బెంగాలీ సమాజంలో సంఘర్షణల్నీ, పరిణామాల్నీ, రాజకీయ వాతావరణాన్నీ శక్తిమంతంగా చిత్రించాయి. ఇవి 'గోరా', 'ఘరే బాహిరే' (The Home and the world), 'నౌకా డుబీ', (The Wreck), 'చార్ అధ్యాయ్' (Four Chapters).

నేనిదివరకు పేర్కొన్న ప్రతీకాత్మకం కాని (Non-Symbolised) నాటకాలేకాకుండా, నాటకీయ సంభాషణలు(Dramatic Dialogues) కూడా రచించాడు. Gandhari's Prayer, Lakshmi's Testing, Karna and Kunti వంటివి. ఇవికాక ప్రతీకాత్మక నాటకాలు చాల ఉన్నాయి. వీటిలో ప్రతీకత (Symbolism) మరీ జాస్తి ఐ, కథా, నటన పాత్రా రచనా బుడుంగుమని అందులో మునిగిపోతాయి. అందువల్ల ఇవి చదువుతుంటే విసుగుపుడుతుంది. కాని, పాడి, నాట్యమాడి ప్రదర్శిస్తే బాగానే ఉంటాయి. 'శాంతినికేతన్' విద్యార్థులకోసం ఋతూత్సవాలకై వ్రాసిన వివి. 'ఫాల్గుణి' (The Cycle of Spring) 'శరదోత్సవ'

(Autumn Festival), 'వసంత' ఇటు వంటివి. 'డాక్ ఘర్' (The Post Office), 'The King of the Dark Chamber' కూడా ప్రతీకాత్మక నాటకాలే.

సరే, 1912లో 'నైవేద్య', 'గీతాంజలి'లోని భక్తి గీతాలు ఇంగ్లీషులోకి అనువదించటం, అవి రోదెన్‌స్టైన్, యేట్స్‌లు చదివి మహాకవి అవతరించాడనటం, ఇతనికి నోబెల్ బహుమాన మివ్వటం, వగైరా అందరికీ ఎరిగినదే. టాగోర్‌గురించి ఎవరు మాట్లాడినా, వ్రాసినా ఈ విషయాలే చెబుతుంటారు. టాగోర్ 'గీతాంజలి' వ్రాయటం, 'నోబెల్ ప్రైజ్' తీసుకోవటం తప్పించి ఇంకేమీ చెయ్యనట్టు.

పాశ్చాత్యదేశాల్లో టాగోర్ యెడల మొదట్లో కలిగిన ఆసక్తి వెంటనే తగ్గిపోయింది. మన దేశంలో కూడా టాగోర్ అనువాదాల యెడ ఉదాసీనత కనిపిస్తుంది. దీనికి కారణం అనువాదకులలోపం. తన రచనల్ని చాలా వరకు తనే అనువదించుకున్నాడు కనక, టాగోరే కారణమని చెప్పవచ్చు. టాగోర్ బహుముఖ ప్రజ్ఞనీ, వైవిధ్యాన్నీ, జీవితోత్సవాన్ని ఎంత ఆనందమయంగా జరుపుకున్నాడో ఆ విషయాన్నీ, అల్ప వస్తువుల్లో మహా సౌందర్యాన్ని చూడగలిగే అతని దర్శనాన్నీ ప్రదర్శించగలిగే అనువాదాలు ఇంతవరకు రాలేదు. ఎంతసేపూ టాగోరంటే గెడ్డం, జుబ్బా వేసుకుని భక్తిగీతాలు పాడే 'బైరాగి' అనే Impression మిగిలిపోయింది జనానికి.

జీవితోత్సవాన్నీ, ప్రపంచ సౌందర్యాన్నీ ఆలపించే గాయకుడుగా ఎంతమంది ఎరుగుదురు టాగోర్ని? ఇతడు రెండువేలకు పైగా అద్భుతమైన పాటలు వ్రాశాడు. బెంగాల్‌లో మూల మూలలా జనం ఇప్పటికీ వీటిని పాడుకుంటుంటారు. సరే, శిష్ట వర్గాల్లో 'రబీంద్ర సంగీత్' అని ఒక కొత్త బాణీయే ప్రచారంలో కొచ్చింది. టాగోర్ essentiallyricist. గా Lyrics వ్రాయటంలో ఇతన్ని మించినవాళ్లు లేరు. విశ్వంలోని ఆనందమూ, సౌందర్యారాధనా ఇతని పాటల్లో పొంగిపొర్లుతూ ఉంటుంది. భక్తిగీతాలు వ్రాస్తున్న రోజుల్లో, ఆ మాటకొస్తే అతని జీవితాంతం వరకూ కూడా, సౌందర్యారాధకాలైన పాటలు రచిస్తూ వచ్చాడు. 'ఊర్వశి' అనే గేయం గురించి వెనక ప్రస్తావించాను. ఈ కావ్యం సౌందర్యారాధనకి చరమసోపానం. ఈ 'ఊర్వశి' కృష్ణశాస్త్రిగారి ఊర్వశిలా ఊహా ప్రేయసికాదు. నిజంగా దేవతా సుందరి ఊర్వశే. ఒక్కొక్క పాదం మహాసాగర తరంగంలా ఉవ్వెత్తుగా లేచివచ్చి; అనుప్రాసలతో విరుగుతుంది. టాగోర్‌ని నిజంగా అనుభవించాలంటే మూలంలో చదవవలసిందే. నాకు ఒకటి రెండు పాదాలు తప్ప గుర్తులేవు.

'బృంతహీన పుష్పసమ ఆప్ నార్ ఆప్ని బికశి
కబే తుమి ఫుటిలే 'ఊర్వశి'.

Thompson అనువాదం :

Like some stemless flower, blooming in thy self
When didst thon blossm Urvasi?
In thy right hand nectar, venom in thy left.
The swelling, mighty sea, like a serpent tamed with spells,
Drooping his thousand, towering hoods,
Fell at thy feet!
White as the Kunda blossom, a naked beauty, adored by the king of Gods,
Thou stainless One.

చివరి రెండు పాదాలకు మూలం :

'కుందశుభ్ర నగ్నకాంతి, సురేంద్ర బందితా,
తుమి అనిందితా'.

బాల్య సహజమైన కౌతూహల్యమూ, కొత్త అనుభవాలయెడ తహతహా ఎంత వృద్ధాప్యంలోనూ టాగోర్‌ను వదల్లేదు. తన డెబ్బైయో ఏట అతని సృజనాసక్తి ఆశ్చర్యనిధులైన కొత్త పేటికల్ని తెరిచింది. టాగోర్ చిత్రకారుడుగా మారాడు. తను బొమ్మలు గీయటం ఎలా ప్రారంభించాడో ఒకచోట వివరించాడు. ఇది టాగోర్ మనస్తత్వానికే కాక అసలు సృజనక్రియ మూల తత్వానికే దర్పణం వంటిది. తను వ్రాసేటప్పుడు పేజీనిండా కొట్టివేతలూ, తుడుపులూ, ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా చెల్లాచెదురుగా పడుండి, పతిత నిర్భాగ్య జీవుల్లా ఆక్రోశిస్తున్నట్టు టాగోరుకు అనిపించేదట. వీటన్నిటికీ పరస్పర సంబంధ మేర్పరచి, ఒక అర్థవత్వమిచ్చి, ఉద్ధరించాలని టాగోర్‌కి ఆవేదన కలిగేదిట. ఈ కొట్టివేతలన్నిటినీ కలుపుతో ఒక బొమ్మో, డిజైనో గీసేవాడు టాగోర్. ఇవన్నీ కలిసి ఒక పక్షిగానో, మృగంగానో, మనిషిగానో మారి ప్రాణం పోసుకునేవి! మూలతత్వంలోకి వెడితే, కళ ప్రయోజన మిదే కదా! అసంబద్ధాలకి సంబంధ మేర్పరచి, అర్థవత్వాన్ని ప్రసాదించటం!

టాగోర్ చిత్రాల్ని యూరోపియన్ చిత్రకారులు గొప్పగా ప్రశంసించారు. యూరోపియన్ మహానగరాల్లో ఇవి ప్రదర్శింపబడ్డాయి. ప్రపంచ ఖ్యాతి పొందాయి.

టాగోర్ ఇక ఆఖరి మజిలీ సమీపించాడు. చాలామంది సన్నిహితులూ, ప్రియులూ దారిలోనే సెలవు తీసుకున్నారు. భార్యా, ఒక కూతురూ 1902లోనే కొన్ని నెలల యెడంలో చనిపోయారు. బొమ్మల పెళ్లిళ్లకు పిలిచి ఫలహారాలు పెట్టిన వదినగారు ఎప్పుడో వెళ్లిపోయింది ఐదుగురు పిల్లల్లోనూ ఒక్క రతీంద్రనాథ్ మిగిలాడు. 1941 ఆగస్టు 7వ తారీఖున తను జన్మించిన జొరాసంకొ భవంతిలోనే టాగోర్ కన్నుమూశాడు.

'పోస్టాఫీస్' అనే నాటకం అంతంలో అమర్ అనే కుర్రవాడు మృత్యుశయ్యపై ఉండగా నేపధ్యంలో పాడేందుకు ఒక పాట వ్రాశాడు. ఐతే, ఆ ప్రదర్శనం చివరికి జరగవేలేదు. టాగోర్ కోరికపై, 'శాంతినికేతన్'లో జరిగిన 'funeral service' లో ఆ పాట మొదటిసారి పాడారు.

In front lies the Ocean of peace
Launch the boat, helmsman......
May the mortal bonds perish
May the vast Universe take him in its arms,
And may he know in his fearless heart
The Great Unknown.

ముందున్నది శాంతిసాగరం
పడవ నడుపు, కర్ణధారీ......

భవబంధాలు రాలిపోనీ,
విశాల విశ్వమతన్ని ఒడిలోకి తీసికోనీ,
తన నిర్భయ హృదయంలో
మహా అజ్ఞాతాన్ని తెలిసికోనీ.

జీవితాన్ని నిర్భయంగా ఆహ్వానించాడు కనుకనే, టాగోర్ మృత్యువుని కూడా నిర్భయంగా ఆహ్వానించగలిగాడు.

ఆఖరి మజిలీ

శ్రీ మల్లెల దాసరి నరసింహమూర్తి

నేను నడిచే దారిలో
నడవలేని జీవితాలెన్నో
నన్ను కన్నీళ్ళతో కట్టేశాయ్ ...
రవ్వంత జాలికోసం
కొండంత ఆశతో కనురెప్పల జోలిని విప్పుకొన్నాయ్
... ...
అప్పుడు —
నేను 'నిశ్శబ్దం'గా మారిపోయిన నిరుద్యోగిని...
... ...
విషాదం, నాలోని వీణను మీటితే ...
జాలి, గొంతును విప్పితే ...
గుండె, గూటి తలుపులు తెరుచుకొని
నీరై పారిపోయింది ... ? ...
? ... ... ? ... ... ? ... ...
ముసలి బిచ్చగాని వీధి పాటలోకి ...
నా దగ్గర...కన్నీళ్ళుగా కరిగిపోయే ...
పిడికెడు గుండెతప్పా — ఇంకేమీలేదు ...

నాకు —
ఈ — బ్రతికే శ్మశానంలో
బుద్ధుడు, జీసస్, గాంధీల, అజ్ఞాత ఆత్మల
అవ్యక్త ఆలాపనల్లో
శతాబ్దాల బాధలు, కన్నీళ్ళు తప్పా—
స్వర్ణయుగాలు, రత్నాల అంగళ్ళు —
ఇవేవీ గుర్తుకురావు.

అందుకే అడుగు ముందుకు వెయ్యలేకున్నా —
ఇదే నా ఆఖరి మజిలీ ...
ఇక్కడే... ఈ శ్మశానంలోనే
జీవాన్ని తోడి వెలికితీస్తా...
అప్పుడు... ఆ చిరంజీవి ప్రపంచానికి
ఈ పిడికెడు గుండెతోనే లాలపోస్తా ...
... ...

ప్రొఫెసర్ పి. వి. అరుణాచలం

"సుందరాచారి రచనలు *"

పిత్రార్జితమైనదో, స్వార్జితమైనదో — ఏదో ఒక స్థిరమైన రాబడి ఉండి కాలక్షేపానికో, కళారాధనకో కవితా వ్యవసాయం చేస్తారు కొందరు. లౌక్యాన్నితెలిసి కవిత్వం ద్వారా కనకాభిషేకాలు పొంది ఏ లోటూ లేక జీవించే కవులు కొందరు. బ్రతికినన్నాళ్ళు ఈతి బాధలతో "రేపటి కెల్లాగూ?" అని అనుదినం ఆలోచిస్తూ, కవిత్వాన్నే నమ్మి మనేవారు కొందరు. ఈ మూడవ తరగతిలో సభ్యత్వాన్నిపొంది, అతి సాహసంతో, అఖండమైన ఆత్మవిశ్వాసంతో తలవంచని కవి వీరుడుగా బ్రతికిన ఖ్యాతి శ్రీ శంకరంబాడి సుందరాచారికి దక్కింది. "పేద కవి" అని ఫిరదౌసీ జీవిత గాథను వ్రాసినారు వీరు. ఆత్మజీవన ప్రతిబింబాన్ని 'ఫిరదౌసి'లోచూచి ఆత్మ కథా కథనంగానే శ్రీ ఆచార్యులవారు ఆ కావ్యాన్ని రచించినారేమో అనిపిస్తుంది.

> "కాని, కవితా ప్రభావమ్ము కడుపు నింప
> కలుగునా యేమి ? పాపమా కవి వరుండు
> కష్టపడుచుండె; పేదరికమ్ము విడక
> కాపురమ్మున కాలిడి కలచు చుండ"

అని సుందరాచారి పారశీక కవినిగురించి వ్రాసిన విషయాలు తనకూ అన్వయిస్తాయి.

వీరు అనేక కావ్యాలను వ్రాసినారు. భారతీయ జీవన విధానాన్నీ, సంస్కృతిని తీర్చిదిద్దిన మూడు మహాకావ్యాలు—రామాయణ, భారత, భాగవతాలను సుందరంగా సంగ్రహించి పండిత విద్యార్థి పామరలోకరంజకంగా రచించినారు. అపవాదు, పేదకవి, గీతాంజలి అనువాదము, నాస్వామి, నేటికవిత్వము, సుందర సుధా బిందువులు, బుద్ధగీత, బలిదానము, ఏకలవ్యుడు, కార్వేటి నగర రాజ నీరాజనము మొదలైనవి వీరి ఇతర రచనలు.

సంప్రదాయ కవిత్వాన్ని, గేయ కవిత్వాన్ని సవ్యసాచిగా నిర్వహించగల సమర్థుడు శ్రీ సుందరాచారి. వీరి కవిత్వాన్ని గురించి సుప్రసిద్ధులైన కవులు, పండితులు వెలిబుచ్చిన అభిప్రాయాల ద్వారా కొంతవఱకు సుందరాచారి రచనలలోని విశిష్టత స్పష్టమౌతుంది.

స్వర్గీయ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారన్నారు—"మృదువైన పదములు, మధురమైన శైలి, మంచి కల్పన కలిగి వీరి కవిత్వము ఆనందము నాపాదించకలిగి ఉన్నది". కీ. శే. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అన్నారు—"తెలుగు పలుకుబడి కవితాశక్తి, సౌకుమార్యము, ఈ మూడు గుణములు మూటగట్టి వీరు పాత్రము లను రచించుచున్నట్లున్నది. ఈ యుగములో వీరిదొక ప్రత్యేక వాఙ్మయముగా నేర్పాటు కాబోవుచున్నట్లున్నది. వీరిశైలి సంస్కృత సమాసములనుండియు, మారుమూల పదములనుండియు విడివడి సరళమైనది."

శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి అంటారు: "ఈతని శైలి మిక్కిలి సరళమైనది. భాష సుగమమైనది. ధార సహజమైనది. పోకడలు, ఎత్తుగడలు, అలంకారములు, చమత్కారములు, మున్నగు ప్రసాధనము లన్నియు సముచిత సన్నివేశములై భావ శ్రుతిలో మేళవించినవి."

"సుందరాచారిగారి సూక్తి ఎంత తేటగా సూటిగా వినబడు తుందో అంత స్ఫురితంగా సుదూరంగా ధ్వనిస్తుంది. ఇది ఈ కవి రచనలోని అనన్య విశిష్టత" అని శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు సెలవిచ్చినారు.

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు :

> "తేటగీతుల తెలుగు తీదీపిరుచుల
> యూట,.........కొంకుల కొసరుల కాటుపడక
> సార తరమిది సుందరాచారి కవిత"

అని చక్కని యోగ్యతా పత్రమిచ్చినారు. మకుటంలేని మహాచక్రవర్తులుగా తెలుగు సాహిత్య ప్రపంచాన్ని ఏలినవారు, ఏలు చున్నవారు ఈ విధంగా ఆచార్యులవారి సుందర కవిత్వాన్ని ప్రశంసించి, వారికి సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచినప్పుడు నేను సుందరాచారి రచనలలో ఏ ఏ సుగుణాలున్నాయో ఎత్తిచూపడం సాహసమే. అయినా వారి దగ్గర రెండు ముక్కలు నేర్చుకొన్నవాణ్ణి గనుక గురుభక్తి పరాయణ చిత్తంతో ఈ పనికి పూనుకొన్నాను.

కవితా రచనను జీవిత ధ్యేయంగా, జీవనమార్గంగా స్వీకరించి సాహసోపేతులై మనిన కవులు ఎందరో లేరు ఆంధ్రదేశంలో. వారిలో శ్రీ శంకరంబాడి సుందరాచారి ఒక విలక్షణ వ్యక్తిగా, సాహితీ శక్తిగా విరాజిల్లి కీర్తిశేషులైనారు. వీరు తేటగీతిని తన ఇష్ట ఛందస్సుగా మలచుకొన్నారు. శంకరంబాడి సుందరాచారిగారు అన్న ప్పుడే ఒక తేటగీతి పాదం ఏర్పడి పోతుంది. శ్రీ రాళ్ళపల్లివారు సెలవిచ్చినట్లు సుందరాచారి తేటగీతులలో తీయని తెలుగు తేనియ ఊటలను ప్రవహింపచేసినారు.

---

* ఆకాశవాణి — కడప సౌజన్యంతో.

నన్నయ కవిత్వమంటూనే అక్షర రమ్యత, ప్రసన్న కథా కథనము, తిక్కన అంటూనే ధర్మాద్వైతము, నాటకీయ శైలి, రసపుష్టి, పోతన పేరెత్తితే సహజ పాండిత్యము, శ్రీనాథుడంటే సీసపద్యాలు, అల్లసాని వాడంటే అల్లిక జిగి బిగి, ముక్కు తిమ్మన అనగానే ముద్దు పలుకులు, శ్రీ విశ్వనాథ అంటే వెంటనే 'జీవుని వేదన' స్ఫురించినట్లు, శ్రీ సుందరాచారి రచనల ప్రసక్తి వచ్చినప్పుడు ప్రసన్నత స్ఫురిస్తుంది. కొంతమంది సుందరాచారి మార్గ చ్ఛందస్సులో వ్రాయలేదు. వ్రాయనేరకనో ఏమో సులభసాధ్యము లైన ఆట వెలదులను, సీసాలను, తేటగీతులను ఆశ్రయించినాడని అపోహపడతారు. వారిని ఒకసారి సుందర సుధా బిందువులనే ఖండ కావ్య సంపుటిని చూడమని అర్థిస్తున్నాను. అందులోని వృత్తాలు అఖండ ధారా సమన్వితాలు. రచనా శిల్పము, శబ్ద వ్యంజకత, వర్ణనా శిల్పము, కథా కథనము అన్నిటినీ సమపాళ్లలో అమర్చు కొన్న కమనీయ కవితా ఖండికలవి. కవితా రసధునులైన ఆ చారు కవితల నుండి కొన్నిటిని ఉదహరిస్తాను. దగాపడిన ఆ సోదరి అఘాయిత్యానికి పూనుకొంటూంటే ఆమెను ఓదార్చుతూ 'సుప్రభాతాన' కవి అంటాడు :

"కనవా సాగర భైరవ ప్రళయ రాగావేశ సంచారముల్
వినవా ఘోరతరంగ తాండవ శిరో విన్యాస సంఘట్టనా
స్వనితానంత మహోగ్ర భీకర నిశా పైశాచికా క్రోశముల్
విను పాటుల్ వ్యిదళించి వేగిడును తన్వీ తెంపు పోనాడుమా"

భావోచిత శబ్ద సమన్విత సమాస నిర్మాణ కౌశలంలో అందె వేసిన చేయి శ్రీ సుందరాచారిదని చెప్పటానికే ఈ పద్యాన్ని ఉదాహరించినాను.

ఇక కవిత్వాన్ని గురించి శ్రీ సుందరాచారి వెలిబుచ్చిన అభిప్రాయాలను చూద్దాం. వారి కవితను కూడా ఈ ప్రమాణాలతోనే కొలవచ్చు.

"నిండు మనమ్మది పొంగి యేరులై పాఱెడు దాక
భావముల్ జారవు నా కలమ్ము వీడి" అంటారు సుందరాచారి.

"లలిత పదాలనేరి, మృదుళమ్మగు శయ్యనుగూర్చి భావముల్
తెలియగజెప్పి పామరుల తెల్వికి నంద పురాణ గాథలం
దలి పరమార్థ ధర్మముల తత్త్వము నింపి సలక్షణమ్ముగా
కలమును కట్టుతో నడిపి కైతల నల్లెద విశ్వశాంతికై"

అంటారు.

"భావుకులన్న పేరిటను వందలు వేలుగ దేశమెల్లెడన్
ఠావల మంది, నవ్యకవితా వనవాటుల కోకిలమ్ములై
భావము బంధము న్వదలి పల్కులనల్లి పదాలుపాడు పుం
భావ సరస్వతీయుతులు ఫక్కున నవ్విన నవ్వి పోవనీ !"

అన్నారు ఒకచో సుందరాచారి.

భాగవతం వ్రాయడానికి భక్తి కావలె, భారతం రచించడానికి భక్తి యుక్తి కావలె, రామాయణాన్ని రచించడానికి భక్తి యుక్తి శక్తి కావలె నంటారు విజ్ఞులు. శ్రీ సుందరాచారి ఈ మూడు కావ్యాలను వ్రాసినారు. వారిలో భక్తి, యుక్తి, శక్తి పుష్కలంగా ఉండినవి. సంగ్రహ భాగవతరచనచేసే సందర్భంలో నమకొంటాను — "అందుకు కావలసిన భక్తి నాలో ఇంకా ఏర్పడలేదన్న" అసంతృప్తితో కొంతకాలం ముద్రించకుండా గ్రంథాన్ని దాచిపెట్టారు. "అట్టికొదువతీరి అది సంస్కరింపబడి వెలుగు జూచు అవకాశాన్ని నా స్వామి శ్రీనివాసుడు నాకీయగలడని ఎదురు చూచుచున్నాడను" అని ఆత్మవిశ్వాసంతో చెప్పినారు సుందరాచారి.

"లోకమందు విషయ లోలత్వమునగల
జీవమెల్ల జుట్టి చేదుతోచి, చిత్రమునగను మారి, శ్రీనివాసా
యని చేయి మోడ్చినాను" అని ప్రార్థించినారు.

"కామ కలుష పూర్ణకాలాంబు నిధిలోన, కలయనీది యూది గట్టు చేరుగితులు కానరాక, కరుణానిధీ! నీదు చేయికోరి నాన"ని శ్రీనివాసుని ఆశ్రయించినారు.

"శాశ్వతంబు కాని చచ్చుబొందిని పెంచు, కర్మలందు మునిగి, కనులుమూసి, చేయరాని పనులు చేసితి, మాసితి, శిక్ష వలయు నాకు శ్రీనివాస" అని పరిదేవించినారు కవిలోని భక్తి, జీవుని వేదన ప్రస్ఫుటంగా కనబడుతుంది 'నా స్వామి' రచనలో. మానసిక భావసంఘర్షణ ఎంత తీవ్రంగా సాగినప్పటికీ, శ్రీ సుందరాచారి జీవిత పోరాటంలో ఒక విధంగా ఓడిపోయినారనే చెప్పవలె కానీ కావ్యప్రపంచంలో విజయ శిఖరాలెక్కి చిరయశస్కులైనారు. భక్తి, యుక్తి, శక్తులకు ప్రదర్శించి భారత సంస్కృతిని పరిరక్షించే మూడు కావ్యాలను ముద్దులొలుకు తెలుగు సుద్దులతో తీర్చినారు.

శ్రీ సుందరాచారి కవిత్వాన్ని పరిశీలించేటప్పుడు:

"Honest criticism and sensitive appreciation is directed not upon the poet, but upon the poetry"

అన్న ఒక ఆంగ్ల విమర్శకుని అభిప్రాయాన్ని గుర్తుంచుకోవలె.

"కమిటెడ్ కవిత్వాలు" "స్లోగన్ కవిత్వాలు" "కసి"తో వ్రాసే కవిత్వాలు, పాండిత్య ప్రకర్షను ప్రకటించుకొన్నందుకు వెలువడే కవిత్వాలు, కొత్త సీసాలలో పాత మధువుల్లాంటి కవితలమధ్య సతమతమయ్యే తెలుగు సాహితీ ప్రపంచంలో అప్పుడప్పుడూ విశుద్ధ కవితా సృజన జరుగుతూ ఉంటుంది. కనుకనే వెయ్యేళ్ళకుపైగా తెలుగు భారతి వెలుగుతూనే ఉన్నది. సుందరాచారి కవిత విశుద్ధ శాఖకు చెందిన కవిత. నిత్యనూతనమై, ప్రవాహశీలమై లోకుల పెదవులపై సజీవంగా నర్తించే భాషను ఎన్నుకొని తేటగీతులుగా మలచుకొన్నారు శ్రీ శంకరం బాడి.

''కృత్రిమానందము నీయ నవ్వలచు నట్లు నటించెడు భోగికాంత చక్కందము జూపి తన్వగల కామిని కావ్యసుమాంగికాదు'' అని

''పరుగిడు శబ్దజాలముల భావము చాలని పట్టులన్నిటిన్
మరుగిడు గారడీల గురుమార్గము నా కలవాటులేదు—నే
త్వరపడి పల్కు నొక్కటియు దండుగసేయను—భావవింతలో
నరకొరలున్నయంత మరియాదగ కైతకె స్వస్తిచెప్పదున్''

అని వారు కొన్ని విలువలకు కట్టుబడి కావ్యరచనలు సాగించినారు.

ఎక్కడ వెదకినా సుందరాచారి కవిత్వంలో అన్వయక్లిష్టత కనబడదు. అందరికీ అర్థమయ్యేటట్లు కవిత్వం వ్రాయడం ఒక ప్రత్యేక సాధనవల్ల వీలవుతుంది. అందువల్లే మహాకవి తన కవిత్వంలో తప్పకుండా అస్పష్టతకు, అగమ్యగోచరత్వానికి తావియ్యాలనటం ఆమోదయోగ్యంకాదు. సాహిత్య విమర్శనలో ఈ విచిత్రమైన భావం ఏలాగో ప్రచారానికి వచ్చింది. ప్రాచ్య పాశ్చాత్య సంప్రదాయాలు రెండింటిలో ఈ భావాన్ని ఆదరించే సాహిత్యాచార్యులున్నారు.

I. A. Richard అంటారు: "The truth is that very much of the best poetry is necessarly ambiguous in its immediate effect. Even the most careful and responsible reader must re-read and do hard work before the poem forms itself clearly and unambiguously in his mind."

శ్రీ విశ్వనాధ వారంటారు:

''మహాకవులు వాళ్ళ కవిత్వం అర్థమవటం సులభంకాదు. పాఠకుడికి గాఢభావన, సూక్ష్మచింతన, దీక్ష అవసరము.'' ఈవిధంగా మహాకవులను, వారి కవిత్వాన్ని పరిగణించడం సర్వజనాదరణీయంగా స్వీకరించలేము. ఒక్కొక్కచో మహాకావ్యము కఠినంగా కొఱుకరాని కొయ్యగా ఉండవచ్చునేమోగాని, మృదుమధురములై, తేనె సోనల్లాంటి పలుకులతో రమణీయములైన కవితలు మహాకావ్యత్వసిద్ధి పొందటానికి వీల్లేదని కొట్టిపారవేయలేము. బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు అన్నట్లు — ''లోకుల రసనలె ఆకులుగా గలిగినట్టివి వో కైతల్''. ఇది ఎలా సాధ్యమవుతుంది. ప్రజాహృదయాకర్షకమైన తీయని కవితలు లోకుల రసనలపై జీవిస్తాయి కాని కఠినాతికఠినములు, బండెడు భాషా చమత్కారాలతో అల్లబడిన కవితలుకావు. ఈ ప్రమాణంతో సమీక్షిస్తే ప్రసన్నకవి సుందరాచారి కవిత్వం ప్రసాదగుణ సమన్వితమై అందరికీ సులభ గ్రాహ్యమై ఉంది.

'మొపాసా' తన శైలిని గురించి ''నా శైలికి మూడు లక్షణాలున్నాయి. మొదటిది విస్పష్టత, రెండవది ఇంకా విస్పష్టత, మూడవది మరీ విస్పష్టత'' అంటాడు. సుందరాచారి కవితలో ఈ లక్షణమే కొట్టవచ్చినట్లు కనబడుతుంది. కవితాశిల్పంలో స్ఫురణ అన్నది ఒక ముఖ్యాంశము. స్ఫురణ అంటే కవి ఆశించి భావం పాఠకునికి చదువగానే సూటిగా స్ఫురించడం. ఇది భాశబలతవల్లనూ, చిత్రశబ్ద సమన్వయంవల్లనూ సాధించవచ్చు. శ్రీ సుందరాచారి రచనల్లో స్ఫురణ ఎక్కువపాలు భావశబలతవల్ల ఏర్పడిందేగాని శబ్దసంబంధికాదు. కనుకనే అవి ఉత్తమశ్రేణి చెందిన రచనలుగా పేర్కొనవచ్చు.

జాతీయాలు రచనకు జీవగఱ్ఱలు సుందరాచారి రచనలలో సందర్భశుద్ధితో ప్రయోగింపబడిన జాతీయములు కోకొల్లలు సుందరరామాయణంలో మంధర అంటుంది కైకతో:

''పడక చుట్టును నీకు కన్పడని పగిది
పరవి పెనుమంటలవి, నిన్ను దఱిసి దఱిసి
వచ్చి కాల్పగనుండగ, బిచ్చిదాన, వచ్చి కసుగందువలె
సుంతభయములేని దానవై పడియుంటివి'' అంటుంది.

ఇంకా, కౌసల్య, సుమిత్రల ''మోచేయిక్రింది గంజిని గడించి, తాగి బ్రతికెడు పెను దల్రాత నీదియ్యైన నేనేమిసేతు'' అంటుంది. ''నా చేతిబొమ్మ దశరథుడు'' 'గుండియ పుండుబడగ నేడ్చుట', పచ్చికసి నాటి పాపమెఱుగనట్టి పావను రాముని అమృతపూర్ణకలశమ్ములో బోతువేల?''; ''మధుర మకరంద మలదిన మచ్చుకత్తి'' ''కడుపులో చేయినిడి ఏదొ కలపినట్లు'' ''కసుల బూజు కప్పినట్టుల కన్పించు'' ''దుమ్మురేగ తిరిగి తిరిగి''లాంటి ఉదాహరణలను ఎన్నో చూపవచ్చు సుందరాచారి రచనలలో.

పిరదౌసి కావ్యంలో ఫిరదౌసి కవితను గుఱించి వ్రాస్తూ సుందరాచారి అంటారు:

''పక్వపద గుంభనము, కుంటుపడని నడక
భావసుగమత, రసపుష్టి పరిణతి గొన

పద్యములు. గూర్చుచుండు''–ఈ లక్షణాలు సుందరాచారి కవితలోనూ ఉన్నాయి పుష్కలంగా. ఫిరదౌసికి మల్లే ఆచార్యుల ''వారు వ్రాసిన మధుర కావ్యమ్ములన్నీ, వసుధకును మంగళంబిడ వ్రాయ, పడినవేకాని, వేఱొండు పగిదిగాదు. వంచనకు పూను నీచ భావాలు లేక''—

సుందర భారత రచన కుపక్రమిస్తూ ఆచార్యులు

''శ్రీకరమ్మును, దివ్యధర్మైక పథము, సకల వేదార్థ
సంపూర్ణ సారమయము
భారతమ్మును, సుందర భారతమున, సరళమధురాంధ్ర
వృత్తిని సంగ్రహింతు''

అన్నారు. సంగ్రహించి వ్రాసిన భారతంలో కవి స్వయంగా కల్పించే శిల్పానికి చోటెక్కడ ఉంటుందనే సంశయం కలగవచ్చు. కానీ అనేకచోట్ల తన కవితా వ్యక్తిత్వాన్ని ప్రస్ఫుటం చేసే విధంగా సుందరాచారి భారత రచన సాగించినారు. రారాజును గురించి ప్రస్తావిస్తూ —

''స్వార్థమును ఈర్ష్యతో గల్పి, పగయటన్న రోటిలోనూరి బువ్వగనోట
బెట్ట, గడుపునిండార ముప్పూట గుడిచి ఎదిగి నట్టి
పెనుకాయ మాతని దగుట నిజము.''

''గుడ్డి తేనికి, నీర్ష్యపై గొన్న సతికి, వేటు పడినట్టి గర్భాన వెడలినట్టి వికృత జన్మము వానిది, వెరికాని, చక్కబడు నెట్టులాతడు చచ్చువరకు'' అని పలికినారు. ఎంత చక్కదనము, ఎంత చిక్కదనము ఉన్నదో ఈ పద్యాలలో విజ్ఞులు పరిశీలించవలె. ఆంగ్ల విమర్శకుడు సర్. C. M. బౌరా, ఎపోలినెయిర్ రచనలనుద్దేశించి "The words are commonest words from the speech of every day, but they are none the less so fresh and lively that the attention is immediately arrested and held" అన్నాడు.

ఈ అంశము సుందరాచారి కవితలో ప్రత్యక్షరంలో కన బడుతుంది.

దీనికి ఒక దృష్టాంతంగా ''పాడు లోకము, పాపిష్టి ప్రజలుతూచి
బాగు నోగును తెలిచి పలుకలేరు
పలుకు పెదవులపై బుట్టి ప్రాకుచుండు''

అనే పద్యాన్ని పేర్కొనవచ్చు.

గేయ రచనలోనూ సుందరాచారి అందెవేసిన చేయి అని ఇదివరలోనే పేర్కొన్నాను. సుందర సుధా బిందువులలో సంకలిత మైన రచనలే ఇందుకు నిదర్శనాలు ఆయన కలం నుండి వెలువడిన ''మా తెలుగు తల్లికీ మల్లె పూదండ'' అనే గేయం తెలుగు తల్లి మంగళ గళసీమను అలంకరించింది. అది ఎన్నటికీ వాడని గుండు మల్లెపూదండ. రెండేళ్ళ క్రితం ప్రపంచ తెలుగు మహా సభలు జరిగిన సందర్భంలో ఈ గేయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గేయంగా ఎన్నుకోబడిన ఉదంతం అందరికీ తెలుసు.

సుందరాచారి ఆంగ్లంలో కూడా ప్రాసక్రీడలను నిర్వహించ గల ప్రతిభాశాలి. లోకసంతరణార్థమై అవతరించిన బుద్ధ భగవానుని చరిత్రాన్ని ఆంగ్లంలోనూ పద్య కావ్యంగా వ్రాసినారు.

"In the Golden days of old, Stood alone a Nation bold
It was Nepal's stately state, Free from all slavish fate"

అనే పద్యంతో కావ్యం ప్రారంభమవుతుంది. గౌతముడు పుట్టకమునుపు శుద్ధోధనుని రాచనగరును వర్ణిస్తూ అంటారు —

"Treasure was there and pleasure was there,
what was wanted was not there,
All is ill and heaven is hell, If a child is not to dwell"

తెలుగు బుద్ధ గీతలో ఇదే భావాన్ని

''ఎంతటెంతటి సిరులున్న నేమి ఫలము, ఎన్ని సుఖములు కలిగిన నేమి ఫలము
చంటి పాపడు నవ్వని స్వర్గసీమ, వల్లకాడుగ దోచును, కల్లగాదు'' అన్నారు.

శ్రీ సుందరాచారి స్వయంగా పండితజవహర్‌లాల్ నెహ్రూను సందర్శించి తన ఆంగ్ల బుద్ధ గీతను గానం చేసినప్పుడు నెహ్రూ ముగ్ధుడై ఆచార్యులను అభినందిస్తూ కౌగిలించుకొన్నారట.

శ్రీ సుందరాచారి అనువాద కవిత్వాన్ని కూడా చక్కని శైలిలో నిర్వహించినారు. విశ్వకవి రవీంద్రుని 'గీతాంజలి'ని తెనిగించినారు. శ్రీ విశ్వనాథగారు ఈ అనువాదానికి ఆముఖమిస్తూ ''ఇది ప్రధానముగా భావమును తీసికొని సులభాంధ్ర భాషలో మూలము యొక్క సౌకుమార్యము చెడకుండా, తెలుగు నుడికారము చెడకుండ చేయబడిన భాషాంతరీకరణ'' మన్నారు. శ్రీ విశ్వనాథ అన్నట్లు తప్పకుండా శ్రీ సుందరాచారి రచనలు ఈ యుగంలో ఒక ప్రత్యేక వాఙ్మయంగా ఏర్పాటవుతుంది.

సుప్రసిద్ధుడైన ఒక తెలుగు కళాకారుడు మహా కవిత్వాన్ని గురించి —

''మహాకావ్యం తల్లి ప్రేమలాంటిది
పువ్వుల అందం లాంటిది, పరిమళం లాంటిది—
వెన్నెల లాంటిది,మహాపురుషుడి మనస్సు లాంటిది''అన్నాడు.

ఈ విశేషణాలన్నీ సుందరాచారి కవిత్వానికి అన్వయిస్తాయి.



కన్యాకుమారిలో అరుణోదయము

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

ప్రాంత చీఁకటి బావిలో లోఁతునఁబడి
దిక్కు తెలియక మూల్గు నాదేసకుమెక్క
సమణి కంకణ పాణిపద్మమటు సాఁగి
వచ్చెఁ గన్యాకుమారి ప్రాగ్ద్వారసీమ.

రుచి రుచిరదీప్తుల నుషస్సరోజనయన
కాళ్లఁ బారాణి శోణరేఖలను దిద్ది
సాగర శ్యామ సీమాంత భాగములను
దడవుకొని వచ్చె నరుణమంత్ర స్వరమ్ము.

సప్తాశ్వములకుఁ బ్రస్థానావసరవేళ
రంగైన కుచ్చుతురాయి తీర్చి
చెలువారు దాసాన చెట్ల కొమ్మలరెమ్మ
లం దెఱ్ఱ విరుల కన్విందుఁగూర్చి
పద్మరాగమణి ప్రభాజవిస్థానమౌ
రోహణాద్రికిఁ బేశలోహలిచ్చి
తామ్రపర్ణీ సైకతములందు మెఱసెడి
కొసముత్తెముల రంగుపసలు తెచ్చి
నా యొకనికోసమట్లు ప్రాణస్పృశంబు
తలఁపుగా, సన్న సన్న మేల్కొలుపుగాఁగ
కడలి కూడలిఘోష మాగధుల గీతి
నాదమై ప్రొద్దుపొడిచెఁ గన్యాకుమారి.

అళికుల రావముల్ శ్రుతుల కాదట గొల్వఁగ నారికేళ తై
ల లవము పూఁత స్నాన సవిలాస సమార్ద్రముతా నరాళకే
రళ మహిళా సుదీర్ఘ చికురంబుల చిక్కొడలించు దువ్వెనల్
కలిత నవోషసంబులగు కాంతికరంబులు సోఁకి రంజిలెన్.

కోయిలల కన్నులును మావిక్రొంజివుళ్ల
కడలి కెరటాలతోఁ గుహూగళరవంబు
తాకళింతకుఁ దెచ్చెఁ గన్యాకుమారి
యాటతోట ననార్తవంబైన మధువు.

కన్యాకుమారిలో అరుణోదయము

కడలి గర్భమునుండి బడబాగ్ని సుందరి
తలయెత్తెనో జగద్దర్శనేచ్ఛ !
మంగళ స్నాతయౌ మాతృక చుట్టు చెం
గావి చీరలు నారగట్టఁబడెనో !
మధువ శేషోద్భూత మహా[illegible]ద్రుమ
శాఖాకిసాల శేషముల రుచులో !
బాల సూర్యోదయ పాకౌషధపుంజికి
త్సకుఁడు పేర్చిన యింగిలికపు శిలలో !
ప్రాగ్దిశాభిత్తికా చిత్రరచనసేత
చేర్చిన హొరంగు రంగు కుంచియలో ! యేమె
క్రమముతప్పి క్షణక్షణ భ్రమలుగొలిపి
తెలిపె నపవాద విధినిఁ బాటలిమ మొకఁడు.

అమృతమహస్సు హైందవ మహాంబుధినుండి 'యరేబియా' సము
ద్రమునను బంగళాజలధి, దార్కొని తాఁ ద్రిగుణాత్మకమ్ముకూ
రిమి భువనంబునం దవతరించిన కుంకుమ ప్రొద్దు పూర్వపూ
ర్వములకు నన్ను లాఁగికొనివచ్చె వినిద్రిత జీవభావమై.

శ్రీ వివేకానంద శిలమీఁదఁ దొలిచూపు
మలిచూపు శ్రీపాద మంటపమున
పరమేశ్వరీ పదాబ్జమ్మునఁ గుడికేలు
నెడకేలు రవళించు కడలిమీఁద
మందేహ దైతేయ మదముపై నొకకాలు
నొకకాలు చీఁకటి యిఱకటమున
దక్షిణ భారతీయక్షోణి నొకవెల్గు
నొకవెల్గు హైందవం బుత్తరమున

పఱచుకొనె నంటయును ద్వైతపరిచయంబ
కాని, యుగపన్మహోదయక్రాంతి భాస
మాన మాప్రొద్దులో నభిధ్యాన సరణి
గణ్య కన్యాకుమారి కారుణ్య మొకఁడె.

నయనము కోటి కోటి జననంబులుగా ననురాగవాసనన్
బ్రియపడి కాంక్షగొన్న ఫలమేయిది ! కాదని యందునేని నిం
ద్రియమున కింత శక్తియె !యతీతము రూపముగాని రూపమ
వ్యయము శివమ్ము సుందరమునౌ తనుఁ దాఁగను టెంతరక్తియో !

(మిగతా 67వ పేజీలో)

శ్రీ కలువకొలను సదానంద

నగ్నరాత్రి

(గతసంచిక తరువాయి)

9

మాట తప్పకుండా వచ్చిన మధురంతో పచ్చిశృంగారానికి పూను కున్నాడు దేవముని.

అతడికి యింతవరకూ పెళ్ళాంతో తప్ప మరో స్త్రీతో శృంగారానుభవం లేదు.

అంటే అతడికి పర స్త్రీ వ్యామోహం లేదనికాదు. అతడి కున్నంత వ్యామోహం దేవదానవులకుకూడా వుండదు. లేనిది ఒకటే! ప్రాప్తం!

అప్సరసలమీద అతడికి మనసుంది.

ప్రబంధ నాయికలందరి మీదా మోజుంది.

సినిమా తారలందరి మీదా ఇష్టముంది.

కంటబడిన ప్రతి కలకంఠిమీదా ఉబలాటముంది.

ఇవాళ ఒక్కసారిగా అందరూ వచ్చారు.

మధురంలో అందరూ వున్నారు.

మాయా ప్రవరుడి కౌగిట్లోంచి వరూధినిని విడిపించి తెచ్చాడు దేవముని. నలచక్రవర్తి గుండెల కిందినుంచి దమయంతిని లాక్కొచ్చాడు. అందర్నీ మధురంలో నిలుపుకొన్నాడు.

కిటికీలూ తలుపులూ బిడాయించాడు. గుండె తలుపుల్ని భళ్ళున తెరిచేశాడు. అందులోంచి ఆవురావురుమంటూ పిశాచాలు బయటి కురికాయి. కబంధుడి చేతుల్లాగా మధురాన్ని చుట్టేశాయి.

దేవముని ఆమె కురులు దిద్దాడు.

వీపు నిమిరాడు.

బుగ్గలు చిదిమాడు.

పెదవులు కొరికాడు

ఆమె ఒంటి మీది పొరల్ని వూడదీసేశాడు.

వివస్త్రను చేయబోయాడు

ఆమె నవ్వుతూ వొద్దంది. బ్రతిమలాడింది చేతులడ్డం పెట్టింది. తాబేలులా ముడుచుకుపోయింది.

దేవముని వినలేదు.

అతడికళ్ళ నిండా వెలుగులే!

'ఛీ! ఏం మగాడివి నువ్వు! ...లైటార్పేయ్...'

'లైటార్పేస్తే బ్యూటీపోతుంది. వెలగనీ!'

'ఉహుఁ...'

ఆమెను మంచం మీదికి తోశాడతను.

'ఛీ! చచ్చినోడా...'

మోటుగా ఆమె మీద పడ్డాడు

తలలో పువ్వులు నలిగిపోయాయి

కళ్ళలో కాటుక కరిగిపోయింది..

దేవముని తనను తాను మరిచిపోయాడు. ప్రబంధనాయకు డైనాడు.

'...మధురం!... నీ చనుదోయి దమయంతి కెక్కడిదీ.? ఆహా... నీ నడుము చూస్తే వరూధిని అసూయపడదూ?... నీ తొడలు చూస్తే మన్మథుడు రతీదేవిని వొదిలేస్తాడు... నీపెదాల్లో అమృతం వుందని తెలిస్తే దేవదానవులు మళ్ళీ పోట్లాడు కుంటారు...'

కిలకిల నవ్వింది మధురం.

ఆమె ఒళ్లంతా రక్కులు.

చెంపలనిండా పంటినొక్కులు.

క్రౌరతో పామును బాదినట్లు, జెట్టీలు పెనుగులాడినట్లు ఆమెను అనుభవించాడు దేవముని.

లేచి పక్కమీద కూర్చుని సిగరెట్టు వెలిగించుకుంటూ 'ఇప్పుడేమంటావ్? ఆడంగివాణ్ణని ఎగతాళి చేస్తావుటే నన్ను?' అన్నాడు విజయగర్వంతో.

'ఇలా అని తెలిసుంటే అసలొచ్చేదాన్నేకాను. అబ్బ, ప్రాణాలు తోడేశావు...' అందామె సన్నగా నవ్వుతూ.

దేవముని పొంగి పోయాడు.

'నా రాణివికదూ! తప్పే! ఈసారి అంతబాధపెట్టన్లే..'

'వొద్దుబాబూ! నీకు పుణ్యం వుంటుంది. ఇంకా నాలుగు రోజులు బతకాలినేను. నువ్విచ్చే నాలుగు రూకలకోసం ఇప్పుడే చచ్చి పొమ్మంటావా?' అంటూ వగలు పోయిందామె.

దేవముని మురిసిపోయాడు.

'పాపం,ఎంత బాధపెట్టానిన్ను!ఇంకోసారి పువ్వులాగాచూసు కుంటాలే! ఒట్టు!' అంటూ ఆమె బుగ్గగిల్లి పక్కన చేరాడు.

'మళ్ళీనా?' అంటూ పసిపిల్లలా జాలిగా రాగం తీసిందామె.

'ఒక్కసారే...'

'నీ చేతికి ఎముక లేదనుకో! అయితే వెధవ డబ్బుకోసం నడుం విరగ్గొట్టుకోమంటావా?...వొద్దు...'

'డబ్బేమిటే రబ్బరుబొమ్మా... నాప్రాణం యిమ్మన్నాయిచ్చే స్తాను... చేతుల్తో...'

ఒళ్ళంతా వెయ్యికళ్లు చేసుకున్నాడు దేవముని.

వెయ్యి ఏనుగుల బలం తెచ్చుకున్నాడు.

వెయ్యి మంది శృంగార పురుషుల చాతుర్యం అరువు పుచ్చు కున్నాడు.

ఆమె ఒళ్ళంతా ముద్దులు కురిపించాడు.

ఇసుక తిన్నెల మీద పరుచుకునే వడగాలిలా—ఆమెశరీరంలోని మిట్టపల్లాలన్నిటినీ తడిమాడు.

పురెక్కిన గోగునారలా ఆమెశరీరంతో తనశరీరాన్ని పెన వేశాడు.

మునిపళ్ళతో ఆమె పెదాల్ని కొరికాడు.

ఆమె నోట్లో నాలుక జొనిపాడు.

అడివినేలను దున్ని చదును చేసే బుల్‌డోజర్‌లా ఆమెను తొక్కి తుక్కు చేశాడు.

కొండకొమ్మున ముసురుకొన్న వానమబ్బులా కరిగి ఆమెలో కలిసిపోయాడు.

అప్పుడే పరుగుపందెం పూర్తిచేసిన వాడిలా రొప్పుతూ ఆమెను వొదిలేసి పక్కకు దొర్లాడు.

ఆమె కదలలేదు, మెదలలేదు. ఒళ్ళు దుంగలాగా పడివుంది. కళ్ళు మూతలు పడ్డాయి.

దేవముని మంచం దిగాడు.

లైటు నవ్వుతూ వుంది, పిశాచంలా.

దూరంగా వెళ్ళి కుర్చీ మీద కూర్చున్నాడు. సిగరెట్టు వెలిగించాడు. పుక్కిటినిండా పొగపీల్చి, గుప్పుగుప్పున వదిలాడు. పొగ సుళ్ళు తిరుగుతూ పైకిలేచింది. ఆ వలయాల నీడలు గోడల మీద అల్లి బిల్లిగా కదలాడుతూ చెదిరిపోసాగాయి.

లైటు నవ్వుతూనే వుంది, మత్తెక్కిన దయ్యంలా.

దేవముని లైటు వైపు చూశాడు. సన్నగా, తృప్తిగా, మత్తుగా, నవ్వుకున్నాడు. మంచం మీద నగ్నంగా పడుకునివున్న మధురం వైపు చూశాడు.

అరమోడ్పు కళ్ళతో అచేతనంగా పడివుందామె.

ఆమె ఒంటిమీద అతడిచూపులు అలాగే నిలిచాయి.

బంగారం పూత పూసినట్లు నిగనిగలాడుతోంది ఆమెఒళ్ళు. శరీరంలోని ఉన్నత భాగాలన్నీ—దేవుళ్ళ నెత్తిమీది బంగారు కిరీటాల్లా వెలిగిపోతున్నాయి.

ఎంత వాటమైన ఆడది!

గుర్రంలా వుంది!

గుమ్మెత్తించేసింది!

మేరునగంలాంటి దీని ఒంట్లో అమరిన శిఖరాల్లో, లోయల్లో ఎంతటి దివ్య సౌఖ్యాలున్నాయి!

ఇలాంటి రేయిని ఈ జీవితంలో చూడలేదు.

ఇంతటి హాయి వెయ్యి జన్మలెత్తినా రాదు.

స్వర్గానికి వెళ్ళినా, ఈ అనుభూతి మరపురాదు.

దీనిల్లు బంగారంగానూ, పదేళ్ళగా ఈ వృత్తిలో నలిగి పోతున్నా, దీని ఒళ్ళింత రంజుగా వుంది!

ఒళ్ళు నడలిపోతేనేం, వొండిపెట్టిన కోడికూరలా వుంది!

కండలు సాగిపోతేనేం, కుండలో మాగిన అంటు మామిడి పండులా వుంది!

ఆ చెంపలు... చెంపల మీద కెంపులు...

ఆ పెదవులు... పెదవుల మీద మధువులు...

ఆ ఉరోజాలు... వాటిలో ఉయ్యాల జోలలు...

ఆ పొత్తికడుపు... దాని మీద పొదిగిన పగడాల దీవిలాంటి బొడ్డు...

ఆ తొడలు... ఆ తొడలలో వేడి...

ఆ నడుము... ఆ ఊపు...

ఆహా! ఓహో!...

ఆ చెంపలు...

ఆ పెదవులు...

ఆ రొమ్ములు...

ఆ నడుము...

ఆ బొడ్డు...

ఆ నీడ...

ఆ తొడలు...

అవేమిటే... ఆ మోకాళ్ళమీద ?

ఆ తొడలు...

ఆ నీడ...

ఆ బొడ్డు...

ఆ నడుము...

ఆ రొమ్ములు...

ఏమిటదీ ... ఆ మోచేతి మీద ?

ఆ మోకాళ్ళ మీద...

ఆ మోచేతులమీద...

నల్లగా...

పగుళ్ళు వారి...

మినమిన లాడుతూ...

ఏమిటది ?

ఎందుకలా వుంది ?

ఆ మోకాళ్ళ మీద, ఆ మోచేతుల మీద – నల్లగా, పగుళ్ళు వారి, మినమినలాడుతూ – ఏమిటది ? ఎందుకలా వుంది !

దేవుడా !

ఏమిట్రా అది ?

ఎందుకురా అలావుంది?

ఎయ్యెయ్యెయ్యేమిట్రా అది ?

ఎయ్యెయ్యెయ్యెందుకురా అలా వుంది ?

దేవమునికి ముచ్చెమటలు పోశాయి.

కుర్చీలోంచి చివాలున పైకి లేచాడు. మంచం దగ్గరికి వెళ్ళాడు. చప్పుడు చేయకుండా మధురం పక్కన కూర్చున్నాడు. ఆమె మీదికి వొంగాడు. అతడి కళ్ళు బల్బుల్లోకి విద్యుచ్ఛక్తి ఉరవళ్లు తొక్కుతూ ప్రవహించింది.

గదిలో లైటు పగలబడి నవ్వుతోంది, మదమెక్కిన భూతంలా !

కాలి వ్రేళ్ళేమిటే, యిలా మొండిబారినట్లున్నాయి ?

చేతి వ్రేళ్ల కణుపుల మీద ఈ మచ్చలేమిటే ?

ఈ పెదాల మీద ఈ తెల్లటి పగుళ్లేమిటే ?

రావా ! ... కృష్ణా ! ... కేశవా ! ... మాధవా !... గోవిందా ! ... నారాయణా ! ... దీనబంధో !... దయాసింధో !...

'మధురం !' అంటూ దీనంగా పిలిచాడు దేవముని.

'ఊం ?'

'ఏమిటే యిది ?'

'ఏది ?' అంటూ కళ్ళు తెరిచిందామె.

'అదే, నీ కాళ్ళూ చేతులూ... '

మధురం ఉలికిపడి లేచి కూర్చుంది

బిత్తర పాటుతో ఆమె కనురెప్పలు రెపరెపలాడాయి.

ఆ కంగారు క్షణంలోనే మాయమై, ఆవిడముఖంలో బిత్తరినవ్వులు గుత్తులై పూచేయి.

పందెపు కోళ్ళకు కట్టిన చిరుకత్తుల్లాంటి నవ్వులు!

ఆకుదోటలో పూచిన అవిసె పువ్వుల్లాంటి నవ్వులు!

లేడిని చంపుతున్న పులిగోళ్ళలాంటి నవ్వులు !

ఎలుకను చీల్చి తింటున్న పిల్లి కోరల్లాంటి నవ్వులు!

'మాయలోడా! జలగలా పట్టుకున్నావ్ నన్ను!...ఎం...త సేపాయె నేనొచ్చి ! ఇంక నన్నొదిలిపెట్టు...' అంటూ గబుక్కున మంచం దిగింది. నేలమీద పడివున్న బట్టల దగ్గరికి నడిచి గబగబా లంగా, చీరా కట్టుకుంది.బాడీ, రవికా తొడుక్కుంది

'వుత్తమోటుమనిషి! అబ్బబ్బ... ఒళ్ళంతా నొప్పులెత్తి పోతుంటేను!... ఆడదాన్ని యిట్లాగేనా యమయాతనలు పెట్టేది? అంటూ నవ్వింది.

దేవముని నవ్వలేకపోయాడు.

'ఇంక నేను వెళ్ళిపోవాలి బాబూ!' అంటూ అతడివైపు చూస్తూ నుంచుంది.

అతడు బొమ్మలా కూర్చుండి పోయాడు, మంచం మీద.

'నాకు సెలవిప్పించరాద్రా బంగారుసామీ!'

'ఆ చొక్కా యిలా అందుకో!'

కొక్కేనికి వేలాడుతూన్న చొక్కాజేబులోంచి–మడతపెట్టిన నోట్లు అందుకుంది మధురం. అందులోంచి ఓ నోటు తీసుకుని, తక్కినవి జేబులోనే వుంచేసింది. తాను తీసుకున్న నోటును మడిచి రొండిలో చెక్కుకుంది.

'పది రూపాయలు తీసుకున్నానయ్యా పంతులూ ! వెళ్ళొస్తా నింక!' అంటూ వాకిలివైపు కదిలింది.

'ఒసేమధురం! నీఒంటిపైన ఆ మచ్చలేమిటో చెప్పవుటే?'

మధురం ఆగింది

'అవా?...అవేమంటే...అవి...అవి...'అంటూనవ్వసాగింది. ఆపుకోటానికి ప్రయత్నిస్తూ, ఆపుకోలేక ఉక్కిరి బిక్కిరైపోతూ, జడివానలా నవ్వింది.

పులిగోరులా, పిల్లికోరలా, కత్తి అంచులా, అవిసెపువ్వులా వాడిగా, వంకరగా, పదునుగా, అందంగా నవ్వింది.

ఆమెకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'ఎందుకలా నవ్వుతావు?'

ఆమె నవ్వులు తగ్గించింది. 'ఎందుకా? ఏడిస్తే ఏంలాభం? నవ్వాలి! నవ్వటం నేర్చుకోవాలి!'

అతడి దగ్గరికి నడిచిందామె.

'ఆ మచ్చలేమిటో చెప్పమంటావా ?'

అతడి జుత్తులోకి వేళ్ళుజొనిపింది.

'ఓ ముద్దియ్యి, చెబుతా !'

అతడికి ఒళ్ళు కంపరమెత్తింది!

'సరే, నేనే ముద్దెట్టుకుంటానుండు'అంటూ అతడి పెదాల మీద గట్టి ముద్దొకటి పెట్టింది. అతడు వెనక్కి జరిగాడు.

'నా ఒంటి మీదున్నవి మచ్చలు కావురా నా రాజా! నీ లాంటి మహారాజులిచ్చిన తీపి ముద్దులు!' అనేసి తలుపులు బార్లా తెరుచుకుని, వెలుపలి చీకట్లలోకి వెళ్ళిపోయింది మధురం.

ఒళ్లంతా చీమలు పాకాడినట్లయింది దేవమునికి. అతడి కనుపాపలు భయంతో పసిపాపల్లా క్యారుమన్నాయి. కుర్చీమీద పడివున్న తువ్వాలు అందుకుని గబగబా పెదాలు రుద్దుకున్నాడు. నాలుక పీక్కున్నాడు.

బయటినుంచి పొంచిచూస్తున్న చీకటి భళ్ళున నవ్వింది.

దడాలున తలుపులు మూసి గొళ్లెం పెట్టాడు.

లైటు గొల్లున నవ్వుతోంది !

వేవిళ్ళొచ్చిన ఆడదానిలా స్నానాలగదిలోకి పరుగుతీశాడు.

సబ్బుబిళ్ళ పూర్తిగా అరిగి పోయింది.

తొట్టిలోని నీళ్ళంతా తూములోకి ప్రవహించింది.

ఒళ్ళు రుద్దుకోలేక రెక్కలు పడిపోయాయి.

ఒళ్ళు తుడుచుకుని, ఉతికిన పంచె కట్టుకుని వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

మనసు కుదుట బడలేదు.

సిగరెట్టు అంటించాడ

గదినిండా పొగ !

గుండెనిండా పొగ !

ఆ మోకాళ్ళ మీద — ఆ మోచేతుల మీద — నల్లగా — పగుళ్ళు వారి — మినమినలాడుతూ — శ్రీ లక్ష్మీ వతద గోవిందా !

మొండిబారినట్లున్న ఆ కాలివేళ్ళ — చేతివేళ్ల కణుపుల మీద ఆ మచ్చలు — శ్రీ ఆంజనేయవరద గోవిందా !

పెదాల మీద ఆ నల్లటి పగుళ్ళు— నమః పార్వతీ పతే !

. వెధవముండ — వెత్త — బజార్ధ సరుకు — గజ్జికుక్క — అసహ్యం — ధగా— నయవంచకి— పాపాత్మురాలు—కృతఘ్నురాలు— ఎంత మోసం చేసింది?

అయ్యో,

దాని ఒళ్ళంతా ముద్దులు కురిపించానే !

ఇసుక తిన్నెల మీద పరుచుకునే వడగాలిలా — దాని శరీరంలోని మిట్టపల్లాలన్నిటినీ తడిమానే !

పురెక్కిన గోగునారలా దాని శరీరంతో నా శరీరాన్ని పెన వేశానే!

మునిపళ్ళతో దాని పెదాల్ని కొరికానే!

దాని నోట్లో నాలుక జొనిపానే!

అడివినేలను దున్ని చదునుచేసే బుల్ డోజర్‌లా దాన్నితొక్కి తుక్కు చేశానే!

కొండకొమ్మన ముసురుకొన్న వానమబ్బులా కరిగి, దానిలో కలిసిపోయానే!

అయ్యో ! అయ్యయ్యో!

రామా! కృష్ణా! కేశవా! మాధవా! గోవిందా! నారాయణా! దీనబంధో! దయాసింధో!...

అది అంటురోగం కదా!

ఆ తీపి ముద్దులు నాకూ వస్తాయంటావా కలియుగ వైకుంఠవాసా?

రక్షించుతండ్రీ రక్షించు! నీ వాణ్ణి! నీ దాసుణ్ణి! నిన్నే నమ్ముకున్న వాణ్ణి! నీ పాటలే పాడుతున్నవాణ్ణి ! నీ లీలలే పొగడు తున్నవాణ్ణి !

దేవమునికి నిద్ర దూరమైంది.

మనశ్శాంతి కరువైంది.

బజార్లంజా! ఎవరో మహరాజులు తీపిముద్దులు నీ కిచ్చి పోతే, నా కంట్లో మిరపొడి కొట్టి వాటిని నాకిచ్చి పోతావా?... నువ్వు సర్వనాశనమైపోతావు! దేవుడందుకే నీకు ఆ గతి పెట్టాడు. తప్పదు లంజా!

వత్సా, కవిశిఖామణీ! కథక చూడామణీ! నట శిరోమణీ! గాయక శమంతకమణీ! అంటు వ్యాధుల దగ్గర అలక్ష్యంగా

వుండకు నాయనా! అలాంటివి రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకో తండ్రీ !

ఏమిటా ముందు జాగ్రత్తలు ?

వైద్యులవారి నడుగు !

ఎవరా వైద్యులవారు ?

మనలాంటివారికి — వైద్యలింగంగాతే !

సరే, ఉదయమే వెళ్తాను. వైద్యోనారాయణో హరి !

ఆలోపల తీపిముద్దులు రక్తంలోకి పాకితే ?... ఆలస్యం అమృతం విషం !... ఇప్పుడే బయల్దేరు !

వైద్యులవారు నిద్రపోతుంటారు !

ఆయన మనకెప్పుడూ దగ్గరివాడే ! పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం ! తలుపుతట్టు ! సంగతి చెప్పు ! సూదివేయించుకో ! మాత్రలిప్పించుకో ! పో !

అయినా యింత రాత్రివేళ వెళ్ళటం ఏం బాగుంటుంది ? ఉదయం వెళ్తాను.

అమ్మమ్మమ్మా...అలా అనకు...ఇప్పుడే ... ఈక్షణంలోనే

వెళ్ళు...ఫరవాలేదులే...తెల్లవారనీ !

ఇలా బద్ధకిస్తే లాభంలేదు... బయల్దేరు !

బద్ధకం కాదనుకో...ఇప్పుడీ చలిలో... ఈ చీకట్లో ... నరసంచారం లేని వీధుల్లో...ఒంటరిగా... భయంగా... కుక్కలూ ...దయ్యాలూ...

చివరంటా కాలిన సిగరెట్టు — దేవముని చేతివేళ్ళ మధ్య అగ్ని సర్పంలా నవ్వింది. ఆ చురకకు అదిరిపడి, చేయి విదిలించాడతను.

పిచ్చివాడిలా పగలబడి నవ్వింది లైటు !

10

చీకట్లో ఊరంతా షికార్లు కొట్టి ఇంటికి తిరిగి వచ్చాడు పిచ్చిదొర. ఇంట్లో మధురం లేదు.

ఇల్లు తాళం వేసివుంది. తలుపు దగ్గర గజ్జికుక్క పడుకునివుంది. వాకిట్లో నిలబడ్డాడు పిచ్చిదొర. వీధి రెండువైపులా చూపులు సారించాడు.

'ఎక్కడ కెళ్ళిందో ఎర్రిముండ...'

ఇంటి ముందర అరుగు మీదెక్కి కూర్చున్నాడు.

చలి !

భుజం మీదున్న పాతగొంగలి తీసి కప్పుకున్నాడు.

'ఎప్పుడొస్తుందో ఎర్రి నాతల్లి...'

జీబురు గడ్డాన్ని వేళ్ళతో గీరుకుంటూ పిచ్చిగా నవ్వుకున్నాడు.

పెళ్ళాం యింట్లో వున్నా, లేకపోయినా ఆ అరుగుమీద పడి వుండటమే అలవాటయింది అతనికి.

తన పెళ్ళాం కోసం పరాయి మగాళ్ళు వస్తుంటారు. తలుపు గొళ్ళెం పెట్టుకుని, వాళ్ళతో లోపల పడుకుంటుంది ఆమె. అతడు బయట అరుగుమీద పడుకుంటాడు.

అప్పుడప్పుడూ పరాయి మగాళ్ళ దగ్గరికి వెళ్ళి వస్తూవుంటుంది మధురం. ఆమె కోసం ఎదురుచూస్తూ అరుగుమీద కూర్చుంటాడతను.

ఆమె అంటే అతడికెంతో జాలి.

అతడంటే ఆమెకు ప్రాణం.

అతడు చిల్లిగవ్వ సంపాదించలేదు. క్షణం తీరికలేదు వీధులన్నీ తిరుగుతుంటాడు. ఇంటికి ఎప్పుడొచ్చినా కడుపునిండా అన్నం పెడుతుందామె. ఆలస్యమైతే అతడికోసం ఎదురుచూస్తూ వాకిట్లో నుంచుంటుంది. 'వేళకు వచ్చి అన్నం తినిపోరాదూ ?' అని తిడుతుంది. అతడామె దగ్గర చంటిపాపలా మసలుకుంటాడు.

తలుపుదగ్గర పడుకున్న కుక్క చెవులు జాడించుకుని లేచి నిలబడింది. చెంగున అరుగుమీదికి గెంతింది.

'ఒసే నాయ్యాలా...నిద్దరాలేదూ? రాయిట్రా !'

కుక్క అతడి దగ్గరికి వచ్చింది. అతడు దాన్ని వాటేసుకున్నాడు. ఒళ్ళంతా దరిచాడు. గొంగలి ముసుగులోకి తీసుకున్నాడు.

'తలుపు దగ్గిర పడిగాపులుగాస్తున్నావ్. ఎక్కడికెళ్ళిందే మీ యక్క ?'

దాని అక్క అంటే ఎవరు ? మధురమే !

అతడికి పెళ్ళామన్నా, గజ్జికుక్కలన్నా అసహ్యం లేదు. ఆత్మీయత వుంది.

'కుయ్...కుయ్...' మంది కుక్క.

'ఏందో నీ మొహం !'

వీధి చివర మరో కుక్క మెల్లగా మొరిగింది.

ఒడిలోవున్న గజ్జికుక్క అటూ యిటూ మెదిలింది. గొంగళి ముసుగులోంచి తల బయటపెట్టి తొంగి చూచింది.

వీధి చివర మొరిగిన కుక్క వీధిలో చకచకా నడిచిపోతూ అరుగుముందర ఆగింది. పిచ్చిదొరవైపు చూస్తూ కుయ్ కుయ్ మంది.

ఒడిలోవున్న గజ్జికుక్క అతడి చేతుల్లోంచి బయట పడటానికి ప్రయత్నిస్తూ 'కుయ్ కుయ్' అంది.

'ఓసే నాయ్యాలా! వాడికోసరమేనా యిట్లా విలవిల్లాడి పోతున్నావ్ ? ...పో! అంటూ దాన్ని కిందికి జారవిడిచాడు పిచ్చిదొర.

కుక్కలు రెండూ మూతీ మూతీ వాసన చూసుకున్నాయి. చెవులూ చెవులూ కొరుక్కున్నాయి. అలిగినదానిలా పాక వెనక్కి వెళ్ళిపోయింది గజ్జికుక్క. అలకదీర్చే చిలిపి కృష్ణుడిలా వెంట నడిచింది, వెతుక్కొచ్చిన కుక్క.

మధురానికీ, ఆ గజ్జికుక్కకూ తేడా ఏముంది?

పదేళ్ళకిందట ఆమె గజ్జికుక్కకాదు. సీత! సావిత్రి! సుమతి! అనసూయ!

రాక్షసులు సైతం నీతి తప్పని ఆ రోజుల్లో సామాన్య స్త్రీలుకూడా సాధ్వీలలామలు కాగలిగారు.

దేవతలకైనా నీతిలేని ఈ రోజుల్లో—సీత చెడిపోయింది. సావిత్రి వెలయాలయింది. సుమతి గజ్జికుక్కయింది అనసూయ బజారు ముండయింది.

ఆ గజ్జికుక్క, ఆ బజారుముండ — మొగుణ్ణి వొదిలెయ్య లేదు!

పెళ్ళాం బజారుపాలు కాకముందు దొరసామి పిచ్చివాడు కాదు. కల్యాణరాముడు! కారుణ్యధాముడు!

మధురం చెడిపోవటానికి కారణం ఎవరు?

మనం!

దొరసామికి మతిచెడిపోవటానికి కారణం ఎవరు?

మనం!

మన శరీరంలో ఓ అవయవం ఓ పనిచేస్తే అందుకు బాధ్యత ఎవరిది?

మనది!

మన శరీరానిది!

మన శరీరంపైన ఆధిపత్యం వహిస్తున్న మనస్సుది!

మనలో ఒకడు తప్పు చేస్తున్నాడు.

మనలో కొందరు తప్పులు చేస్తున్నారు.

ఆ అపరాధం ఎవరిది?

ఆ తప్పుల్ని మనం సహించలేకపోతే, వాళ్ళను మనం క్షమించలేకపోతే — ఆ అపరాధం మనదికాదు. వాళ్ళది!

ఆ తప్పుల్ని మనం సహించగలిగితే, వాళ్ళను మనం క్షమించగలిగితే — ఆ అపరాధం వాళ్ళది కాదు.

మనది!

మనం నిర్మించుకున్న వ్యవస్థది!

మనం ఔదల దాల్చి అందల మెక్కించి ఊరేగిస్తున్న సామాజిక న్యాయానిది!

ఐదేళ్ళక్రితం పెళ్ళిచేసుకున్నాడు దొరసామి. పుత్తడిబొమ లాంటి పెళ్ళాంతో కొత్త కాపురం పెట్టగానే, రిట్రెంచ్‌మెంట్ ఘాతబడ్డాడు. ఆలివి పోషించటానికి అభయహస్తంలా వుండే కొన్న అకెండరు ఉద్యోగం తుట్టిముక్కల మేడలా అల్లాలాడింది.

'నీ సర్వీసు రెండేళ్ళేగదా? అందరికంటే ముందు మీరే పోతావ్!' అన్నారు ఆఫీసర్లు.

ఆకలితో ఆవురావురుమంట్లూ కంచం ముందు కూరు న్నాడు అంచాల బకాసురుడు.

నౌకరీ కాపాడుకోవాలన్న ఏకైక లక్ష్యంతో పైవాళ్ళకి నైవేద్యం పెట్టక తప్పలేదు.

పైకం థాలదన్ని పెదవి విరిచారు పైవాళ్ళు.

వడ్డీకాసుల వేంకటేశ్వరుడిలా, మొక్కులు తీర్చే మూలల దేవుడిలా ఆ వూళ్ళో వెంచేసియున్న అకిలాలీ దగ్గరికెళ్ళి తన తాకట్టుపెట్టి వందరూపాయలు పుచ్చుకున్నాడు, దొరసామి.

పైవాళ్ళు తృప్తి పడ్డారు.

ఉద్యోగం మాత్రం ఊడిపోయింది.

ఆఫీసుల చుట్టూ అప్పుల్తో తిరిగాడు దొరసామి.

ఆఫీసర్ల అనుగ్రహం కోసం పడిగాపులు పడ్డాడు.

పైవాళ్ళు పెదవి విరిచారు.

పైకి చూశారు.

పైకి చేతులెత్తి పైనున్న దేవుణ్ణి చూపారు.

వాళ్ళకి కనిపించిన దేవుడు దొరసామికి కనిపించలేదు.

బతుకు భారమైంది.

శాంతి దూరమైంది,

పుట్టుక నేరమైంది,

పస్తులున్నాడు. పెళ్ళాం పుస్తెలమ్మాడు.

కడుపునిండా నీళ్ళు తాగి, కళ్ళనిండా నీళ్ళుపెట్టుకున రిద్దర్నూ.

సంవత్సరం దొర్లిపోయింది.

అప్పులు తీరలేదు. నిప్పులు ఆరలేదు.

ఓపిక చచ్చిన అప్పులవాళ్ళు వేటకుక్కలైనారు.

అకిలాలీ పీకలమీద కూర్చున్నాడు.

సంకరజాతిమృగంలా వికృతంగా పెరిగింది, సంవత్సరం వడ్డీ

అప్పుల చవిటిపర్రలలో అల్లనటతీరని ప్రయాణమైం బతుకు.

ఆ చవిటి పర్రలనిండా అల్లిబిల్లిగా, అడ్డదిడ్డంగా, అడుగు కదలనివ్వకుండా మొలిచాయి వర్డీలు — బొమ్మజెముడులాగా, ఈతమొక్కల్లాగా, చీకిపొదల్లాగా.

ఒళ్ళు చీరేశాయి ఆ ముళ్ళు!

చియ్య ఒలుచుకుతినే చీవాట్లతో, ఆత్మను కోకవిప్పి కొప్పు పట్టి లాగే అవమానాలతో దాగుడుమూతలాడాడు దొరసామి.

'ఆ సాయిబు చీటికీ మాటికీ వొచ్చి చీవాట్లుపెట్టి పోతున్నాడు. వాడి అప్పుతీర్చేయరాదూ ?' అంది మధురం.

'ఎలా తీర్చమంటావ్?...' అంటూ నిట్టూర్చాడు దొరసామి.

ఆమె అతడి కళ్ళలోకి చూచి తలదించుకుంది.

'వాడి మాటలు వినలేక చస్తున్నాను...నువ్వేమో యింట్లో వుండవు...'

రెణ్ణెల్లపాటు కడుపుగట్టి కూడబెట్టాడతను.

కూలీనాలీ చేశాడు.

మూటలు మోశాడు.

బండిలాగాడు.

అడివికెళ్ళి కట్టెలు మోసుకొచ్చి అమ్మాడు.

ఒళ్ళు గుల్లయింది.

రెక్కలు ముక్కలయివాయి.

మనిషి ఎముకలగూడైనాడు.

ఓరోజు రాత్రి చాలా పొద్దుపోయి యింటికి వచ్చాడు దొరసామి.

ఇల్లంతా చీకటిగా వుంది.

'మధురం...' అన్నాడు.

సమాధానం రాలేదు.

అగ్గిపుల్ల గీచి దీపం వెలిగించాడు.

గడ్డ కట్టిన చీకటిలా బెంగగా గోడకు చేరగిలబడివుంది మధురం.

'చీకట్లో కూచుని ఏం చేస్తున్నావే ?'

కళ్ళార్పకుండా అతడివైపు చూచిందామె. కళ్ళు నీటి ఊటలైనాయి.

'ఎందుకే అలా వున్నావు ?'

మధురం ఏడుపు దిగమింగలేకపోయింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

అతడు ఆమె పక్కన చతికిలబడ్డాడు. ఆమెను తన ఒడిలోకి తీసుకుని కన్నీళ్ళు తుడిచాడు. 'ఏం జరిగిందో చెప్పరాదూ?' అన్నాడు లాలనగా వీపు నిమురుతూ.

ఆమె కొంగుతో ముక్కు చీదుకుని 'అకిలాలీ వొచ్చి పోయాడు...' అంది.

'వొస్తే ఏం ? ...అప్పేకదా అడిగాడు...అంతమాత్రానికి ఏడవటం దేనికీ ?'

'అప్పే అడిగుంటే నాకెందుకు బాధ ?...'

'ఇంకే మడిగాడు ! '

మధురం మళ్ళీ ఏడ్చింది. ఏడుస్తూ చెప్పింది.

ఆరోజు మునిమాపువేళ యింటివాకిట ప్రత్యక్షమయ్యాడు అకిలాలీ.

'ఒరేయ్ దొరసామీ !' అన్నాడు.

మధురం లేచివెళ్ళి తలుపుచాటున నుంచుని, తల బయటకు పెట్టింది.

అకిలాలీ ఆమె కళ్ళలోకి చురుగ్గా చూసి, నీ మొగుడు లేడటే ?' అన్నాడు

'లేడు !'

'ఎక్కడ చచ్చాడు ?'

'తెలియదు.'

'ఎప్పుడు చస్తాడు ?'

'తెలియదు.'

అకిలాలీ సన్నగా నవ్వాడు. 'ఇంకేం తెలుసు నీకు ?'

'అప్పుతీర్చటం చేతకానివాడు అప్పులు చెయ్యటం ఎందుకు? అడంగి వెధవ !' అంటూ చొరవగా యింట్లోకి నడిచివచ్చాడు.

'ఈరోజు వాడొచ్చేంతవరకూ వుండి సంగతి తేల్చుకోవాల్సిందే !' అంటూ పాతనులకమంచం వాల్చుకుని కూర్చున్నాడు.

మధురం నివ్వెరపోయింది.

అతడామెవైపు ఓరగంట చూచి నవ్వుతూ, 'బతకలేనివాడికి పెళ్ళామెందుకూ ? పస్తులుపెట్టి చంపటానికా ? ... పెళ్ళాన్ని సుఖపెట్టటం చేతకాని ఫకీరు నాకొడుకులక్కూడా పెళ్ళాలు కావాలి ! మొలకు కోక కొనివ్వలేకపోయినా, మోజుకేం తక్కువలేదు !' అంటూ విగాసం దువ్వాడు.

సిగ్గుతో చచ్చిపోయింది మధురం.

అకిలాలీ లేచిపోలేదు. మంచంమీదే కూర్చుండిపోయాడు. మరదలికోసం వచ్చిన మేనత్తకొడుకులా.

ఆమెకు ఎన్నో మాటలు చెప్పాడు.

చెవిటిదానిలా అన్నీ విన్నది మధురం. చచ్చిన చెట్టులా చలనం లేకుండా నిలబడిపోయింది. తలుపుదగ్గిరే !

పాపం, నిన్నుచూస్తూంటే నాకు జాలేస్తోందే! ఆడపుట్టక పుట్టి మోడులా బతుకుతున్నావు. ఆడది ఆడదిలాగానే బతకాలి. ఆనందంగా బతకాలి. కట్టుకున్న పెళ్ళాన్ని సుఖపెట్టలేని మొగుడు వాడేం మొగుడు !

నీ చక్కదనాన్ని చుక్కలెత్తుకుపోనూ, రామచిలకలా వున్నావు, ఏం లాభం ? అప్పుతీర్చలేని మొగుడి దగ్గర—అన్నం పెట్టలేని మొగుడి దగ్గర—ఇసకలోపోసిన విస్కీలా ఇంకిపోతున్నావు! ఒక నగలా ? ఒక చీరలా ? ఒక సుఖమా ? ఒక సంతోషమా ? ఏముంది ఎంగిలి కంచాలు తప్ప ?

ఆ ముఖం చూడు, ముక్కుపుడకైనా లేదు !

ఎంత పాత చీరైనా, అన్ని చిరుగులా ?

ఆ కడుపు చూడు, ఎలా ఎండిపోయిందో ?

ఛీ ఛీ ఛీ, వాడూ ఒక మగాడేనా ?

మట్టిగుర్రాన్ని నమ్ముకుని ఏట్లో దిగావు, పాపం !

నారెండో పెళ్ళాం సంగతి చెబుతా వింటావా ? దాని మొగుడూ యిట్లాగే; పెళ్ళాన్ని సుఖపెట్టలేని బికారి నాకొడుకు ! అడిగితే, అప్పిచ్చాను. అప్పు తీర్చలేకపోయాడు. ఇంక నీ మొగుడు నా అప్పు తీర్చలేడు, నువ్వు నా యింటికొచ్చేస్తావా అన్నాను వాడి పెళ్ళాంతో. చెప్పిందే చాలని చక్కా వొచ్చేసింది. వాడు నా యింటి దగ్గరికొచ్చి లబోదిబోమన్నాడు. అదేం చేసిందీ ? చేటపుచ్చుకుని దబాదబా వాయించింది. ఇప్పుడది నా యింట్లో రాణీలా బతుకుతూ వుందనుకో ! అది కట్టే చీరలు ఈ వూళ్ళో ఎవరూ కట్టరు. దానికున్నన్ని నగలు యింక ఏ ఆడదానికీ వుండవు. నాదగ్గరి కొచ్చినాక, నాకు ముగ్గురు పిల్లల్ని కనింది. ఇప్పుడు మళ్ళీ కడుపుతో వుంది. మొదట దానికి తాళికట్టినోడు ఈ వూళ్ళోనే వున్నడనుకో...వాడి బతుకు వాడిది !

ఏమంటావ్ ?

నీ మొగుడికి భయపడుతున్నావా ?

ఛూత్, వాడూ ఒక మొగుడేనా ?

నువ్వు ఊఁ అంటే చాలు, నీ పైన ఈగ వాలనిస్తానా ?

పువ్వుల్లోపెట్టి పెంచుకుంటా నిన్ను !

ఎండ కన్నెరక్కుండా రాణివాసంలో ఉంచుకుంటాను !

వాడంతగా ఏడుపు మొహం పెడితే మరో రెండు వందలు వాడి మొహాన పారేద్దాం, ఏరుకుతింటాడు.

ఏమిటే, మాట్లాడవు !

మధురం కొయ్యబారిపోయింది. ముఖం జేవురించింది. కళ్ళు ఎర్రబడ్డాయి. కాళ్ళు చేతులు గడగడలాడాయి.

'సరే, యిప్పుడు తొందరేముందిలే ? తీరిగ్గా ఆలోచించుకో ! మళ్ళీ రేపు సాయంత్రం వొస్తాను...ఏది, కాసిని మంచి నీళ్ళు పట్రా !'

నుంచున్న చోటినుంచి కదల్లేదు మధురం.

'కదలనంటావేమే ?' అంటూ పైకిలేచి ఆమె దగ్గరికి నడిచాడు అకిలాలీ.

'నా మాటలు నమ్మలేకపోతున్నావా ?' అంటూ ఆమె భుజాలమీద చేతులు వేశాడు.

అతన్ని దూరంగా నెట్టేసి వీధిలోకి పరిగెత్తింది మధురం.

ఈ ఉదంతం మొగుడికి చెప్పి, కక్కేసుకున్న దానిలా పక్క మీదికి సోలిపోయిందామె.

దొరసామి ఒంట్లో దావానలం ప్రాకింది.

నెత్తురు కుతకుత లాడింది.

నెత్తురు బుసబుస పొంగింది.

నెత్తురు పరవళ్ళు తొక్కింది.

నెత్తురు ఆవిర్లు కక్కింది.

నెత్తుటి ఒత్తిడికి గుండె ఊగిసలాడింది.

నెత్తుటి ఉరవడికి ఒళ్ళు నిప్పుగోళమైంది.

అతడి కళ్ళలో నెత్తురు నాల్కలు చాపింది.

అతడి పిడికిట్లో నెత్తురు కత్తులు దూసింది.

అప్పుడతడు దొరసామికాదు.

ప్రళయతాండవం చేస్తున్న పరమశివుడి ఎర్రకన్ను!

ప్రళయతాండవం చేసి బానిసవాడెగరేసిన ఎర్రజెండా!

అతడు పెళ్ళాన్ని గుండెలకు హత్తుకున్నాడు. ఆమెనుదురు మీద ముద్దెట్టుకున్నాడు. 'వాడు చెప్పింది నిజమేనే! నేనూ ఒక మొగుణ్ణేనా? అలాంటివాడ్నైతేనే నిన్ను సుఖపెట్టగలడు...' అన్నాడు డగ్గుత్తికతో.

'నేను నీకు బరువైతే ఒక్కసారిగా చంపేయ్ నన్ను. ఇలాంటి మాటలనకు!' అంటూ అతడి గుండెలమీద కన్నీళ్ళు కార్చిందామె

ఆ రాత్రి అతడు నిద్రపోలేదు.

అతడి గుండెలో అగ్ని చల్లారలేదు.

మరునాడు పోస్టాఫీసుకు వెళ్ళి, పొదుపు చేసిన డబ్బంతా తీసుకున్నాడు. లెక్కపెట్టి జేబులో వుంచుకున్నాడు. అటునుంచి మూరేసినా, ఇటునుంచి మూరేసినా ఒకే పొడవున్న కోకలాగా—ఎటుతిరగేసినా ఒక్క రకంగావున్న బ్రతుకులాగా—రెండువందలా ఎనభైరెండు!

ఆ రోజు అకిలాలీ యింటికి వెళ్ళాడు దొరసామి.

వసారాలో కూర్చుని వున్నాడు అకిలాలీ.

ఇంట్లోకి వచ్చిన దొరసామిని చూచి అతడి నోట మాట లేదు.

'నీకు రావాల్సిన అప్పెంత ?' అన్నాడు దొరసామి.

'సంవత్సరంపైన రెండు నెలలయింది. అసలు వంద, వడ్డీ వందా డెబ్భై అయిదు. మొత్తం రెండువందలా డెబ్భై అయిదు.'

'ఇందా, తీసుకో !'

డబ్బు లెక్కపెట్టుకుని లోపలి గదిలోకి వెళ్ళబోయాడు అకిలాలీ.

'ఆగు. అప్పు తీరిపోయిందా

'తీరిపోయింది.'

'ఇప్పుడు చెప్పు, నా పెళ్లాన్ని ఎంతకు కొంటావ్ ?'

'ఏమిట్రా ? పరాచికాలాడుతున్నావా ?'

'పరాచికాలు కాదు. నిజమే ! అన్నానికి గతిలేనోడికి అలూ చూలూ ఎందుకు ?... అమ్మేస్తాను ... ఏమిస్తావు ?'

'ఏంకావాలి ?'

దొరసామి వికృతంగా నవ్వాడు. నడుములోంచి కత్తి లాగాడు. 'నీ ప్రాణం కావాలి !'

అకిలాలీకి నిలువెల్లా వణుకు పుట్టింది. చారల మెకానికి బారెడు దూరంలో నిలబడ్డ వాడిలా చావుకేకలు పెట్టాడు.

దొరసామికి కంగారు పుట్టుకొచ్చింది.

కడుపుకు గురిపెట్టి బలంగా ఒక్క పోటు పొడిచాడు.

అకిలాలీ వెనక్కి తిరగడంతో కత్తి వీపున గుచ్చుకొంది.

ఇల్లెగిరి పోయేలా కేకలు పెట్టాడు అకిలాలీ.

'చచ్చాన్రా దేవుడా...చంపేశాడ్రా నాయనోయ్...' అంటూ తెగిపోయిన పుచ్చకాయలా దొర్లుకు పోయి, వీదిలో పడ్డాడు.

బిలబిలమంటూ వాకిట్లో జనం పోగయ్యారు.

'పట్టుకోండి ... పట్టుకోండి పిచ్చిలంజకొడుకును ...' అన్నారు.

పిరికితనం నరాల్ని మెలితిప్పేసింది.

దొరసామి దిక్కులు మరిచిపోయాడు.

చిక్కబలం కొద్దీ పరుగందుకున్నాడు.

పైనపడిన వాళ్లను దులిపి పారేశాడు.

ఎదురొచ్చినవాళ్ళను విదిలించి పారేశాడు.

చీర దొంగిలించుకుని పారిపోయే జగదేక వీరుడిలా తిరిగి చూడకుండా పరుగుతీశాడు.

ఊరి పొలిమేరలు దాటుకున్నాడు.

వెట్లూ పుట్టలూ ఛాటుచేసుకున్నాడు.

వంకల వెంట, వాగుల వెంట పరుగులు పెట్టాడు.

అంతే ! మళ్ళీ ఎవరికీ కనిపించలేదు

అప్పడగట్టానికొచ్చిన అల్లాటప్పయ్యలా అకిలాలీకి సలాం చేసి వెళ్ళిపోయింది మృత్యువు.

గండం గడిచి గట్టెక్కాడు అకిలాలీ.

దొరసామిని దొరకబుచ్చుకోటానికి నరసింహావతారమెత్తారు పోలీసులు.

పది రోజుల తర్వాత పక్కనున్న అడవుల్లో గాలించి పట్టుకున్నారు.

మూడేళ్ళ కఠిన శిక్షపడింది దొరసామికి.

అతడు మధురాన్ని మళ్ళీచూడటం—ఆ మూడేళ్ల తర్వాతనే!

అతడు చూసింది మధురాన్ని కాదు.

చెడిపోయిన సీతను !

వెలయాలుగా మారిన సావిత్రిని !

సాటుక్కుక్కగా మారిన సుమతిని !

బజారు ముండగా మారిన అనసూయను

ఆడది కంటబడగానే, అవకాశాలను గురించి ఆలోచించే వాళ్ళు నూటికొక్కరు చొప్పున వుంటారు. నూటి కొక్కడేచాలు— నూర్గురి పెళ్లాలను గురించి ఆలోచించటానికి, వీలైతే వాళ్ళను ముంచటానికీ !

గతిలేనివాడి కడుపున పుట్టి గజ్జెలగుర్రంలా ఎదిగిన మజ్జిగముంత...

సిరిలేని వాణ్ణి కట్టుకుని చిరుగులకోక కట్టుకున్న పెరుగు ముంత...

రోగిష్టి మొగుడితో భోగాలు అనుభవించలేని మీగడగిన్నె...

పెనిమిటి వొదిలేసిపోయిన వెన్నకడవ...

జోలె పట్టుకు తిరుగుతున్న జున్నుపాలు...

డబ్బున్న పిల్లులకు ఈ ఉట్లు దగ్గరగానే కనిపిస్తాయి !

మొట్టమొదట మధురాన్ని చెరచినవాడు భవనరాజా !

ఆ వూళ్ళోని గూండాలందరూ అతడి కనుసన్నల్లోనే బ్రతుకుతున్నారు.

గండుపిల్లి గుడ్లు మిటకరించే గొడ్డు చీకట్లో గూండాల చేత ఆమెను తెప్పించుకుని, గోరిల్లాకు మల్లే మీద పడ్డాడు. ఆమె మొత్తుకుంది. మొరపెట్టుకుంది. ఆమె అంగీకారంతో నిమిత్తం లేకుండా, ఆమె తిరస్కారంతో ప్రమేయం లేకుండా, ఆకలైన

తోడేలు ఆశలుడిగిన కుందేలును చంపుకుతిన్నట్టు ఆమెను అను భవించాడు బసవరాజు.

రెండోవాడు అకిలాలీ. ఆమె ఇంట్లోనే దూరి తలుపు గొళ్ళెం పెట్టాడు. అడ్డుపడిన వాళ్ళేలేరు.

మూడోవాడు శేషఫణి. డబ్బిస్తా రమ్మన్నాడు. ఆమె రానంది. వారంరోజుల తర్వాత వెళ్ళింది, డబ్బుకోసం!

ఆమె చెడిపోయింది.

చెడిపోకుండా వుంటే పస్తుల్ని సహించేదే! పస్తుల్తో చచ్చి పోయేదే! కానీ చెడిపోయిన తర్వాత పస్తులుండటం తెలివితక్కువ అనుకుంది.

ఆ వూరివాళ్ళకు ఆమె నందనవనంలా కనిపించింది. ఆ నందనవనానికి గేట్లులేవు. కడుపుకోసం వాటిని విరగ్గొట్టేసిం దామె. అందులోకి అందరూ నడిచివెళ్ళారు.

ఆమెను పొందనివాడు షాపాత్ముడు!

జైలునుంచి తిరిగివచ్చిన మొగుణ్ణి కన్నకూతురులా కరుచు కుని 'నేను చెడిపోయాను మామా...నాబతుకు బుగ్గిపాలయింది మామా...' అంటూ బావురుమంది మధురం.

కాస్సేపు అతడి గుండె ఆగింది.

...శ్వాసఆగింది.

రక్తప్రసరణం ఆగింది.

కనురెప్పలు ఆగేయి.

మెదడుమాత్రం ఆగలేదు. రంగులరాట్నంలా గిర్రున తిరిగింది.

దొరసామి వెన్నవూసలా మృదువుగా నవ్వాడు.

ఎండుటాకులా గలగలా నవ్వాడు.

పిడుగుల వానలా ఫెళ్ళున నవ్వాడు.

గుండె పగిలిపోయేలా, ఊపిరితిత్తులు తూట్లుపడిపోయేలా, రక్తనాళాలు చిట్లిపోయేలా, కనుగుడ్లు పేలిపోయేలా—నవ్వాడు.

శరీరంలోని నెత్తురంతా కన్నీళ్ళుగా మారి, చెంపలు తడిశాయి.

అతడు ఆమెను అక్కున జేర్చుకున్నాడు. కొనవ్రేళ్ళతో కన్నీళ్ళు తుడిచాడు. చెంపలు నిమిరాడు. ఆమెను భుజం మీదికి వాల్చుకుని, మెల్లగా వీపు తట్టాడు.

ఆమె ఒడిలో నిద్రపోయాడు.

తెల్లవారుతూండగా నిద్రలేచాడు దొరసామి. పెళ్ళాంవైపు చూచి, ఆమె నివ్వెరపోయేలా వెర్రినవ్వులు నవ్వాడు.

నెలలూ ఏండ్లూ గడిచిపోయాయి. అన్నీ పోగొట్టుకున్న పిచ్చిదొరకు ఆఖరున దక్కినవి ఆ పిచ్చినవ్వులే!

అతడికి మనుషులమీద ద్వేషంలేదు

పీడించటం; పీడను సహించటం— రెండూ మనిషి స్వభావాలే! బలవంతుడు బలహీనుణ్ణి మనిషిగా బ్రతకనివ్వటంలేదు. అది వాడి అజ్ఞానం! తెగబడితే తానూబలవంతుడేనని బలహీనుడు తెలుసుకోలేక పోతున్నాడు. అదివాడి అజ్ఞానం! మనిషి మనిషిగా గుర్తించబడాలంటే ఎవడికి వాడు ఏకాకిగా ఎగబడితే లాభంలేదు. అందుకు కావలసింది ఐకమత్యం. 'అది బలవంతుల్లో వుంది. బలహీనుల్లో లేదు ఐక్యమత్యంతోబలహీనుల్ని బానిసలుగా చేసుకోవడం మహా అజ్ఞానం!

ఈ అజ్ఞానమే దేశాన్ని పరిపాలిస్తోంది.

దేశాన్ని ప్రేమించు!

అజ్ఞానాన్ని చెప్పుతో కొట్టు!

అజ్ఞానిని క్షమించు!

అజ్ఞానాన్ని క్షమించకు!

రవిగాంచనిచో కవిగాంచునే కదా?

...ఏమిటీ వాడిబొంద!

అజ్ఞానాన్ని పోగొట్టలేని రవిని క్షమించకు!

అజ్ఞానాన్ని చిక్కబరిచే కవిని క్షమించకు!

అందర్నీ క్షమించాడు పిచ్చిదొర.

ఒక్కణ్ణి మాత్రం క్షమించలేకపోయాడు.

ఆ ఒక్కడూ ఎవరు?

దేవముని!

అతన్ని చాలాచోట్ల చాలాసందర్భాల్లో చూశాడు పిచ్చిదొర. అతడు దేవుడి ఆస్థానకవి!

దేవుడి ప్రతినిధులైన ధనవంతుల దగ్గరికి దేవుడంపిన అరణపుకవి!

పారమార్థిక సభల్లో పాల్గొంటాడు దేవముని. పేటలోని పెద్దల్ని పొగిడి తన లౌకికజ్ఞానాన్ని ప్రదర్శిస్తాడు.

హరికథలు చెబుతాడు. వరహాలిచ్చిన వాళ్ళకు వరాలిస్తాడు.

పెద్దవాళ్ళ పెండ్లిండ్లకు పద్యాలురాసి చదువుతాడు.

ఎన్నికల కరపత్రాలు రాసిపెడతాడు. ఎలక్షన్ పాటలూ, బుర్రకథలూ రాసిస్తాడు.

'మనజిల్లా మణిదీపాలు'— అనేశీర్షికతో బసవరాజుల్ని గురించి, అకిలాలీల్ని గురించి, శేషఫణుల్ని గురించీ స్థానిక పత్రికలో వ్యాసాలు రాశాడు.

'స్వాతంత్ర్యలక్ష్మి' అనే పుస్తకం రాసి బసవరాజుకు అంకిత మిచ్చాడు.

'శ్రీవేంకటేశ్వరశతకము' రాసి అకిలాలికి అంకితమిచ్చాడు.

'నీతికథాగుచ్ఛము' రాసి శేషఫణికి అంకితమిచ్చాడు.

దేవుడి దయతో, దేవుడి ప్రతినిధుల అండదండలతో రేపో మాపో ఘనసన్మానం చేయించుకో బోతున్నాడు.

పండిత శాలువ కప్పుకుని ప్రజలకు దూరంగా, ప్రభువుల గుమ్మాల వెంట తిరిగే దేవమునికి 'ప్రజాకవి' అని బిరుదివ్వ బోతున్నారు, ఆవేదిక మీదే!

ఈదేశంలో ప్రజలు దేవుణ్ణి నమ్ముకుని దిక్కులేనివాళ్ళయి నారు.

ఈ దగాపడిన తమ్ముళ్ళకు యింకెవరు దిక్కు?

విద్యావంతులు! రచయితలు! మేధావులు!

మేధావి స్వార్థపరుడై మేత మరిగితే, వాడిమేథస్సు నేమ నాలి ?

మట్టిగడ్డ !

ధనిక వర్గాన్ని కమ్మేసిన అజ్ఞానమే వీళ్ళనూ కమ్మేసింది. సోలెడు సుఖంతో జోలెనింపుకుని 'ఇదే స్వర్గం' అనే స్థితికి దిగ జారిపోయారు.

జానెడు కడుపుకోసం జాలిడేగలైనారు.

కలిగిన వాళ్ళ యిళ్ళకు కావలికుక్కలైనారు.

దేవమునిలో మేధావిని చూశాడు పిచ్చిదొర.

ఆ మేధావిలో నక్కను చూశాడు.

'నక్కనాయాలు! రెండుసార్లు వాడి దుంప తెంచానీరోజు!'

నవ్వుకున్నాడు పిచ్చిదొర.

గాజుల చప్పుడయింది.

తలెత్తి చూశాడు.

మధురం వచ్చింది. తలుపుతీసి లోపలికెళ్ళింది.

పిచ్చిదొర మళ్ళీ తలొంచుకున్నాడు. కప్పుకున్న గొంగలిని మరింతగా బిగదీసుకున్నాడు.

పాక వెనక్కి వెళ్ళిన కుక్కలు రెండూ 'కయ్యి కయ్యి' మంటూ ఒక దాన్నొకటి గుంజుకొంటూ జంటగా వీధిలోకి వచ్చాయి.

ముఖానికి అడ్డంపడివున్న ముసుగును తొలగించాడు పిచ్చి దొర.

'ఛా, నాయ్యాలా అప్పుడలెల్ళి, యిప్పుడెందుకే ఏడుపు ? కష్టమూ సుఖమూ రెండూ పక్కపక్కనేవుంటాయని తెలవదూ ? నాయ్యాలా— సద్దూ!''

పాక లోపల్నుంచి సన్నగా ఏడుపు వినిపించింది.

పిచ్చిదొర ఉలిక్కి పడ్డాడు.

లేచి లోపలికి వెళ్ళాడు.

మోకాళ్ళ మీద తల వాల్చి ఏడుస్తూ్తంది మధురం.

పిచ్చిదొర ఆమె పక్కన కూర్చున్నాడు. ఆమె తలమీద చెయ్యివుంచి 'ఎందుకేడుస్తున్నావే ఎర్రిమొగిమా ?' అన్నాడు.

ఆమె తలపైకెత్తింది. ఆమె కళ్ళు జాలిగా వున్నాయి. కుమిలిపోతున్న ఆమె గుండెలు ఎగిరెగిరి పడు తున్నాయి. చీర తొడలమీదికి లాక్కుని 'నా ఒళ్ళు చూడు మామా' అంది.

ఆమె ఒళ్ళంతా తడిమి చూశాడు పిచ్చిదొర.

అతడి కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

'ఏమిటే యిది ?... ఓసే, ఏమిటే యిది...'

అతడి మీదికి ఒరిగి కుమిలి కుమిలి ఏడ్చిందామె.

'ఆ పంతులుగాడు చూడనే చూశాడు...'

పిచ్చిదొర కళ్ళలో వింతనీడలు కదిలాయి.

'పంతులు గాడెవుడే?...ఆడేనా?'

'ఆ దేవమునిగాడు!'

పిచ్చివాడి ముఖంలో ఆశ్చర్యం అచ్చుపడింది.

'ఇందాకా ఆడి దగ్గిరే ఉండొస్తున్నావా?'

'ఔను!'

చాపమీదికి ఒరిగింది మధురం. రెప్పలు మూసి చీకటి గంతల్ని కళ్ళకు కట్టేసుకుంది.

పిచ్చిదొర కళ్ళలో నిప్పులు రాజుకున్నాయి.

కూర్చున్న చోటినుంచే ఇల్లంతా కలయజూశాడతను.

పొయ్యిదగ్గర కట్టెపుల్లలమీద ఒళ్ళుమరిచి నిద్రపోతోంది కత్తి, ఎవరికోసమోకలలుగంటూ.

పిచ్చిదొర పైకిలేచాడు.


ఆ కత్తిని చేతికందుకున్నాడు.

ఇంట్లోనుంచి బయట అడుగు పెట్టాడు.

చీకటి గజగజలాడింది,

అజ్ఞానానికి తంతివార్తపంపింది, దాక్కోమని!

(ఇం కా వుం ది)


క్రొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్టమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.
AMRUTANJAN
LTD'S
SPECIAL GRADE
CASTOR
OIL
SUPERIOR
PURE REFINED
AND ODOURLESS
NET CONT. 200 ML LOT No.
Manufactured by
AMRUTANJAN LTD.
UPPAL — HYDERABAD
MADE IN INDIA
మూడు
సైజులలో
లభిస్తూంది:
50 మిలి
100 మిలి
200 మిలి
OBM 8270 TG

కవి కోకిల

డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం

ఎప్పుడో ! ఏ త్రేతాయుగంలోనో
మామిడి కొమ్మెక్కి కూసిందో
కోయిల.
ఆ కొమ్మేపచేళిమ కవితాశాఖ.
ఆ కోకిల కవికోకిల.

కుహూకుహూరావాలా అవి ?
'రామ' 'రామ' మధురకూజితాలు.
ఆ మధురాక్షర సంపుటిలో
సంక్షేపించింది సహస్రనామాలేకాదు
సకల మానవ ధర్మాలు.
నికషోపల భారతీయ జీవనాలు.

సమ్మోహ పరచిందా సంపుటి
సమానంగా, సరసంగా
సామాన్య జనానీకాన్నేకాదు
అసామాన్య ధీమాన్యుల్నికూడా.

ఆ మధుర కూజితాలకన్న
మిన్నగా కవిత్వం ఇంకారాలేదు.

'కవి' అంటే నిజంగా కోకిలే
'కోకిల'ంటే నిజంగా కవే.
కవి – కోకిలానుబంధాన్ని
గుర్తించలేని కవులు కొందరు
కవి సమ్రాట్టులో, కవిచక్రవర్తులో
అవుతారేమో కాని
కవి కోకిలలు కాలేరు.

కవి కోకిల కావాలంటే
ఎంత తపస్సు చేయాలో !
వాల్మీకి కావాలి మున్ముందు
ఆపైనే కవికోకిల కాగల్గేది.

ఏమి కాంక్షించి కూసిందీ కోకిల ?
ఏమని సందేశమిచ్చిందీ వాల్మీకి కవి
కోకిల ?

"నన్ను విస్మరించండి
నా రాముడ్ని సదా సంస్మరించండి.
నా రూపు చూడకండి
ఆ రూపాన్నే తిలకించండి.
రామరాజ్యం స్థాపించండి
క్షేమరాజ్యం చేకూర్చండి
ధర్మరాజ్యం పాలించండి.
రామో విగ్రహవాన్ ధర్మః
రామ స్సత్య పరాక్రమః
రామోరాజీవలోచనః".

తన జాతి తన్నే తలచుకోవాలని
తనకే జన్మదినోత్సవాలు జరపాలని
తన సంస్మరణం ఏమరరాదని
ఏమేమో ఆశిస్తాడు మహాకవి.
తన పదసంవిధాన విధానం
తన అనల్ప కల్పనా చమత్కృతి
అనన్య సామాన్యాలు
నాన్యో తోదర్శనీయాలంటాడు.
పదిమందిచేత పలికిస్తాడు
మహిమోపేతమైన పాత్రసృష్టిలో
జాతీయాదర్శాల నున్మీలించలేనికవి
ఆకాంక్షించేది యిట్టిస్తుతుల్నే.

రామునివంటి ఆదర్శ తనయుడ్ని
ఆదర్శ శిష్యుడ్ని, ఆదర్శ సోదరుడ్ని
ఆదర్శ సఖుడ్ని, ఆదర్శ పతిని
ఆదర్శ ప్రభువును, ఆదర్శ శత్రువును
అఖిలాదర్శాలకే ఆదర్శమైన మూర్తిని
సృష్టించటంలోనే లీనమై
తనదంటూ ఏమీ కానరానీకుండా
కరిగిపోయిన కవి–వాల్మీకి.
తాను మహోన్నతంగా పెరిగిపెరిగి
గిరియై

రామాయణ గంగను ప్రవహింపజేసి
ప్రజాహృదయ క్షేత్రాలను
దివ్యకేదారాలు కావించి
అపార భావ సస్యాల్ని పండించి
రామసాగరంలో లయం చేసాడు.

రాముడి శిలావిగ్రహంచేసి
గుడిగోపురాల్లో కూలేసి
రామ భజనలు కావించటం
రామ సంస్మరణం కావచ్చునేమోకాని
రామునిలా జీవించటమే
సజీవ సరస రామసంస్మరణం.
నిత్యజీవనంలో అతనిలాగా
సత్య పరాక్రమం చూపాలి.
క్షేమరాజ్యానికి పర్యాయపదం
రామరాజ్యం నెలకొల్పాలి.
అదే ప్రజాస్వామ్యరాజ్యం.

మూఢభక్తి యిదేమిటని
గాఢంగా ప్రశ్నిస్తారు కొందరు–
అన్యథా అనేక విధాల
మూఢంగా ప్రవర్తిస్తు.

ఆధునిక లోకాని కాయన
ఆదర్శం ఏమాత్రమని
ఆరాటిస్తారాధునికులు.
అవగాహనలేని ఆలాపాలు.
రామచరిత పారమ్యక్రమం
ఏమాత్రం తెలియని ప్రలాపాలు .
రాముని ధర్మాదర్శం అత్యాధునికం
సకల ప్రకృతితో సమరస భావంతో
సరసంగా జీవించటమే రామాదర్శం
అట్టి సమరస జీవనమే రామాయణం
ఆటవికులతో, అల్లరి కోతులతో,
రాక్షసులతో, మహర్షులతో

కడకు రావణ బ్రహ్మతోను
మైత్రీభావంతో మనటమే
అతులిత రామాదర్శం.
ఇది అసమర్థపు సజ్జనత్వంకాదు
శ్రుతి మనోహర వీణానినాదం.

సమరస జీవనమంటే ఎన్నడు
నమ్మిన సత్యాన్ని వమ్ముచేయటం కాదు
తా నమ్మిన సత్యాన్ని ప్రతిష్ఠించటానికి
అఖిల శక్తులు ధారపోయాలి.
ఎంతటి త్యాగానికైనా సిద్ధంకావాలి
దీన్నే విజేతృశీలమని వర్ణించారు
విశ్వకవులు రవీంద్రులు.

ఇట్టి శీలంతోనే రాముడు
కాకాసురుడ్ని రాపాడి జయించాడు
రావణుడ్ని నిర్వీర్యంచేసి నిర్జించాడు.

ఈ ద్వివిధ శక్తుల సమ్మేళనమే
ఆదర్శ మానవజీవితం.
అందుకే రాముడాదర్శ మానవుడు.

ఆత్మ విశ్వాస రహితులై
అర్హత లేకుండా ఆశిస్తు
అధికారుల కదుగడుగునా
మడుగు లొత్తుతు
తాము నమ్మిన సత్యమనేదేలేకుండా
తమ్ము నమ్మిన సత్యాన్ని వమ్ముచేసే
ఆధునికులంటే అమితా సహ్యం.
ఏ కోశాన వెతకి చూచినా
సంకోచమే విజేతృత్వం.

ఏవం విధశక్తి ద్వయం
ఏవిధంగా లభించింది రాముడికి?
సమరస జీవన విధాన
రహస్యాలన్నీ నూరిపోసాడు
ఆవసిష్ఠ మహర్షి వరిష్ఠుడు .
అదే సమగ్ర జీవిత విధానం కాదని
తన శిష్యత్వమే చాలదని
విజేతృత్వ సముపార్జనానికి
విశ్వామిత్రుడుతో పంపాడు.
ఇరువురి శిష్యత్వంతో
పరిణతి పొందాడు రాముడు.
సమరస విజేతృశక్తుల
సరస సమ్మేళనం రామాయణం.
అందుకే అది మానవాళికి నిత్యం
ఉపాదేయం, పాథేయం.

రామాయణానుభవ
జీవన పరాయణులకు
సమకూరుతుందీ శక్తిద్వయం.
ఇదే మన జాతీయ విధానం
దీనితోనే యీ జాతి సర్వం
సర్వతంత్ర స్వతంత్ర జాతిగా
అసత్యంనుండి సత్యానికి
తమస్సునుండి జ్యోతికి
మృత్యువునుండి అమృతత్వానికి
వెల్గుబాటలు వెలార్చుకొని
త్రివిక్రమ పరాక్రమంతో
జైత్రయాత్ర సాగిస్తుంది.

ఈ మధుమయోజ్వల మార్గదర్శి
రామకవి — కవికోకిల.
ఆ కవి కోకిలకు
నా సుమనస్సుమాంజలి.

కన్యాకుమారిలో అరుణోదయము

(53 వ పేజీ తరువాయి)

చెమరుచు కన్నులై వడఁకు చేఁగవ మ్రోడ్పులు నై జపాభిశో
ణిమ మది నెమ్మదిన్ గొన నణీయముగా వినిపించు విశ్వ వి
శ్వమున 'తమేవ భాంత మనుభాతి' యటన్న శ్రుతిప్రతిధ్వనుల్
ద్యుమణి శశాంక వహ్ని తటి దుజ్జ్వలతల్ తనలో మిడుంగుఱుల్.

విరహ విచ్ఛేదములురాని వెలుఁగు—దుఃఖ
దురితములు లేని వెలుఁగు—బంధూకపుష్ప
బంధువై బోధకళికఁ జేపట్టు వెలుఁగు
నాఁటి యరుణోదయమ్ము కన్యాకుమారి.

త్రిగుణసంగమ మీ మహాబ్ధిఁబడి సాఁగు
జీవనౌకల కమవస చీఁకటులను
దారిఁజూపు దీపస్తంభ దర్శనముగ
వరలుఁ గౌ మారి నా స్వాగ వజ్రరోచి.

ఆంధ్రగీర్వాణఛందము

ఆధునికయుగమున నాంధ్రసాహిత్య చరిత్రలో అనవరతము స్మరింపదగిన భాషోద్ధారకుడు బ్రౌను. అతడు రచించినదే యీ కృతి.

ఆంధ్రగీర్వాణ ఛందము

ఇప్పటికి 150 యేండ్లక్రింద అనగా క్రీ. శ. 1827లో బ్రౌను పాశ్చాత్యులకు సంస్కృతాంధ్ర ఛ్ఛందస్సుల పరిచయము గలిగించుటకు ఇంగ్లీషు భాషలో దీనిని రచియించియున్నాడు. ఈ గ్రంథము నేడు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వారు ముద్రించియున్నారు. క్రీ. శ. 1827లో అప్పటి కుంపిణి ప్రభుత్వమువారు ముద్రించిన యీ గ్రంథము నేడు పునర్ముద్రణము చేసి వెలుగులోనికి తెచ్చినందులకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వా రత్యంతము నభినందనీయులు.

ఈ గ్రంథమునకు ప్రధాన సంపాదకుడు జి. యన్. రెడ్డి. సంపాదకుడు బంగోరె. ప్రధాన సంపాదకుడు వ్రాసిన ''ముందుమాట'', సంపాదకుడు వ్రాసిన ''చారిత్రాత్మక పీఠిక'' గలవు. ఈ రెండును ఆంగ్లభాషలోనే యున్నవి. గ్రంథమాంగ్ల భాషలోనే వ్రాయబడినను, మూలము మాత్రము తెలుగుననే యున్నది. సంస్కృతము తెలుగు లిపిలో గలదు. మూలగ్రంథమున 105 పుటలు, 4 అనుబంధములున్నవి. గ్రంథాంతమున పాశ్చాత్య సంస్కృత విద్వాంసుల జీవిత సంగ్రహములు — ఇంగ్లీషులోను, తెలుగులోను పదానుక్రమణికలు గలవు. ఇది గ్రంథస్వరూపము.[1]

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమువారు బ్రౌను పరిశోధన ప్రణాళికను చేపట్టి ప్రకటించిన గ్రంథములలో నిది రెండవది. ఈ ప్రణాళికలో మొదటిది ''బ్రౌన్ లేఖలు''. దీనిని నేను 1977 జూన్ 'భారతి' (పుటలు 48–57)లో సమీక్షించుచు నిట్లు వ్రాసినాను :

''పై రెండు గ్రంథములు సమీక్షార్థమై నాకు పంపబడినవి. అందు మొదటిదైన''బ్రౌన్ లేఖల''ను గూర్చినదే యీ సమీక్ష. దీని తరువాత రెండవ గ్రంథము చేయుదును.''

ఈ రెండవ గ్రంథమగు 'ఆంధ్రగీర్వాణఛందము' కూడ విశ్వవిద్యాలయ ముద్రతో వెలువడిన పరిశోధన గ్రంథము కాబట్టి విశ్వవిద్యాలయ పరిశోధనా పద్ధతుల స్థాయినే దీనిని కూడ సమీక్షించుచున్నాను.

గ్రంథము పేరు

ఈ గ్రంథముపేరు—''ఆంధ్రగీర్వాణఛందము'' అని అట్టపైని గ్రంథముఖ పత్రమున స్పష్టముగా నున్నది. కాని బ్రౌను కాలమునందే ముద్రింపబడిన ప్రథమ ముద్రణమున ''ఆంధ్రగీర్వాణచ్ఛందము'' అనియే కలదు. దీనిని నిర్ధారణ చేయుటకు నీ గ్రంథముననే యీయబడిన ప్రథమ ముద్రణ ముఖపత్రము నిచ్చుచున్నాను.

ఆంధ్రగీర్వాణచ్ఛందము

The
Prosody
of the
Telugu and Sanscrit
Languages
Explained

By Charles Philip Brown
of the Madras Civil service

Madras
Printed at the College press 1827.

'ఆంధ్రగీర్వాణచ్ఛందము' అని బ్రౌను ముద్రించినదే సరియైన రూపము.

'ఆంధ్రగీర్వాణ ఛందము' అని విశ్వవిద్యాలయమువారు ముద్రించిన రూపము సరియైనది కాదు.

బ్రౌను తెలుగు భాషయందేగాక సంస్కృత భాషలోకూడ పండితుడు. సంస్కృత భాషలో పాణినీయము నాత డధ్యయనము చేసినాడు. పాణినీయమున, 'ఛ'కారము సమాసమున హ్రస్వముపై వచ్చునపుడు ద్విత్వమగును. దీర్ఘముపై వచ్చునపుడు వికల్పమగును. ''స్తోశ్చునాశ్చుః''–''ఆఙ్మాఙోశ్చ''–''దీర్ఘాత్''–''పదాన్తాద్వా'' అని పాణినీయ సూత్రములు. (8–4–48–51) వీనిచే హ్రస్వములపై 'ఛ' పరమగునపుడు ''తుక్'' ప్రత్యయము వచ్చును.

అందువలన ''ఆంధ్రగీర్వాణ + ఛందము. ఆంధ్రగీర్వాణ + తుక్ =ఆంధ్రగీర్వాణ + తు= ఆంధ్రగీర్వాణ + తే + ఛందము= ఆంధ్రగీర్వాణ చ్ఛందము అని రూపమేర్పడినది.

పై నాలుగు సూత్రములును అప్పకవి తన గ్రంథమున వ్యాఖ్యానించినాడు. చూడుడు:

సీ. ''ఛాగపుచ్ఛచ్ఛటాచ్ఛందోయదృచ్ఛాసి
        తచ్ఛత్ర పద్మచ్ఛలాదలాచ్ఛ
    విచ్ఛిత్తి కచ్ఛప కచ్ఛ పరిచ్ఛేద
        వృచ్ఛాచ్ఛ విచ్ఛుర తుచ్ఛ గుచ్ఛ

1 ఆంధ్రగీర్వాణ ఛందము—సి. పి. బ్రౌను — సంపాదకుడు. బంగోరె. పుటలు 123. వెల : 20–00

పదములు మొదలైన త్రిదశ భాషా శబ్ద
ముల నాదిమధ్యాంతములను గలుగు
సప్తమ వ్యంజనాక్షరము హ్రస్వముమీదఁ
దనక్రింద దాన ద్విత్వమగుచుండు

గీ. నిడుదలఁ నక్కరంబుల కుడిని నిలుచు
నప్పుడ వికల్ప కంబున నట్లన యగు"
(బంధుర నివాస చంద్రికాభ దరహాస
భర్మమయవాస శ్రీకామె పలి పురీశ!) (2–38)

పై పద్యమున — త్రిదశ భాషా శబ్దముల నాది మధ్యాంత మున గల్గు సప్తమ వ్యంజనమనగా —ఛ— (క వర్గము క, ఖ, గ, ఘ ఙ — 5. చ వర్గము — చ ఛ లు — 2)...ఇది హ్రస్వములపై పరమగునపుడు ద్విత్వమగును అని చెప్పబడినది. అందువలన — 'ఆంధ్ర గీర్వాణ చ్ఛందము' అని సరియైన రూపను.

పై వివరణమును బట్టి "ఆంధ్ర గీర్వాణ చ్ఛందము" అనియే ముద్రితము కావలెను. ఈ ఒక్క విషయమే బ్రౌను సంస్కృత వ్యాకరణము నందెంత పండితుడో, గ్రంథ నామమును గూడ ముద్రించుట యందెంత శ్రద్ధ వహించి జాగరూకుడై యుండెనో మనకు తెలియగలదు.

కీర్తిశేషులైన వఝ్ఝల వారు తాము వ్రాసినప్పుడు ద్విత్వముగానే వాడిరి. "ఆంధ్ర చ్ఛందస్సు" (ఇది వ్యాసము) — (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక 1918). ప్రస్తుత గ్రంథము విశ్వ విద్యాలయ పునర్ముద్రణముగాన దీనిని గూర్చి యింత ప్రస్తావింప వలసి వచ్చినది. ప్రాజ్ఞులు గ్రహింతురు గాక.

ప్రధాన సంపాదకుడు తన "ముందు మాట" లో నీ గ్రంథ మును గూర్చి తెలుపుచు, బ్రౌను తొలిసారిగా తెలుగు చ్ఛందస్సును గూర్చి తులనాత్మక పరిశీలన చేసినవాడనియు నీ గ్రంథమట్టి పరి శీలనకు తోడ్పడుననియు, నిది చిరకాలముగా లభ్యముగాకుండుటచే తిరిగి ముద్రించితిమనియు వ్రాసినాడు కాని గ్రంథమందలి విశేష ములను గూర్చి ప్రస్తావింపలేదు.

సంపాదకుడు తాను వ్రాసిన పీఠికకు—'చారిత్రాత్మక పీఠిక' యని పేరు పెట్టి, — అందు గ్రంథ ముద్రణమును గూర్చి చరిత్ర దెలిపినాడు. ఆతడే తన పీఠికలో తాను చరిత్ర మాత్రమే తెలుపు చున్నాననియు, ఛందస్సు విషయకమైన చర్చయింతయు విడిచి పెట్టినాననియు స్పష్టముచేసియున్నాడు. గ్రంథస్థమైన విషయము లందులో కూడ లేనిహేతువుచేత, నీ గ్రంథము నందలి ఛందో విషయములు, ఇతర విశేషములు, లోకమునకు వెల్లడింపవలసిన యావశ్యకత ఏర్పడినది.

ప్రస్తుత సమీక్షయందు గ్రంథస్థ విషయములకు ప్రాధా న్యము నిచ్చుచున్నాను. ఇందు తొలుత గ్రంథమున విషయసూచిక, గ్రంథ రచన యందవలంబింపబడిన పద్ధతులు దెలిపి, ఆ వెనుక నీ గ్రంథము నుండి, బ్రౌను గూర్చి మనకు లభ్యములైన నూత నాంశములను దెలుపుచున్నాను :

విషయ సూచిక

మూలగ్రంథము 6 భాగములును, 150 చిన్నచిన్న ఖండ ములు లేక పేరాలుగా విభజింపబడియున్నది. ఈ గ్రంథ రచనమున బ్రౌను అనుసరించిన విశేష పద్ధతులు —

1) ఛందో లక్షణములను ప్రాచీన లక్షణ గ్రంథముల నుండి యుదాహరించి, వానికి పూర్వ కవుల కావ్యముల నుండి లక్ష్యముల నిచ్చుట.
2) గణ, వృత్త, యతి, ప్రాస లక్షణములను వేర్వేఱుగా విభజించుట.
3) తెలుగు వృత్తములలో కందమునకు విశేష ప్రాధాన్యమున్నది గావున (కందము చెప్పినవాడే కవి, పందిని పొడిచినవాడే బంటు) దానిని ప్రత్యేకముగా వివరించుట.
4) పూర్వపు ఛందో లక్షణ కర్తలవలె గాక, వృత్తములను గణానుసారముగా వర్గీకరించుట.
5) ఛందశ్శాస్త్ర సాంకేతిక పదముల వివరించుట.
6) తెలుగు చ్ఛందస్సునకు, తెలుగు వ్యాకరణమునకు గల అవినా భావ సంబంధమును గుర్తించుట.

పై గ్రంథరచనా ప్రణాళిక ననుసరించి చూచిన బ్రౌను, ఆంధ్రచ్ఛందో లక్ష్య లక్షణముల నెంత యఖండ పాండిత్యము గల వాడో మనకు గోచరింపగలదు. బ్రౌను ఈ గ్రంథమున ప్రాచీన

కావ్యములనుండి ఇచ్చిన లక్ష్యములు విలువైనవి. ఏలననగా అవి, తాళపత్ర ప్రతులనుండి గ్రైకొనబడినవి. ఈ గ్రంథ రచనా కాలము నాటికి అనగా క్రీ. శ. 1827 నాటికి బ్రౌను ఉదాహరించి గ్రంథములు ముద్రితములు కానేలేదు. ఈనాడును వృత్తగణ లక్షణములను గూర్చి వ్రాసినవారు పూర్వలక్షణ గ్రంథకర్తల పద్యపాదములనే యుదాహరించి లక్ష్యము లిచ్చెదరు గాని, మనకు పరిచితములైన ప్రాచీన భారతాది కావ్యములనుండి లక్ష్యము లీయరు. ఇప్పటికి 150 యేండ్లక్రిందటనే నిట్టి నూతన మార్గమున ఛందో లక్ష్య లక్షణ సమన్వయము బ్రౌను చేయుట బహుధా ప్రశంసనీయమై అతని దూరదర్శిత్వము చాటుచున్నది.

ప్రాచీన లాక్షణికులు తమ ఛందోగ్రంథములలో సమ వృత్తములను, ఆయా ఛ్చందస్సులనుండి(ఇవి26)పుట్టినవని నిరూపింపగా, బ్రౌను, సమవృత్తములను, గణములనుబట్టి—(య, ర, త, భ, జ, స, మ, న) వర్గీకరించియున్నాడు. ఇదియు నిదివఱకే ఛందోలక్షణ గ్రంథకర్త చేయనిది. తెలుగు ఛందస్సున నూతన పథకము. ఈ గ్రంథమున నిట్లు క్రొత్త రీతులతో విశదముగా, ఆంధ్రఛ్ఛందో లక్షణములు దిద్ది తీర్చబడియున్నవి.

ఇక గ్రంథమునుండి తెలియదగిన యంశములు—

1. బ్రౌను తెలుగు కవిత

బ్రౌను తెలుగు భాషోద్ధారకుడుగా మన మెఱుగుదుము కాని తెలుగు కవిగా మన మెఱుగము. అతడు తెలుగు కవియని తొలిసారిగా, కడపటిసారిగా నిరూపించినదీ గ్రంథమే. బ్రౌను వృత్త లక్షణములు చెప్పినపుడు వానిని జ్ఞాపకము పెట్టుకొనుటకు ఆయా వృత్తపాదములను స్వయముగా రచించినాడు. వానికి "Memorial verses" అని పేరు పెట్టినాడు. వీని కర్తృత్వము తనదే యని కవిరాజ విరాజిత వృత్త సందర్భమున నిట్లు తెలియజేసినాడు:

> [44] కవిరాజ విరాజిత వృత్తము
> రసమగు నీ కవిరాజ విరాజిత
> రాగము బ్రౌనను రాజొసగిన

ఆంగ్ల భాషలో దీని లక్షణము వ్రాయుచు నిట్లు ముగించినాడు:

My name has been introduced into this rule 10 but I cannot alter it conveniently.

10. అథోజ్ఞాపిక. దీనిలో బ్రౌను తన కర్తృత్వము చెప్పినాడు.

"All these memoriallines I Composed, excepting those for this verse, the preceding [three and the Sanscrit instances"—

44వ సంఖ్యవద్దనున్న పై దానినిబట్టి—బ్రౌను 44 పద్యపాదమేగాక 41, 42, 43 సంఖ్యగల, పద్యపాదములను తాను రచింపలేదనియు తక్కినవన్నియు తానే రచియించితిననియు స్పష్టపఱచినాడు.

ఇక నీ గ్రంధమున బ్రౌను రచనల నిచ్చుచున్నాను.

1. ఉత్పలమాల
ఉన్నత నీలహారమున నుత్పలమాలిక చెప్పినా నయా

2. చంపకమాల
చవిగల పూలమాలవలె చంపకమాలిక చెప్పినానయా

3. శార్దూల విక్రీడిత
శాంతంబౌ ధ్వనితోడ వెళ్లవలదా శార్దూల విక్రీడితా

4. మత్తేభ విక్రీడిత
మదమున్ యేనుగు వెళ్లుతూన్న దదిగో మత్తేభ విక్రీడితా

5. మత్తకోకిల
మాటమాటికి పాడుతుండగ మత్తకోకిల వింటివా

6. తరళ
తరళలోచన తోటలోపల తారసిల్లిన రీతిగా

7. స్రగ్ధర
సందేహంబేమి లేకన్ సహజముగల ఘుస్రగ్ధరావృత్తమయ్యెన్

8. మహాస్రగ్ధర
సరిగా తప్పేమిలేకన్ సరసముగ మహాస్రగ్ధరావృత్తమయ్యెన్

9. మానిని
మానినిదుఃఖము మానినవానికి మారుని తొందరమానదయా

10. మాలిని
మలసిన గమసంబున్ మాలినీ వృత్తమయ్యెన్

11. పంచ చామరము
ప్రయత్నమైన చేసినేని పంచ చామరంబులో

12. భుజంగ ప్రయాతము
భుజంగ ప్రయాతంబు భూమంత మెచ్చున్

13. దోధకము
దోధక యుండును తోడన పేరో
తొనచే కొనుటందుకు తోటకుపో

14. రోదకము
వెసమున రోదక వృత్తము పుట్టెన్-

15. ఇంద్ర వజ్ర
ఇంతులే సదానాడుదు రింద్ర వజ్రల్

16. ఉపేంద్ర వజ్ర
ఉపేంద్ర వజ్రల్ వెలయున్ సదీప్తిన్

17. రథోద్ధత
కృష్ణవేణుని నదై రథోద్ధతా

18. మంజుభాషిణి
మనసున్ ప్రబోధితము మంజు భాషిణిన్

19. సునందిని
కనక ప్రభాయుతముగా సునందినిన్

20. లయగ్రాహి
పెద్దలయ వేది మన సద్దమున జూచితిని
కొద్ది తడవున్ సొగసు పద్దు దొరికిందే

21. లయ విభాతి
పొదుపుగని పాదముల విదితముగ నాలుగిట
మొదటిగడ ప్రాసలిడ యిది లయ విభాతిన్

22. మంగళ మహాశ్రీ
భక్తియను తాలిమి యు భావమున గల్గినయా
భాషితము మంగళ మహాశ్రీ

23. ఇందువదన
ఎల్ల వరసుందరికి యిందు వదనంచున్

24. వన మయూరము
వొల్లు జగతిన్ వనమయూరమను వృత్తం

25. భాస్కర విలసితము
భాస్కర విలసిత సూర్యుని మాడ్కిన్
భాసిలె నలముల సొగసులు యారన్

26. మణిగణ నికరము
మణిగణ నికరము మణిగణ నికరం

27. ఉత్సాహము
రవువేడున్‌గురు వొక్కడే నిజనువిశ్రామంబు నుత్సాహకున్
(ఇది మత్తేభ పాదము)

The rule is composed in the following line in the (Mattebha vikridita).

28. దండకము
తగన సహంబు తాలుగును దండక ప్రాసలు వళ్లు లేనిద్దె

29. కందము
కందము మూడేన్ గణములు
నందుకు నాల్గేసి లఘువులైన గణంబుల్—
ఇట్లు పద్య పాదములనే గాదు. పద్యములను
బ్రౌను వ్రాసియున్నాడు.

30. చంద్ర గణములు
ఇంద్ర గణములందు చంద్రులు బయలాడె
పైన గురువు వేసిగాని లఘువు—
మగణ యగణ మందు మట్టుకు గురువురా
కుండ యుండ జెల్లుకొదు వలకను (పుట75)
ఇది ఆటవెలది —

31. కంద సీసాలు వెలదుల పాదములు
కందమందు మొదటి కాలు తక్కువ యుండు
నాట వెలని యందున రయసీస
ములకు రెండవదియు వెలితియై తనరారు
నితరములకు నాల్గు నేక సమము.
ఇదియు ఆట వెలదియే.

పై 31 వ పద్యము ప్రస్తుత ముద్రిత గ్రంథమున లేదు. దీనికి మూలమైన వ్రాత ప్రతియందు గలదని సంపాదకుడు తన పీఠికలో చూపియున్నాడు. (Page X VII)

2. ప్రథమాంధ్రచ్ఛందో పరిశోధకుడు బ్రౌను

ఈనాటికిని తెలుగు భాషలో ఛందశ్శాస్త్ర పరిశోధన ప్రత్యేకముగా ప్రారంభము కాలేదు. అట్టి పరిస్థితిలో నిప్పటికి నూటయేభయి ఏండ్ల క్రిందటనే తెలుగు ఛందస్సునుగూర్చి పరిశోధన ప్రారంభించి, దానికి మార్గము నేర్పఱచిన బ్రౌను మనకు బహుధా ప్రశంసనీయుడు.

బ్రౌను ఆనాటికి తనకు లభ్యములైన ఛందోలక్షణ గ్రంథములను కూలంకషముగా పరిశీలించినాడు. తెలుగు భాషలో ప్రథమ ఛందోలక్షణ గ్రంథము 'భీమన ఛందస్సు' అనుపేర ప్రచారములోనున్నది కవిజనాశ్రయము.

కవిజనాశ్రయము

దీనిని బ్రౌను పూర్తిగా ఇంగ్లీషు భాషలోని కనువదించినాడు. అది నేటికిని అముద్రితముగానున్నది. (చూడుడు—మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తకశాల వ్యాకరణచ్ఛందో గ్రంథములు. పుస్తకసూచి సంఖ్య—D. 1260). మొట్టమొదటిసారిగా, ఈ గ్రంథ ప్రాధాన్యతను గుర్తించిన — ఆధునిక విద్యాంసులలో బ్రౌనే తొలివాడు. ఈ గ్రంథమును బ్రౌను 7 చోట్ల నుదాహరించియున్నాడు. భీమన చందము అను పేరనున్న పై కృతికి కర్త భీమన కాడని మల్లియరేచన అని యొక వాదమున్నది. బ్రౌను ఆ కాలముననే దీని నెంత చక్కగా వివరించినాడో చూడుడు. యతులనుగూర్చి చెప్పు సందర్భమున నిట్లు వ్రాసినాడు:

"Bhimana or rather his son Mallaya Rel (who composed his work under his father name] states that" verses of less than ten syllabus in length haveno Yati — (P. 64)

ఆంగ్లభాషలో నీ గ్రంథమునకు "The Refuge of Poet" అని పేరుపెట్టినాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము వారి బ్రౌను కవి జనాశ్రయాంగ్లభాషానువాదము ముద్రింతురు గాక.

అ ప్ప క వీ య ము

కవిజనాశ్రయము తరువాత హెచ్చుగా బ్రౌను ఉదాహరించిన గ్రంథము అప్పకవీయము. ఈ అప్పకవీయము నేటికిని ప్రచారములో నున్నది.

సు ల క్ష ణ సా ర ము

బ్రౌను ఈలక్షణ గ్రంథము నుండి 4 వృత్త లక్షణములను యథామాతృకముగా తన గ్రంథమున చేర్చినాడు (P.21).

పై రెండు గ్రంథములును తెలుగున ఛంద శ్శాస్త్రము నభ్యసించు వారికి ముఖ్యములని యిట్లు చెప్పినాడు:

If after persuing the present Volume the advanced student should refer (as I trust some will) to the native prosodians among whom the sulacs hana saram and Appa Kawiyam alone deserve his attention (P. 65)

పై రెండింటిలోను బ్రౌను అప్పకవీయమునకే ప్రాధాన్యము నిచ్చినాడు. అప్పకవీయ కర్త అప్పకవి. తెలుగునకు ప్రధాన విమర్శకుడని యిట్లు చెప్పినాడు. అక్కరలను గూర్చి వ్రాయు సందర్భమున నిది గలదు :

The Accara metre is used by Nannaya Bhatt alone and it admits atleast six Varieties whichare defined by Appakavi, the chief critic in Telugu deeming." (Page 41).

ఛందో లక్షణ పరిశోధన

సంప్రదాయ సిద్ధమగు తెలుగు ఛందస్సును సవిమర్శకముగా పరిశోధన ప్రారభించినవాడు బ్రౌను. ఆ విశేషములన్నియు నిచ్చుటకు నవకాశములేదు. గాన రెండు మూడింటిని మాత్రము తెలుపుచున్నాను.

అక్కరలు

అక్కర తెలుగున క్రొత్త వృత్తమని ఆనాడే బ్రౌను గ్రహించి, అప్పకవీయము ననుసరించి — ఆరు విధములైన అక్కరల లక్షణములను వివరించినాడు. కాని అప్పకవీయమున అక్కరలకు నిచ్చిన లక్షణములు ఆ అక్కరలలోనే యుండుటచేత నవి జ్ఞాపకం పెట్టుకొనుటకు వీలులేనివని గ్రహించి, వానికి ధారణ చేయుటకు వీలైన తేటగీతి, తరల, మత్తకోకిల వృత్తములలో నొక పండితునిచే వ్రాయించి, తన గ్రంథమున ప్రకటించినాడు. (పుట 42) ఆ పద్యములకు తిరిగి వచనముకూడ వ్రాసి, అక్కర లక్షణములను చక్కగా విశదము చేసినాడు.

ద్విపద - ప్రాస యతి

ద్విపదయందు యతియేయుండునుగాని సాధారణముగా ప్రాస యతి యుండదు. ప్రసిద్ధ ద్విపద కావ్య కర్త సోమన ప్రాస యతిని వాడినాడు. ఇతరులు వాడలేదు. లాక్షణికులైన ఛందో గ్రంథకర్తలు దీనిని తెలుపలేదు. క్రీ. శ. 1927 వ సంవత్సరమున పాల్కురికి సోమనాథుని బసవపురాణమునకు కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పీఠిక వ్రాయుచు, అందు సోమనాథుడు వాడిన ద్విపద ప్రాసయతిని లోకమునకు వెల్లడించినారు. అప్పటి నుండి మాత్రమే ఆ విషయము సాహిత్యలోకము తెలుసుకున్నది. కాని, అంతకుముందు నూరేండ్ల క్రిందటనే, అనగా క్రీ. శ. 1827 లోనే, బ్రౌను దీనిని కనిపెట్టి యిట్లు వ్రాసినాడు:

"In the Dwipada metre Prasa Yati is not used by Ranganatha or any other elegant author, while Vulger writers, as the composer of the Telugu Basava purana frequently admits it with ther in in elagancies" (Page 66)

ఈనాడు పాల్కురికి సోమనాథుడు మహాకవిగా పరిగణితుడై శివకవులలో ప్రధాన స్థానము నాక్రమించినను, బ్రౌను కాలము నాటికి — సోమనాథుడు అలాక్షిణిక కవి. అందువలన బ్రౌను సోమనాథుని అలాక్షిణిక (Valgar poet) కవిగా పరిగణించినాడు. అంతే. పాల్కురికి సో మ నా థు ని బ స వ పు రా ణ పండితారాధ్య చరిత్రల తాళపత్ర ప్రతులు సేకరించి, వానిని కాగితములపై వ్రాయించి — వానిని పరిష్కరించి భద్రపరచినది బ్రౌనే. అవి నేటికిని గలవు. ఈ తరువాత ముద్రణలకు నవియే ఆధారభూతములైనవి. సోమనాథుని బసవపురాణమును చదివియే బ్రౌను జంగములను గూర్చి ప్రథమముగా వ్యాసమును వ్రాసి, ఆ మత సంప్రదాయములను వెల్లడించినాడు. సోమన యందాతనికి గౌరవము తరువాత నేర్పడినది.

ర గ డ లు

కవి జనాశ్రయమున రగడల ప్రస్తావన లేదు. అప్పకవి తొమ్మిది విధములైన రగడలను తెలిపినాడు. బ్రౌను వానినన్నింటిని లక్ష్యలక్షణములతో పరిశోధించినాడు. ఈ గ్రంథమున ఆ తొమ్మిదింటిలో రెండింటికి — మధురగతి రగడకు, ద్విరదగతి రగడకు లక్ష్యముల నుదాహరించినాడు. ఈ తొమ్మిది విధములైన రగడలను సవిమర్శముగా పరిశీలించి బ్రౌను ఈ క్రిందిరీతిని వానిస్వరూపము నిర్ణయించినాడు.

"The Ragada (రగడ)is written in couplets connected at pleasure by prasa, not fourlines in a verse... ....This is very similar to the Vaisaliyam see section 118. Nine specimens are described, but these are evidently reducable to there" (Page 45).

రగడ ప్రధానములైన ఉదాహరణ కావ్యములనుగూర్చి నేను పరిశోధనచేసి 1950లో నాఉదాహరణ వాఙ్మయ చరిత్రలో తొమ్మిది విధములైన రగడలకు మూడు విధములైన రగడలు మూలమని నిరూపించియున్నాను. (ద్వితీయ ముద్రణము 1968).

నా పరిశోధనకు 113 యేండ్లు ముందుగానే నీ విషయము మొదట కనిపెట్టిన బ్రౌను ఛందశ్శాస్త్ర పరిశోధన మన కత్యంతము నారాధనీయము.

3. ప్రాచీనకావ్యముద్రణ బ్రహ్మ బ్రౌను

బ్రౌను కాలము నాటికి, మన ప్రాచీన కావ్యములన్నియు తాళ పత్రములపైనే యుండెడివి. అవి సాధారణముగా అడుగు అడుగున్నర పొడవు గలిగి, అంగుళమున్నర రెండంగుళములు వెడల్పు గలిగి యుండుటచేత, అందు పద్యములు వచనమువలె, ఒకే పంక్తిలో తాటాకు ఈ చివరనుండి, ఆచివర వరకూ వ్రాయబడుచుండెడివి. పద్యము పేరు సంగ్రహముగా — ఉ. చ. సి. గి. — అని మాత్రమే యుండును. బ్రౌనుకు నెనిమిది శతాబ్దములకు పూర్వమున గల మన తెలుగు సాహిత్య మందలి కావ్యములన్నియు నీ తాటాకు గ్రంధముల యందే నిక్షిప్తములై భద్రపఱుపబడినది.

తాటాకులనుండి కావ్యములను
తొలిసారిగా కాగితములపై వ్రాయించి
వానిని ముద్రణమునకు సిద్ధము చేసినది
బ్రౌను.

బ్రౌను తెలుగు భాషాధ్యయనము ప్రారంభించునాటికి తాను చదివిన గ్రంధములు తాటాకులలో నుండుట గమనించి వానిని కాగితములపై వ్రాయించుట కేర్పాటు చేసినాడు. అతడా సందర్భమున నీక్రింది పద్ధతుల నవలంభించినాడు:

1) పద్యములు పాద విభజనముచేసి వ్రాయించుట.
2) యతి స్థానములు గుర్తించి యుదాహరించుట.
3) పద్యములకు వచనములకు సంఖ్యలు వేయుట.
4) ద్విపద పాదముల నొక దాని క్రింద నొకటి వ్రాయించుట.
5) అర్ధాను స్వార శకట రేఫలను పాటించుట.

బ్రౌను యీ ప్రాచీన కావ్యలేఖనమును నొక మహోద్యమముగా సాగించినాడు. కాని యీ వివరము లిచ్చుటకు నిచ్చట యవకాశములేదు. అతడిట్లు కాగితములపై వ్రాయించుటయే గాక — దాని నెట్లు ముద్రింపవలెనో, తాను ప్రత్యేకముగా ఈ ఆంధ్ర గీర్వాణ చ్ఛందమున ప్రథమముగా మనకు మార్గదర్శకుడైనాడు. ఆతడానాడు ప్రారంభించిన ప్రాచీన కావ్యముద్రణ పద్ధతియే నేటివఱకు ప్రచారములో నుండి స్థిరపడినది. కావుననే—బ్రౌనును, 'ప్రాచీన కావ్యముద్రణ బ్రహ్మ'అని పేర్కొంటిని.

అచ్చు పుస్తకములతోనే తప్ప తాటాకు వ్రాతలతో గాని, కాగితపు వ్రాతలతోగాని సుతరాము పరిచయము లేని మనకీనాడు, ఆనాడు — బ్రౌను మన ప్రాచీన కావ్యముద్రణ ప్రారంభించిన యామహత్తరోద్యమ విశిష్టత గ్రాహ్యము కాదు.

బ్రౌను కాలమునాడు తాళ పత్రములలో పద్యముల వ్రాతలెట్లుండెడివో, ఆతడు కాగితములపై వ్రాయించినపుడెట్లుగా రూపొందినవో చూపుటకు నాలుగు ఉదాహరణముల నిచ్చుచున్నాను.

(1)

పుట 18 పద్యము

తాటాకు ప్రతి · ఉత్పలమాల

ఉ॥ ఇచ్చట నున్న నన్నుగని యీముని యేముని శాపమిచ్చునో
వచ్చిన చేటువచ్చుననివాము విలోచన బట్టి కొంటినే
యిచ్చనెఱుంగకే మనునో యీపని కాదని యూరకుంటినే
పచ్చనివింటి జోదునను బాణపరం పరనొంపు దెంపునన్.''

బ్రౌను ముద్రణ

ఉ. ఇచ్చట నున్న నన్నుగని యీముని యేమని శాపమిచ్చునో
వచ్చినచేటు వచ్చెనని నామవిలోచనంబట్టి కొంటినే
యిచ్చ నెఱుంగ కేమనునోయీ పనిగాదని యూరకుంటినే
పచ్చని వింటి జోదునను బాణ పరంపర నొంపుదెంపునన్''

(పద్మ పురాణము. 3–19)

ఇందుత్పలమాల లక్షణము- యతి ప్రాసలు చక్కగా నాలుగు పాదముల యందు సూచితమైనవి. అర్ధాను స్వారములు శకట రేఫ. పాటింపబడినవి.

(2)

పుట 44. పద్యము మధ్యాక్కర. తాటాకుప్రతి

''అతిథియై వచ్చిన బ్రాహ్మణుని జీవితార్థినై నాకు హితముగా రక్కసువాత ద్రోవనేనెట్లొడ బడదు మతి నవమానింప గాదనిన విప్రమరణంబు దలపనతి పాతకము పాతకములలో బ్రహ్మ హత్యయ పెద్ద''

బ్రౌను ముద్రణ

మధ్యాక్కర

అతిథియై వచ్చిన బ్రాహ్మణుని జీవి తార్థినై నాకు
హితముగా రక్కసువాతఁ ద్రోవనే నెట్లొడ బడుదు
మతినవ మానింప గాదనిన విప్రు మరణంబు దలఁప
అతి పాతకము పాతకములలో బ్రహ్మ హత్యయ పెద్ద—

మహాభారతము — అది. 6–303.

(3)

పుట 49. కందము—తాటాకు ప్రతి

క. జున్నులుగల యదువులు మహిదున్నక విత్తక ఫలించు తోరపు మొదవుల్ చన్నవశి పాలుపిదుకును వన్నెగ నెలనెలకు మూడువానలుగురియున్.

బ్రౌను ముద్రణ — కందము

క జున్నులుగల యదువులు మహి
దున్నక విత్తక ఫలించు తోరపు మొదవుల్
చన్నవశి పాలు పిదుకును
వన్నెగ నెలనెలకు మూడు వానలు గురియున్.

(విష్ణు పురాణము — 2–156)

(4)

పుట 104. సీసము—తాటాకు ప్రతి

సీ. నాగరథాశ్వసన్నాహమొనర్పక యొడ్డనంబులు దీర్పకు భయ సైన్యవీరు

ల కరముల వివిధాయుధంబుల నన్యోన్య సంఘట్ట నారవంబు లెసగంగ

సంగ్రామ మేర్పడజేయక నక్షముల్ దార్చి యేశ్రమమున ప్రతిపక్షత.

తులసంపదలు జయించి నీకిచ్చెదవగవంగనేల ధర్మరాజు ప్రీతితోడ రావించి యతనితో గడగు జూదమాడ గౌరవేంద్రయొందు పాట పాండవోన్నతి వేల్పులకైన నపహరింప నలవికాదు.''

ప్రౌను ముద్రణ

సీ. నాగరథాశ్వ స న్నాహ మొనర్పక
యొడ్డనంబులు దీర్ప కుభయ సైన్య
వీరుల కరముల వివిధాయుధంబుల
నన్యోన్య సంఘట్ట నారవంబు
లెసగంగ సంగ్రామ మేర్పడః జేయక
నక్షముల్ దార్చియే న్శ్రమమున
ప్రతిపక్షతతుల సం పదలు జయించి
నీకిచ్చెద వగవంగ నేల ధర్మ

ఆ. రాజు ప్రీతితోడ రావించి యతనితో
గడగు జూదమాడః గౌరవేంద్ర
యొందుపాట పాండ వోన్నతి వేల్పుల
కైన నపహరింప నలవికాదు.

(మహాభారతము. సభాపర్వము–2)

ఇట్లు పద్యములేగాక ద్విపదలు, రగడలుకూడ పాద విభజన చేసి తొలుత ముద్రించినది బ్రౌనే. వాని కుదాహృతులు.

పుట 39. ద్విపద — తాటాకుప్రతి

తలపనీ లెక్కడ దంతులు పులులు నెలుగులు తోడేళ్ళు నిఱులు గిరులు పాములు గాములు పై బాకు నెఱచీమలు గిరి గుహా సీమలు చరులు

బ్రౌను ముద్రణ

తలఃపనీ వెక్కడ దంతులు పులు
నెలుగులు తోడేళ్ళు నిఱులు గిరులు
పాములు గాములు పైఃబాకు నెఱ
చీమలు గిరి గుహా సీమలు చరులు.

రంగనాథ రామాయణము–2

పుట 46. రగడ — తాటాకు ప్రతి.

తాటాకు ప్రతులలో రగడలు ద్విపదవలె నొక్కేపంక్తిలో వ్రాయబడును. ''వెలసె వనాంతర వీథి వసంతము కలిగె జగంబుల కనక వసంతము జిలి బిలి యలరుల జిమ్మెలతాంతము సాలపున విూరెన శోకలతాంతము మురువుగ పొన్నల మొగ్గలు పుట్టెను సరసి జముల మధుసారము బుట్టెను''

బ్రౌను ముద్రణ

వెలసె వనాంతర వీథి వసంతము
గలిగె జగంబుల కనక వసంతము
జిలిబిలి యలరుల జిమ్మెలతాంతము
సాల పునవిూ రెనశోక లతాంతము
మురువుగ పొన్నల మొగ్గలు బుట్టెను.
సరసిజముల మధుసారము బుట్టెను.

వీనిని మచ్చునకు చూపితిని గాని, బ్రౌను ఈ గ్రంథము ద్వారా, ప్రాచీన తెలుగు కావ్యముద్రణ సౌధమునకు పునాది వేసినాడు. తాళపత్ర ప్రతుల నుండి ముద్రణకు — గ్రంథము సిద్ధముచేయుట ఎంతకష్టమో పైయుదాహృతులుచూపగలవు.[1]

సంశోధిత ముద్రణలు :

సపరిష్కృత ప్రాచీనాంధ్ర కావ్య ముద్రణకేగాక, సంశోధిత ప్రాచీనాంధ్ర కావ్య ముద్రణకు బ్రహ్మ బ్రౌనే. ఇప్పటి కేబదియేండ్ల క్రిందట క్రీ. శ. 1927 లో మాత్రమే ప్రారంభమైన యీ సంశోధిత ముద్రణ పథకమునప్పటికి నూరేండ్ల క్రిందట ననగా క్రీ. శ. 1827 లోనే బ్రౌను ప్రారంభించినట్లుగా నీ గ్రంథము తెలుపుచున్నది.

ఈ గ్రంథమున బ్రౌను నన్నయ భారతమున సభాపర్వము ద్వితీయాశ్వాసము 155 మొదలు 168 వరకు గల భాగమును 10 తాళపత్ర ప్రతులతో సంప్రతించి పాఠాంతరముల నిచ్చి యీ సంశోధన ముద్రణా పథకమునకు మార్గదర్శకుడైనాడు.

''ప్రాచీనాంధ్ర కావ్యములను ముద్రించునపుడు తాళపత్రములతో సంప్రతించియే ముద్రింప వలెను'' అన్న సూత్రమునకు కర్త వ్యాఖ్యాత బ్రౌను.

స్థాలీపులాక న్యాయమున నీ గ్రంథ పీఠికలో చేర్పదగిన యంశములను మూడింటిని మాత్రమే యిచ్చితిని. ఇంకను నిందు ఉదాహరింపబడిన గ్రంథములనుగూర్చి, కవులనుగూర్చి వ్రాయ వలసినది, సాహిత్య లోకమునకు వెల్లడి కావలసినది చాలా గలదు. మరియొక అవకాశమును దీసికొని ఆ విషయము నివేదింతును అని విన్నవించుచున్నాను.

1 తాళపత్ర గ్రంథములను తొలుత నవీన యుగమున తెలుగు దేశమున సంపాదించినవారు మా నాయనగారైన కీ. శే. నిడుదవోలు సుందరము పంతులుగారు (1864 – 1931) తాటాకు గ్రంథ సంశోధన మాయింట వంశ పారం పర్యంగా వచ్చుచున్నది . నేను మదరాసు, తంజావూరి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములతో నిరువదేండ్లుగా సవినాభావ సంబంధము గలవాడను.

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

కలగూరగంప

తెనుఁగు మఱుఁగులు - కాఁద పువ్వులు

నన్నె చోడుని కుమారసంభవములోని షష్ఠాశ్వాసమునందలి

"వరతరు కోటరాహి ఫణ వర్గము దేనెలు సావి..........

....

.... కాఁద పువ్వుల

య్యెఱుఁగమి డాయ నోడుదు రహి[వజశంక విభీతచిత్తులై.

కుమా. 6. 44.

అను పద్యము నందలి కాఁద పువ్వులను గురించి విశేష చర్చ జూన్ నెల 'భారతి'లో డా|| శ్రీ తి. కోదండ రామయ్యగారు చేసినది చూచితిని. సంతోషించితిని. నేను పదేళ్ల క్రితము కుమారసంభవమును జదివినప్పుడు ఈ "కాఁదపువ్వులు" అనుదాని అర్థవిచారము సేయుచుండు తఱి తెలంగాణాలో బహుళ ప్రచారములో నుండి, వినాయక చతుర్థినాడు జన సామాన్యముచే పూజార్థమై తెచ్చి "వెంకయ్య పూవను పేరను వాడుటనుబట్టి, దానికి గల పెంజర్ల పువ్వను తెలంగాణాలోని శిష్ట వ్యవహారమునుబట్టి కాఁదపువ్వులనగా బెంజెర్ల పువ్వని యనుకొని సరిపెట్టికొనియుంటిని. పెంజర సర్ప పర్యాయపదము. శ్రీవి సర్ప సదృశములుగా నుండును కనుకనే పెంజర్ల పూవులు అందురు. నా యూహ యప్పటి కంతటితో నాగినది.

కాఁదపువ్వులకు వారుచూపిన ఉపపత్తుల యందలి వర్ణనల బట్టియు, కార్తికమున విరివిగా బూయు పూవులను తమిళ నిఘంటువుయొక్క యర్థమును బట్టియు, "గ్లోరియో సుసర్బా" అను పేరు గల పటము నీయుటను బట్టియు నేనాడూహించినది సరియైనదేయని స్పష్టమైనది. తెలంగాణాలోని ఈ పెంజర్ల పుష్పము (సర్ప పర్యాయ నామము గలది) తప్పక నన్నె చోడుడు, వాడిన "కాఁద పువ్వే"యై యుండును.

ఈ విషయమును సుస్పష్ట మొనర్చిన డా|| తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారికి కృతజ్ఞతలు.

శ్రీ అష్టకాల నరసింహరామ శర్మ

"ఒక సందేహము"

ఆగష్టునెల 'భారతి'లో శ్రీ దీవి దీక్షితుల వార వ్రాత చూచి నేను నాలుగు ముక్కలు వ్రాయదలచుకున్నాను. అవి యివి:

నన్నయ చింతామణిలో 'హ'కారము ప్రక్షిప్తమా? కాదా? ఇది సందేహము. కాదని శ్రీ వంతరాం రామకృష్ణారావుగారు వ్రాసినారు. కాదు ప్రక్షిప్తమని దీక్షితుల వారి భావన. అస్తుతావత్.

దీక్షితులవారు చెప్పిన మాటలు కొంత విచారించుట ప్రథమ కర్తవ్యము. "రావుగారు పేర్కొనినట్లు తమిళ కన్నడ పదములలో "హ" కారము కనిపించదు కన్నడములో మాత్రము కలదు. తమిళమున 'హ' కారములేదు. ఇందు మొదటి వాక్యము తమిళ—కన్నడ పదములలో 'హ' కారము కనిపించదు. వెంటనే రెండవ వాక్యములో "కన్నడములో మాత్రము కలదు." రెంటికి నర్థమేమియో?

"ఆతని నత్యుగ్రావల
పాతోన్ముఖుఁడైన వాని (బడకుండగనో
హోతక్షక క్రమ్మఱుమని

యాతతభయుఁ గ్రమ్మరించె నాస్తీకుఁడెడన్." భా. అది. 2-235. ఇందలి "ఓహో" శబ్దమును గూర్చి దీక్షితుల వారి వ్రాతయిది. "ఓహో అను పదము సుఖాద్యతిశయ ద్యోతకమైన ధ్వని సంకేతము"— ఓహో ధ్వని సంకేతమే. కాదనలేము. ప్రస్తుత పద్యముననది సుఖాద్యతి శయద్యోతకము కాదు. ఓహో—అనునది సంబోధనము.

ఓహో = సంబోధనమున వచ్చును. ఓహో తక్షక క్రమ్మఱుము.
శబ్దరత్నాకరము

ఓహో = అన్య. సంబోధనమున వచ్చును. ఓహో తక్షక. లక్ష్మీనారాయణీయము. శుద్ధాంధ్రనిఘంటువు

ఓహో = సంబోధనమున వచ్చును. శబ్దార్థచంద్రిక.
ఆశ్చర్యార్థకమున గూడ వచ్చును.

దీక్షితులవారి యర్థము ప్రస్తుతమునకు భిన్నముగా లేదా?

రెండవ పదము "హనుమ."

ప్రాకృత హణుమ — అణఁట.

సంస్కృత. హనుమత్ — హనూమత్.

ఇది తద్భవము గాదని దీక్షితులవారి మాట. కారణము తద్భవ ప్రకరణములో నడిదముసూరకవి సూచింపలేదు. అంతమాత్రమున మనము నిఘంటుకారుల వ్రాతలను గాదనలేము. నిఘంటువులు హనుమ—అనునది తద్భవమనియే చెప్పుచున్నవి. వానినికాదనగలమా?

"పదాది హ కార లోపము మాత్రమే కలుగును. హిమము — ఇవము; హితము — ఇతవు; హేళలు — ఏలలు; హంస— అంచ; —హనుమ — అనుమ; హరణము — అరణము." ఇత్యాదిగా వజ్ఝలవారు వైయాకరణ పారిజాతమున (108వపుట) వ్రాసినారు. వీరిదృష్టిలో హనుమ తత్సమము — అనుమ తద్భవము కాని హనుమ తత్సమమని చూపుటకు సమాసగతమైన ప్రయోగము కావలయును. వారట్లు చూపలేదు. అందువలన హనుమ తద్భవమనియే చెప్పికొనవలె.

"హోదులయు నీలుగు లోనగు వాని తొలి హల్లునకు లోపంబు బహుళంబుగానగు" (బాల.ప్రక. 10.) దీని ప్రకారము హనుమ– అనుమయగును ఇట్లేకొన్ని.

హడపము–అడపము; హరిదళము – అరిదళము హలంది – అలంది.

అనలాస్త్ర సుట్టు నక్షముఁ
గొనిన విచింత్యుండుగూలెఁ గుతలంబిద్రువన్
ఘనువానిఁ జూచి హాహా
స్వనములెసగ సాల్వసేన సంక్షోభించెన్.
భార. ఆరణ్య. 1–162

ఇందలివి హాహా అనునదేగాని దీక్షితుల వారన్నట్లు ఆహా మాత్రముకాదు. ఆహా అన్నచో నంత సంక్షోభధ్వని రాదు. హాహా అనుటతోడనే యది కర్ణపుట భేదకముగానున్నది. భాషాశాస్త్రము ప్రకారము ఆహా గా మారుననుట శాస్త్రమేయైనను ప్రస్తుత మజాదిగాదు. అది నన్నయ కభిమతముగాదు. దీనిని బట్టి చింతామణిలో నన్నయ 'హ' కారము సాచ్ఛికవర్ణముగా గ్రహింపగలము. చిన్నయసూరియు నిట్లే వ్రాసినాడు.

"తత్సైన్యంబు హాహాధ్వనులెసంగ" భార. ఆది–6–87, ఇచ్చటసుగాదందుమా?

"బో, రనబాష్పము లొలుకగ హా
యనుచుం బదినోళ్ళఁ దెలచి..." భార. ఆరణ్య.7–137.

అని యెఱ్ఱాప్రెగడయుఁ బ్రయోగించినాడు.

"హాహా రవంబు లెసగ" మౌసల. 145.

అని తిక్కనయుఁ బ్రయోగించెను.

ఇంకనెందరో కవులు ప్రయోగించినారు· వారినికాదందుమా? దీనినిబట్టి 'హ'కారము ప్రక్షిప్తముకాదనుట నిర్వివాదము

'నన్నయకాలము తరువాత హ కార ఘటితములైన కన్నడ పదములు తెలుగులో ఎన్నియోచేరినను వానికి హకార రహితము లగు రూపాంతరములు వాఙ్మయమున నెందులకు ఏర్పడినవి?' ఇది దీక్షితుల వారిప్రశ్న. ఇదిచాలపెద్దది ప్రశ్నము వేయునప్పుడు నిదానముగా నాలోచించుట యుత్తమపద్ధతి. చాల హ కారఘటితము లైన కన్నడ పదములు మార్పులేక తెనుగుననట్లే యున్నవి. ప్రఖ్యాత భాషాశాస్త్రోపన్యాసకులయిన ఆచార్యశ్రీ దొణప్పగారి "భాషా చారిత్రకవ్యాసావళి" చూచిన దీక్షితుల వారిప్రశ్నకు సదుత్తరము లభించెడిది.

కన్నడము:హత్తు, పత్తు=జోడించు, కలుపు
తెలుగు:గోడిగజాతిలోఁగొదమ పెంటులనేర్చి
మావులహత్తించు మార్దవంబు. విరా.1–94
కుంకుముహత్తించి కొనగోరదీర్చిన–ఉ.హరి. 3–86.
కన్నడము–హసను, పదను=యుక్తము, తగినది.

'ఓహరిసాహరిఁ....
ఆహదనంజెలంగు జనమాంతము·' ఆము.4–93.

కన్నడము. హర్వు–హరువు–రీతి.

తెలుగు: జవ్వాది పదనిచ్చి క్రొవ్విఱులో ముడిచెంబె
న్నెఱివేణి కొక వింత హరువులెసగ. శుకస 1–226,

ఇంకెన్నియో దొణప్పగారు చూపినారు. ఇవన్నియు హకార సహితరూపములు కన్నడమునుండి తెచ్చికొని కవులు వాడలేదా? మనము తొందరపడి నిర్ణయము చేయరాదు. ముందువెనుక లాలోచింపవలయును. గ్రంథావలోకనము చేయవలె.

దీనినిబట్టి 'హ'కారము చింతామణిలోనున్నదే. ప్రక్షిప్తము కాదు.

. *భాషాప్రవీణ పాతకోట రాధాకృష్ణమూర్తి*

లేఖ

'మే' నెల 'భారతి'లో శ్రీ శేషుగారు 'రాజకీయ అనవగాహన' అన్న గ్రంథాన్నిసమీక్షిస్తూ ఒక్కమాట అన్నారు. "ప్రజాస్వామ్యం అంటే ప్రజల పరిపాలన. ప్రతినిధుల పరిపాలన కాదు. సోషలిజం అంటే సంఘపరం చేయడం. అంటే అధికార కేంద్రీకరణ. ఈ రెండింటికి పొసగ గలదని చెప్పడం మాటల గారడీయే తప్ప మరేమీ కాదు." ఈ మాటలనుబట్టి ప్రజాస్వామిక సామ్యవాదం కేవలం బూటాటకమే. శ్రీ శేషుగారు ఈ బూటాటకానికి చరిత్రాధారాలున్నా యంటున్నారు. అతి జటిలమైన ఈ సమాజవాద సిద్ధాంతాన్ని రెండు మాటలతో కొట్టి పడవేసిన వారి "సాహసానికి" ఆశ్చర్యం పొంది, నాకు తోచిన రెండు వాక్యాలు వ్రాస్తున్నాను.

సామ్యవాదం, అన్న ఒక సమాజిక సిద్ధాంతం కొన్ని చారిత్రాత్మక కారణాలవల్ల వుద్భవించి, దేశ కాల పరిస్థితుల కనుగుణ్యంగా మార్పులు చెందుతూ వొచ్చింది. సిండికాలిజమ్, ఫ్యాబియనజిమ్, ర్యాడికలిజమ్ మున్నగునవి వానిలో కొన్ని ముఖ్యమైన విభేదాలు. కమ్యూనిజమ్‌కు, ప్రజాస్వామిక సామ్యవాదానికి అతిముఖ్యమైన భేదముంది. కమ్యూనిష్టులు సమాజంలోని విభిన్నసంస్థలు, సంఘాలు కేవలం ఆర్థిక అసమానత్వాన్ని ప్రతిబింబించేవి, దోపిడీదారుల నీతి కనుగుణ్యంగా మలచబడిందనీ పేర్కొంటూ, ప్రజా విప్లవం ద్వారా అధికారంలోనికి వచ్చిన కమ్యూనిష్టు పార్టీయే, సమాజంలోని విభిన్న వర్గాల శ్రేయస్సును పెంపొందించగలదని, కాబట్టి సమాజంలో వున్న యితర సంస్థలు, సంఘాలు పార్టీ నియంత్రత్వానికి దాసోహమనాలనీ ఉద్ఘాటిస్తారు. కాబట్టి కమ్యూనిష్టు దేశాలలో పార్టీ నియంత్రత్వం ఒక ప్రధాన అంశంగా పేర్కొబడుతుంది. కానీ సిండికాలిజమ్, మొదలగు సిద్ధాంతాలు ఈవాదాన్ని అంగీకరించవు. సమాజంలో ఎన్నోవర్గాలు, సంఘాలు అవసరమనీ, ఏ ఒక్క పార్టీ కూడా పూర్తిగా సమాజాన్ని ప్రతి

బింబింపలేదనీ, సమాజంలోని వివిధ సంస్థలకు (ఉదా :— విశ్వ విద్యాలయాలు, కళాకేంద్రాలు వంటివి) స్వయం ప్రతిపత్తి నివ్వాలని, ఈ సిద్ధాంతాలు వెల్లడిస్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యూరోప్ దేశాలలో తీవ్రమైన సంకట పరిస్థితి ఏర్పడింది. పేదరికం తాండవించసాగింది. ప్రజలు దుర్బల స్థితికి లోనైనారు. దేశ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. అప్పటి పరిస్థితుల నుండి దేశాన్ని రక్షించడానికి గాను, ఎన్నో ప్రభుత్వాలు ఆర్థిక రంగాన్ని తమ చేతులోనికి తీసికొన్నాయి. అప్పటివరకు పాటిస్తున్న ఉదార ఆర్థిక విధానానికి స్వస్తిచెప్పి, క్రమబద్ధ ఆర్థిక విధానానికి అంకురార్పణ జరపడంతో ప్రజాస్వామ్య స్వామ్యవాదానికి నాందీవాచకం పలుకబడింది. ఎన్నో భారీ పరిశ్రమలు జాతీయం చేయబడ్డాయి. వేతనాలను నిర్ణీతం చేస్తూ ఏట్టాలు చేయబడ్డాయి. కార్మికుల సంక్షేమం కొరకు ఎన్నో విప్లవాత్మక చర్యలు తీసుకోబడ్డాయి. ప్రభుత్వమే స్కూళ్ళు, కళాశాలలు కట్టించి, విద్యా సౌకర్యం కల్గించటమే కాకుండా, నిరుద్యోగులకు జీవన భృతి కల్గించడం వంటి చర్యలు సమాజవాద సిద్ధాంత ప్రభావంవల్లనే జరిగిందని 'చరిత్ర' ఉద్ఘోషిస్తుంది. ఈ దేశాలు ప్రజాస్వామ్యం కావనగలమా ? అసలు ప్రజాస్వామ్యం పుట్టిందే పశ్చిమ యూరప్‌లో కదా? మరి శేషుగారి వాదనప్రకారం ఇవన్నీ ప్రజాస్వామ్య దేశాలు కాకుండా అన్నాపోవాలి, లేక ఈ చర్యలు సామ్యవాదపువన్నా కాకుండా పోవాలి. కానీ ఈ రెండూ నిజమే!

మన దేశంలో కూడా, జమీందారీ రద్దు, ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమల స్థాపన, బ్యాంకుల జాతీయకరణ వంటి సామ్యవాద చర్యలు ప్రజాస్వామ్యాన్ని బలపరచాయేకానీ, కుంటుపరచలేదే? ఒక్క చిన్న ఉదాహరణ. టౌను బస్సులో ఎక్కడికైనా పోవాలంటే మనకు ఏ నలుబది పైసలో అవుతుంది. అదే టాక్సీలోపోతే...! టౌను బస్సు ప్రభుత్వంచే నడుపబడుతుంది. లాభనష్టాల బేరీజు కాక ప్రజాశ్రేయస్సు దాని ముఖ్యధ్యేయం. కానీ టాక్సీవాడు ఎంత మట్టుకు సాధ్యమైతే లాభం చేసుకొనేందుకు ప్రయత్నిస్తాడు. తమకు లాభసాటిబేరం కానిచోట్ల ప్రవేటు సంస్థలు కర్మాగారాలను నెలకొల్పరు. కొద్దిగా నష్టమొచ్చినా సరే ఫ్యాక్టరీని మూసేస్తారు. దాని ద్వారా ఎన్ని వేలమంది నిరుద్యోగులైనా వారికి చింతలేదు. తమకు ఏదైతే చిక్కులు లేకుండా త్వరగా లాభాన్ని సంపాదించిపెడుతుందో అట్టి పరిశ్రమలలోనే పెట్టుబడి పెడ్తారు కాని, దేశానికి ఏది ముఖ్యమో వాటిలో పెట్టుబడి పెట్టరు. ఆటువంటి స్వార్ధపూరితమైన ప్రవేటు వాణిజ్య సంస్థలను దేశ శ్రేయస్సుకై మార్చి, ప్రజలపురోన్ముఖానికి పాల్పడటమే ప్రజాస్వామ్య సామ్యవాద ముఖ్యలక్షణం.

'ప్రణాళిక' అన్న అంశం యావత్తూ సామ్యవాద సిద్ధాంతానికి ఋణపడి వుంది. మరి ప్రణాళికలులేని ప్రభుత్వాలున్నవా? స్వేచ్ఛా ఆర్థికవిధానాన్ని అవలంభించే అమెరికాలోకూడా ప్రభుత్వం విద్య, వైద్య, సాంకేతిక రంగాలలో ఎన్నో రకాలుగా ప్రవేశిస్తూనే వుంది. ఈనాటి సమాజిక పరిస్థితులకు ప్రభుత్వం ఆర్థిక రంగంలోనికి ప్రవేశించడం అనివార్యం. కానీ పూర్తిగా ఆర్థిక రంగాన్ని తన నియంత్రత్వంలోనికి తెస్తే అది కమ్యూనిజమ్ అవుతుంది. ఆర్థిక రంగాన్ని ఒక క్రమబద్ధంగా పెంపొందించితే అది ప్రజాస్వామ్య సామ్యవాదం అవుతుంది.

శ్రీ శేషుగారు, కమ్యూనిజమ్ ప్రజాస్వామ్యం సరిపోవంటే ఒప్పుకోవచ్చుగాని, సామ్యవాదం ప్రజా స్వామ్యం కలువ వంటవే నమ్మశక్యంకాదు.

డా ॥ మురళీధర్

'శ్రీ మన్నవ ఖండ మండిత ధరామండలా ఖండల కుంఫినీ సార్వభౌమ సమర్పిత సామ్రాజ్య రాజాధి రాజ పూజ్య ఇంగ్లీషు వంశ పయః పయోధి రాకా సుధాకర, వినయాధి సుగుణ రత్నాకర, డేవిడ్డు వసుంధరా రమణ హృదయ కమల దివాకర, సకల భాషా విశేషాభి భాషణ, విద్యా వినయ నయ వితరణా భరణ పోషణ, సకల కళా సనాథ, చార్లీసు పిలీపు బ్రౌన్విపులాధి నాథు' ని జయంతి వైజయంతిక.

ఆంధ్ర భాషోద్ధారకుడు సి. పి. బ్రౌన్ 1'-11-1798 నాడు జన్మించాడు. నిజంగా ఆ మహనీయునికి జయంతి జరపవలసిన విధి మనపైన ఎంతైనా ఉంది. నవంబర్ నెలలో జన్మించాడు కాబట్టి ఆయన స్మృత్యర్థం ములుపాక బుచ్చయశాస్త్రి వ్రాసిన వసుచరిత్ర వ్యాఖ్యలోని గద్యను ప్రచురించడం జరిగింది.

సేకరణ : శ్రీ సుందరేశ్వరరావు

గ్రంథ విమర్శలు

ఎఱ్ఱనేల:

[ఆత్మబలిదాతల వీరగాథ. రామకృష్ణకటాక్ష:డెమ్మీ 1/8. 55 పొరటలు, వెల. రు–5/–ప్రతులకు–సుమిత్రా పబ్లికేషన్సు 17–4–40 సుందయ్యవీధి; చిత్తూరు.]

ఇది వట్టి ఎర్రమట్టి దుమ్ముతో ఎర్రనైన నేలకాదు. ధర్మవీరులైన ఒక రెడ్డి కుటుంబంయొక్క అగ్ని తరంగితక్షాత్ర రక్తంతో ఎర్రనైన రణరంగము. కులగౌరవం క్రుంగిపోగా అవమానం దిగమ్రింగలేక, అకళంక జీవితాల అగ్నిదేవుని కాహుతిజేసిన ఆత్మబలిదాతల మహోజ్వలగాథ ఈ చిన్నకావ్యం.

వినికిడిగా వ్యాపించియుండినా జరిగిన కథే ఇది. పాత్రలు హిందూ ముస్లిములు కావడం యాదృచ్ఛికం. అంతే. సద్గుణాల ఉచ్ఛ, దుర్గుణాల నీచ ప్రతిదేశంలో, ప్రతి జాతిలో కలగలుపుగా ఉన్న గుణాలు.

కథాంశం :– మదనపల్లి దగ్గర, కురబలకోట గుర్రంకొండ లోయలోజంగాలపల్లె ఉన్నది. ఇది ఒక తురుష్కపాలెగాని ఏలుబడిలో ఉన్నప్రాంతం. జంగాలపల్లెలో మూర్ధన్యరెడ్డి ధర్మగుణ గరిష్ఠుడు. పెద్దకాపు. నిండు సంసారి ఉండినాడు. ఆయనకు శౌర్యతేజో నిధులు, కొదమసిగులు, ఏడుగురు పుత్రులు, ఒక కూతురు. శివుని వరాన బుట్టిన ఈమెకు నగరాజకుమారి అని పేరు బెట్టినారు. ''నేలపై దింగని ప్రేమతో, దాదిరొమ్ము మెత్తని పాన్పుగాగ'' పెరిగినది.

ఒకనాడు ఎట్లనో, యౌవన రూప లావణ్య పేశల అయిన నగ రాజకుమారిని యవనేశ్వరుడు **చూ**చినాడు, మదనుని ఉచ్చులలో బడి మది తప్పినాడు. ఒక ఖానును రెడ్డిదగ్గరకు పంపి, కూతురును జనానాకు పంపమని అడిగించినాడు. మూర్ధన్యరెడ్డి మండిపడి, ఆ దుష్టదూత తల పర్రన నరికివేసినాడు. యవనేశ్వరుడు ఇంకొక దూతను పంపగా, వానినికూడ రెడ్డి పీరులలో గలిపినాడు. మదన తాపము, అవమానం ప్రేరేపించగా నవాబు పెద్ద సైన్యాన్ని రెడ్డిపైకి పంపినాడు. మిడిఎండలో ఒక బావి దగ్గర చెట్టు నీడన నిద్రించే ఆత్మగౌరవ భూషితుడైన మూర్ధన్యరెడ్డి మూర్ధాన్ని ముసల్మాను వీరులు నరికివేసినారు.

రెడ్డి కుమారులు ఆర్గురు నిర్యాతన యుద్ధానికి వీరకాశి బిగించినారు. వీరి భార్యలు, ఖడ్గతిక్కన భార్య చానమ్మ పురికొల్పి భర్తను యుద్ధానికి పంపినట్లు, వీరి శౌర్యాన్ని పురిబెట్టి పంపి, ఇక్కడ ఆర్గురు తోడికోడండ్రు అగ్నిప్రవేశంచేసి పేరంటాండ్లయినారు. రెడ్డి యువకులు రణమరణంతో వీరస్వర్గం అలంకరించినారు. వీరి వీరరక్తంలో కీర్తిసిందూరాన్ని దాల్చినదే ఆనేల!

కడగొట్టు కొడుకు–శివారెడ్డి, పల్నాటి వీరుడు బా[ల] చంద్రుని చాలువాడు. చెల్లెలు నగరాజకుమారి కన్నీటి జడితో అన్న ఒడిని తడిపి ధర్మకోపాన్ని పుట్టించినది. శివారెడ్డి చెల్లెలును అలంకరింపజేసి, అందలంలో కూర్చుండబెట్టుకొని, అంతటి నవాబు గౌరవానికి తగిన పరివారంతో యవనుని కోటకు బయలుదేరినాడు. నర్తనశాలలో భీముని దగ్గరకు బయలుదేరిన కీచకుని విధంగా నవాబు నగరాజకుమారి విడిది చేసిఉన్న మందిరం ప్రవేశించినాడు. పాతివ్రత్య మహిమ ప్రేరేపించగా, రెడ్డిపడమ కూచిబాకు లాగి యవనుని కరకుగుండె పొడిచి, వాని అంధకామాన్ని రూపుమాపినది. అనాథ స్త్రీలకు రక్షాబంధంచేసి వెంటనె శివారెడ్డి యుద్ధానికి దిగినాడు. రెండు సైన్యాలమధ్య కరకుపోరు రేగినది. ఉభయ పక్షాలు పీనుగు పెంటలైనవి. కదనరంగం నెత్తుటేరులతో ఎర్రనై, కీర్తిపతాక పెళపెళలాడుతూ రెడ్డికుల ప్రతాపానికి ప్రతీకమైనది.

అభిమన్యునివలె వీరవిహారంచేసి శివారెడ్డి–చెల్లెలితోబాటు అగ్నిదేవుని ఒడిలో తలదాచుకొని, కులగౌరవాన్ని, హిందూసతీత్వాన్ని రక్షించుకొన్నారు ఈ మానధనులు. దీనికిముందే శివారెడ్డి నరకుడు బడిన తండ్రి తలను మొండెమునకు చేర్చి దహన సంస్కారం చేసినాడు.

ఇది ఇంకేదోఒక రసపుత్రకథను జ్ఞప్తికి దెస్తున్నది.

ఈ వీరగాథను మోడుగు చిగిర్ప రామకృష్ణ కటాక్ష వ్రాసి నాడు. ఇందలి 50 పొరటలో వీరుల పచ్చినెత్తుటి అలలు లే[చి] ఉన్నవి; క్షాత్రలక్ష్మి వీరవిహారం చేసినది. కట్టమంచి రామలింగా రెడ్డి ''ముసలమ్మ మరణం''లో, దువ్వూరు రామిరెడ్డి ''నల జారమ్మ అగ్నిప్రవేశం''లో రెడ్డివనితల పాతివ్రత్యధర్మం శాం[తి] మార్గాన నడిచి, ఆత్మాహుతిలో దేవకన్యలైనారు. ఇందు ధర్[మ] వీరం మహాగ్నివలె ప్రజ్వలిస్తున్నది.

చక్కటి కథను రసవత్తర సజీవ భాషావికాసంతో వ్రాసి నాడు కవి. ఈ కవికి పాండిత్యానికి మించిన కథక వైదుష్యము వర్ణనాచాతుర్యము. పాత్ర చిత్రీకరణ కళ, ఆవేగము గతి ఉన్నవి. ఇవి మెరపుతీగవలె మిరుమిట్లు గొలుపుతున్నవి యుద్ధవర్ణనలు తిక్కన అచ్చున బడినవి. ఆ మహాకవివలెనే చారుభీషణతను కల్పించి కనుకొనలకు వేడి ఎరుపెక్కిస్తున్నాడు.

కవిత్వంపాండిత్యంపండి శిల్పమైనవి. సాంప్రదాయికవాసనలు గుబాళిస్తున్నవి జాను తెనుగు నుడికారం ముద్దులమూట కట్టు తున్నది ఉత్ప్రేక్షలు ఉపమానాలు సహజ శోభాదీపకాలు. ప్ర[స్ఫు] ఘట్టము ఉచిత రసస్ఫోరకంగా పాఠకుని చిత్తమాకర్షిస్తున్నది. ఈ పుస్తకపు సిట్ట చిన్నదైనా కూత పెద్దదే.

శ్రీ మరుపూరు కోదండరామరె[డ్డి]

నాలుగు పద్య రచనలు

1. అభ్యుదయము

[కావ్యకర్త. అభ్యుదయ కవి శ్రీ బొడ్డు ప్రకాశం., బి. ఏ. క్రౌన్ సైజు 7+56పేజీలు. వెల 2రూ. ప్రతులకు – రచయిత, కోబాల్డుపేట, గుంటూరు – 522 002.]

2. పల్నాటి మాంచాల.

[రచయిత్రి శ్రీమతి చోడవరపు–సత్యవతీదేవి. క్రౌన్‌సైజు 20+106పేజీలు. వెల5రూ. ప్రతులకు–శ్రీచోడవరపు–రాఘవాచారి, చెరుకుపల్లివారివీధి, విజయవాడ–2]

3. గోమాత-

[రచయిత. భాషాప్రవీణ శ్రీభల్లం తిరుపతిరాజు, డెమ్మీ సైజు 30+63పేజీలు. వెల.రూ 3 = 50. ప్రతులకు–శ్రీ ఉదయభాను సత్యనారాయణరాజు, బి.ఎస్.సి, కవిటం. పశ్చిమ గోదావరిజిల్లా.]

4. రామానందము

[గ్రంథకర్త: శ్రీ చేబోలు–చిన్మయ బ్రహ్మకవి, ఎం.ఏ. డెమ్మీసైజు 14+146 పేజీలు. వెల8రూ. ప్రాప్తిస్థానం, రచయిత, కుసుమహర శ్రీనికేతనము, వీరభద్రపురం, రాజమండ్రి – 4.]

1. విదేశీయుల పరిపాలన తొలగిపోయి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పిదప ప్రతిభాశాలురైన భారతీయనాయకులు దేశాన్ని పెక్కు విధాల అభ్యుదయ మార్గానికి తీసుకు వచ్చారు. దేశం ప్రగతి మార్గాన సాగిపోతున్నది. గ్రామీణ ప్రజల్లో చైతన్యం హెచ్చింది. రచయిత దీనికి ఎంతో సంతృప్తిచెందారు. ఆయన బ్యాంక్‌డెవలప్‌మెంటు ఆఫీసరుగా ఆరుసంవత్సరాలు పనిచేసి ఎన్నో విధాల ప్రజలకు సహకరించారు. ఆయన ఉదారభావాలు, దేశ నాయకులు శ్రీ ప్రకాశం పంతులు, శ్రీ సంజీవయ్య, డాక్టర్ అంబేత్కర్‌ల యెడగల భక్తిగౌరవాలు ప్రేరణచెయ్యగా ఈ "అభ్యుదయ" కావ్యాన్ని రచించారు. కవి సంస్కర్తల ప్రశంస, అభ్యుదయార్థం మేలుకొలుపు, కర్షక ప్రబోధం, మహిళాభ్యుదయం, సహకారోద్యమం, నవాబు, విశ్వమానవుడు, సాహిత్యగోష్ఠి, ఆధునిక కవిత్వం, ఆంధ్రకేసరి ప్రశంస, స్వాతంత్ర్యరజతోత్సవం, సంజీవయ్య వర్ధంతి, అంబేత్కరు ప్రశంస, అధికారభాష ఇందలి విషయాలు. అక్కడక్కడ గేయాలు కూడా ఉన్నవి. గేయ, పద్య రచన సామాన్యమయినా, ఈయనకు వాటిని రచించుటలో గల ప్రగాఢాసక్తి దీనివల్ల స్పష్టమవుతున్నది.

2. భారత యుద్ధానికి కుటుంబకలహం దారి తీసినట్లే పల్నాటియుద్ధానికిన్నీ సోదరకుటుంబాల కలహమే కారణమయింది. మలిదేవాదుల మంత్రియైన బ్రహ్మయ్య కొడుకు బాలచంద్రుడు. అతని భార్య మాంచాల. అందరూ రణరంగానికి పోగా బాలచంద్రుడు బొంగరా లాడుతూ ఊరిలోనే ఉండిపోయాడు. ఒక వైశ్యవనిత నిందవల్ల పౌరుషం తెచ్చుకుని యుద్ధానికి పోవడానికి సంసిద్ధుడైనాడు. భార్య అనుమతిని కోరగా, ఆమె అనుమతించడమే కాక తగిన ప్రోత్సాహం ఇచ్చినది. ఆ పతివ్రతామ తల్లి వీరవనిత అగుటవల్ల తాను కూడా తన చెలికత్తెలతో రణరంగానికి ఉరికి వీరవిహారం చేసింది. యుద్ధానికి కారకురాలై ఎదిరి పక్షాన యుద్ధంచేస్తున్న నాయకురాలు నాగమ్మతో తలపడినది. భర్తతో కూడా చేరి పెక్కుమందిని చెండాడి భర్తతోపాటు రణరంగంపైనే వీరస్వర్గం అలంకరించిది. ఇందులోని వృత్తాంతం చరిత్రకు కొంత భిన్నంగా ఉన్నది. అయినా మహిళామణుల వీరవిహారాన్ని వర్ణించవలెననే సంకల్పంతో రచయిత్రి కథను మార్చినట్లు తెలుస్తున్నది.

ఈమె యిదివరకే 'తొలకరి జల్లులు' రచించి ప్రశంసలను అందుకొన్నది.

"నిండు సభలోన నలగాము డుండువేళ
బ్రహ్మనాయుని పలుకులు భట్టు తెలుప
ఈసడించుచు ·ంధిని త్రోసిపుచ్చి
పలికె నిట్టుల నాగమ్మ పరుషముగను" (పుట 37)

అనే పద్యం చూస్తే రచన యెంత సరళంగాను, సొంపుగాను జరిగిందో తెలుసుకోవచ్చును.

ఇది రసజ్ఞులను మురిపించే ముచ్చటైన రచన అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ప్రశంసించారు. ఇది మహిళా సారస్వతానికి ఒజ్జబంతియైన కబ్బమని ఊటుకూరి – లక్ష్మీకాంతమ్మగారంటున్నారు. కాల్పనికోద్యమ కవితా రీతిని ఆనంద పర్యంతంగా రచయిత్రి వెలయించినట్లు డాక్టర్ దోణప్పగారు వ్రాస్తున్నారు. కళాప్రపూర్ణ – దర్శనాచార్య, డాక్టర్ కొండూరు వీరరాఘవాచార్యులుగారు పద్యరూపంగా ప్రశంసిస్తూ 'మాంచాల'కు తిలకం దిద్దారు.

మహిళా మణుల రచనలలో ఇది అగ్రశేణికి చెందిన కావ్యమని చెప్పవచ్చును.

3. భారతీయులకు గోమాత ఎంతో పవిత్రమైనది. దాని యుపయోగము కూడ ఎక్కువే! 'గవా మంగేషు తిష్ఠంతి, భువనాని చతుర్దశ' అనే సూక్తిగో ప్రశస్తికి నిదర్శనం. రచయితకు గోమాతపై ఆదరాభిమానాలు అధికం. అవే 'గోమాత' పద్యరచనకు దోహదం చేశాయేమో!

ఈ కృతి 'గోమాత' కాబట్టి నాలుగు పాదాలుగా విభజించబడినది. అవి– ఆత్మతత్త్వం, ఔచిత్యం, మాహాత్మ్యం, కర్షకోత్సవం అనేవి. కాలంలో వున్నప్పుడు ఎంతో పొగరుగా వున్న ఒక పాడియావు, వయస్సు మళ్ళిన వెనుక, గతించిన తన జీవితాన్ని

తలచుకొని పశ్చాత్తాపాన్ని పొంది, బంధువులతో తన గోడు చెప్పు కుంటుంది. పూర్వపుణ్యవశం వల్ల దానికి ఆత్మతత్త్వం బాగా అవగాహనమైనది. ఈ విషయమంతా ఆత్మతత్త్వంలో వ్యక్తం చెయ్యబడింది.

రెండో భాగమైన ఔచిత్యంలో భగవంతుని సృష్టిలో ప్రాణులన్నీ సరిసమానమైనవే అని భావించి, మానవుడు గోవు మున్నగు వాటి విషయంలో ఏ రీతిగా ప్రవర్తించవలసినదీ స్పష్టం చెయ్యబడినది.

మూడవ భాగమైన గోమాతృ మాహాత్మ్యంలో పేరుపొందిన గోమాతల త్యాగం తెలుపబడింది. గోమహిమను తెలిపే భోజరాజీయంలోని గో వ్యాఘ్ర సంవాదం, దిలీపునికి నందినీ ధేనువు వరాన్ననుగ్రహించిన వృత్తాంతం, చ్యవనుని వృత్తాంతం సంగ్రహించబడినవి.

నాల్గవ భాగంలో కర్షకోత్సవం, అప్పటి సభలో గోవునకిచ్చిన ప్రాముఖ్యం, అభినందన కానవస్తున్నవి. లేగతో కూడా గృహాంగణంలో గోమాత ఉన్న గృహమే ఉత్తమమైనదని తెలుపబడింది. ఇందలిరచన ఇంపుగా కొనసాగింది. మచ్చునకొక పద్యం—

'భూలోకామృత దారలౌ మొదవులన్
బోషించి రక్షించుటే
మేలౌ సత్కృతియై యిహంబు పర మా
ర్మే డించు సత్కీర్తికిన్
మూలం బౌట యెఱుంగరించుక తమం
బుంజిమ్ము నజ్ఞానులౌ
రా! లీలా నటనం బొనర్చు కవి వి
క్రాంతిన్ హత ప్రజ్ఞులై.'' (పుట 47)

ఈ పద్యకావ్యం సుప్రసిద్ధ విద్వత్కవులు మధునా పంతుల వారు, వెంపరాలవారు మున్నగు వారి ప్రశంసలను అందుకొన్నది.

4. చేబోలు చిన్మయ బ్రహ్మకవిగారు పేరు పొందిన విద్వత్కవులు. బహు గ్రంథకర్తలు. ఎన్నో బిరుదాలు, సమ్మానాలు పొందిన సమర్థులు. ఒకప్పుడు వీరి గురువుగారైన జటావల్లభుల పురుషోత్తంగారు ఏదైనా ఒక పద్య కృతిని వ్రాసి తమకు అంకితమియ్యవలెనని కోరారట! కాని, పురుషోత్తంగారు ఆ తర్వాత స్వల్పకాలంలోనే దివంగతులగుటవల్ల ఆ కృతినిర్మాణంగాని, అంకితమివ్వడంగాని జరగలేదు. తర్వాత ఒకనాడు ఆయన స్వప్నంలో కానరాగా, కవిగారికి గ్రంథాన్ని రచించి వారికి అంకితం చెయ్యాలనే ధృఢసంకల్పం కలిగింది. తత్ఫలితంగా ఈ 'రామానందం' వెలువడింది. కవిగారి గురువుగారికి అంకితమూ అయింది.

శ్రీ పురుషోత్తంగారు ఆర్ష విద్యా భూషణులు. భక్తాగ్రగణ్యులు. వారి ఉదారభావాలకు అనుగుణమైన రచన చేస్తేనే ఆయనను తృప్తి పరిచినట్లవుతుంది. చిన్మయ బ్రహ్మకవి గారు బాగా ఆలోచించి శ్రీరామభక్తుడైన కబీరు యొక్క చరిత్రను తమ కవితా వస్తువుగా గ్రహించారు. దాని మూలంగా ఉత్తర దక్షిణ భారతాలకూ, హిందూ ముస్లిములకూ, సగుణ నిర్గుణాలకూ, గురుశిష్య సంప్రదాయాలకూ, హిందీ—తెలుగు సాహిత్యాలకూ ఒక సమన్వయం కలుగుతుందని వారి భావన.

కబీరు గొప్ప భక్తుడు. వేదాంతి, కవి. మత విద్వేషమే అనైక్యానికి కారణమని గ్రహించినవాడు. అట్టి మహనీయుని జీవిత చరిత్రను వ్రాయడం ఎంతో సమంజసంగానే ఉన్నది. అతనిగురువు రామానందులు. ఆ గురువు మూలంగా కబీరు తన జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు. చివరకు భద్రాచలంలో రామదాసు రామనామ సంకీర్తనా నందంతో గ్రంథం సమాప్తమవుతుంది. అందువల్ల దీనికి రామానందమనే పేరు యుక్తియుక్తంగా కానవస్తుంది.

కబీరు శిష్య సహితంగా దక్షిణ దేశ సంచారం చెయ్యడం, బరంపురం, విజయనగరం, విజయవాడ మున్నగు ప్రాంతాలను చూడడం, ధర్మన్న శిల్పి వృత్తాంతం మున్నగు వాటికి కబీరు జీవిత చరిత్రతో సంబంధం లేదనీ, ఇవి కవి కల్పితాలు మాత్రమే అని తోస్తున్నది.

రచయిత సిద్ధహస్తులగుటచే పద్య రచన ధారాళంగా, రసవంతంగా సాగినది. అక్కడక్కడ సుదీర్ఘాలయిన వచనాలు కూడా చక్కగానే కూర్చబడినవి. మచ్చునకొక పద్యం—

''ఓ సుల్తాను మహాశయా! విను మదే
మోకాని, నా చిత్త మ
ల్లా సాక్షిత్వముగా ప్రపంచ సుఖ సం
బంధములం గోర ద
ర్థాసక్తిన్ సహియింపఁబో; దవనిరా
జ్యం బబ్బినన్ దాని నెం
తే సూక్ష్మమ్ముగనెంచు బెంచు భగవ
ద్భక్తిడా సముల్లాసమున్.''
[పుట. 68]

"అంగీరస"

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.